

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



శనివారం | 6-12-2025 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 248 | శ్రీ విశ్వావసునామసంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, మార్గశిరమాసం, బహుళపక్షం; తిథి: విదియ రా.9.26 తదుపరి తదియ; నక్షత్రం: మృగశిర ఉ.8.49, ఆర్ద్ర తె.6.13; వర్జ్యం: సా.4.18-5.44; దుర్ముహూర్తం: ఉ.6.36-8.04; అమృతఘడియలు: రా.9.18-10.43; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 6.36; సూర్యాస్తమయం: 5.36 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



బిజినెస్

వరంగల్ ● శనివారం 6 డిసెంబరు 2025

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,29,930 ▼	1,19,100 ▼	1,96,000 ▼
విజయవాడ	1,30,300 ▼	1,22,000 ▼	1,83,000 ▲
విశాఖపట్నం	1,32,690 ▲	1,18,850 ▼	1,96,000 ▼
రాజమండ్రి	1,30,690 ▲	1,19,800 ▲	1,79,000 ▼
ప్రొద్దుటూరు	1,27,850 ▲	1,17,620 ▲	1,78,000 ▲
ముంబై	1,28,592 ▲	1,17,790 ▲	1,78,210 ▲

రుణాలు మరింత చవక

గృహ, వాహన రుణాలపై తగ్గనున్న ఈఎంఐల భారం ● రెపో రేటు 0.25% తగ్గింపు.. 5.25 శాతానికి తగ్గిన రెపో

- భవిష్యత్ రేట్లపై తటస్థ వైఖరి యథాతథంగా కొనసాగింపు
- జీడీపీ వృద్ధి అంచనా 6.8 శాతం నుంచి 7.3 శాతానికి పెంపు
- ద్రవ్యోల్బణం అంచనా 2.6 శాతం నుంచి 2 శాతానికి తగ్గింపు
- దేశీయ బ్యాంకింగ్ వ్యవస్థలో ద్రవ్య లభ్యత భారీగా పెంపు
- ఓఎంఓ ద్వారా రూ.లక్ష కోట్ల ప్రభుత్వ బాండ్ల కొనుగోలు
- రూ.45,000 కోట్ల డాలర్/రూపీ మార్పిడి వేలం నిర్వహణ
- ద్రవ్య పరపతి సమీక్ష నిర్ణయాలను ప్రకటించిన ఆర్‌బీఐ
- 2026 ఫిబ్రవరి 4-6 తేదీల్లో తదుపరి సమీక్ష



ముంబై: రుణగ్రహీతలకు శుభవార్త. రుణాలకు ప్రామాణికమైన రెపో రేటును ఆర్‌బీఐ మరో 0.25 శాతం తగ్గించింది. దీంతో రెపో రేటు 5.50 శాతం నుంచి 5.25 శాతానికి దిగివచ్చింది. తద్వారా రెపో అనుసంధానిత గృహ, వాహన, వ్యక్తిగత రుణాలపై వడ్డీ రేట్లు మరింత తగ్గనున్నాయి. ఇప్పటికే రుణం తీసుకున్న వారిపై ఈఎంఐ చెల్లింపుల భారం కూడా తగ్గనుంది. చవక వడ్డీ రేట్లు బ్యాంకింగ్ వ్యవస్థలో రుణాల వృద్ధితో పాటు అమెరికా అధిక సుంకాల నేపథ్యంలో దేశ ఆర్థిక వృద్ధికీ దోహదపడనున్నాయి.

వడ్డీ రేట్లపై ఏకగ్రీవ నిర్ణయం

ద్వైమాసిక ద్రవ్యపరపతి సమీక్షలో భాగంగా భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా అధ్యక్షతన ఆరుగురు సభ్యుల మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) మూడు రోజుల పాటు సమావేశమైంది. శుక్రవారంతో ముగిసిన ఈ సమీక్షలో కమిటీ సభ్యులు రెపో రేటును మరో పావు శాతం తగ్గించాలని ఏకగ్రీవ నిర్ణయం తీసుకున్నారు. అంతేకాదు, భవిష్యత్ రేట్లపైన తటస్థ వైఖరిని కొనసాగిస్తున్నట్లు ఆర్‌బీఐ తెలిపింది. తద్వారా ఆర్‌బీఐ రెపో రేటును మరింత తగ్గించేందుకు అవకాశాలున్నాయని సంకేతాలిచ్చింది. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి రెపో రేటును తగ్గించడం ఇది నాలుగోసారి. ఈ నాలుగు విడతల్లో రెపోను 1.25 శాతం తగ్గించింది. అంచనాల కంటే వేగంగా తగ్గిన ద్రవ్యోల్బణం.. అనుకూల స్థాయిలోనే కదలాడినంత కాలం రెపో రేటు కూడా తక్కువ స్థాయిలోనే కొనసాగనుందని ఆర్‌బీఐ గవర్నర్ మల్హోత్రా అన్నారు.

రూపాయి మారకం విలువకు లక్ష్యాన్నేమీ నిర్దేశించుకోలేదు..

ఫారెక్స్ మార్కెట్లో రూపాయి మారకం విలువను ఫలానా స్థాయి లేదా శ్రేణికి కట్టడి చేయాలని లక్ష్యాన్నేమీ నిర్దేశించుకోలేదని ఆర్‌బీఐ గవర్నర్ మల్హోత్రా అన్నారు. రూపాయి విలువను మార్కెట్ పరిస్థితులే నిర్ణయిస్తాయని పరపతి సమీక్ష అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. మార్కెట్ హెచ్చుతగ్గులకు లోనవుతూనే ఉంటుందని, అధిక లేదా అసాధారణ స్థాయిలో హెచ్చుతగ్గులను తగ్గించడంపైనే ఆర్‌బీఐ దృష్టి సారిస్తుందన్నారు. డాలర్‌తో రూపాయి మారకం విలువ సరికొత్త జీవితకాల కనిష్ఠ స్థాయి రూ.90కి చేరిన నేపథ్యంలో ఆర్‌బీఐ గవర్నర్ తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

ధరలు.. కూల్!

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2025-26) వినియోగదారుల ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం అంచనాను ఆర్‌బీఐ గతంలో ప్రకటించిన 2.6 శాతం నుంచి 2 శాతానికి తగ్గించింది. ఈ జూలై-సెప్టెంబరు త్రైమాసికానికి 1.7 శాతంగా నమోదైన ద్రవ్యోల్బణం అక్టోబరులో రికార్డు కనిష్ఠ స్థాయి 0.25 శాతానికి తగ్గింది. ధరలు అంచనాల కంటే వేగంగా తగ్గుతూ వచ్చిన నేపథ్యంలో ఆర్‌బీఐ పూర్తి ఆర్థిక సంవత్సరం అంచనాను కూడా తగ్గించింది.

వృద్ధి హైజంప్!

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధి రేటు 7.3 శాతానికి ఎగబాకవచ్చని ఆర్‌బీఐ తాజాగా అంచనా వేసింది. గతంలో ప్రకటించిన 6.8 శాతంతో పోలిస్తే వృద్ధి అంచనాను ఏకంగా 0.5 శాతం పెంచింది. ఈ సెప్టెంబరుతో ముగిసిన మూడు నెలల్లో (క్యూ2)లో జీడీపీ వృద్ధి రేటు 6 త్రైమాసికాల గరిష్ఠ స్థాయి 8.2 శాతానికి చేరుకోవడంతోపాటు ఈనెలతో ముగియనున్న మూడో త్రైమాసికం (క్యూ3)లోనూ మెరుగైన వృద్ధి నమోదుకు అవకాశాలున్నాయని ఆర్‌బీఐ భావిస్తోంది. ఈ నేపథ్యంలో పూర్తి ఆర్థిక సంవత్సరం అంచనాను గణనీయంగా పెంచింది.

బ్యాంకింగ్‌లోకి రూ.1.45 లక్షల కోట్లు

రుణాలకు గిరాకీ మరింత పెరగనున్న నేపథ్యంలో బ్యాంకింగ్ రంగంలో ద్రవ్య లభ్యతను పెంచేందుకు ఆర్‌బీఐ రెండు కీలక నిర్ణయాలు తీసుకుంది. బహిరంగ మార్కెట్ కార్యకలాపాల (ఓఎంఓ) ద్వారా రూ. లక్ష కోట్ల విలువైన ప్రభుత్వ బాండ్లను కొనుగోలు చేయనున్నట్లు ప్రకటించింది. ఈ నెల 11న, 18న రూ.50,000 కోట్ల చొప్పున రెండు విడతల్లో బాండ్ల కొనుగోలును చేపట్టనుంది. అలాగే, మూడేళ్ల కాలపరిమితితో 500 కోట్ల డాలర్ల (సుమారు రూ.45,000 కోట్లు) విలువైన డాలర్/రూపీ క్రయ-విక్రయ మార్పిడి వేలాన్ని ఈనెల 16న నిర్వహించనున్నట్లు ఆర్‌బీఐ తెలిపింది. ఈ రెండు చర్యల ద్వారా బ్యాంకింగ్ వ్యవస్థలోకి అదనంగా రూ.1.45 లక్షల కోట్లు వచ్చి చేరనున్నాయి.

డాలర్/రూపీ మార్పిడి ఎలా..?

మూడేళ్ల డాలర్/రూపీ క్రయ-విక్రయ మార్పిడిలో భాగంగా ఆర్‌బీఐ తొలుత బ్యాంకుల నుంచి డాలర్లను కొనుగోలు చేస్తుంది. తద్వారా బ్యాంకింగ్ వ్యవస్థలో దేశీయ కరెన్సీ లభ్యత పెరుగుతుంది. మలివిడతలో భాగంగా ఆర్‌బీఐ మూడేళ్ల తర్వాత ఆ డాలర్లను తిరిగి బ్యాంకులకు ముందస్తుగానే నిర్ణయించిన ధరకు విక్రయిస్తుంది. రూపాయల్లో ద్రవ్య లభ్యత నిర్వహణతో పాటు కరెన్సీ స్థిరత్వం, విదేశీ మారకం నిల్వలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఇది దోహదపడుతుంది.

గృహ రుణం ఎంత తగ్గుతుందంటే..

వడ్డీ రేట్లు తగించిన బీఓబీ, బీఓఐ

ఆర్‌బీఐ కీలక రెపో రేటును మరో పావు శాతం తగ్గించింది. ఈ ప్రభావం రెపో రేటు ఆధారిత గృహ రుణాలపై ముఖ్యంగా ఫ్లోటింగ్ రేట్ హోమ్ లోన్ల ఈఎంఐలపైనా పడనుంది. ఆర్‌బీఐ ఎంపీసీ నిర్ణయం వెలువడిన కొద్దిసేపటికే తన రెపో ఆధారిత రుణాల వడ్డీ రేటును తగ్గిస్తున్నట్లు బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ), బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ) ప్రకటించాయి. బీఓఐ తన వడ్డీ రేటును 8.35 శాతం నుంచి 8.10 శాతానికి తగ్గిస్తున్నట్లు వెల్లడించింది. శుక్రవారం నుంచే ఈ తగ్గింపు అమల్లోకి వస్తుందని తెలిపింది కాగా బీఓబీ.. శనివారం నుంచి వడ్డీ రేటును 8.15 శాతం నుంచి 7.90 శాతానికి తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. త్వరలోనే మిగతా బ్యాంకులూ ఇదే బాటలో నడిచే అవకాశం ఉంది.

రూ.25 లక్షల గృహ రుణంపై..

- రుణ చెల్లింపు కాలపరిమితి 15 ఏళ్లు
- 8.5% వడ్డీ రేటుతో చెల్లిస్తున్న ఈఎంఐ రూ.24,618
- 8.25% వడ్డీ రేటుతో చెల్లించే ఈఎంఐ రూ.24,254
- నెలనెలా తగ్గే ఈఎంఐ రూ.364
- 8.5% వడ్డీ రేటుతో 15 ఏళ్లలో చెల్లించే మొత్తం వడ్డీ రూ.19,31,328
- 8.25% వడ్డీతో చెల్లించే మొత్తం వడ్డీ రూ.18,65,632
- ఆదా అయ్యే వడ్డీ రూ.65,696

రూ.50 లక్షల గృహ రుణంపై..

- కాలపరిమితి 20 ఏళ్లు
- 8.5% వడ్డీ రేటుతో చెల్లిస్తున్న ఈఎంఐ రూ.43,391
- కొత్త వడ్డీ రేటు 8.25%తో చెల్లించే ఈఎంఐ రూ.42,603
- నెలనెలా ఆదా అయ్యే ఈఎంఐ రూ.788.
- పాత వడ్డీ రేటుతో 20 ఏళ్లలో చెల్లించాల్సిన మొత్తం వడ్డీ రూ.54,13,879
- కొత్త వడ్డీ రేటుతో చెల్లించాల్సిన మొత్తం వడ్డీ రూ.52,24,788
- ఆదా అయ్యే వడ్డీ రూ.1,89,091

రూ.75 లక్షల గృహ రుణంపై..

- కాలపరిమితి 20 ఏళ్లు
- 8.5% వడ్డీతో ప్రస్తుత ఈఎంఐ రూ.60,392
- కొత్త వడ్డీ రేటు 8.25%తో చెల్లించే ఈఎంఐ రూ.59,134
- నెలనెలా తగ్గే ఈఎంఐ రూ.1,258
- పాత వడ్డీ రేటుతో 20 ఏళ్లలో చెల్లించాల్సిన మొత్తం వడ్డీ రూ.1,06,17,609
- కొత్త వడ్డీ రేటుతో 20 ఏళ్లలో చెల్లించే మొత్తం వడ్డీ రూ.1,02,40,128
- ఆదా అయ్యే వడ్డీ రూ.3,77,481

నెట్‌ఫ్లిక్స్ గూటికి వార్నర్ బ్రదర్స్ స్టూడియో, స్ట్రీమింగ్ వ్యాపారాలు

- డీల్ విలువ రూ.6.48 లక్షల కోట్లు

న్యూయార్క్: ప్రపంచ మీడియా, వినోద రంగంలో మరో మెగా ఒప్పందం కుదిరింది. హాలీవుడ్‌కు చెందిన ప్రముఖ నిర్మాణ సంస్థ వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ స్టూడియో, స్ట్రీమింగ్ వ్యాపారాలతో పాటు హెచ్‌బీఓ మ్యాక్స్ చానెల్‌ను అంతర్జాతీయ ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ 7,200 కోట్ల డాలర్లకు (సుమారు రూ.6.48 లక్షల కోట్లు) కొనుగోలు చేసింది. నగదు, స్టాక్స్ రూపంలో ఈ డీల్ జరగనుంది. ఇందులో భాగంగా వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ (డబ్ల్యూబీడీ) ఒక్కో షేరు ధరను 27.75 డాలర్లుగా లెక్కగట్టారు. ఈ డీల్ నేపథ్యంలో వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ గతంలోనే రూపొందించుకున్న ప్రణాళిక ప్రకారంగా డిస్కవరీ గ్లోబల్‌ను (టీఎన్‌టీ, సీఎన్‌ఎన్ టీవీ చానెళ్ల నెట్‌వర్క్) విభజించి 2026 మూడో త్రైమాసికంలో ప్రత్యేక లిస్టెడ్ కంపెనీగా ఏర్పాటు చేయనుంది. అనంతరం నెట్‌ఫ్లిక్స్‌తో డీల్ పూర్తి కానుంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు) 6వ తేదీ			
హైదరాబాద్	651	విజయవాడ	670
వరంగల్	653	గోదావరి	650
చిత్తూరు	663	విశాఖపట్నం	640
		డజను గుడ్లు రూ.	90

ఫామ్‌గేట్ ధర వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్			
హైదరాబాద్	127	విజయవాడ	130
వరంగల్	127	గుంటూరు	135
కరీంనగర్	127	ఒంగోలు	135
మహబూబ్‌నగర్	127	చిత్తూరు	120
కర్నూలు	127	నెల్లూరు	125
విశాఖపట్నం	120	అనంతపురం	125
గోదావరి	130		

మార్కెట్‌కు 'రెపో' బూస్ట్

447 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్

ముంబై: పలు వర్గాల ఊహలకు భిన్నంగా ఆర్‌బీఐ రెపో రేటును 0.25% తగ్గించడం మార్కెట్లో ఉత్తేజం నింపింది. సెన్సెక్స్ శుక్రవారం 447.05 పాయింట్ల లాభంతో 85,712.37 వద్ద ముగిసింది. అంతకు ముందు ఇంట్రాడేలో 531.40 పాయింట్ల లాభంతో 85,796.72 స్థాయిని తాకింది. నిఫ్టీ కూడా 152.70 పాయింట్లు లాభపడి 26,186.45 వద్ద ముగిసింది. మార్కెట్ లాభపడడం వరుసగా ఇది రెండో రోజు.

బ్యాంక్, ఆటో షేర్ల జోరు: వడ్డీరేట్ల ప్రభావం అధికంగా ఉండే బ్యాంక్, ఆటో, రియల్టీ షేర్లు మాత్రం ఆర్‌బీఐ నిర్ణయంతో కొత్త ఉత్తేజం పొందాయి. బ్యాంకింగ్ షేర్లలో ఎస్‌బీఐ 2.46%, బీఓబీ 1.56% మేర లాభపడ్డాయి. కోటక్ మహీంద్రా బ్యాంక్, ఇండస్ ఇండ్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ, ఫెడరల్ బ్యాంక్ లాభపడిన షేర్లలో ఉన్నాయి. కాగా బ్యాంకెక్స్ 0.86% లాభపడింది.

- ఆటో షేర్లలో మారుతి సుజుకీ (1.75%), ఐషర్ మోటార్స్ (1.54%) అగ్రస్థానంలో నిలిచాయి. మహీంద్రా అండ్ మహీంద్రా, భారత్ ఫోర్జ్, టీవీఎస్ మోటార్ కంపెనీ, అశోక్ లేలాండ్, బజాజ్ ఆటో కూడా లాభపడ్డాయి. ఆటో ఇండెక్స్ 0.57% లాభపడి 62,112.92 వద్ద ముగిసింది.
- రియల్టీ షేర్లలో ప్రెస్టీజ్ 1.99%, డీఎల్ఎఫ్ 1.50% మేర లాభపడగా సిగ్నేచర్ గ్లోబల్, లోధా డెవలపర్స్, గోద్రెజ్ ప్రాపర్టీస్, శోభ లిమిటెడ్ కూడా లాభాల్లో ముగిసాయి. ఉన్నాయి. కాగా రియల్టీ సూచీ 0.34% మేర లాభపడింది.

ఇండిగో షేరు డౌన్: ప్రస్తుతం సంక్షోభం ఎదుర్కొంటున్న ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ షేర్లు గత నాలుగు రోజుల్లో 7% మేరకు నష్టపోయాయి. శుక్రవారం బీఎస్ఈలో 1.22% నష్టపోయిన ఈ షేరు రూ.5,371.30 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 3.15% నష్టంతో రూ.5,266 వరకు దిగజారింది. ఎన్‌ఎస్ఈలో 1.27% నష్టంతో రూ.5,367.50 వద్ద ముగిసింది. నాలుగు రోజుల్లో కంపెనీ మార్కెట్ విలువ రూ.16,190.64 కోట్లు నష్టపోయి రూ.2,07,649.14 కోట్లకు దిగజారింది.

ఫారెక్స్ నిల్వల క్షీణత: నవంబర్ 28వ తేదీతో ముగిసిన వారంలో ఫారెక్స్ నిల్వలు 187.7 కోట్ల డాలర్ల మేరకు క్షీణించి 68,622.7 కోట్ల డాలర్లకు దిగజారాయి. బంగారం నిల్వల విలువ 161.3 కోట్ల డాలర్ల మేరకు పెరిగి 10,579.5 కోట్ల డాలర్ల వద్ద నిలదొక్కుకుంది.

- ఫారెక్స్ మార్కెట్లో అమెరికన్ డాలర్ మారకంలో రూపాయి విలువ 6 పైసలు పడిపోయి 89.95 వద్ద నిలిచింది.

స్పోర్ట్స్

సిరీస్ నీదా.. నాదా?

విశాఖలో ఆఖరి వన్డే నేడు



టీమిండియాపైనే ఒత్తిడి
ఆత్మవిశ్వాసంతో దక్షిణాఫ్రికా

మ.1.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో...

తుది జట్లు (అంచనా)

భారత్: యశస్వీ జైస్వాల్, రోహిత్, కోహ్లీ, రుతురాజ్, రాహుల్ (కెప్టెన్), సుందర్/తిలక్, జడేజా, హర్షిత్, కుల్దీప్, అర్ష్‌దీప్, ప్రసిద్ధ్.

దక్షిణాఫ్రికా: మార్‌క్రమ్, డికాక్, బవుమా (కెప్టెన్), బ్రీట్‌స్కే, రికెల్టన్, బ్రెవిస్, యాన్సెన్, బాష్, కేశవ్, ఎన్‌గిడి, బార్ట్‌మన్.

పిచ్, వాతావరణం

మహిళల వన్డే వరల్డ్‌కప్‌లో ఇక్కడ ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనూ చేజింగ్ టీమ్ గెలిచింది. పిచ్ బ్యాటర్లకు అనుకూలంగా ఉంటుంది. ఇప్పటిదాకా జరిగిన రెండు వన్డేల మాదిరే ఇక్కడ కూడా మంచు కీలక ప్రభావం చూపనుంది. దీంతో టాస్ గెలిచిన జట్టు ఫీల్డింగ్ వైపు మొగ్గు చూపవచ్చు. మ్యాచ్‌కు వర్షం సూచన లేదు.

సుందర్‌ను బౌలర్‌గానే పరిగణించాలి: అశ్విన్

చెన్నై: భారత జట్టులో స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌ను ప్రధాన బౌలర్‌గానే చూడాలని మాజీ స్పిన్నర్ అశ్విన్ సూచించాడు. ఈ సిరీస్‌లో ఏడు ఓవర్లు మాత్రమే వేసిన వాషింగ్టన్.. ఒక్క వికెట్ కూడా తీయలేకపోయాడు. అయితే ప్రస్తుతం జట్టులో అతడిని బ్యాటర్‌గా పరిగణిస్తూ, కొద్ది ఓవర్లు మాత్రమే వేయిస్తున్నారని అశ్విన్ చెప్పాడు. దీంతో జట్టులో తన పాత్రేమిటో సుందర్‌కు అర్థం కాకుండా పోతున్నదన్నాడు.



విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): భారత్-దక్షిణాఫ్రికా జట్ల మధ్య ఆసక్తికర మూడు వన్డేల సిరీస్‌కు విశాఖ సాగర తీరం ముగింపు ఇవ్వబోతోంది. తొలి రెండు మ్యాచ్‌లు భారీ స్కోర్లతో అభిమానులను ఉర్రూతలూగించగా, ఇరు జట్లు చెరొక విజయంతో 1-1తో సమంగా ఉన్నాయి. ఈనేపథ్యంలో శనివారం జరిగే సిరీస్ నిర్ణాయక మ్యాచ్‌కు స్థానిక ఏసీఏ-వీడీసీఏ క్రికెట్ స్టేడియం వేదిక కానుంది. ఇప్పటికే టెస్టు సిరీస్‌ను 0-2తో వైట్‌వాష్ అయిన భారత్‌పైనే మరోసారి ఒత్తిడి నెలకొంది. ఎలాగైనా ఈ మ్యాచ్‌ను గెలిచి వన్డే సిరీస్‌తో అభిమానులకు కాస్త ఉపశమనం ఇవ్వాలనుకుంటోంది. అటు దక్షిణాఫ్రికా రాయ్‌పూర్‌లో 359 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించి జోష్‌లో ఉంది. అందుకే మరొక్క విజయంతో పరిమిత ఓవర్ల సిరీస్‌ను కూడా ఖాతాలో వేసుకోవాలని ఉవ్విళ్లూరుతోంది. అయితే 1986-87 తర్వాత స్వదేశంలో భారత్ టెస్టు, వన్డే సిరీస్‌లను కలిపి ఒక్కసారి కూడా కోల్పోలేదు. దీంతో ఆఖరి పోరులో ఎవరిది పైచేయో తేల్చుకునేందుకు ఇరు జట్లూ హోరాహోరీగా తలపడే అవకాశం ఉంది.

రోహిత్, విరాట్‌పై భారం: సిరీస్‌ను వశం చేసుకునేందుకు భారత జట్టు మరోసారి వెటరన్లు రోహిత్, విరాట్‌లపైనే ఆధారపడింది. ముఖ్యంగా విరాట్ తన చివరి మూడు వన్డేల్లో ఓ ఫిఫ్టీ, రెండు సెంచరీలతో సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. దీంతో పాటు విశాఖలో సైతం తనకు అదిరే రికార్డు ఉంది. ఇక్కడ ఆడిన ఏడు వన్డేల్లో మూడు శతకాలు సాధించగా.. సగటు 97.83గా ఉండడం విశేషం. దీంతో తనకు అచ్చొచ్చిన గ్రౌండ్‌లో మరో సెంచరీతో హ్యాట్రిక్‌ను పూర్తి చేయాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. అటు రోహిత్ తన చివరి నాలుగు వన్డేల్లో ఓ సెంచరీ, రెండు ఫిఫ్టీలతో ఆకట్టుకున్నాడు. అయితే ఓపెనర్ జైస్వాల్ అటు బ్యాటింగ్, ఇటు ఫీల్డింగ్‌లో నిరాశపరుస్తున్నాడు. లెఫ్టామ్ పేసర్లను సరిగ్గా ఎదుర్కోలేకపోతున్నాడు. రుతురాజ్ శతకంతో ఫామ్‌ను చాటుకోవడం సానుకూలాంశం. మిడిలార్డర్‌లో వాషింగ్టన్ సుందర్ ఫామ్‌లేమిపై జట్టు ఆందోళనగా ఉంది. అతడి స్థానంలో తిలక్ వర్మను ఆడిస్తే బ్యాటింగ్ బలోపేతం కావడంతో పాటు అదనపు స్పిన్నర్‌గా, అద్భుత ఫీల్డర్‌గానూ ఉపయోగపడగలని కోచ్ గంభీర్ భావిస్తున్నాడు. పంత్ కూడా పోటీలో ఉన్నాడు. ఇక పేస్‌లో అర్ష్‌దీప్ మినహా ప్రసిద్ధ్, హర్షిత్ ధారాళంగా పరుగులిచ్చుకుంటున్నారు. నేటి మ్యాచ్‌లో పేసర్లు విశేషంగా రాణిస్తేనే ఫలితం ఉంటుంది.

గాయాల బెడద

తొలి వన్డేలో విజయం దరిదాపుల్లోకి వచ్చి, రెండో వన్డేలో భారీ ఛేదనను విజయవంతంగా ముగించిన పర్యాటక దక్షిణాఫ్రికా పూర్తి ఆత్మవిశ్వాసంతో ఉంది. అయితే పేసర్ బర్గర్, బ్యాటర్ డి జోర్జి తొడ కండరాలు పట్టేయడంతో రెండో వన్డేలో మైదానం వీడారు. వారి ఫిట్‌నెస్‌పై స్పష్టత లేకపోయినా.. ఈ కీలక మ్యాచ్‌కు అందుబాటులో ఉండకపోవచ్చు. జోర్జి స్థానంలో రికెల్టన్ ఆడే చాన్సుంది. మార్‌క్రమ్ అదరగొడుతున్నా, మరో ఓపెనర్ డికాక్ సిరీస్‌లో ఏమాత్రం రాణించలేకపోయాడు. చివరి మ్యాచ్‌లోనైనా స్థాయికి తగ్గ ప్రదర్శన చేయాలనుకుంటున్నాడు. బ్రీట్‌స్కే, బ్రెవిస్ మిడిలార్డర్‌లో కీలకంగా మారారు. పేసర్ యాన్సెన్ ఆల్‌రౌండ్‌షో చూపుతున్నాడు. పేసర్ బర్గర్ స్థానంలో బార్ట్‌మన్‌కు అవకాశం దక్కవచ్చు.

సెమీస్‌కు భారత్

'షూటౌట్'లో బెల్జియం చిత్తు
జూనియర్ హాకీ ప్రపంచ కప్



చెన్నై: పూల్ మ్యాచ్‌ల్లో చిన్నజట్లపై విజయాలు సాధించిన భారత్..క్వార్టర్‌ఫైనల్ కఠిన పరీక్షలో నెగ్గింది. అత్యంత బలమైన బెల్జియం జట్టును..పెనాల్టీ షూటౌట్‌లో కంగుతినిపించింది. దాంతో జూనియర్ పురుషుల వరల్డ్ కప్ హాకీ సెమీఫైనల్లోకి అడుగుపెట్టింది. శుక్రవారం హోరాహోరీగా సాగిన పోరులో యువ భారత్ షూటౌట్‌లో 4-3తో బెల్జియం జట్టును చిత్తు చేసింది. నిర్ణీత సమయానికి మ్యాచ్ 2-2తో సమమైంది. భారత్ తరపున రోహిత్ (45 ని.), శారదానంద తివారీ (48 ని.) గోల్స్ చేశారు. కోరెంజ్ (13 ని.), నాథన్ (59 ని.) బెల్జియానికి గోల్స్ అందించారు. ఆదివారం జరిగే సెమీఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ జర్మనీతో భారత్ అమీతుమీ తేల్చుకోనుంది. మరో క్వార్టర్‌ఫైనల్లో జర్మనీ పెనాల్టీ షూటౌట్‌లో 3-1తో ఫ్రాన్స్‌పై నెగ్గింది. ఇతర క్వార్టర్‌ఫైనల్స్‌లో స్పెయిన్ 4-3తో న్యూజిలాండ్‌ని, అర్జెంటీనా 1-0తో నెదర్లాండ్స్‌ని ఓడించాయి. రెండో సెమీఫైనల్లో అర్జెంటీనా-స్పెయిన్ ఢీకొంటాయి.

ఐర్లాండ్‌పై భారత మహిళల గెలుపు

శాంటియాగో (చిలీ): జూనియర్ వరల్డ్ కప్ హాకీ ఆఖరి పూల్ మ్యాచ్‌ను భారత్ అమ్మాయిలు విజయంతో ముగించారు. శుక్రవారం జరిగిన పూల్ 'సి' పోరులో భారత్ 4-0తో ఐర్లాండ్‌ను చిత్తు చేసింది.

పెళ్లి వాయిదా తర్వాత.. మంధాన తొలి పోస్టు



న్యూఢిల్లీ: బాలీవుడ్ సంగీత దర్శకుడు పలాష్ ముచ్చల్‌తో తన పెళ్లిని వాయిదా వేసుకున్న తర్వాత టీమిండియా క్రికెటర్ స్మృతీ మంధాన తొలిసారి సోషల్ మీడియాలో కనిపించింది. ఓ వాణిజ్య ప్రకటనకు సంబంధించి తాను చేసిన ప్రమోషన్ వీడియోను ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో శుక్రవారం పోస్ట్ చేసింది. కాగా, ఆ వీడియోలో ఆమె చేతివేలికి నిశ్చితార్థపు ఉంగరం లేకపోవడంతో నెటిజన్లు పలు విధాలుగా చర్చించుకుంటున్నారు. పలాష్‌తో పెళ్లిని రద్దు చేసుకుందనేందుకు ఇదే నిదర్శనం అంటూ కొందరు పోస్ట్‌లు పెడితే.. ఆ వీడియోను మంధాన తన నిశ్చితార్థానికి ముందు చేసి ఉండొచ్చుగా! అని మరికొందరు అభిప్రాయపడ్డారు. ఏదేమైనా.. ఈ పెళ్లి త్వరలోనే జరుగుతుందని ఓవైపు పలాష్ కుటుంబం చెబుతుండగా, మంధాన తరఫు నుంచి మాత్రం ఎలాంటి ప్రకటనా రాకపోవడం గమనార్హం.

కోహ్లీ, రోహిత్ కాదు.. వైభవ్

గూగుల్ సెర్చ్‌లో సూర్యవంశీ టాప్



న్యూఢిల్లీ: వైభవ్ సూర్యవంశీ..ఈ పేరు దేశ క్రికెట్‌లోనే కాదు అంతర్జాతీయ స్థాయిలోనూ ప్రస్తుతం మార్మోగుతోంది. 14 ఏళ్ల ఈ చిచ్చర పిడుగు క్రికెట్‌లో స్వల్పకాలంలోనే నెలకొల్పిన రికార్డులు ఎన్నో. ఈనేపథ్యంలో అతడి గురించి తెలుసుకొనేందుకు గూగుల్‌లో విపరీతంగా శోధించారు. దాంతో 2025లో అత్యధికమంది శోధించిన వారిలో భారత్ నుంచి వైభవ్ టాప్‌లో నిలిచాడు. ఈక్రమంలో స్టార్లు కోహ్లీ, రోహిత్‌లను సూర్యవంశీ వెనక్కు నెట్టాడు.

పాక్‌లో అభిషేక్ కోసం..: ఇక టీ20 క్రికెట్‌లో సంచలన బ్యాటర్ అభిషేక్ శర్మకు పాకిస్థాన్‌లో ఆదరణ లభించడం విశేషం. పొట్టి ఫార్మాట్‌లో అతడి ఆట తీరుకు ఫిదా అయిన పాకిస్థానీయులు.. అభిషేక్ గురించి మరిన్ని వివరాలు తెలుసుకొనేందుకు భారీసంఖ్యలో ప్రయత్నించారు.

ఆసీస్ తొలి ఇన్నింగ్స్ 378/6

జేక్, లబుషేన్, స్మిత్ అర్ధ శతకాలు

ఇంగ్లండ్‌తో యాషెస్ రెండో టెస్ట్



బ్రిస్బేన్: టాపార్డర్ బ్యాటర్లు జేక్ వెదరాల్డ్ (72), లబుషేన్ (65), తాత్కాలిక కెప్టెన్ స్టీవ్ స్మిత్ (61) అర్ధ శతకాలతో సత్తా చాటడంతో యాషెస్ రెండో టెస్ట్ (డే/నైట్)లో ఆస్ట్రేలియా ఆధిక్యంలో నిలిచింది. రెండోరోజు ఆట ముగిసే సరికి ఆతిథ్య జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లకు 378 పరుగులు చేసింది. కంగారూలు 44 పరుగుల ఆధిక్యంలో నిలవగా..ఇంకా నాలుగు వికెట్లు చేతిలో ఉన్నాయి. శుక్రవారం ఆఖరికి కేరీ (46 బ్యాటింగ్), మైకేల్ నేసర్ (15 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. అంతకుముందు ఓవర్‌నైట్ 325/9 స్కోరుతో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్ మరో 9 పరుగులు చేసి 334 రన్స్‌కు ఆలౌటైంది. ఆస్ట్రేలియాకు ఓపెనర్లు హెడ్ (33), జేక్ (77) శుభారంభం అందించారు. అయితే హెడ్‌ను అవుట్ చేసిన కార్స్ మొదటి వికెట్ భాగస్వామ్యాన్ని విడదీశాడు. ఆ తర్వాత వచ్చిన బ్యాటర్లంతా బాధ్యతాయుతంగా ఆడడంతో ఇంగ్లండ్ 400 పరుగుల సమీపంలోకి వచ్చింది. ఇంగ్లండ్ ఫీల్డర్లు ఏకంగా ఐదు క్యాచ్‌లు వదిలేయడం ఆస్ట్రేలియాకు లాభించింది.

సంక్షిప్తస్కోర్లు: ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 334 (రూట్ నాటౌట్ 138, క్రాలే 76, ఆర్చర్ 38, బ్రూక్ 31, స్టార్క్ 6/75); **ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్:** 378/6 (జేక్ వెదరాల్డ్ 72, లబుషేన్ 65, స్మిత్ 61, కేరీ 46 బ్యాటింగ్, గ్రీన్ 45, కార్స్ 3/113, స్టోక్స్ 2/93).

హోప్ అజేయ శతకం

విండీస్ రెండో ఇన్నింగ్స్ 212/4

క్రైస్ట్‌చర్చ్: న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో విండీస్ పోరాడుతోంది. 530 పరుగుల భారీ ఛేదన కోసం బరిలోకి దిగిన ఈ జట్టు హోప్ (116 బ్యాటింగ్) అజేయ శతక సహాయంతో రెండో ఇన్నింగ్స్‌లో 212/4 స్కోరు చేసింది. అయితే 74 రన్స్‌కే 4 వికెట్లు కోల్పోయిన వేళ.. గ్రీవ్స్ (55 బ్యాటింగ్)తో కలిసి హోప్ ఐదో వికెట్‌కు 140 పరుగులు జోడించాడు. విండీస్ విజయానికి మరో 319 పరుగులు చేయాల్సి ఉంది. కివీస్ రెండో ఇన్నింగ్స్‌ను 466/8 వద్ద డిక్లేర్ చేసింది. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో కివీస్ 231, విండీస్ 167 పరుగులు చేశాయి.

డేవిస్ కప్ వేదిక బెంగళూరు

- నెదర్లాండ్స్‌తో భారత్ పోరు

న్యూఢిల్లీ: వచ్చే ఫిబ్రవరి 7, 8 తేదీల్లో నెదర్లాండ్స్‌తో భారత్ ఆడే డేవిస్ కప్ క్వాలిఫయర్స్‌కు బెంగళూరు ఆతిథ్యమివ్వనుంది. బిడ్డింగ్‌లో ఢిల్లీని అధిగమించి బెంగళూరు ఆతిథ్య హక్కులు దక్కించుకుంది. బెంగళూరులో చివరిసారిగా 2017లో డేవిస్ కప్ జరిగింది.

సీమా పూనియాపై 16 నెలల నిషేధం



న్యూఢిల్లీ: మహిళల డిస్కస్ త్రోయర్, ఆసియా క్రీడల మాజీ చాంపియన్ సీమా పూనియా డోప్ పరీక్షలో విఫలమైంది. దీంతో ఆమెపై 16 నెలల నిషేధం విధిస్తున్నట్టు డోపింగ్ నిరోధక క్రమశిక్షణ ప్యానెల్ శుక్రవారం ప్రకటించింది. పూనియా డోప్ పరీక్షలో పాజిటివ్‌గా తేలడం ఇది మూడోసారి. కాగా, 42ఏళ్ల సీమ చివరిసారిగా 2023 ఆసియా క్రీడల్లో పోటీపడింది. ఆ టోర్నీలో కాంస్యం నెగ్గింది. అయితే, ఆమె ఏ టోర్నీ సందర్భంగా డోప్ పరీక్షలో విఫలమైంది, ఎలాంటి నిషేధిత ఉత్ప్రేరకం తీసుకుందన్న వివరాలు వెల్లడికాలేదు.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



శనివారం | 6-12-2025 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 248 | శ్రీ విశ్వావసునామసంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, మార్గశిరమాసం, బహుళపక్షం; తిథి: విదియ రా.9.26 తదుపరి తదియ; నక్షత్రం: మృగశిర ఉ.8.49, ఆర్ద్ర తె.6.13; వర్జ్యం: సా.4.18-5.44; దుర్ముహూర్తం: ఉ.6.36-8.04; అమృతఘడియలు: రా.9.18-10.43; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 6.36; సూర్యాస్తమయం: 5.36 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో జరిగిన భారత్-రష్యా 23వ వార్షిక శిఖరాగ్ర సమావేశంలో చర్చలు జరుపుతున్న ప్రధాని మోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్, ఇరు దేశాల మంత్రులు, అధికారులు

భారత ఇంధన అవసరాలన్నీ తీరుస్తాం

అంతరాయం లేకుండా చమురు సరఫరా చేస్తాం

- కూడంకుళం అణువిద్యుత్ ప్లాంటుకు సహకరిస్తాం
- ప్రధాని మోదీతో భేటీలో రష్యా అధ్యక్షుడు పుతిన్ హామీలు
- ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో 23వ శిఖరాగ్ర సమావేశం
- భారత్, రష్యా మధ్య ఐదేళ్ల వ్యవధికి ఆర్థిక ఒప్పందం
- 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యం 100 బిలియన్ డాలర్లకు
- రక్షణ, ఆరోగ్యం, షిప్పింగ్ తదితర 16 ఒప్పందాలు
- ఉక్రెయిన్‌తో శాంతియుత ముగింపు.. మోదీ సూచన
- భారత్- రష్యా స్నేహం ఒడిదుడుకులను తట్టుకొని ధ్రువతారగా నిలిచిందని వెల్లడి
- చర్చల తర్వాత మోదీ-పుతిన్ మీడియా సమావేశం
- రాష్ట్రపతి భవన్‌లో విందు.. స్వదేశానికి బయల్దేరిన పుతిన్
- విందుకు శశిథరూర్.. రాహుల్, ఖర్గేలకు అందని ఆహ్వానం

న్యూఢిల్లీ, డిసెంబరు 5: భారత్‌కు రష్యా నమ్మకమైన ఇంధన సరఫరాదారుగా ఇకముందు కూడా కొనసాగుతుందని ఆ దేశాధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ హామీ ఇచ్చారు. భారత్‌కు అంతరాయం లేకుండా చమురు, గ్యాస్, బొగ్గు వంటి అవసరమైన అన్నిరకాల ఇంధనాలను సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. భారత పర్యటనకు వచ్చిన పుతిన్‌తో ప్రధాని నరేంద్రమోదీ శుక్రవారం ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో చర్చలు జరిపారు. భారత్-రష్యా 23వ వార్షిక శిఖరాగ్ర సమావేశంలో పాల్గొన్న ఇద్దరు నేతలు రెండు దేశాల మధ్య ఆర్థిక, ఇంధన సహకారంతోపాటు అనేక అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఉగ్రవాదంపై సంయుక్తంగా పోరాటం చేయాలని నిర్ణయించారు. భారత్-రష్యా బిజినెస్ ఫోరం సమావేశంలో పాల్గొన్నారు. ఇద్దరు నేతలు సంయుక్త మీడియా సమావేశంలో పాల్గొని పలు అంశాలపై మాట్లాడారు. భారత ఉత్పత్తులకు రష్యా మార్కెట్‌ను మరింతగా తెరుస్తామని ఈ సందర్భంగా పుతిన్ ప్రకటించారు. తమిళనాడులోని కూడంకుళం అణువిద్యుత్ ప్లాంటులో నిర్మాణంలో ఉన్న నాలుగు యూనిట్లను త్వరలో వినియోగంలోకి తెచ్చేందుకు సహకారం అందిస్తామని పుతిన్ హామీ ఇచ్చారు. 6,000 మెగావాట్ల సామర్థ్యంగల

మిగతా 2వ పేజీలో...

ఏ దేశమూ ఒంటరి కాదు

- రష్యాతో వాణిజ్యం వద్దని
- అమెరికా, యూరప్ ఒత్తిళ్లు
- అయినప్పటికీ భారత్‌లో
- వ్లాదిమిర్ పుతిన్ పర్యటన
- ఇది ప్రపంచానికి స్పష్టమైన సందేశం పంపింది 2
- చైనా మీడియాలో కథనాలు

పుతిన్‌కు భగవద్గీత

- రష్యన్ భాషలోకి
- అనువదించిన గ్రంథాన్ని
- బహూకరించిన మోదీ 2
- పొలరాతి చదరంగం కూడా..

నిధులడిగే ఓపిక ఉంది!

కాదంటే కేంద్రాన్ని ఢీకొట్టే దమ్ముంది

- వంద సార్లయినా ఢిల్లీ వెళ్లి నిధులడుగుతా.. రాష్ట్ర ప్రజలు అండగా నిలిస్తే చాలు
- రెఫరెండం అన్నోడిని బండకేసి కొట్టారు.. సిగ్గు లేకుండా నెల రోజులకే తిరుగుతుండు
- గడీలోళ్ల కరెంటు పీకేందుకే కాంగ్రెస్ వచ్చింది.. ఉచిత కరెంట్ పేటెంట్ హక్కులు కాంగ్రెస్‌వే
- మంత్రితో పని చేయించుకొనే వాళ్లను ఎన్నుకోండి.. త్వరలో 40 వేల ఉద్యోగాల ప్రకటన
- మార్చిలో 35 లక్షల ఇందిరమ్మ చీరల పంపిణీ.. నర్సంపేట బహిరంగ సభలో సీఎం రేవంత్


నర్సంపేట సభలో సీఎం రేవంత్, మంత్రులు పొంగులేటి, కొండా సురేఖ, సీతక్క, ఎమ్మెల్యే మాధవరెడ్డి

వరంగల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రజలు అండగా ఉంటే ఢిల్లీనైనా ఢీకొట్టడానికి వెనుకాడనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రానికి అవసరమైన నిధుల కోసం ఒకటికి వంద సార్లు ఢిల్లీకి వెళ్లి అడుగుతానని, ముఖ్యమంత్రిగా ప్రధాని దగ్గరకు, కేంద్ర మంత్రుల దగ్గరకు వెళ్లడం తన బాధ్యతని చెప్పారు. తనకు ఓపిక, వయసు, విషయాన్ని వివరించే పరిజ్ఞానం ఉన్నాయని ప్రస్తావించారు. తెలంగాణ ప్రయోజనాల కోసం ఎవరినైనా కలుస్తానని, అదే సమయంలో రాకపోతే ఎంత దూరం అయినా వెళ్లి కొట్లాడతానని అన్నారు. శుక్రవారం వరంగల్ జిల్లా నర్సంపేటలో రూ.532 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడారు. తెలంగాణపై కేంద్ర వివక్ష

మిగతా 13వ పేజీలో...

నేడు దేవరకొండకు సీఎం రేవంత్

- గ్లోబల్ సమ్మిట్ పూర్తిగా ఆర్థిక సదస్సే
- రానున్న 20ఏళ్ల ప్రణాళికను ప్రకటించే వేదిక
- సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్
- ఫ్యూచర్ సిటీలో ఏఐ ఎక్సలెన్స్ సెంటర్
- ఆస్ట్రేలియాతో తెలంగాణ ప్రభుత్వం ఒప్పందం
- డిజిటల్ ఇండియాకు ముఖద్వారం: దుద్దిళ్ల
- తెలంగాణ గ్లోబల్ సదస్సుకు రండి
- ఏపీ సీఎం బాబుకు కోమటిరెడ్డి ఆహ్వానం
- స్టాలిన్, ఒమర్ అబ్దుల్లాకు ఉత్తమ్ ఆహ్వానం
- అసోం సీఎంకు ఆహ్వాన పత్రిక ఇచ్చిన జూపల్లి
- గ్లోబల్ సమ్మిట్‌పై ఇండిగో ప్రభావం?
- పరిస్థితిని సమీక్షిస్తున్న ప్రభుత్వం 13



బీసీ రిజర్వేషన్ల కోసం ఆత్మాహుతి!

- ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న క్యూన్యూస్ కార్యాలయం వద్ద యువకుడి ఆత్మహత్యాయత్నం
- కిరోసిన్ పోసుకొని నిప్పు పెట్టుకున్న సాయి ఈశ్వర్ చారి
- చికిత్స పొందుతూ మృతి
- భగ్గుమన్న బీసీ నేతలు, గాంధీ ఆస్పత్రి వద్ద ధర్నా 14
- ఈశ్వర్ మరణానికి సీఎం రేవంత్‌దే బాధ్యత : ఆర్.కృష్ణయ్య
- నేడు, రేపు నిరసనలు: జాజుల
- ఇది ప్రభుత్వ హత్యే: కేటీఆర్

ఫోన్ లొకేషన్ ఎల్లప్పుడూ ఆన్!

- కొత్త నిబంధన అమలుపై కేంద్ర ప్రభుత్వం కసరత్తు
- గోప్యతకు భంగం 2
- యాపిల్, గూగుల్, శాంసంగ్ నుంచి వ్యతిరేకత


నిర్మాణ దశలో ఉండగానే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ పొందిన భవనం

విలీనానికి ముందు.. విచ్చలవిడి అనుమతులు

- విలీన మునిసిపాలిటీల్లో పర్మిషన్ల దందా!
- నిర్మాణ దశలో ఉన్న భవనానికి ఓసీ జారీ
- కోర్టు వివాదాల్లో ఉన్న భూములకు, పార్కులో నిర్మించిన భవనానికీ పర్మిషన్లు
- ఖాళీ స్థలాలకు ఇంటి నెంబర్ల కేటాయింపు
- ఆస్తిపన్నులో అడ్డగోలు మినహాయింపులు
- జీహెచ్‌ఎంసీలో మునిసిపాలిటీల విలీనంతో మునిసిపల్ అధికార్ల అక్రమాలు
- ఏసీబీ, విజిలెన్స్‌కు చేరిన వసూళ్ల చిట్టా
- పూర్తి స్థాయి విచారణకు రంగం సిద్ధం

హైదరాబాద్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈ ఫొటోలో కనిపిస్తున్న ఆకుపచ్చ రంగు పరదా చాటున దాగి ఉన్న భవనం.. ఇంకా నిర్మాణ దశలోనే ఉంది. స్లాబులు కూడా పూర్తి కాలేదు. కానీ, ఈ భవనానికి మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు అప్పుడే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) జారీ చేశారు. ఇందుకు కారణం.. ఈ కార్పొరేషన్ గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్

మిగతా 12వ పేజీలో...

ఏకగ్రీవానికి వేలంపాట..

35 మందిపై కేసు

- సిద్దిపేట అర్బన్ మండలం బొగ్గులోనిబండలో ఘటన
- వేలంలో ఓడిన వ్యక్తి నామినేషన్ వేయడంతో విషయం వెలుగులోకి
- పోలీసుల విచారణ.. కేసు నమోదు

సిద్దిపేట అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో తమ సర్పంచ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు వేలంపాట నిర్వహించిన ఓ గ్రామానికి చెందిన 35 మందిపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఇందులో వేలంలో పాల్గొన్న అభ్యర్థులు, వేలం నిర్వహించిన గ్రామ పెద్దలు ఉన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం బొగ్గులోని బండ (పాండవపురం)లో జరిగిన ఈ ఘటనకు సంబంధించి

మిగతా 11వ పేజీలో...

విత్‌డ్రా చేసుకోండి

- లేదంటే తీవ్ర పరిణామాలుంటాయ్
- సర్పంచ్ అభ్యర్థిని బెదిరిస్తూ లేఖ
- ఆసిఫాబాద్ జిల్లాలో ఘటన 11

కావాలనే సంక్షోభం?

ఉద్యోగులు రాసిన లేఖతో ఇండిగో యాజమాన్యంపై సందేహాలు

- సంక్షోభానికి కారకులు బాగానే ఉన్నారు
- ఫ్రంట్‌లైన్ ఉద్యోగులేమో ప్రయాణికుల ఆగ్రహాన్ని ఎదుర్కొంటున్నారు
- డీజీసీఏ నిబంధనలు అమల్లోకి రాగానే విమాన సర్వీసులు రద్దవడమేంటి?
- ఉద్యోగుల బాధ్యత లేదని ప్రకటించాలి
- లేఖలో ఇండిగో సిబ్బంది డిమాండ్
- డీజీసీఏ నిబంధనల అమలుకు వ్యవధి ఇచ్చినా ఏర్పాట్లు చేసుకోని ఇండిగో!
- దర్యాప్తునకు ఆదేశించిన కేంద్రం
- ఫిబ్రవరి 10 దాకా ఇండిగోకు తాత్కాలికంగా నిబంధనల సడలింపు
- 15 రోజులకోసారి సమీక్ష
- తప్పంతా ఇండిగోదే.. చర్యలు తప్పవు
- కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు
- తాజాగా వెయ్యికి పైగా విమానాల రద్దు


ఇండిగో సర్వీసుల రద్దుతో శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ప్రయాణికుల అవస్థలు

న్యూఢిల్లీ, డిసెంబరు 5: దేశంలోనే అతిపెద్ద పౌర విమానయాన సంస్థ ఇండిగోలో సంక్షోభం కావాలనే సృష్టించారా? డీజీసీఏ నిబంధనల అమలుకు సమయం ఉన్నప్పటికీ తగిన ఏర్పాట్లు చేసుకోకుండా తాత్సారం చేశారా? నిబంధనలు అమల్లోకి వచ్చిన తర్వాత గందరగోళం సృష్టిస్తున్నారా? ఉద్దేశపూర్వకంగానే విమాన

మిగతా 10వ పేజీలో...

'మ్యాచ్ ఫిక్సింగ్' గుత్తాధిపత్యం వల్లే..

- ఇండిగో సంక్షోభంపై రాహుల్
- పార్టీ, ప్రభుత్వం, వ్యాపారాల్ని ఇద్దరే నడిపితే ఇలాగే ఉంటుంది: ఖేరా

వర్చువల్‌గా రిసెప్షన్.. 10

విమానం రద్దుతో వింత పరిస్థితి



హిల్ట్ జీవోపై స్టేకు హైకోర్టు నో!

- జీవో చట్టవిరుద్ధమన్న పిటిషనర్లు
- పాలసీ ప్రకటించింది ఇప్పుడే కదా..
- ఏదో అయిందనుకోవడం ఊహే 13
- ప్రజల కాలుష్యం బాధ కనిపించట్లేదా?
- పిటిషనర్లను తప్పుపట్టిన ప్రభుత్వం
- నిజమేనని అంగీకరించిన హైకోర్టు ధర్మాసనం

బియ్యం లారీ జీపీఎస్‌ను మార్చి..

300 క్వింటాళ్ల రేషన్ బియ్యం దారి మళ్లింపు

- బైకుకు జీపీఎస్ అమర్చి ఏమార్చిన అక్రమార్కులు
- అక్రమ దందాను గుర్తించిన విజిలెన్స్ అధికారులు
- 15 మందిపై కేసు నమోదు.. 13 మంది అరెస్టు
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఘటన

కొత్తగూడెం కలెక్టరేట్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా పేదలకు అందించాల్సిన రేషన్ బియ్యాన్ని గోదాముల్లో నిల్వ ఉంచుతారు. అక్కడి నుంచి ఎంఎల్‌ఎస్ పాయింట్‌కు.. అటు నుంచి ఆయా ప్రాంతాల్లోని రేషన్ దుకాణాలకు లారీల్లో బియ్యాన్ని సరఫరా చేసి లబ్ధిదారులకు అందిస్తారు. రేషన్ బియ్యం దారిమళ్లకుండా సరఫరా చేసే లారీలకు జీపీఎస్‌ను అమరుస్తారు. దీని ద్వారా లారీ ఎటువైపు వెళ్తుందన్నది తెలుసుకోవచ్చు. అయితే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో

మిగతా 14వ పేజీలో...


స్వాధీనం చేసుకున్న డబ్బుతో పోలీసు ఉన్నతాధికారులు

సీట్ల కింద.. స్టెప్నీ టైరులో.. రూ.4.50 కోట్లు!

- మోసం కేసులో నిందితులను వెంబడిస్తే.. కారులో హవాలా డబ్బు దొరికిన వైనం 12
- 125 కి.మీ. వెంబడించి పట్టుకున్న పోలీసులు
- ఇద్దరు నిందితుల అరెస్టు.. హైదరాబాద్‌లో ఘటన

60 వేలు లంచం తీసుకుంటూ


అదనపు కలెక్టర్ అరెస్టు

- హనుమకొండ జిల్లాలో ఘటన
- స్కూల్ పునరుద్ధరణకు లక్ష డిమాండ్ చేసిన అధికారి
- 60 వేలకు ఒప్పందం.. ఏసీబీ దాడిలో అరెస్టు
- ఆయనతో పాటు ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు కూడా


ఏసీబీకి పట్టుబడ్డ హనుమకొండ అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

వరంగల్ క్రైం/ హనుమకొండ కలెక్టరేట్/ చండూరు/ బెల్లంపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేటు పాఠశాల పునరుద్ధరణ ఆదేశాలివ్వడానికి రూ.లక్ష లంచం డిమాండ్ చేసిన హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ (ఇన్‌చార్జి డీఈఓ) వెంకట్‌రెడ్డి, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు

మిగతా 11వ పేజీలో...



దేవుడి నిధులు ఆలయానివే

- నష్టాల్లోని బ్యాంకులను ఆదుకోవడానికి వాటిని వాడరాదు
- బ్యాంకులకు అవి ఆదాయ వనరు కాదు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, డిసెంబరు 5: భగవంతుడికి చెందాల్సిన ఆలయ నిధులను, నష్టాల్లో ఉన్న సహకార బ్యాంకులను కాపాడేందుకు వాడరాదని సుప్రీం కోర్టు తేల్చి చెప్పింది. దీనిపై కేరళ హైకోర్టు తీర్పును ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీల బెంచ్ ధ్రువీకరిస్తూ, ఆ రాష్ట్రానికి చెందిన సహకార బ్యాంకుల పిటిషన్‌ను తిరస్కరించింది. కాలపరిమితి తీరిన తర్వాత కూడా ఫిక్స్‌డ్ డిపాజిట్లను క్లియర్ చేయడానికి నిరాకరించడంతో ఈ సహకార బ్యాంకులకు వ్యతిరేకంగా తిరునెల్లి దేవస్థానం కేరళ హైకోర్టుకు వెళ్లింది. ఆలయ దేవస్థానం డిపాజిట్లను రెండు నెలల్లో తిరిగి ఇచ్చేయాలంటూ ఆ బ్యాంకులను హైకోర్టు ఆదేశించింది. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా ఆ ఐదు బ్యాంకులకుగాను, మనంతవాడి కో ఆపరేటివ్ అర్బన్ సొసైటీ లిమిటెడ్, తిరునెల్లి సర్వీస్ కో ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ అనే రెండు బ్యాంకులు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. అయితే, హైకోర్టు నిర్ణయాన్నే సీజే బెంచ్ సమర్థించింది. "బ్యాంకులను రక్షించడానికి ఆలయ నిధులను వాడాలంటారా" అని సీజే ప్రశ్నించారు. ఆలయ నిధులు భగవంతుడికి చెందినవని, వాటిని కేవలం ఆలయ అవసరాల కోసమే వినియోగించాలని స్పష్టం చేశారు. సహకార బ్యాంకుల మనుగడకు, వాటి ఆదాయానికి ఈ నిధులు వనరు కారాదని తేల్చిచెప్పారు. రెండు నెలల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్ నిధులను తిరిగి ఇచ్చేయాలన్న హైకోర్టు తీర్పును సవరించడానికి నిరాకరించారు.

రాజ్‌ఘాట్‌ను సందర్శించిన పుతిన్

న్యూఢిల్లీ, డిసెంబరు 5: రష్యా అధ్యక్షుడు పుతిన్ శుక్రవారం ఉదయం మహాత్మా గాంధీ సమాధి రాజ్‌ఘాట్‌ను సందర్శించి నివాళులు అర్పించారు. అక్కడ ఉన్న సందర్శకుల పుస్తకంలో మహాత్ముని సేవలను ప్రస్తుతిస్తూ రష్యన్ భాషలో రాశారు. మహాత్ముడు శాంతి, సత్యం, అహింస ద్వారా ఈ భూగోళానికి ఎనలేని సేవలు చేశారని పేర్కొన్నారు. ఆయన బోధనల అవసరం నేటి ప్రపంచానికి ఎంతో ఉందని అభిప్రాయపడ్డారు. రష్యా వాటిని పాటిస్తోందని తెలిపారు. రష్యా ప్రభుత్వ టీవీ ఛానెల్ 'ఆర్‌టీ ఇండియా'ను పుతిన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలీవుడ్ లెజెండ్ రాజ్ కపూర్‌ను గుర్తు చేశారు. బాలీవుడ్ సినిమాలు, రాజ్ కపూర్‌కు రష్యాలో ఎంతో ఆదరణ ఉండేదని చెప్పారు.

విజయ్‌తో తమిళనాడు కాంగ్రెస్ నేత భేటీ!

చెన్నై, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): డీఎంకేతో ఎంత స్నేహంగా ఉన్నా అధికారంలో భాగస్వామ్యం ఇవ్వకపోవడం పట్ల కాంగ్రెస్ అసంతృప్తిగా ఉందా?.. అందుకే వచ్చే ఏడాది ఏప్రిల్‌లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను ప్రముఖ సినీ నటుడు విజయ్‌తో కలిసి ఎదుర్కోవాలని భావిస్తోందా?.. అవుననే అంటున్నాయి తమిళ రాజకీయవర్గాలు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తమకు 40 స్థానాలు కావాలంటూ గత బుధవారం టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ గిరీష్ శోడంకర్ డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్‌ను కోరారు. అయితే, ఆ భేటీ జరిగిన 48 గంటల్లోనే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి సన్నిహితునిగా పేరుగాంచిన ప్రవీణ్ చక్రవర్తి టీవీకే అధినేత విజయ్‌తో రహస్యంగా భేటీ కావడం తమిళ రాజకీయాల్లో కలకలం రేపుతోంది. శుక్రవారం స్థానిక పట్టినబాక్కంలోని టీవీకే కార్యాలయానికి వెళ్లిన ప్రవీణ్ చక్రవర్తి.. విజయ్‌తో గంటకు పైగా భేటీ అయినట్లు సమాచారం. ఇదిలా ఉండగా కాంగ్రెస్ అడిగినన్ని స్థానాలు ఇచ్చేందుకు స్టాలిన్ సుముఖంగా లేరు. కాంగ్రెస్‌కు 20-25 శాసనసభ స్థానాలు మాత్రం ఇవ్వాలని స్టాలిన్ భావిస్తున్నట్లు సమాచారం.

వలసదారుల వర్క్ పర్మిట్ల కాలవ్యవధి కుదింపు

- ఐదేళ్ల నుంచి 18 నెలలకు తగ్గింపు: యూఎస్‌సీఐఎస్

న్యూఢిల్లీ, డిసెంబరు 5: శరణార్థులు, వలసదారులకు ట్రంప్ యంత్రాంగం మరో షాక్ ఇచ్చింది. వీరికి ఇచ్చే వర్క్ పర్మిట్ల కాల వ్యవధిని ఐదేళ్ల నుంచి 18 నెలలకు తగ్గించింది. భద్రతాపరమైన కారణాలతోనే ఈ మేరకు నిబంధనలు సవరించినట్లు అమెరికా పౌరసత్వ, వలస సేవల విభాగం(యూఎస్‌సీఐఎస్) గురువారం ప్రకటించింది. ఈ నిర్ణయంతో అమెరికాలో పనిచేయాలనుకొనేవారు ప్రజా భద్రతకు ముప్పు కలిగించకుండా, అమెరికన్ వ్యతిరేక భావజాలాన్ని ప్రోత్సహించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకొనే అవకాశం ఉంటుందని పేర్కొంది. సవరించిన నిబంధనల ప్రకారం.. శరణార్థులు, ఆశ్రయం కోరేవారు, గ్రీన్‌కార్డు కోసం ఎదురుచూస్తున్న వారికి ఐదేళ్లకు బదులుగా 18నెలలకు పరిమితం చేసిన ఎంప్లాయ్‌మెంట్ ఆథరైజేషన్ డాక్యుమెంట్(ఈఏడీ) మంజూరు చేస్తారు. అదే విధంగా టెంపరరీ ప్రొటెక్టెడ్ స్టేటస్ (టీపీఎస్) కలిగినవారు, పెరోల్ దారులు, టీపీఎస్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నవారికి ఏడాది, అంతకంటే తక్కువ సమయానికి వర్క్ పర్మిట్ ఇస్తారు.

ఎక్స్‌పై ఈయూ రూ.1,257 కోట్ల జరిమానా

లండన్, డిసెంబరు 5: ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన ప్రముఖ సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'పై యూరోపియన్ యూనియన్ (ఈయూ) భారీ జరిమానా విధించింది. తమ కూటమి డిజిటల్ నిబంధనలను ఉల్లంఘించినందుకు గాను, ఎక్స్‌పై ఏకంగా 120 మిలియన్ యూరోల (సుమారు రూ.1,257 కోట్లు) ఫైన్ వేసినట్లు ఈయూ నియంత్రణాధికారులు శుక్రవారం ప్రకటించారు. ఎక్స్‌లోని కొన్ని పద్ధతులు వినియోగదారులను మోసాలకు గురిచేస్తున్నాయని యూరోపియన్ కమిషన్ తమ రెండేళ్ల దర్యాప్తులో తేల్చింది. గతంలో ప్రముఖులకు మాత్రమే ఇచ్చే బ్లూ చెక్‌మార్క్‌లను మస్క్ కొనుగోలు తర్వాత, నెలకు కొంత డబ్బు చెల్లించిన ప్రతి ఒక్కరికి ఇవ్వడం మొదలుపెట్టిందని తెలిపింది. దీనివల్ల అసలు ఖాతాదారులెవరు? నకిలీ ఖాతాలు ఏవి? అని తెలుసుకోవడం కష్టమవుతోందన్న కమిషన్, దీన్ని మోసపూరిత పద్ధతిగా పేర్కొంది.

నేషనల్ హెరాల్డ్ కేసులో డీకేకు నోటీసులు

బెంగళూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): నేషనల్ హెరాల్డ్ కేసులో ఆర్థిక లావాదేవీలకు సంబంధించి వివరాలు సమర్పించాలని కోరుతూ కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, ఆయన సోదరుడు మాజీ ఎంపీ డీకే సురేశ్‌కు ఢిల్లీ పోలీసులు నోటీసులు జారీ చేశారు. కాంగ్రెస్ అగ్రనాయకులు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీపై అక్టోబరు 3న దాఖలైన నేషనల్ హెరాల్డ్ కేసుకు సంబంధించి శివకుమార్ వద్ద కీలక సమాచారం ఉందని భావిస్తూ ఆర్థిక నేరాల విభాగం నోటీసులో పేర్కొంది. వ్యక్తిగత సమాచారం, కాంగ్రెస్‌తో సంబంధాలు, నేషనల్ హెరాల్డ్ పత్రికకు విరాళాలు ఎలా ఇచ్చారనే అంశాలను ప్రస్తావించినట్లు తెలుస్తోంది. ఈనెల 19వ తేదీలోపు హాజరు కావాలనీ, లేదంటే సమాచారం ఇవ్వాలని సూచించారు.

ట్రంప్‌కు ఫిఫా 'శాంతి బహుమతి'

- ప్రదానం చేసిన ప్రపంచ ఫుట్‌బాల్ సమాఖ్య



వాషింగ్టన్, డిసెంబరు 5: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అన్నట్టుగానే 'శాంతి దూత' అయ్యారు. 8యుద్ధాలు ఆపానంటూ ఆయన గట్టిగా కోరుకున్నట్టుగానే శాంతి బహుమతి వచ్చింది. కానీ నోబెల్ కాదు.. ఫిఫా శాంతి బహుమతి. 'ప్రపంచ ఫుట్‌బాల్ సమాఖ్య' తొలిసారిగా ప్రవేశపెట్టిన ఈ శాంతి బహుమతిని శుక్రవారం ట్రంప్‌కు ప్రదానం చేసింది. వచ్చే ఏడాది జరగనున్న ఫిఫా ప్రపంచ కప్ ఫుట్‌బాల్ టోర్నీకి జట్ల ఎంపికపై శుక్రవారం వాషింగ్టన్‌లో డ్రా వేడుక జరిగింది. ట్రంప్ ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఫిఫా అధ్యక్షుడు గియాని ఇన్‌ఫాంటినో ఈ సందర్భంగా ట్రంప్‌కు శాంతి బహుమతిని ప్రదానం చేశారు. బంగారు రంగులో ఉన్న పెద్ద ట్రోఫీని, నీలి రంగు రిబ్బన్‌తో కూడిన స్వర్ణ పతకాన్ని అందజేశారు. 'నిజంగా ఇది నా జీవితంలో అత్యంత గొప్ప గౌరవం. భారత్-పాక్ యుద్ధం సహా ఎన్నో యుద్ధాలు ఆపి.. లక్షలాది ప్రాణాలు కాపాడను. నిజానికి నాకు బహుమతులు అవసరం లేదు. ప్రజల ప్రాణాలు కాపాడటమే లక్ష్యం' అని ట్రంప్ పేర్కొన్నారు. ఫిఫా శాంతి బహుమతిని ఇవ్వడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

భారత ఇంధన అవసరాలన్నీ తీరుస్తాం



శుక్రవారం రాష్ట్రపతి భవన్‌లో విందు సందర్భంగా మాట్లాడుతున్న రష్యా అధ్యక్షుడు పుతిన్

(మొదటి పేజీ తరువాయి)

ఈ పవర్ ప్లాంటులో 2013లో ఒకటి, 2016లో మరొక యూనిట్ విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించాయి. మరో నాలుగు నిర్మాణంలో ఉన్నాయి. ఇంధనేతర అణు సాంకేతికత అభివృద్ధిలో (ఔషధ, వ్యవసాయ రంగాల వంటివి) భారత్‌కు సహకారం అందిస్తామని పుతిన్ తెలిపారు. గురువారం రాత్రి ఢిల్లీ చేరుకున్న పుతిన్‌కు మోదీ విమానాశ్రయానికి వెళ్లి స్వాగతం పలకగా, శుక్రవారం ఉదయం రాష్ట్రపతి భవన్ వద్ద భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అధికారికంగా పుతిన్‌కు స్వాగతం పలికారు. భారత త్రివిధ దళాలు గౌరవ వందనం సమర్పించాయి. శుక్రవారం రాత్రి రాష్ట్రపతి భవన్‌లో విందులో పాల్గొన్న అనంతరం పుతిన్ స్వదేశానికి తిరిగి వెళ్లారు. "కలిసి సాగుదాం.. కలిసి ఎదుగుదాం" అన్న చెప్తూ ఆయన తన భారత పర్యటనను ముగించారు.

ధ్రువతారగా నిలిచిన స్నేహం

భారత్- రష్యా మధ్య 80 ఏళ్ల స్నేహం కాలపరీక్షకు తట్టుకొని నిలిచిందని మోదీ అన్నారు. 'గత 8 దశాబ్దాల్లో ప్రపంచం ఎన్నో ఎత్తుపల్లాలను చూసింది. ఎన్నో మానవతా సంక్షోభాలు, సమస్యలు వచ్చాయి. వీటన్నింటినీ తట్టుకొని భారత్-రష్యా స్నేహం ధ్రువతారలా స్థిరంగా నిలబడింది. ఈ పునాదిని మరింత బలోపేతం చేసేందుకు మేము అన్ని అంశాలపై చర్చలు జరిపాం. ఆర్థిక సహకారాన్ని మరోస్థాయికి తీసుకెళ్లటమే రెండుదేశాల ఉమ్మడి లక్ష్యం. ఇందుకోసం 2030 వరకు కొనసాగే ఆర్థిక సహకార ప్రణాళికపై సంతకాలు చేశాం. ఈ ప్రణాళిక రెండు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులను విస్తృతం చేయటంతోపాటు సుస్థిరం చేస్తుంది' అని సంయుక్త మీడియా సమావేశంలో మోదీ తెలిపారు. భారత్- రష్యా సంబంధాల్లో ఇంధన భద్రత చాలా కీలకమైందని చెప్పారు. ఈ విషయంలో రెండువైపులా ప్రయోజనం ఉండే విధానాన్ని అవలంబిస్తామని వెల్లడించారు. అరుదైన ఖనిజాల విషయంలో ఈ రెండు దేశాల మధ్య సహకారం ప్రపంచ సప్లై చైన్‌కు భద్రత కల్పిస్తుందని పేర్కొన్నారు. ఉక్రెయిన్‌తో యుద్ధం ముగింపునకు భారత్ సహకారం అందిస్తుందని మోదీ ప్రకటించారు. 'అంతర్జాతీయ ఘర్షణల విషయంలో భారత్ తటస్థ విధానం అనుసరించబోదు' అని స్పష్టం చేశారు.

ఐదేళ్ల ఆర్థిక ప్రణాళిక

భారత్-రష్యా మధ్య వార్షిక ద్వైపాక్షిక వాణిజ్యాన్ని ప్రస్తుతం ఉన్న 64 బిలియన్ డాలర్ల నుంచి 100 బిలియన్ డాలర్లకు పెంచాలని సమావేశంలో నిర్ణయించారు. ఇందుకోసం వచ్చే ఐదేళ్ల కాలానికి సంబంధించి ఆర్థిక సహకార ప్రణాళికపై సంతకాలు చేశారు. డాలర్‌కు బదులుగా సొంత కరెన్సీలోనే లావాదేవీలు నిర్వహించేందుకు తగిన వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించారు. భారత్ త్వరలో రష్యా పౌరుల కోసం 30 రోజుల వ్యవధిగల ఉచిత ఈ- టూరిస్ట్ వీసాలను, 30 రోజుల గ్రూప్ టూరిస్ట్ వీసాలను జారీచేసేందుకు సమావేశంలో ఒప్పందం కుదిరిగింది. మరోవైపు, భారత్- యూరేషియన్ ఎకనమిక్ యూనియన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై చర్చలు ప్రారంభమైనట్లు మోదీ ప్రకటించారు. రష్యాలో 1.2 బిలియన్ డాలర్లతో 20 లక్షల టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో గ్రీన్‌ఫీల్డ్ యూరియా ప్లాంటు ఏర్పాటుచేసేందుకు భారత్‌కు చెందిన ఆర్‌సీఎఫ్, ఐపీఎల్, ఎన్ఎఫ్ఎల్ సంస్థలు సంయుక్తంగా రష్యా కంపెనీ ఉరాల్‌కెమ్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి.

పుతిన్‌తో విందుకు థరూర్

- రాహుల్, ఖర్గేలకు అందని ఆహ్వానం

పుతిన్‌కు రాష్ట్రపతి ముర్ము ఇచ్చిన విందుకు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేలకు ఆహ్వానం అందలేదు. అదే సమయంలో కాంగ్రెస్ ఎంపీ అయిన శశిథరూర్‌కు మాత్రం పిలుపువచ్చింది. విదేశాల అధినేతలు భారత్‌కు వచ్చినప్పుడు వారు ప్రతిపక్ష నేతను కలవకుండా మోదీ ప్రభుత్వం అడ్డుకుంటోందని రాహుల్ గాంధీ ఆరోపణలు చేసిన మరునాడే ఇలా జరగడం గమనార్హం. ఆపరేషన్ సిందూర్ అనంతరం వివిధ దేశాలకు కేంద్రం పంపిన బృందాల్లో శశిథరూర్ ఉన్న సంగతి తెలిసిందే.

లోకం తీరు



ఏ దేశమూ ఒంటరి కాదు

- పుతిన్ భారత పర్యటనపై చైనా

న్యూఢిల్లీ, డిసెంబరు 5: భారత్‌లో పుతిన్ పర్యటనను చైనా మీడియా విపరీతంగా ప్రశంసించింది. రష్యాపై అమెరికా, యూరోపియన్ దేశాల ఆంక్షలు, భారత్‌పై అడ్డగోలు టారిఫ్‌లు, రష్యాతో వాణిజ్యాన్ని తగ్గించాలన్న తీవ్ర ఒత్తిడులు కొనసాగుతున్న సమయంలో.. పుతిన్ భారత పర్యటన ప్రపంచానికి స్పష్టమైన సందేశం పంపిందని పేర్కొంది. భారత్, రష్యాల్లో ఏ దేశమూ ఒంటరికాదని ఈ పర్యటన తేల్చిచెప్పిందని వ్యాఖ్యానించింది. దీనిపై చైనాకు చెందిన గ్లోబల్ టైమ్స్ సహా పలు పత్రికలు కథనాలు ప్రచురించాయి. ఇక భారత-రష్యా మధ్య బంధం అత్యంత వ్యూహాత్మకమైనదని.. బయటి ఒత్తిళ్లకు, జోక్యానికి ప్రభావితమయ్యేది కాదని చైనా విదేశాంగ వ్యవహారాల యూనివర్సిటీ ప్రొఫెసర్ లీ హైడాంగ్ పేర్కొన్నారు.



పుతిన్‌కు రష్యన్ భగవద్గీత గిఫ్ట్

పుతిన్‌కు ప్రధాని మోదీ చిరస్మరణీయంగా ఉండే పలు బహుమతులు అందజేశారు. దేశ సంస్కృతికి ప్రతిబింబాలుగా, భారత-రష్యా స్నేహానికి గుర్తులుగా వాటిని బహూకరించారు. విశేషంగా రష్యన్ భాషలోకి అనువదించిన భగవద్గీత గ్రంథాన్ని స్వయంగా ఆయనకు అందజేశారు. ఇదే కాకుండా దేశంలోని నలుమూలలకు చెందిన వస్తువులను బహుమతులుగా ఇచ్చారు. అస్సాంకు చెందిన 'బ్లాక్ టీ' పొడిని అందజేశారు. దీనికి తోడుగా పశ్చిమ బెంగాల్‌లోని ముర్షీదాబాద్‌లో తయారు చేసిన వెండి టీ కప్పుల సెట్‌ను ఇచ్చారు. 'రెడ్ గోల్డ్'గా పిలుచుకునే కశ్మీరీ కుంకుమ పువ్వును కానుకగా మోదీ పుతిన్‌కు అందజేశారు.

రేంజ్ రోవర్, మెర్సిడెస్‌ను కాదని.. మోదీ, పుతిన్ ఫార్చునర్‌లో వెళ్లారెందుకు?

ప్రధాని మోదీ అధికారిక వాహనాలైన రేంజ్‌రోవర్, మెర్సిడెస్ మేబ్యాచ్ ఎస్650 వంటి కార్లు ఓవైపు.. రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రత్యేక వాహనం 'ఆరస్ సెనాట్' లైమోజిన్ కారు మరోవైపు.. అవన్నీ భద్రతాపరంగా ప్రత్యేకంగా రూపుదిద్దినవే. కానీ వాటిని కాదని పుతిన్, మోదీ ఇద్దరూ సాధారణ తెలుపు రంగు టొయోటా ఫార్చునర్ కారులో పాలెం విమానాశ్రయం నుంచి ప్రధాని నివాసానికి వెళ్లారు. దీనివెనుక యూరోపియన్ దేశాలకు పరోక్ష సంకేతం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రేంజ్ రోవర్ కారు తయారీ సంస్థ ప్రస్తుతం మన టాటాల చేతుల్లోనే ఉన్నా అది ప్రధానంగా బ్రిటన్‌కు చెందినది. ఇక మెర్సిడెస్ సంస్థ జర్మనీకి చెందినది. ఉక్రెయిన్‌పై యుద్ధం నేపథ్యంలో ఆ రెండు దేశాలూ రష్యాపై ఆంక్షలు విధించడం గమనార్హం. ఈ క్రమంలోనే జపాన్‌కు చెందిన టొయోటా సంస్థ ఫార్చునర్ వాహనాన్ని ఎంపిక చేసుకున్నట్టు చెబుతున్నారు. ఇరు దేశాల రక్షణ మంత్రులు రాజ్‌నాథ్, బెలోసోవ్ నేషనల్ వార్ మెమోరియల్ వద్ద నివాళులు అర్పించేందుకు తెలుపు రంగు ఫార్చునర్ కారులోనే కలిసి వెళ్లడం గమనార్హం.

నిజాం కట్టించిన భవనంలో చర్చలు

భారత్-రష్యా వార్షిక సదస్సులో భాగంగా ఢిల్లీలో ప్రధాని మోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్ భేటీ అయి చర్చించిన హైదరాబాద్ హౌస్‌కు ఎంతో చరిత్ర ఉంది. స్వాతంత్ర్యానికి పూర్వం హైదరాబాద్ సంస్థానాన్ని పాలిస్తున్న ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్‌కు.. ఢిల్లీకి వచ్చి వెళ్లినప్పుడు, బ్రిటిష్ అధికారులతో చర్చల కోసం ఓ భవనం అవసరం పడింది. ప్రపంచంలో అత్యంత ధనికుడిగా పేరున్న నిజాం.. తన వైభవాన్ని తలపించేలా ఉండాలని ఎనిమిది ఎకరాల విస్తీర్ణంలో 'హైదరాబాద్ హౌస్'ను కట్టించారు. అప్పటి ప్రఖ్యాత ఆర్కిటెక్ట్ ఎడ్విన్ ల్యూటైన్స్ మొఘల్, రోమన్ శైలిలను, ఆధునికతను జోడించి.. సీతాకోకచిలుక ఆకారంలో ఈ భవన సముదాయానికి రూపకల్పన చేశారు. అప్పటి వైస్రాయ్ హౌస్ (ప్రస్తుత రాష్ట్రపతి భవన్) తరహాలో పెద్ద డోమ్ ఏర్పాటు చేశారు. మొత్తం 36 గదులు, బర్మా టేకుతో కూడిన విలాసవంతమైన ఫర్నీచర్, పర్షియా కార్పెట్లు, 500 మంది భోజనం చేయగల డైనింగ్ హాల్, విశాలమైన లాన్లు వంటి ఏర్పాట్లెన్నో ఇందులో ఉన్నాయి. అప్పట్లోనే ఈ భవనానికి రూ.50 లక్షలు ఖర్చయింది. అంటే ఇప్పుడు సుమారు రూ.378 కోట్లు.

జమిలికి అసెంబ్లీల ఆమోదం అవసరం లేదు!

- జేపీసీ సభ్యులకు స్పష్టం చేసిన లా కమిషన్
- వచ్చే బడ్జెట్ సమావేశాల్లోనే జేపీసీ నివేదిక



జమిలిపై తన రిపోర్టును రాష్ట్రపతికి సమర్పిస్తున్న కోవింద్(ఫైల్)

న్యూఢిల్లీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): 'ఒక దేశం- ఒకేసారి ఎన్నికలు' లక్ష్యంతో దేశంలో జమిలి ఎన్నికలు నిర్వహించేందుకు ప్రవేశపెడుతున్న బిల్లులకు రాష్ట్రాల శాసనసభల ఆమోదం అవసరం లేదని లా కమిషన్.. సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి తెలిపింది. ప్రతిపాదిత బిల్లులు రాజ్యాంగంలోని మౌలిక స్వరూపాన్ని మార్చేందుకు ఏమీ ప్రయత్నించడం లేదని పేర్కొంది. సమాఖ్య నిర్మాణానికి భంగకరమయ్యేలా రాజ్యాంగ నిబంధనల్నీ మార్చడం లేదని స్పష్టం చేసింది. ఈ బిల్లులకు సంబంధించి ఇప్పటికే పలు వర్గాలతో చర్చించిన జేపీసీ.. గురువారం లా కమిషన్‌తో కూడా విస్తృత చర్చలు జరిపింది. మరో రెండు నెలల్లో మరింత మంది నిపుణులు, సంస్థలతో చర్చలు జరిపిన తర్వాత నివేదికను రూపొందించి వచ్చే బడ్జెట్ సమావేశాలలోపు సమర్పించనుంది. ఈ నివేదికను బడ్జెట్ సమావేశాల్లో పార్లమెంటులో ప్రవేశపెట్టే అవకాశాలున్నాయి. కాగా, రాజ్యాంగంలోని 368వ అధికరణ కింద జమిలి ఎన్నికల నిర్వహణకు రాష్ట్రాల ఆమోదం అవసరం లేదని 23వ లా కమిషన్ ఛైర్మన్ జస్టిస్ దినేశ్ మహేశ్వరి.. జేపీసీ సభ్యులకు వివరించారు. ఈ రాజ్యాంగ సవరణకు కనీసం 50 శాతం అసెంబ్లీలు ఆమోదించాల్సిన అవసరమేదీ లేదన్నారు. జమిలి ఎన్నికల కోసం ప్రవేశపెట్టే ప్రతిపాదనలన్నీ రాజ్యాంగ పరిమితుల్లోనే ఉన్నాయని, లోక్‌సభ, శాసనసభల ఎన్నికల షెడ్యూలును ఒకే తేదీల్లో నిర్ణయించడం వల్ల ప్రజల ఓటు హక్కుకేమీ నష్టం వాటిల్లదన్నారు.

కాలపరిమితిపై ఆందోళన వద్దు..

లోక్‌సభ, శాసనసభల కాలపరిమితికి సంబంధించి ఆందోళన కూడా అవసరం లేదని జేపీసీ సభ్యులకు లా కమిషన్ తెలిపింది. రాష్ట్ర శాసనసభల ఎన్నికలకు సంబంధించి కూడా చట్టాలు చేసే అధికారం పార్లమెంటుకే ఉందని తెలిపింది. అందువల్ల ఈ మేరకు బిల్లులు చేసే అధికారం పార్లమెంటుకే ఉంటుందని స్పష్టం చేసింది. 82ఏ(3), 82ఏ(5) క్లాజుల కింద ఎన్నికల కమిషన్‌కు విస్తృత అధికారాలు కల్పించడంపై వచ్చిన సందేహాలను కమిషన్ నివృత్తి చేసింది. రాజ్యాంగంలోని 324 అధికరణ కింద ఇప్పటికే ఎన్నికల కమిషన్‌కు విస్తృత అధికారాలున్నాయని, ఇప్పటికే ఉన్న కమిషన్ అధికారాలను సంబంధిత క్లాజులు మరింత స్పష్టీకరిస్తాయని వివరించింది. అయితే తమ ప్రశ్నలకు లా కమిషన్ సభ్యులు సంతృప్తికరమైన సమాధానాలు ఇవ్వలేకపోయారని ప్రతిపక్ష సభ్యుడొకరు అన్నారు. ఒకేసారి ఎన్నికలు జరిగితే ప్రజలు లోక్‌సభ ఎన్నికల్లో, అసెంబ్లీ ఎన్నికల్లో వేర్వేరుగా ఓటు వేసే అవకాశాలు ఉండకపోవచ్చునని, దీంతో ఓటు వేసిన తర్వాత సమీక్షించుకునే అవకాశం ఉండదని తాము చెప్పినట్లు తెలిపారు.

పాన్ మసాలా యూనిట్లపై సెస్

- బిల్లుకు లోక్‌సభ ఆమోదం

న్యూఢిల్లీ, డిసెంబరు 5: పాన్ మసాలా తయారీ యూనిట్లపై సెస్ విధింపునకు అవకాశం కలిగించే బిల్లుకు శుక్రవారం లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఈ రూపంలో వసూలయ్యే సొమ్మును జాతీయ భద్రత, ప్రజారోగ్యం కోసం వినియోగించనున్నారు. హెల్త్ సెక్యూరిటీ సే నేషనల్ సెక్యూరిటీ సెస్ బిల్లు-2025ను ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సభలో ప్రవేశపెట్టారు. జాతీయ భద్రత, ప్రజారోగ్య సేవల బలోపేతానికి అదనపు నిధులు అవసరం కావడంతో దీన్ని విధిస్తున్నట్టు చెప్పారు. పాన్ మసాలా తయారీ యంత్రాలపై సెస్ విధించనున్నట్టు తెలిపారు. పాన్ మసాలపై ప్రస్తుతం 40 శాతం జీఎస్టీ ఉందని, అది కొనసాగుతుందని చెప్పారు.

ఫోన్ లొకేషన్ ఎల్లప్పుడూ ఆన్!

- కొత్త నిబంధనపై కేంద్ర ప్రభుత్వం కసరత్తు

న్యూఢిల్లీ, డిసెంబరు 5: మెరుగైన నిఘా వ్యవస్థ కోసం ఫోన్ లొకేషన్ ఎల్లప్పుడూ ఆన్‌లోనే ఉండేలా కొత్త నిబంధన తీసుకొచ్చేందుకు కేంద్రం ప్రయత్నిస్తోంది. మొబైల్ తయారీ సంస్థలు ఫోన్ లొకేషన్‌ను ఎప్పుడూ ట్రాక్ చేసే వ్యవస్థను ప్రారంభించాలన్న టెలికాం శాఖ ప్రతిపాదనలపై కేంద్రం సమీక్షిస్తోంది. కానీ, దీనివల్ల వినియోగదారుల గోప్యతకు భంగం వాటిల్లే అవకాశం ఉండడంతో యాపిల్, గూగుల్, శాంసంగ్ వంటి మొబైల్ తయారీ కంపెనీలు దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు సమాచారం. కేసుల దర్యాప్తులో భాగంగా టెలికాం సంస్థలను చట్టపరంగా కోరుతున్నప్పటికీ.. అవి ఫలానా ప్రాంతాన్ని సూచిస్తున్నాయి తప్ప కచ్చితమైన లొకేషన్‌ను మాత్రం అందించడం లేదు. ఈ సమస్య పట్ల కేంద్ర ప్రభుత్వం కొన్నేళ్లుగా ఆందోళన వ్యక్తం చేస్తూనే ఉంది. ఇటీవల ఒక అంతర్గత సమావేశానికి సంబంధించి ఐటీ మంత్రిత్వ శాఖకు పంపిన ఈమెయిల్ ప్రకారం.. స్మార్ట్‌ఫోన్ తయారీ సంస్థలు ఉపగ్రహ సిగ్నల్స్, సెల్యూలార్ డేటాను ఉపయోగించే ఏ-జీపీఎస్ (అసిస్టెడ్-గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్) టెక్నాలజీని యాక్టివేట్ చేయాలని ప్రభుత్వం ఆదేశిస్తే.. వినియోగదారుల కచ్చితమైన లొకేషన్‌ను అందిస్తామని సెల్యులర్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రతిపాదించింది. దీని ప్రకారం స్మార్ట్‌ఫోన్లలో లొకేషన్ సర్వీసులను ఎల్లప్పుడూ ఆన్‌లోనే ఉంచాల్సి ఉంటుంది. వినియోగదారులు వాటిని ఆఫ్ చేయడానికి వీలుండదు. అయితే వినియోగదారుల గోప్యత దృష్ట్యా యాపిల్, గూగుల్, శాంసంగ్ వంటి కంపెనీలు దీన్ని వ్యతిరేకిస్తూ ఈ ఏడాది జూలైలో కేంద్రానికి లేఖ రాశాయి. సంచార్ సాథీ యాప్‌పై కేంద్రం వెనక్కు తగ్గడంతో ప్రస్తుతానికైతే దీనిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు.

అద్దెకు భర్త కావాలి

- పురుషుల జనాభా తగ్గిపోవడంతో లాత్వియా మహిళల అవస్థ
- ఇంటి పనుల్లో చేదోడు కోసం భర్తను అద్దెకు తెచ్చుకుంటున్న స్త్రీలు

న్యూఢిల్లీ, డిసెంబరు 5: ఉత్తర ఐరోపాలోని లాత్వియా దేశంలో పురుషులకు డిమాండ్ పెరిగిపోయింది. పెళ్లి చేసుకునేందుకు, ఇంటి పనుల్లో సాయం చేసేందుకు భాగస్వామి దొరక్క మగ తోడు కోసం ఆ దేశ మహిళలు నానాపాట్లు పడుతున్నారు. గత్యంతరం లేక ఇంటి పనుల్లో తమకు చేదోడువాదోడుగా ఉండేందుకు భర్తలను గంటలు, రోజులు లెక్కన అద్దెకు తెచ్చుకుంటున్నారు. లింగ నిష్పత్తిలో తేడా భారీగా పెరిగిపోవడం వల్లే ఆ దేశంలో ఈ వింత పరిస్థితి నెలకొందని 'ది న్యూయార్క్ పోస్ట్' ఓ కథనాన్ని ప్రచురించింది. లాత్వియాలో పురుషుల జనాభా కంటే మహిళల జనాభా 15.5 శాతం అధికంగా ఉంది. ప్రతీ వంద మంది పురుషులకు 115 మంది స్త్రీలు ఉన్నారు. అదే 65 ఏళ్ల అంతకంటే పైబడిన వారి విషయంలోనైతే పురుషుల కంటే స్త్రీలు రెండు రెట్లు అధికంగా ఉన్నారు. దీంతో తమ రోజువారీ జీవితంలో మగాళ్లే లేకుండా పోయారని, పని ప్రదేశంలో ఎటు చూసినా మహిళలే కనిపిస్తున్నారని ఆ దేశ స్త్రీలు వాపోతున్నారు. దేశంలో మగవారి కొరత వల్ల భాగస్వామి కోసం విదేశాలను ఆశ్రయించాల్సి వస్తుందని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇంటి పనుల్లో చేదోడు కోసం లాత్వియా మహిళలు భర్తలను అద్దెకు తెచ్చుకుంటున్నారు. ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్ ద్వారా భర్తను బుక్ చేసుకొని వచ్చిన వారితో కలిసి ఇంటి పనులను పూర్తి చేసుకుంటున్నారు. లాత్వియా లింగ నిష్పత్తిలో భారీ తేడా రావడానికి పురుషుల ఆయుర్దాయం తగ్గిపోవడమే కారణమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ధూమపానం అలవాటు, ఊబకాయం వంటి అనారోగ్య సమస్యలే లాత్వియాలో పురుషుల సంఖ్య తగ్గిపోవడానికి ప్రధాన కారణాలని చెబుతున్నారు.



ప్రియురాలు కేట్ పెర్రీతో కలిసి ట్రుడో జపాన్ పర్యటన

న్యూఢిల్లీ, డిసెంబరు 5: కెనడా మాజీ ప్రధాని జస్టిన్ ట్రుడో తన ప్రియురాలు, అమెరికా పాప్‌స్టార్ కేట్‌పెర్రీతో కలిసి జపాన్ పర్యటనకు వెళ్లారు. అక్కడ జపాన్ మాజీ ప్రధాని కిషిదా ఇచ్చిన విందులో పాల్గొన్నారు. ట్రుడో, పెర్రీ కలిసి విందుకు వచ్చిన విషయాన్ని కిషిదా స్వయంగా వెల్లడించారు. "ట్రుడో తన భాగస్వామితో కలిసి జపాన్‌ను సందర్శించారు. నేను ఇచ్చిన విందులో పాల్గొన్నారు" అంటూ వారి ఫొటోను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఈ పోస్టు ట్రుడో రీపోస్టు చేశారు. ట్రుడో, కేట్ పెర్రీ డేటింగ్‌లో ఉన్నట్లు చాలా కాలంగా ప్రచారం జరుగుతోంది. అనేక కార్యక్రమాలకు వాళ్లు కలిసి వెళ్లారు. తాజాగా కిషిదా కేట్ పెర్రీని ట్రుడో 'భాగస్వామి' అని పేర్కొనడంతో అది నిజమేనని తేలింది.

బంగారం కొంటే లాభాలంటూ 'బిస్కెట్'

- కస్టమర్లతో కొనిపించి తన వద్ద పెట్టుకున్న వ్యాపారి
- రూ.40 కోట్ల గోల్డ్‌తో పరార్.. బళ్లారిలో ఘటన

బళ్లారి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆయనో బంగారం వ్యాపారి.. సాయి కమల్ జువెలర్స్ పేరిట బళ్లారిలో ఎన్నో ఏళ్లుగా గోల్డ్ షాపు నిర్వహిస్తున్నాడు. బంగారం ధరలు రోజురోజుకీ పెరుగుతుండడంతో.. కొని పెట్టుకుంటే మంచి లాభాలు వస్తాయని చెబితే ఆయన కస్టమర్లలో చాలామంది బంగారం బిస్కెట్లు కొనుగోలు చేసి ఆయనకు అప్పగించారు. కానీ, ఆయన రూ.40 కోట్ల విలువైన బంగారంతో పరారయ్యాడు. బళ్లారిలోని సాయి కమల్ జువెలర్స్ యజమాని జగదీష్ గుప్తా ఇంటికి, బళ్లారిలోని బెంగళూరు రోడ్డులో ఉన్న బంగారం షాపునకు 15 రోజులుగా తాళం వేసి ఉంది. దీంతో ఆయన వద్ద బంగారం బిస్కెట్లు ఉంచిన 200 మంది బాధితులు లబోదిబోమంటున్నారు. వారు తెలిపిన సమాచారం ప్రకారం.. బళ్లారిలో జగదీష్ గుప్తాతోపాటు అతని సోదరులు కూడా ఏళ్లుగా బంగారం వ్యాపారం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో షాపునకు వచ్చిన కస్టమర్లకు జగదీష్ గుప్తా.. బంగారం ధర రోజురోజుకీ పెరుగుతోందనీ, కొని పెట్టుకోవాలని సూచించేవాడు. దీంతో చాలామంది బంగారం బిస్కెట్లు కొనుగోలు చేశారు. వాటిని ఇంట్లో పెట్టుకుంటే లాభం రాదనీ, తన వద్ద ఉంచితే ఆభరణాలు చేసి షాపులో ఉంచుతానని చెప్పారు. మీకు వడ్డీ వేసి ఇస్తానని నమ్మబలికాడు. దీంతో బళ్లారిలో ఉండే ప్రముఖులతో పాటు సమీప ప్రాంతాలవారు సైతం బంగారం కొని జగదీష్ వద్ద ఉంచారు. ఇలా దాదాపు 200 మంది బంగారం ఆయన వద్ద ఉంచారు. దాని విలువ రూ.40 కోట్ల వరకూ ఉంటుందని అంచనా. బళ్లారికి చెందిన ఓ ప్రముఖుడు రూ.3 కోట్ల విలువైన బంగారం బిస్కెట్లు జగదీష్ వద్ద ఉంచినట్లు తెలుస్తోంది.

ఉపాధి దూరమై.. బతుకు భారమై

పనిదినాల కోతతో కూలీల ఆవేదన.. కుదేలవుతున్న గ్రామీణ భరోసా

- రాష్ట్రంలో 2025-26లో 12.77 కోట్ల పని దినాల గుర్తింపు
- కేంద్రం ఇచ్చింది 7.50 కోట్లే



పెద్దపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ పేదరికానికి అండగా, జీవనోపాధికి భరోసాగా నిలిచిన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో.. నిధుల కోత, పనిదినాల తగ్గింపుతో కూలీలు ఆర్థికంగా చితికిపోతున్నారు. ఉపాధి కోసం కూలీలు వలసలు వెళ్లకుండా, ఆకలి చావులు లేకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో 20 ఏళ్ల క్రితం ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఈ పథకం ద్వారా జాబ్ కార్డులు పొందిన కుటుంబాలకు ఏడాదికి వంద రోజుల పాటు పని కల్పించాలని చట్టంలో పేర్కొన్నారు. ఏటా సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి సరిపడా పనులను గుర్తించి ప్రణాళికలు రూపొందిస్తుంది. డిసెంబర్ నాటికి ఈ ప్రక్రియ పూర్తిచేసి కేటాయించాల్సిన పనిదినాల సంఖ్యను జనవరిలోగా కేంద్రానికి పంపిస్తుంది. ఆ మేరకు కేంద్రం పనిదినాలను కేటాయిస్తుంది. అయితే, కేంద్ర ప్రభుత్వం పలు నిబంధనలు, మార్గదర్శకాల పేరుతో పథకాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తుందన్న విమర్శలు వస్తున్నాయి. 2025-26 సంవత్సరానికి 12 కోట్ల పని దినాలు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరగా.. కేంద్రం 7.5 కోట్లకే పరిమితం చేసింది. గత ఐదేళ్ల ఉపాధి హామీ పని దినాల గణాంకాలను పరిశీలిస్తే ఏనాడూ 10 కోట్లకు తక్కువగా నమోదు కాలేదు. ఈ పథకానికి కేటాయించే నిధుల్లో 60 శాతం కూలీలకు, 40 శాతం నిధులను మెటీరియల్ కాంపొనెంట్ కింద శాశ్వత నిర్మాణాల కోసం వెచ్చిస్తారు. పని దినాల్లో కోత విధించడం వల్ల ఈ నిధులు కూడా తగ్గాయి. మెటీరియల్ ఖర్చుల కింద ఏటా రూ. 1200 కోట్ల నుంచి రూ. 1600 కోట్లకు పైగా సమకూరే నిధుల్లో పెద్దఎత్తున కోతలు విధించడంతో.. రోడ్లు, చెరువుల పునరుద్ధరణ, కాల్వల మరమ్మతులు వంటి పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి.

ఎన్నడూ లేనివిధంగా కోతలు

ఉపాధి హామీ పథకంపై గత నాలుగేళ్ల గణాంకాలు కేంద్రం వైఖరి స్పష్టంగా తెలియజేస్తున్నాయనే విమర్శలు వస్తున్నాయి. పనిదినాల కేటాయింపులో వచ్చిన భారీ కోతలు గ్రామీణ ప్రాంతాల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. 2021-22లో 14.25 కోట్లు, 2022-23లో 11 కోట్లు, 2023-24లో 10. 50 కోట్లు, 2024-25లో 12 కోట్ల పనిదినాలు కేటాయించగా.. 2025-26లో మాత్రం 7.50కోట్లే మంజూరు చేయడం గమనార్హం. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి దాదాపు అన్ని జిల్లాల్లో ప్రణాళికలు పూర్తి కావచ్చాయి. వచ్చే ఆర్థిక సంవత్సరానికి కూడా కేంద్రం పనిదినాల్లో భారీ కోత విధిస్తే గ్రామీణ కుటుంబాలకు ఇబ్బందులు తప్పవన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

ఖాళీగా ఉంటున్న కూలీలు

ఓవైపు పెరుగుతున్న ధరలు, మరోవైపు పనులు దొరకకపోవడంతో కూలీలు ఆర్థికంగా చితికిపోతున్నారు. ఉపాధి దొరకకపోవడంతో వారు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లక తప్పని పరిస్థితి నెలకొంది. వాస్తవానికి యేటా జనవరిలో యాసంగి ముగిసిన తర్వాత కూలీలకు పెద్దగా పనులు ఉండవు. ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఎక్కువగా ఉపాధిహామీ పనులకే వెళతారు. ఈ రెండు మాసాల్లోనే 3 నుంచి 5 కోట్ల పని దినాలను సద్వినియోగం చేసుకుంటారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 5.55 కోట్ల పనిదినాలను కూలీలు సద్వినియోగం చేసుకున్నారు. ఇంకా 1.94 కోట్ల పనిదినాలు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఇవి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, మొక్కల పెంపకం, నిర్వహణకే సరిపోతాయని అధికారులు అంటున్నారు. దీంతో ఉపాధి కూలీలకు పనులు దొరకని పరిస్థితి ఏర్పడింది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు అండగా నిలిచిన ఉపాధి హమీ పథకంలో పని దినాలను పెంచాల్సిన అవసరం ఉందని, నిధుల కేటాయింపులో కోతలు నిలిపివేయాలని కూలీలు, సామాజిక కార్యకర్తలు ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ సంక్షోభంపై పాలకులు వెంటనే దృష్టి పెట్టకపోతే గ్రామీణ పేదరికం, వలసలు మరింత పెరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

ఉగ్రవాదుల చెరలో భువనగిరి యువకుడు

- దక్షిణాఫ్రికాలో బోర్‌వెల్ కంపెనీలో విధులు
- కిడ్నాప్ చేసిన 'జేఎన్‌ఐఎం' ఉగ్రవాదులు
- గత నెల 23న ఘటన.. ఆలస్యంగా తల్లిదండ్రులకు సమాచారం
- యాదాద్రి భువనగిరి జిల్లాలో ఉత్కంఠ



నల్లమాసు ప్రవీణ్

భువనగిరి రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): జీవనోపాధి కోసం పరదేశం వెళ్లిన యువకుడు ఉగ్రమూక చెరలో చిక్కాడు.. ఎక్కడున్నాడో ఏమయ్యాడో తెలియని పరిస్థితి.. తమ బిడ్డ ఆచూకీ తెలుసుకుని అతడిని కాపాడాలని తల్లిదండ్రులు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. గత నెల 23న ఈ ఘటన జరగ్గా, ఈ నెల 4న అతని తల్లిదండ్రులకు సమాచారం అందింది. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం బండసోమారం గ్రామానికి చెందిన నల్లమాస జంగయ్య, మహేశ్వరి దంపతుల రెండో కుమారుడు ప్రవీణ్ హైదరాబాద్‌లోని ఓ బోర్‌వెల్ కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. కంపెనీ తరఫున గత ఏడాది నవంబరులో దక్షిణాఫ్రికా దేశంలోని మాలి రాష్ట్రంలో కోబ్రి ప్రాంతానికి వెళ్లాడు. రోజూ ఉదయం 9 గంటల సమయంలో తల్లిదండ్రులతో మాట్లాడేవాడు. గత నెల 22న చివరిసారిగా తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడాడు. మరుసటి రోజు నుంచి అతడి ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉండడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. ఈ నెల 4న బోర్‌వెల్ కంపెనీ ప్రతినిధులు ప్రవీణ్ తల్లిదండ్రులకు ఫోన్ చేసి అతడు కిడ్నాప్ అయ్యాడని సమాచారమిచ్చారు. గత నెల 23న ప్రవీణ్ విధులు ముగించుకుని తాను ఉంటున్న గది వద్దకు వెళుతుండగా మార్గం మధ్యలో జేఎన్‌ఐఎం సంస్థకు చెందిన ఉగ్రవాదులు కిడ్నాప్ చేశారని తెలిపారు. గతంలోనూ ఆ ప్రాంతంలో అదే సంస్థకు చెందిన ఉగ్రవాదులు కొంత మంది విదేశీయులను కిడ్నాప్ చేశారు. బోర్‌వెల్ కంపెనీ ప్రతినిధులు భారత రాయబార కార్యాలయం అధికారులతో ప్రవీణ్ ఆచూకీ కోసం సంప్రదింపులు జరుపుతున్నట్లు అతడి కుటుంబసభ్యులు తెలిపారు. తమ కుమారుడిని ఉగ్రవాదుల చెర నుంచి విడిపించేలా దక్షిణాఫ్రికా దేశాన్ని కోరాలని కేంద్ర ప్రభుత్వానికి ప్రవీణ్ తల్లిదండ్రులు విజ్ఞప్తి చేశారు.

అప్పులు తీర్చలేక యువ రైతు ఆత్మహత్య

- వరంగల్ జిల్లా ఇల్లందలో విషాదం



మైదం రాకేశ్(ఫైల్)

వర్ధన్నపేట రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షానికి పంట నష్టపోవడంతో చేసిన అప్పులు తీర్చలేక ఓ యువరైతు ఆత్మహత్య చేసుకున్నాడు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామానికి చెందిన మైదం రాకేశ్(28) తమకున్న 2 ఎకరాలతో పాటు పక్కనే ఉన్న 10 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని సాగు చేశాడు. ఈ ఏడాది కురిసిన అకాల వర్షంతో చేతికొచ్చిన పంట నేలకొరిగింది. దీంతో ఆశించిన దిగుబడి రాలేదు. పెట్టుబడి కోసం చేసిన అప్పులు రూ.లక్షల్లో ఉండటంతో మనస్తాపం చెందిన రాకేశ్ గురువారం సాయంత్రం కలుపు మందు తాగాడు. కుటుంబ సభ్యులు అతడిని వరంగల్‌లోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం చనిపోయాడు. బాధిత కుటుంబాన్ని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పరామర్శించారు. మృతదేహానికి నివాళులర్పించారు.



ఇనుమును గట్టిపరిచే కర్బనాన్ని అభివృద్ధి చేసిన జయకిషన్

తంగేడు, పులాయి ఆకులతో 'ఇనుము'

- మట్టి కుండలో భద్రపరచి దృఢమైన కర్బనం తయారీ
- ఐఐఎం సదస్సులో ప్రదర్శించిన హైదరాబాదీ శాస్త్రవేత్త

కంది, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మన దేశంలో 5 వేల సంవత్సరాల క్రితం తంగేడు, పులాయి ఆకులతో ఇనుప వస్తువులను తయారు చేసే వారని హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఖనిజ పరిశోధకుడు జయకిషన్ తెలిపారు. తంగేడు, పులాయి ఆకులను దంచి మట్టి కుండలో భద్రపరచి, ఇనుమును గట్టిపరిచే కర్బనాన్ని అభివృద్ధి చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ విధానాన్ని ఉపయోగించే మన పూర్వీకులు దృఢమైన కోటలు నిర్మించారని తెలిపారు. సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీహెచ్‌లో జరుగుతున్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెటల్స్(ఐఐఎం) 79వ అంతర్జాతీయ సదస్సు రెండో రోజు శుక్రవారం కొనసాగింది. సింగరేణి సీఎండీ బలరామ్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐఐటీహెచ్ డైరెక్టర్, ఐఐఎం అధ్యక్షుడు బీఎస్ మూర్తి, బలరాంలు.. దేశ, విదేశాల నుంచి వచ్చిన లోహ శాస్త్ర పరిశోధకులతో ఐఐటీహెచ్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఫ్యూచర్ మైనింగ్ అండ్ మెటల్ స్టాళ్లను పరిశీలించారు. అనంతరం బీఎస్ మూర్తి మాట్లాడారు. పారిశ్రామిక నిపుణులు, పరిశోధకులు, విద్యావేత్తలు, ఆలోచనాపరుల మధ్య సహకారం, విజ్ఞానాన్ని పంచుకోవడానికి ఈ కార్యక్రమం ఒక వేదికగా పనిచేస్తుందని అన్నారు. ఈ సందర్భంగా గుట్టలు, లోయల్లో రాళ్లను తొలిచే పరికరాలను అభివృద్ధి చేసిన సాయిదీప రాక్ డ్రిల్లింగ్ సంస్థ.. వాటిని ప్రదర్శించింది. క్షిపణులు, రాకెట్ల తయారీకి అవసరమైన సామగ్రిని రూపొందిస్తున్నట్లు హైదరాబాద్‌లోని మిధాని సంస్థ శాస్త్రవేత్తలు తెలిపారు. అందుకు సంబంధించిన పరిశోధనలను ప్రదర్శించారు.

పోక్సో కేసులో నిందితుడికి 35 ఏళ్ల జైలు

ఆసిఫాబాద్ రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో నిందితుడికి కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా ప్రిన్సిపల్, సెషన్స్ కోర్టు 35 ఏళ్ల జైలుశిక్ష, 50 వేల రూపాయల జరిమానా విధించింది. "నిజామాబాద్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో చదివే బాలిక (16)ను అదే నగరానికి చెందిన సాయిచరణ్‌రెడ్డి ప్రేమిస్తున్నానంటూ వెంటపడ్డాడు. అంగీకరించక పోవడంతో బాలికను అపహరించి అత్యాచారం చేసేందుకు యత్నించాడు. బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు 2013 ఏప్రిల్ 3న ఆసిఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో నిందితుడిపై పోక్సో కేసు నమోదయింది. విచారణలో నిందితుడిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఎంవీ రమేశ్ శుక్రవారం ఈ మేరకు తీర్పునిచ్చారు" అని జిల్లా ఎస్పీ నితికాపంత్ వెల్లడించారు.

ఆరోగ్య భద్రత పథకంపై అసత్య ప్రచారం

- డీఎస్‌పీ శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 5(ఆంధ్రజ్యోతి): పోలీసుల ఆరోగ్య భద్రత పథకంపై అసత్య ప్రచారాన్ని నమ్మవద్దని పోలీసు సంక్షేమ విభాగం డీఎస్‌పీ శ్రీనివాసరెడ్డి సూచించారు. పోలీసులకు ఇక నుంచి ఆరోగ్య భద్రత పథకం నిమ్స్ ఆసుపత్రిలో మాత్రమే అమలు చేస్తారని, కార్పొరేట్ ఆసుపత్రుల్లో కాదంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్సలు ఎప్పటిలాగే కొనసాగుతున్నాయని, అదనంగా ఎక్కువ ఖర్చుతో కూడిన దీర్ఘకాలిక చికిత్సలను నిమ్స్ ఆసుపత్రిలో చేయించుకుంటే పూర్తి మొత్తాన్ని ఆరోగ్య భద్రత పథకం నుంచి చెల్లిస్తామని ఆయన వివరించారు. పోలీసులు వైద్య సేవల నిమిత్తం కార్పొరేట్ ఆసుపత్రికి వెళితే రూ.5లక్షల నుంచి రూ.7.5లక్షల వరకు చికిత్స పొందవచ్చని, వారి కుటుంబ సభ్యులకు అయితే లక్ష నుంచి రూ.2లక్షల వరకు చికిత్స తీసుకోవచ్చని ఆయన వివరించారు. ఇంత కన్నా ఎక్కువ ఖర్చు అయ్యే చికిత్సలు మాత్రమే నిమ్స్‌లో పొందవచ్చని శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.

దుబాయ్ విమానాన్ని పేల్చేస్తామని బెదిరింపు

శంషాబాద్ రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి మరోమారు బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. దుబాయ్ నుంచి వచ్చే విమానాన్ని పేల్చేస్తామంటూ శుక్రవారం బాంబు బెదిరింపు మెయిల్ రావడంతో విమానాశ్రయ అధికారులు, భద్రతా సిబ్బంది ఉరుకులు పరుగులు పెట్టారు. ఇందుకు సంబంధించి జీఎంఆర్ ఎయిర్‌పోర్టు, ఆర్జీఐఏ ఔట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దుబాయ్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు బయలుదేరిన ఈకే 526 విమానం గాలిలో ఉండగా జీఎంఆర్ సపోర్టు కేర్‌కు గుర్తు తెలియని దుండగుల నుంచి శుక్రవారం ఉదయం 7.30 గంటలకు మెయిల్ వచ్చింది. దుబాయ్ నుంచి వచ్చే ఆ విమానాన్ని పేల్చేస్తున్నామని ఆ మెయిల్‌లో ఉంది. దీంతో భద్రతా బలగాలు అప్రమత్తమయ్యాయి. శుక్రవారం ఉదయం 8.30 గంటలకు సదరు విమానం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అవ్వగానే ప్రయాణికులను దించేసి డాగ్ స్క్వాడ్‌తో విస్తృత తనిఖీలు చేపట్టాయి. చివరికి ఎలాంటి బాంబులు లేవని తేలడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

'సుప్రీం' ప్రశ్న

పార్లమెంట్ సమావేశాలు మొదలైన రోజున 'ఈ శీతాకాల సుందర ప్రకృతిని ఆస్వాదించండి' అంటూ ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యను బ్యానర్లమీద ప్రదర్శిస్తూ గురువారం విపక్షాలు ఢిల్లీ కాలుష్యంపై పార్లమెంట్ ప్రాంగణంలో నిరసన ప్రదర్శన నిర్వహించాయి. మొఖానికి నల్లటిమాస్కులు పెట్టుకొని, ప్లకార్డులు చేతబట్టి, కాలుష్యంతో దేశ రాజధానిలో పసికందులు మరణిస్తున్నారని, వృద్ధులు ఇబ్బందిపడుతున్నారని, ఈ అంశంపై పార్లమెంట్‌లో చర్చ జరగాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. కాలుష్యాన్ని నియంత్రించాల్సిన బాధ్యత నుంచి ప్రభుత్వం తెలివిగా తప్పించుకుంటోందని కాంగ్రెస్ ఆరోపణ. ఇది రాజకీయాంశం కాదు, ప్రభుత్వం చర్చకు సిద్ధపడితే చర్చలకు మా మద్దతు ఉంటుందని అది హామీ ఇస్తోంది. చర్చకు సిద్ధపడితే, విఫలమైనామని ఒప్పుకున్నట్టేనని ప్రభుత్వం అనుకోవడం సహజం. సవ్యంగా మాట్లాడుకోగలిగే అంశాలనే సభలోపల కలుషితం చేస్తున్న ఈ పార్టీలు, ఢిల్లీ పౌరులను పట్టిపీడిస్తున్న వాయు కాలుష్యం గురించి హుందాగా, సయోధ్యతో చర్చ చేసి, పరిష్కారాలను ప్రతిపాదిస్తాయని నమ్మడం మరీ కష్టం.

ఇండియాగేట్ ఏదీ? అంటూ దాని చుట్టుపక్కల ప్రాంతాలన్నీ పొగమంచు, కాలుష్యంతో సతమతమవుతున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో దర్శనమిస్తున్నాయి. ఢిల్లీ వాసులారా, మీరు ఈ రోజు పదిహేను సిగరెట్లు కాల్చినంత కాలుష్యాన్ని భరిస్తున్నారంటూ కొన్ని వెబ్‌సైట్లు ఏవేవో లెక్కలుగట్టి జనాన్ని మరింత భయపెడుతున్నాయి. దేశ రాజధానిని డేంజర్ జోన్‌గా మార్చేసిన కాలుష్యం మీద సభలో నిజంగానే చర్చ జరిగినా, అది రాజకీయాలకు అతీతంగా సాగుతుందనుకోలేం. ఇది మీ పాపమే, మీ చేతగానితనమే అని పరస్పరం విమర్శించుకోవడానికే పార్టీలు పరిమితమవుతాయి. తప్పు తోసేయడం మీద ఉన్న శ్రద్ధ పరిష్కారంలో కనబడదు. సుప్రీంకోర్టు నాలుగు రోజుల క్రితం ఇటువంటి తీరుతెన్నుల గురించే కఠినంగా వ్యాఖ్యానించింది. పొరుగు రాష్ట్రాల్లో రైతులు పంటవ్యర్థాలు తగలబెట్టడమే రాజధాని కాలుష్యానికి కారణమని కేంద్రం అన్నందుకు ఆగ్రహించింది. కాలుష్యం పెరిగిన ప్రతీసారీ నెపం రైతుల మీదకు నెట్టివేసే ధోరణి మార్చుకోమని హితవు చెప్పింది. ప్రధాన కాలుష్య కారకాల లెక్కతేల్చమంటూ కమిషన్ ఫర్ ఎయిర్‌క్వాలిటీ మేనేజ్‌మెంట్‌కు ఆదేశాలు ఇవ్వడంతోపాటు, రైతు పక్షాన కోర్టు చేసిన ఆ వ్యాఖ్యలు మెచ్చవలసినవి. కరోనాకాలంలో ఢిల్లీ ఆకాశవీధులు అంత స్వచ్ఛంగా, నీలంగా ఎలా కనిపించాయంటూ కేంద్రాన్ని కోర్టు ప్రశ్నించింది. కరోనా కాలంలో వ్యర్థాల దహనం సాపేక్షంగా ఎక్కువగా ఉన్నప్పటికీ, గాలి నాణ్యతకు లోటురాలేదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ గుర్తుచేశారు. పొరుగు రాష్ట్రాల రైతులే ఈ కాలుష్యానికి ప్రధాన కారకులంటూ తప్పు పూర్తిగా వారిమీదకు నెట్టేసే ప్రయత్నాన్ని ఆయన అడ్డుకున్నారు. వాహనాల రాకపోకలన్నీ ఆగిపోయి, నిర్మాణాలు నిలిచిపోయి, పరిశ్రమలు పనిచేయని లాక్‌డౌన్ కాలంలో, ఎప్పటిలాగానే తన పని మౌనంగా చేసుకుపోయిన ఒకే ఒక్కడు రైతు. మిగతా సమాజం ఆగినా, ఆయన కదిలాడు కనుకనే అన్నానికి లోటేమీలేకపోయింది. కాలుష్యానికి కారణమవుతున్న రైతును శిక్షించాల్సిందేనంటూ గత ఏడాది ఇదే కోర్టు వ్యాఖ్యానించినదానికి పూర్తిభిన్నంగా, అసలు కాలుష్యకారకాల మీదకు దృష్టిమరల్చి, రైతును రాజకీయం చేయవద్దన్న విస్పష్ట సందేశం ఇచ్చారు ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి.

పంటవ్యర్థాలను రైతులు తరతరాలుగా తగలబెడుతూనే ఉన్నారు. నిజానికి గత నాలుగేళ్లలో దాని స్థాయి, విస్తృతి ప్రభుత్వాల జోక్యం కారణంగా బాగా తగ్గినట్టు విశ్లేషణలు వెలువడ్డాయి. అయినా, రైతునే బూచిగా చూపే ప్రయత్నం అలాగే సాగుతోంది. ఆ ప్రక్రియ కాలుష్యాన్ని కలిగించడం లేదని కోర్టు కూడా అనడం లేదు. దాని ప్రభావం పరిమితమని, ఒక పెద్ద సమస్యకు బక్క రైతును బలిపశువు చేయకండని చెప్పడమే ప్రధాన న్యాయమూర్తి ఉద్దేశం. శీతాకాలం మాత్రమే ఆలోచించి, నాలుగు చర్యలూ చేష్టలతో వదిలివేయగలిగే సమస్య కాదిది. సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (సీఎస్ఈ) వంటి చాలా సంస్థలు ఢిల్లీ కాలుష్యానికి స్థానిక అంశాలే కారణమని, వాహన, నిర్మాణ రంగాలు తొలిస్థానాల్లో ఉన్నాయని స్పష్టంగా చెబుతున్నాయి. కాలుష్య నియంత్రణ చర్యలను నెలకు రెండుసార్లు సమీక్షిస్తాననీ, కొత్త ఆలోచనలను స్వాగతిస్తాననీ అంటున్న ప్రధాన న్యాయమూర్తి ఈ విషానికి ఏ విరుగుడు కనిపెడతారో చూడాలి.

పార్లమెంటులో తగ్గిపోతున్న చర్చలు

ఆయన మాటలలోని వ్యంగ్యాన్ని నేను అర్థం చేసుకున్నాను. నిజానికది ఎవరికైనా అవగతమవుతుంది. పార్లమెంటరీ సమావేశాలు ప్రారంభమవడానికి ముందు ఆనవాయితీగా నిర్వహించే అఖిలపక్ష సమావేశంలో ఉభయ సభల్లో చర్చలకు, చట్టాల నిర్మాణానికి సహకరించాలని ప్రతిపక్షాలకు ప్రభుత్వాధినేతలు విజ్ఞప్తి చేయడం పరిపాటి. ఆ ప్రకారమే డిసెంబర్ 1, 2025న పార్లమెంటు శీతాకాల సమావేశాలు ప్రారంభమయ్యే ముందు పార్లమెంట్ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడుతూ సందేశంలో 'సత్ఫలితాలను సాధించే నిర్మాణాత్మక చర్చలు వేదికగా పార్లమెంటు భాసించాలే కానీ, స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం నాటకీయ ప్రవర్తనలకు తావు కాకూడద'ని నొక్కి చెప్పారు. పార్లమెంటు సమస్త సభ్యులు, ప్రత్యేకించి ఒకటి రెండు పార్టీల నుద్దేశించి ఆయన ఈ విజ్ఞప్తి చేశారు.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

శీతాకాల సమావేశాల ఆరంభానికి ఇదొక అశుభ సూచకమేనని చెప్పాలి. మోదీ వ్యాఖ్యలను మరింత వివరంగా ఉటంకించవలసిన అవసరమున్నది: 'దురదృష్టవశాత్తు ఎన్నికలలో తమ ఓటమిని జీర్ణించుకోలేని పార్టీలు ఒకటి రెండు ఉన్నాయి. బిహార్ ఎన్నికల ఫలితాలు వెలువడి చాలా రోజులు అయిందని, పరాజితులు తమ పరాభవ భారం నుంచి కోలుకుని ఉంటారని నేను భావించాను. అయితే తాజాగా ఆ పార్టీల ప్రకటనలు విన్న తరువాత బిహార్ ఓటమి వారిని ఇప్పటికీ కలచివేస్తోందని అర్థమయింది... నినాదాలు చేసేందుకు దేశంలో చాలా ప్రదేశాలు ఉన్నాయి. మీరు ఇప్పటికే ఓడిపోయిన చోట పెద్ద పెట్టున నినాదాలు చేశారు. సమీప భవిష్యత్తులో ఓడిపోనున్న రాష్ట్రాలలో కూడా మీరు పెద్ద పెట్టున నినాదాలు చేయవచ్చు. అయితే ఇక్కడ, పార్లమెంటులో నినాదాలకు కాకుండా విధానాలపై చర్చలకు ప్రాధాన్యమివ్వాలి'. ప్రాంతీయ పార్టీలపై కూడా మోదీ వ్యంగ్య విమర్శనాస్త్రాలను సంధించారు. 'కొన్ని రాష్ట్రాలలో ప్రభుత్వ వ్యతిరేకత తీవ్రంగా ఉన్నది. అక్కడ సుదీర్ఘ కాలంగా అధికారంలో ఉన్న నాయకులు ప్రజల మధ్యకు వెళ్లలేకున్నారు. అయితే వారు పార్లమెంటుకు వచ్చి తమ ఆగ్రహాన్ని ఇక్కడ వ్యక్తం చేస్తున్నారు'.

పార్లమెంటు సమావేశాలు ప్రారంభమయ్యే ప్రతిసారీ తాము దేనికీ భయపడమని, దేనినీ గోప్యంగా ఉంచవలసిన అవసరం తమకు లేదని, పార్లమెంటులో ఏ అంశంమీదనైనా చర్చించడానికి సంసిద్ధంగా ఉన్నామని ప్రభుత్వం ఉద్ఘోషిస్తుంది. అయితే ఈ నిర్నిబంధ స్వేచ్ఛకు ఒక అవరోధం ఉన్నది. అది 'నియమాలకు లోబడి చర్చ జరపాలనే' షరతు.

పార్లమెంటరీ కార్యక్రమాల నిర్వహణకు ఒక స్పష్టమైన, కచ్చితమైన నియమావళి ఉన్నది. ఆ నియమాలకు భాష్యం చెప్పడం, వాటిని అనువర్తింపచేయడమనేది ఆయా పార్లమెంటరీ రాజకీయ పక్షాల నాయకులతో సంప్రదించి సభాపతులు (లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ ఛైర్మన్) తరచు ఆయా పార్లమెంటరీ పక్షాల నాయకులను సంప్రదించి తీసుకునే నిర్ణయాల మేరకు ఉంటుంది.



దేశ సమస్యలపై సమగ్ర అవగాహనతో, సామాన్య పౌరుల శ్రేయస్సే లక్ష్యంగా చర్చలు జరిగే పార్లమెంటు, ప్రజాస్వామ్యాన్ని శక్తిమంతం చేస్తుందనే సత్యాన్ని నరేంద్ర మోదీ ప్రభుత్వం విశ్వసించడం లేదు. సంభాషణలు, సంవాదాలు, సాధికార చర్చలను మోదీ సర్కార్ వ్యతిరేకిస్తోంది.

బిల్లులు, బడ్జెట్ ప్రవేశపెట్టడం ప్రభుత్వ అజెండా. ప్రశ్నోత్తరాల సమయం (క్వశ్చన్ అవర్)లో చర్చను అనుమతించరు. ప్రతిపక్షాల అభ్యర్థన మేరకు నిజమైన, స్వేచ్ఛాయుత చర్చ వాయిదా తీర్మానం ద్వారా మాత్రమే జరుగుతుంది లేదా స్వల్ప వ్యవధి చర్చ ద్వారానో లేక సావధాన తీర్మానం ద్వారానో జరుగుతుంది. ఇవి సువ్యవస్థితమైన, మొదటి నుంచీ అనుసరిస్తున్న పార్లమెంటరీ పద్ధతులు, సంప్రదాయాలు.

వాయిదా తీర్మానాన్ని, కొన్ని కారణాల వల్ల, ప్రభుత్వానికి అభిశంసనగా పరిగణిస్తున్నారు. దీనికి సంబంధించిన నియమం స్పష్టంగా ఉన్నది. లోక్‌సభ కార్యక్రమాల నియమావళిలో 57వ నియమం ఇలా ఉన్నది: భారత ప్రభుత్వ బాధ్యతతో ముడివడి ఉన్న, ఇటీవల సంభవించిన నిర్దిష్ట సంఘటనలపై వాయిదా తీర్మానం ద్వారా చర్చకు తొలుత నోటీసు ఇవ్వాలి. రాజ్యసభలో తక్షణ ప్రాధాన్యమున్న వ్యవహారంపై చర్చకు ముందుగా నిర్ణయించిన సభా కార్యక్రమాలను నిలిపివేసేందుకు ఎగువ సభ కార్యక్రమ నియమావళిలోని 267వ నియమం అనుమతిస్తుంది. స్వల్ప వ్యవధి చర్చ లోక్‌సభలో నియమం 193 ప్రకారం, రాజ్యసభలో నియమం 176 ప్రకారం జరుగుతుంది. తక్షణ ప్రజా ప్రాధాన్యమున్న అంశాలపై స్వల్ప వ్యవధి చర్చ జరుగుతుంది. సావధాన తీర్మాన నోటీసు చాలా నిరపాయకరమైనది. తక్షణ ప్రజా ప్రాధాన్యమున్న అంశాన్ని సంబంధిత మంత్రి దృష్టికి తీసుకువెళ్లేందుకు లోక్‌సభ కార్యక్రమాల నియమాళిలో 197వ నియమం, రాజ్యసభ కార్యక్రమాల నియమావళిలో 180వ నియమం సభ్యులను అనుమతిస్తుంది. సభ్యులు తన దృష్టికి తీసుకువచ్చిన విషయమై మంత్రి ప్రకటన చేయవలసి ఉంటుంది.

సరే, నరేంద్ర మోదీ ప్రభుత్వం పదకొండేళ్ల క్రితం అధికారంలోకి వచ్చిన తరువాత పార్లమెంటరీ చర్చలు ఎలా జరుగుతున్నాయో చూద్దాం. ప్రతిపక్షాలకు ప్రతి ద్వారమూ, ప్రతి గవాక్షమూ క్రమంగా మూసుకుపోయాయని నిశ్చయంగా చెప్పక తప్పదు. మోదీ సర్కార్ అంతకంతకూ మొండిగా వ్యవహరిస్తుండడంతో పార్లమెంటరీ చర్చల పరిస్థితి దిగజారిపోయింది. నరేంద్ర మోదీ ప్రభుత్వం మొదటి పర్యాయం అధికారంలోకి వచ్చినప్పుడు వాయిదా తీర్మానం ద్వారా చర్చకు భయపడింది. అటువంటి తీర్మానం ద్వారా చర్చవల్ల తన ప్రతిష్ఠకు కళంకం ఏర్పడుతుందని భావించడమే అందుకు కారణం. స్వల్ప వ్యవధి చర్చలు లేదా సావధాన తీర్మానం నోటీసులకు అభ్యంతరం చెప్పలేదు. అయితే ద్వితీయ పర్యాయం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ రెండు రకాల చర్చల పట్ల కూడా మోదీ సర్కార్ అసహనం ప్రదర్శించింది. ద్వారం మూసివేసినా, కిటికీలను తెరిచే ఉంచింది. మూడోసారి కనీస మెజారిటీ కంటే తక్కువ సీట్లు మాత్రమే సాధించుకుని, మిత్రపక్షాల మద్దతుతో అధికారంలోకి వచ్చిన తరువాత గవాక్షాలను సైతం మూసివేసింది. దీన్నెలా అర్థం చేసుకోవాలి? చర్చకు యోగ్యమైన తక్షణ ప్రజా ప్రాధాన్యమున్న సంఘటనలు, పరిణామాలు ఏవీ సంభవించలేదని భావించాలా?

విషాదమేమిటంటే లోక్‌సభలో కంటే రాజ్యసభలో చర్చలు చాలా తక్కువగా జరుగుతున్నాయి. అసలు జరగని సందర్భాలు కూడా ఉన్నాయి. నాటి సభాపతే అందుకు కారణమని పలువురు సభ్యులు భావిస్తున్నారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో రాజ్యసభకు కొత్త ఛైర్మన్ ఎన్నికయ్యారు. రాజ్యసభ ఛైర్మన్ విధులు, బాధ్యతలు ఆయనకు కొత్త కనుక వాటి నిర్వహణ పద్ధతులు, మెళకువలను సమగ్రంగా అవగాహన చేసుకునే దశలో ఉన్నారు. అంతేకాకుండా కొత్త ఛైర్మన్ అధ్యక్షత వహిస్తున్న ఈ శీతాకాల సమావేశాల కాల పరిధి చాలా తక్కువ కనుక ఆయన సభా నిర్వహణ సామర్థ్యంపై అప్పుడే ఒక అభిప్రాయానికి రావడం సాధ్యం కాదు.

పార్లమెంటరీ చర్చల ప్రమాణాలు అంతకంతకూ పడిపోతున్న దృష్ట్యా ఒక వాస్తవాన్ని నిక్కచ్చిగా చెప్పదలుచుకున్నాను. దేశ సమస్యలపై సమగ్ర అవగాహనతో, సామాన్య పౌరుల శ్రేయస్సే లక్ష్యంగా చర్చలు జరిగే పార్లమెంటు, ప్రజాస్వామ్యాన్ని శక్తిమంతం చేస్తుందనే సత్యాన్ని నరేంద్ర మోదీ ప్రభుత్వం విశ్వసించడం లేదు. సంభాషణలు, సంవాదాలు, సాధికార చర్చలను మోదీ సర్కార్ వ్యతిరేకిస్తోంది. శీతాకాల సమావేశాలు ఆరంభమవడానికి ముందు ప్రధానమంత్రి చేసిన వ్యాఖ్యలలోని వ్యంగ్యాన్ని విస్మరించలేము.


(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

కాంగ్రెస్ కలహ కర్ణాటకం!

తనను తాను ఓడించుకోవడంలోను, తనకు తాను నష్టం కలిగించుకోవడంలోను పోటీపెడితే స్వర్ణ పతకం దక్కేది కాంగ్రెస్ పార్టీకే అనడంలో ఏ మాత్రం సందేహం లేదు. కర్ణాటక కాంగ్రెస్‌లోని 'అంతర్నాటకం' ఇప్పటికే అనేక వారాలుగా మీడియా సాక్షిగా ఎడతెగకుండా ప్రదర్శితమవుతోంది. 'కౌన్ బనేగా ముఖ్యమంత్రి' అనే కాంగ్రెస్ తాజా రాజకీయ నాటకమది. పార్టీ అధిష్ఠానం ఆదేశం మేరకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఆ పదవిని ఆశిస్తున్న డీకే శివకుమార్ (డీకేఎస్) మధ్య ఇటీవల జరిగిన ఉదయం ఉపాహార సమావేశంలో మెనూతో పాటు ప్రతి చిన్న విశేషాన్నీ మీడియా సవివరంగా నివేదించింది, విశ్లేషించింది. అధికారాన్ని నిలబెట్టుకునేందుకు ఒకరు, కైవసం చేసుకునేందుకు మరొకరు కలహించుకుంటుండగా, ఎటూ పాలుపోని పార్టీ హై కమాండ్ ఆ ఉభయులనూ సంయమనపరచలేకపోతోంది. గందరగోళం, నియంత్రణ రాహిత్యం పెరిగిపోతోంది. ఈ శోచనీయ పరిస్థితులకు బాధ్యులు ఎవరు?

గతించిన మంచి రోజులలో అయితే ఆ ఇరువురికీ కాంగ్రెస్ సముచిత ప్రాధాన్యమివ్వగలిగి ఉండేది. అయితే అటువంటి సానుకూల పరిస్థితులు ఇప్పుడు బొత్తిగా లేవు. భారతదేశ పురాతన రాజకీయపక్షం ఇప్పుడు శక్తిహీనమైపోయింది. అధికార వైభవం గతించిన చరిత్రగా ఉన్నది. పార్టీలో నాయకుల మధ్య ఘర్షణలను సామరస్యపూర్వకంగా పరిష్కరించగల రాజకీయ నైపుణ్యాలు దాదాపుగా నిర్వీర్యమైపోయాయి. నాయకత్వ తగాదాలకు పరిష్కారంగా ముఖ్యమంత్రి పదవిలో, పోటీదారులను ఒకరి తరువాత మరొకరిని నియమించే పద్ధతిని అనుసరించేందుకు కాంగ్రెస్ ప్రయత్నించింది. నిర్మొహమాటంగా చెప్పాలంటే అదొక విడ్డూరమైన ఆలోచన. ఆచరణ యోగ్యం కానిది. కనుకనే అది పనిచేయలేదు. ముఖ్యమంత్రిగా నియమితుడైన నేత రెండున్నర సంవత్సరాల పాటు కొనసాగి, ఆ తరువాత మిగతా రెండున్నర సంవత్సరాలకుగాను ఆ పదవిని తన ప్రత్యర్థి లేదా మరొకరికి అప్పగిస్తాడా? ఈ దేశంలో ఏ నాయకుడూ స్వచ్ఛందంగా సీఎం పదవిని వదులుకోడు, అందునా ఈ కాలంలో. సిద్ధరామయ్య రెండున్నర సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉన్న తరువాత, ఆ పదవిలో నియమిస్తామని శివకుమార్‌కు కాంగ్రెస్ జాతీయ నాయకత్వం నిజంగా హామీ ఇచ్చి ఉంటే, అది, విఫలమైన పద్ధతిని మళ్లీ అనుసరించడమే అవుతుంది. ఉపయుక్తమైన ఆలోచనేనా ఇది? గతంలో రాజస్థాన్‌లోనూ, ఛత్తీస్‌గఢ్‌లోనూ ఈ పద్ధతిని అనుసరించేందుకు జరిగిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. పార్టీలో అంతర్గత కలహాలు పెరిగిపోయాయి. ఫలితంగా ఎన్నికలలో కాంగ్రెస్ ప్రభుత్వాలు పరాజయం పాలయ్యాయి. మరి కర్ణాటకలో ఇప్పుడు ఆ పద్ధతి ఎందుకు పనిచేస్తుంది?

సమస్యేమిటంటే కష్టకాలంలో ఉన్న కాంగ్రెస్ బాగుకు కఠిన నిర్ణయాలు తీసుకోవడానికి పార్టీ 'హై కమాండ్' సుముఖంగా లేదు. కఠిన నిర్ణయాలు తీసుకోగల తెగువ, సత్తా దానికి లేదని చెప్పడమే సత్యమవుతుంది. 2024 సార్వత్రిక ఎన్నికలలో కాంగ్రెస్ 'పునరుద్ధరణ' లేదూ, మరింత కచ్చితంగా చెప్పాలంటే బతికి బట్టకట్టిన పరిస్థితి కారణంగా రాహుల్‌గాంధీ నాయకత్వం పట్ల సద్భావం పెరిగింది.



ముఖ్యంగా సొంత పార్టీ నేతల నుంచి గౌరవాదరాలను ఆయన తిరుగులేకుండా సముపార్జించుకున్నారు. భారత రాజ్యాంగ ప్రతిని ఎత్తిచూపుతూ జాతి నిర్మాణానికి అది నిర్దేశించిన విధివిధానాలను వివరిస్తూ బీజేపీ మహాశక్తిని ఆయన సమర్థంగా ఎదుర్కొన్నారు. ప్రత్యర్థులు పరిహసించినప్పటికీ కాంగ్రెస్‌లో ఆయన స్థానం మరింత సుదృఢమయింది. సంఘ్ పరివార్‌పై రాజీలేని పోరాటం చేసిన కారణంగా కాంగ్రెస్ శ్రేణులు ఆయన నాయకత్వాన్ని ఎటువంటి ఆక్షేపణలు లేకుండా అంగీకరించాయి. కాంగ్రెస్‌కు తిరుగులేని నాయకుడుగా ఆయన ఆవిర్భవించారు. మరి పార్టీపై మరింత పట్టు సాధించేందుకు ఆయన పూనుకున్నారా? పార్టీ కార్యకలాపాలు అన్నిటినీ స్వయంగా పర్యవేక్షిస్తున్నారా? పార్టీ సమస్త వ్యవహారాలనూ స్వయంగా చక్కబెడుతున్నారా? లేదు. అదే సమస్య. పార్టీ సంస్థాగత వ్యవహారాలను చాలావరకు తన విధేయులకు, మరీ ముఖ్యంగా కేసీ వేణుగోపాల్‌కు అప్పగించారు. వేణుగోపాల్ ఇప్పుడు కాంగ్రెస్ 'వ్యవస్థ'లో రెండో అత్యంత శక్తిమంతుడైన వ్యక్తి.



■ రాజ్‌దీప్ సర్దేశాయి

మరి పార్టీ కూడా పునశ్శక్తిమంతమయిందా? 2024లో సమకూరిన చెప్పుకోదగ్గ విజయాలు వ్యర్థమయ్యాయి. మితిమీరిన ఆత్మవిశ్వాసంతో హర్యానా అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ చతికిలపడింది.. మహారాష్ట్రలో మహిళలకు నగదు బదిలీల ద్వారా భారతీయ జనతా పార్టీ జయపతాక ఎగురవేసింది. ఢిల్లీ, బిహార్‌లలో కాంగ్రెస్ ఎన్నికల ప్రచార ప్రయత్నాలు ఎల్లప్పుడూ ప్రారంభం కానివే సుమా! పరాజయం తరువాత పరాజయం పాలవుతూ కూడా కఠినమైన, వివేకవంతమైన నిర్ణయాలు తీసుకునేందుకు కాంగ్రెస్ మరింతగా సంకోచిస్తోంది. 'రాజకీయాలలో కొన్నిసార్లు, ఏ నిర్ణయాన్నీ తీసుకోకపోవడమే అత్యుత్తమ నిర్ణయం' అన్న పీవీ నరసింహారావు సుభాషితాన్ని ఔదలదాల్చింది కాబోలు!

కాంగ్రెస్ హై కమాండ్‌కు గతంలో ఒక వ్యవస్థగా లేదా ఒక వ్యక్తిగా గుర్తింపు ఉండేది. ఇప్పుడు పరిస్థితి అలా లేదు. కాంగ్రెస్ వ్యవహారాలలో హై కమాండ్ అనే పదానికి కాలం చెల్లిపోయినట్టుగా కనిపిస్తోంది. ఎందుకంటే పార్టీ వ్యవహారాలను సమర్థంగా నిర్దేశించగల 'అత్యున్నత' నేత ఎవరో తెలియదు; నియంత్రించగల వ్యవస్థ ఉనికిలో లేదన్నది స్పష్టం. మరి కాంగ్రెస్ 'హై కమాండ్' ఎవరు? సోనియా గాంధీ ఇంకెంత మాత్రం కాదు. ఆమె ఆ అత్యున్నత బాధ్యతల నుంచి దాదాపుగా వైదొలిగారు; పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సైతం కాదు. సహచరులకు సమస్యలు సృష్టించడానికి ఆయన ఇష్టపడరు. అంతేగాక మార్పులకు చొరవ చూపే నేత కూడా కాదు; ప్రియాంకగాంధీ వాద్రా అంతకంటే కాదు. పార్టీలో ఏ నిర్దిష్ట బాధ్యతనూ ఆమెకు అప్పగించలేదు కదా. ఇక రాహుల్. కీలకమైన నిర్ణయాలు తీసుకోగల అధికారమున్న ఏకైక కాంగ్రెస్ నాయకుడు ఆయన మాత్రమే. కాంగ్రెస్ భావజాల యోధుడుగా మంచి పేరు ప్రఖ్యాతులు ఉన్నప్పటికీ పార్టీ వ్యవహారాలలో కార్యదక్షుడుగా ఆయనను ఎవరూ భావించడం లేదు. మరి కాంగ్రెస్‌కు ఇప్పుడు అత్యవసరమైనది ఘటనాఘటన సమర్థుడైన నేత కాదూ?

> **2027లో సిద్ధరామయ్య ఎటువంటి అవాంతరాలకు తావివ్వకుండా అధికారాన్ని శివకుమార్‌కు అప్పగిస్తారనే ఊహాగానాలు విస్తృతంగా వినవస్తున్నాయి. ఈ తాత్కాలిక సంధి ఎంతకాలం నిలుస్తుంది? గుజరాత్‌లో మంత్రులందరినీ రాత్రికి రాత్రే రాజీనామా చేయాలని ఆదేశించి, వెన్వెంటనే కొత్త మంత్రివర్గాన్ని తీసుకురావడంలో బీజేపీ సఫలమయింది. అటువంటి అద్భుతం కాంగ్రెస్‌లో సంభవించేందుకు ఆస్కారం లేనేలేదు.**

కర్ణాటకలో కాంగ్రెస్ ఎదుర్కొంటున్న క్లిష్ట సమస్యకు మళ్లీ వద్దాం. సులువైన, సరళమైన పరిష్కారాలు ఏవీ ఇక్కడ లేవు. సిద్ధరామయ్యకు మెజారిటీ శాసన సభ్యుల మద్దతు ఉన్నది. పైగా ఆయన ఓబీసీ నాయకుడు. మరి వెనుకబడిన వర్గాల సాధికారతకై, వారి జనసంఖ్యకు సమస్థాయిలో అధికారంలో భాగస్వామ్యం కల్పిస్తామని హామీపడుతున్న కాంగ్రెస్ పార్టీకి ఓబీసీ ముఖ్యమంత్రి చాలా ప్రతిష్ఠాత్మకమైన బలం, సందేహం లేదు. శివకుమార్ వయసు 63 సంవత్సరాలు. సిద్ధరామయ్య కంటే 14 సంవత్సరాలు చిన్నవాడు. ప్రత్యర్థి కంటే అమితంగా శక్తి సామర్థ్యాలు ఉన్న నేత. సిద్ధరామయ్య వచ్చే ఏడాది ప్రథమార్థంలో కర్ణాటకలో అత్యధిక కాలం అధికారంలో ఉన్న ముఖ్యమంత్రిగా అద్వితీయ ప్రతిష్ఠ సంపన్నుడు అవనున్నారు. సిద్ధరామయ్య స్థానంలో శివకుమార్ ముఖ్యమంత్రి అయితే అది ఒక విధంగా పార్టీ నాయకత్వంలో తరం మార్పు అవుతుంది. గతంలో మధ్యప్రదేశ్, రాజస్థాన్ నాయకత్వాల్లో తరం మార్పు భావనకు లభించిన అవకాశాన్ని కాంగ్రెస్ జారవిడుచుకున్నది. ఫలితంగా ప్రజల తిరస్కరణకు గురయింది. కర్ణాటకలో మరొకసారి అటువంటి అవకాశం వచ్చింది. సిద్ధరామయ్య తేలిగ్గా ముఖ్యమంత్రి పదవి నుంచి వైదొలిగి వెళ్లిపోయే వ్యక్తి కాదు. ఎట్టి పరిస్థితులలోనూ అధికారాన్ని నిలుపుకునేందుకే ఆయన తప్పక ప్రయత్నిస్తారు.

2027లో సిద్ధరామయ్య ఎటువంటి అవాంతరాలకు తావు లేకుండా అధికారాన్ని శివకుమార్‌కు అప్పగిస్తారనే ఊహాగానాలు విస్తృతంగా జరుగుతున్నాయి. ఈ తాత్కాలిక సంధి ఎంతకాలం నిలుస్తుంది? గుజరాత్‌లో మంత్రులు అందరినీ రాత్రికి రాత్రే రాజీనామా చేయాలని ఆదేశించి, వెన్వెంటనే కొత్త మంత్రివర్గాన్ని తీసుకురావడంలో భారతీయ జనతా పార్టీ సఫలమయింది. ఇదెలా సాధ్యమయింది? భారత రాజకీయాలలో నిజమైన 'హై కమాండ్' 7 లోక్ కల్యాణ్ మార్గ్, 6ఎ కృష్ణ మీనన్ మార్గ్‌లో ఉన్నది. బీజేపీలో ప్రధాన నిర్ణయాలు అన్నిటినీ ఆ రెండు నెలవులలో తీసుకోవడం జరుగుతోంది. బీజేపీ అధికారంలో ఉన్న పలు రాష్ట్రాలలో కూడా అధికారం కోసం వెంపర్లాటలు, గుంజాటనలూ ఉన్నాయి. గోవాలో అవి మరీ ఎక్కువగా ఉన్నాయి. అయినా ఏ ఒక్క నాయకుడూ బహిరంగంగా ప్రభుత్వం మార్పు గురించి మాట్లాడడానికి సాహసించలేదు. సాహసిస్తే సంభవించేదేమిటో అందరికీ బాగా తెలుసు. కాంగ్రెస్‌లో పరిస్థితి పూర్తిగా భిన్నమైనది. అధికారాన్ని ఆకాంక్షిస్తున్న వ్యక్తులు, వర్గాలు ప్రత్యర్థులతో బహిరంగంగా వాద ప్రతివాదాలు చేస్తారు. జాతీయ నాయకత్వం తమపై చర్య తీసుకోగలదనే సంకోచం ఏ ఒక్కరికీ ఉండదు గాక ఉండదు. హై కమాండ్ ప్రాబల్యం లోపించినా లేదా బలహీనపడినా జరిగేదేమిటో కర్ణాటకలో కాంగ్రెస్ వ్యవహారాలు స్పష్టం చేస్తున్నాయి. అక్కడ నాయకులు అందరూ తమ స్వీయ ప్రయోజనాలకే ప్రాధాన్యమిస్తున్నారు. పార్టీ భవిష్యత్తు గురించి ఆలోచించడం లేదు. అధికారాన్ని స్వాయత్తం చేసుకునేందుకే ఆరాటపడుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో బలవంతుడు మాత్రమే నెగ్గుతాడు.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

వెండితెరపై తెలుగువెన్నెల

నడకలోనే నవ్వులు పూయించే నటనామయి, భావాలే మాటలుగా పలికించే మహానటి. ఒక్కో నవ్వు వెనుక వెయ్యి కష్టాలున్నా ఆమె చిరునవ్వే నిత్యవసంతం. కన్నీటి చుక్కకే జీవం పంచిన ఆ కళామయి పేరు పలికితే తెలుగుతెరపైన వెలుగురేఖ వికసిస్తుంది. ఆవిడే మహానటి సావిత్రి. ఆమె ప్రతి భావం ఒక నటశాస్త్ర గ్రంథం. ప్రతి పాత్ర ఒక దర్శనం. విమర్శకులు 'నటి' అంటారు గానీ ప్రేక్షక దేవుళ్లు ఆత్మీయంగా 'అమ్మ' అన్నారు.

సావిత్రి తెలుగు చిత్రసీమ పుటల్లోనే కాదు, తెలుగు మనసుల్లోనూ శాశ్వతంగా వెలిగే అక్షరం. దక్షిణాదిలో ప్రేక్షకాభిమానం పొందిన నటీమణులు ఎందరో ఉన్నప్పటికీ, 'మహానటి' గౌరవానికి సావిత్రి మాత్రమే ప్రతీక. సత్యజిత్ రే వంటి ప్రపంచ ప్రసిద్ధ దర్శకుడే అలా కీర్తించటం ఆమె కళాభినయానికి అతిపెద్ద ముద్ర.



నవరసాలను అలవోకగా పండించి, ఏ పాత్రలోనైనా జీవించి, కళ్లతోనే హావభావాలను పలికించిన సావిత్రి ఒక అద్భుత నటశిఖరం. ఆమె సినిమాలు ఆ తరాన్నే కాదు, ఈ తరం వారినీ మంత్రముగ్ధుల్ని చేస్తున్నాయి. ఆ మధ్య వచ్చిన 'మహానటి' సినిమా అందుకున్న అపార ప్రజాదరణ, ఆమె మహత్తర వ్యక్తిత్వానికి నేటి యువతరం అందించిన వందనం. ఆమె పోషించిన ప్రతి పాత్రలోనూ ఆమె ఆత్మ నిలిచేది. ఆ పాత్ర సావిత్రి తప్ప మరెవరూ చేయలేరని అనిపించే విధంగా తెరపై ఆమె మెరిసేది. సావిత్రి నటించిన చిత్రాలన్నింటినీ ఒక్కసారి జ్ఞాపకం చేసుకుంటే ఆ వైవిధ్యం మన కళ్లముందు కదలాడుతుంది. 'దేవదాసు'లో పార్వతే గుర్తొస్తుంది. 'మాయాబజార్'లో శశిరేఖే కనిపిస్తుంది. ఆ మహానటి మనకు దొరకటం తెలుగుజాతి అదృష్టం.

1971లో పీవీ నరసింహారావు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత, దక్షిణ భారత చలనచిత్ర పరిశ్రమ ఆయనకు ఘన సన్మానం నిర్వహించి, ఒక భారీ పూలదండ అర్పించారు. అది పాకిస్థాన్ దురాక్రమణను దేశం ఎదుర్కొంటున్న వేళ కనుక, ఆ పూలదండను దేశరక్షణ నిధుల కోసం వేలం పాటకు పెట్టారు. అక్కడ సుప్రసిద్ధ అగ్రనటులు, నిర్మాతలు ఎందరో ఉన్నప్పటికీ, ఆ వేలానికి మొదటగా ముందుకు వచ్చినది సావిత్రిగారే. ఆకస్మికంగా ఆమెను ప్రోత్సహిస్తూ ఆ వేలం పాటలో పాల్గొన్న మరో మహానటుడు ఎం.జి. రామచంద్రన్. వేలం పాటను పెంచుకుంటూ పదిహేను వేలవరకూ ఆయన తీసుకెళ్లారు. చివరకు ఆ పూలదండను గెలుచుకుంది సావిత్రి గారే. ఎం.జి.ఆర్. లాంటి మహానటుడితో పోటీపడి గెలవడం ఒక విశిష్ట ఘనత. అయినా, ఆమె 'ఇది దేశరక్షణ విషయం కనుక మీతో పోటీపడ్డాను. తప్పయితే మన్నించండి' అని ఎం.జి.ఆర్.తో వినమ్రంగా అన్నారు. దానికి ప్రతిగా ఎం.జి.ఆర్. ఆమెను ప్రశంసిస్తూ, "అమ్మా! తప్పేమీ లేదు. ఎవరూ ముందుకు రాలేదు. నువ్వు ఎలా వేలం పాడుతావో నాకు తెలుసు. ఇది దేశం కోసం ఇచ్చే డబ్బు కనుక నేను పాట పెంచాను" అన్నారు. సావిత్రి దాతృత్వానికీ, దేశభక్తికీ, ఆమె అమోఘమైన వ్యక్తిత్వానికీ శాశ్వత సాక్ష్యం ఈ ఘటన. తెలుగు తెరకు మహానటి అయితే, జీవనవేదికపై ఆమెది మహా మనసు.

నాటి ప్రధానమంత్రి లాల్‌బహదూర్ శాస్త్రి హైదరాబాదుకు వచ్చినప్పుడు, దక్షిణాది చలనచిత్ర పరిశ్రమకు చెందిన నటీనటులందరినీ కలిసి దేశరక్షణ నిధికి సహాయం కోరారు. చాలామంది తమవంతు సాయం చెక్కుల రూపంలో అందించారు. సావిత్రి మాత్రం ఆ రోజు ఆమె ఒంటినిండా వేసుకున్న బంగారు నగలన్నింటినీ తీసి ప్రధాని చేతిలో పెట్టారు. ఆ నిశ్శబ్ద క్షణం– ఆమె దాతృత్వాన్ని, ఆమెలోని దేశభక్తిని కూడా అక్షరాలుగా చెక్కింది. సావిత్రి మనసున్న మనిషి. రాయలసీమ క్షామ నివారణకు, తుపాన్ల బాధితులకు, విద్యాసంస్థలకు, అనేక సేవాసంస్థలకు స్వయంగా వెళ్లి సహాయం అందించేది. 1975 నాటి ప్రపంచ తెలుగు మహాసభల్లో ఆవిడను ప్రత్యక్షంగా దర్శించే అదృష్టం నాకు దక్కింది. మా నాన్న మండలి వెంకట కృష్ణారావుగారు, జలగం వెంగళరావుగారు కలిసి ఆమెకు ఘన సన్మానం చేసినప్పుడు, ఆ ఆరాధ్య నటీమణి నవ్వు, భాషణం ఎన్నటికీ మరిచిపోలేనివి. సావిత్రి పోషించిన తెరపాత్రలన్నీ తెలుగుతనం ఎలా ఉండాలో మనకు చూపించే పాఠాలే. ఆమె కట్టు, తిలకం, మాట, నవ్వు తెలుగు సంస్కృతీ స్వరూపం.

■ **మండలి బుద్ధప్రసాద్**
శాసనసభ్యులు, అవనిగడ్డ

(నేడు సావిత్రి 90వ జయంతి)

రాజ్యాధికారమే అంబేడ్కర్‌కు అసలైన నివాళి

ఆధునిక భారతదేశ చరిత్రలో అంబేడ్కర్‌కు అత్యంత ప్రాముఖ్యం ఉంది. దేశ జనాభాలో పదిశాతం ఉన్న అగ్రవర్ణాలవారు, తొంభైశాతం ఉన్న అణగారిన వర్గాల ప్రజల మెడల్లకు బానిస సంకెళ్లు వేసి తరతరాలుగా వారితో వెట్టిచాకిరీ చేయించుకున్నారు. స్వాతంత్ర్యానంతరం ఇలాంటి పరిస్థితులను రూపుమాపి, దేశ సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక పరిస్థితులను సరిసమానం చేసేందుకు కృషి చేసిన వ్యక్తి డా. బీఆర్ అంబేడ్కర్. 'దళిత కుటుంబంలో జన్మించి, ఎన్నో కష్టాలు పడి, పోరాటాలు, త్యాగాలు చేసి భారత రాజ్యాంగం అనే గ్రంథాన్ని రచించిన ఒక విశిష్ట సంఘ సంస్కర్త'గా మాత్రమే నేటి పాలకులు అంబేడ్కర్‌ను పరిమితం చేశారు. కానీ, అణగారిన వర్గాలకు ఏ లక్ష్యాలను సాధించుకోవాలని చెప్పాడో వాటిని నేటి పాఠ్యాంశాల్లో చేర్చకపోవడం దేశ అగ్రవర్ణ పాలకుల స్వార్థబుద్ధికి నిదర్శనం. వారు అంబేడ్కర్ స్థాయిని ఉద్దేశపూర్వకంగానే తగ్గించి రాశారు. ఆ చరిత్రే నిజమని నేడు ఎందరో విద్యావంతులు, మేధావులూ నమ్ముతుండడం విచారకరం.



అంబేడ్కర్ రాజ్యాంగ నిర్మాత, గొప్ప సంఘసంస్కర్త మాత్రమే కాదు. సాంఘిక సంక్షేమ హాస్టళ్లు, ఉచిత స్కాలర్‌షిప్‌లు, రిజర్వేషన్లు అంతకంటే కాదు. అంబేడ్కర్ సమానత్వాన్ని కాంక్షించారు. జనాభాలో పదిశాతం ఉన్న అగ్రవర్ణాలకు, తొంభైశాతం ఉన్న అణగారిన వర్గాలకు మధ్య ఒక స్పష్టమైన సైద్ధాంతిక గీత గీశారు. అసమానతలను పెంచి పోషించాలనుకునే అగ్రవర్ణ సమాజానికి– సమసమాజం, ప్రజాస్వామ్య, గణతంత్ర విలువలు కావాలనుకునే అణగారిన సమాజానికి మధ్య 'సామాజిక రాజకీయ సాంస్కృతిక' భావజాల పోరాటం చేశారు. భారత ప్రజలందరి మధ్యా 'స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం, ప్రజాస్వామ్య, గణతంత్ర' భావాలు విరజిల్లాలని కలలు గని, ఆయా అంశాలను రాజ్యాంగంలో పొందుపరిచాడు. ఒకపక్క బ్రిటిష్ పాలకులపై రాజీపడని స్వాతంత్ర్య పోరాటం సాగిస్తూనే, మరోపక్క నాటి అగ్రవర్ణ నాయకులతోనూ అంతే స్థాయిలో తీవ్ర పోరాటం చేశాడు. స్వాతంత్ర్యానంతరం అగ్రవర్ణాల వారే పాలకులై, అణగారిన వర్గాలను బానిసలుగా మార్చకూడని భావించాడు. అంబేడ్కర్ అంతటి విశాల భావాలు ఉన్నవాడు కాబట్టే ఆయన జయంతిని జ్ఞాన దినోత్సవంగా జరుపుకుంటున్నాం.

ఓటు అనే వజ్రాయుధాన్ని రాజ్యాంగం ద్వారా అంబేడ్కర్ ప్రజలకందించాడు. జనాభాలో అధిక శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలు అధికారంలోకి రావాలని ఆకాంక్షించాడు. అంబేడ్కర్ జయంతి, వర్ధంతి రోజుల్లో ఏదో హడావిడి చేయడం కాదు 'రాజ్యాధికారంతో సమాజాన్ని మార్చడం, సమాజంతో రాజ్యాధికారానికి రావడం– దీన్ని పునరావృతమయ్యేలా సామాజిక పరివర్తన చేయడమే అంబేడ్కర్‌కు మనం ఇచ్చే ఘనమైన నివాళి.

– పుల్లెంల గణేశ్

(నేడు అంబేడ్కర్ వర్ధంతి)



మహిళల కోసం రెండు ప్రైవేటు బిల్లులు

- లోక్‌సభలో ప్రవేశపెట్టిన ఎంపీ కడియం కావ్య
- తెలంగాణ నుంచి మూడు దశాబ్దాల కాలంలో మొదటి సారి
- మూజువాణి ఓటుతో బిల్లుల ఆమోదం

6



అడ్డంగా బుక్కైన అదనపు కలెక్టర్



ఏసీబీకి పట్టుబడిన హనుమకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ ఎ.వెంకట్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్లు గౌస్, మనోజ్

- రూ.60వేల లంచం తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ
- ప్రైవేట్ పాఠశాల రెన్యూవల్ కోసం రూ.లక్ష లంచం డిమాండ్
- ఇన్‌చార్జి డీఈవో హోదాలో వెంకట్‌రెడ్డి ఒత్తిడి
- విసిగి వేసారి ఏసీబీని ఆశ్రయించిన బాధితుడు
- కలెక్టర్ చాంబర్ ముందే ఏసీబీ రహస్య ఆపరేషన్
- ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు సైతం పట్టివేత

వరంగల్ క్రైం/హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆయన జిల్లాకు అదనపు కలెక్టర్. పాలనను సక్రమంగా సాగించే కీలక బాధ్యతల్లో వున్న వ్యక్తి. అవినీతి, అక్రమాలను అదుపు చేయడంలో కీలకంగా వ్యవహరించాల్సిన ఉన్నతాధికారి. కానీ ఆయనే లంచం డబ్బులకు కక్కుర్తిపడి ఏసీబీకి అడ్డంగా దొరికిపోయాడు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో రూ.60వేల నగదు తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఈ సంఘటన హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం సాయంత్రం జరిగింది. ఆయనతో ఇద్దరు విద్యాశాఖ ఉద్యోగులు కూడా ఏసీబీ వలలో

(మిగతా 6లో..)

అవినీతి మకిలి..

ఏసీబీ అధికారులకు పట్టుబడ్డ అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డిపై గతంలోనే పలు అవినీతి ఆరోపణలున్నాయి. 2008లో నల్లగొండ జిల్లాలో రెవెన్యూశాఖలో పనిచేస్తున్న క్రమంలో ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నాడని ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. ఆ కేసు కొనసాగుతున్నట్లు ప్రస్తుత దర్యాప్తులో వెలుగులోకి వచ్చిందని ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపారు. కాగా గతంలో పనిచేసిన పలు చోట్ల వెంకట్‌రెడ్డి అవినీతికి పాల్పడ్డట్లుగా ఆరోపణలు ఉండటం గమనార్హం.





నర్సంపేటలో బహిరంగ సభా వేదికపై అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

- కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం..
- పంచాయతీ ఎన్నికల్లో అభివృద్ధికి కృషి చేసేవాళ్లనే ఎన్నుకోవాలి
- చదువుకుంటే విద్యార్థుల తలరాతలు మారుతాయి
- రైతులు పండించే ప్రతి గింజను కొనుగోలు చేస్తాం
- రైతు భరోసా, రుణమాఫీ అమలు చేశాం..
- సమ్మక్క-సారలమ్మ స్ఫూర్తితో రెండేళ్ల ప్రజాపాలన పూర్తి
- నర్సంపేట సభలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి



మాట్లాడుతున్న పొంగులేటి, బలరాంనాయక్, దొంతి మాధవరెడ్డి

హైదరాబాద్ తరహాలో వరంగల్ అభివృద్ధి

నర్సంపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ తరహాలో వరంగల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. వరంగల్ జిల్లా నర్సంపేటలోని వైద్య కళాశాల సమీపంలో శుక్రవారం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. తొలుత నియోజకవర్గంలో రూ:531 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల సభలో ప్రసంగించారు. హైదరాబాద్ తరహాలో వరంగల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే బాధ్యతను తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. వరంగల్‌లో ఔటర్ రింగ్ రోడ్డుతోపాటు ఎయిర్‌పోర్టు, అండర్ డ్రెయినేజీ నిర్మాణం చేస్తామన్నారు.

రెండేళ్ల ప్రజాపాలన పూర్తి

వందల ఏళ్ల చరిత్ర కలిగిన సమ్మక్క-సారలమ్మల పోరాట స్ఫూర్తి, దొడ్డి కొమురయ్య, వీరనారి చాకలి ఐలమ్మ, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు, కాకతీయ యూనివర్సిటీ ఉద్యమాలు, ప్రొఫెసర్ జయశంకర్ స్ఫూర్తితో

(మిగతా 7లో..)

మందు సీసాలకు ఆశపడొద్దు..

హాఫ్, ఫుల్‌కు ఆశపడి ఓట్లు వేస్తే గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడుతుందని సీఎం అన్నారు. అందుకే గ్రామాభివృద్ధికి కృషి చేసే మంచి వ్యక్తులను సర్పంచ్‌లుగా ఎన్నుకుంటే, వారు మంత్రులు, ఎమ్మెల్యేలను కలిసి గ్రామాల అభివృద్ధికి పాటుపడతారని పేర్కొన్నారు. అలాంటి వారిని ఎన్నుకోవాలని సీఎం ప్రజలకు, మహిళలకు పిలుపునిచ్చారు.



నర్సంపేటలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి



విజయోత్సవ సభకు హాజరైన జనం

మూడో విడతకు ముగిసిన నామినేషన్లు

చివరి రోజు రాత్రి వరకు కొనసాగిన దాఖలు

హనుమకొండ టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా పరిధిలో మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి శుక్రవారం సర్పంచ్, వార్డు స్థానాలకు నామినేషన్ల పర్వం ముగిసింది. మూడో విడతలో హనుమకొండ జిల్లాలోని దామెర మండలంలో 14 గ్రామ పంచాయతీలకు 79 నామినేషన్లు, 132 వార్డు స్థానాలకు 300 నామినేషన్లు, నడికూడ మండలంలో 14 గ్రామ పంచాయతీలకు 83 నామినేషన్లు, 138 వార్డు స్థానాలకు 287 నామినేషన్లు, శాయంపేట మండలంలో 24 గ్రామ పంచాయతీలకు 107 నామినేషన్లు, 212 వార్డు స్థానాలకు 391 నామినేషన్లు, ఆత్మకూరు మండలంలో 16 గ్రామ పంచాయతీలకు 84 నామినేషన్లు, 152 వార్డు స్థానాలకు 336 నామినేషన్లు దాఖలైనట్లు అధికారులు తెలిపారు. నామినేషన్ల స్వీకరణకు క్లస్టర్లలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సమయం ఉండడంతో 5 గంటల లోపు వచ్చిన వారికి టోకెన్ ఇచ్చి అనుమతించారు. దీంతో చివరి రోజు కావడంతో ఎక్కువ సంఖ్యలో అభ్యర్థులు నామినేషన్లు వేయడంతో రాత్రి వరకు నామినేషన్ల పర్వం కొనసాగింది.

మూడో విడత నామినేషన్ కౌంటర్ | చివరి రోజు 05-12-25

మండలం పేరు	సర్పంచ్ స్థానాలు	దాఖలైన నామినేషన్లు	వార్డు సభ్యులు	దాఖలైన నామినేషన్లు
దామెర	14	79 (106)	132	300 (407)
శాయంపేట	24	107 (179)	212	391 (558)
నడికూడ	14	83 (114)	138	287 (407)
ఆత్మకూరు	16	84 (114)	152	336 (447)

నోట్: (బ్రాకెట్)లో ఇప్పటి వరకు దాఖలైన మొత్తం నామినేషన్ల సంఖ్య

నిబంధనలను పటిష్ఠంగా అమలు చేయాలి

- ఎన్నికల్లో సూక్ష్మ పరిశీలకుల విధులు కీలకం
- ఎన్నికల జిల్లా పరిశీలకులు శివకుమార్ నాయుడు
- కలెక్టరేట్‌లో మైక్రో అబ్జర్వర్‌లకు శిక్షణ
- ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ సిబ్బంది కేటాయింపు



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న శికుమార్ నాయుడు

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో సూక్ష్మపరిశీలకుల పాత్ర ఎంతో కీలకమని గ్రామపంచాయతీ ఎన్నికల జిల్లా పరిశీలకుడు శివకుమార్ నాయుడు అన్నారు. హనుమకొండలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం సూక్ష్మపరిశీలకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శివకుమార్ నాయుడు మాట్లాడుతూ.. సాధారణ పరిశీలకులు ఎలక్షన్ కమిషన్‌కు కన్నులవంటివారని, వీరి ద్వారానే ఎలక్షన్ కమిషన్ ఎన్నికల ప్రక్రియను పరిశీలిస్తారన్నారు. అందువల్ల సూక్ష్మపరిశీలకులు ఎన్నికల రోజు తగు జాగ్రత్తలతో ఉండి ఎన్నికల ప్రక్రియలో జరిగే ప్రతీ అంశం నిబంధనల ప్రకారం జరిగేలా పరిశీలించాలని, వాటికి సంబంధించిన రిపోర్టులను తయారుచేయాలని అన్నారు. అదేవిధంగా ఓట్ల లెక్కింపు కార్యక్రమం, ఉప సర్పంచ్ ఎన్నిక మొదలైనవి ఎలక్షన్ కమిషన్ నిబంధనల ప్రకారం జరిగేలా చూడాలన్నారు. హనుమకొండ జిల్లాలో మొత్తం 58 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించి 70మంది సూక్ష్మపరిశీలకులను నియమించామన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎన్నికల అధికారి, జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీరమాకాంత్, జిల్లా పరిషత్ సీఈవో రవి, తదితర అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్

గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా పోలింగ్ సిబ్బంది రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకుడు శికుమార్ నాయుడు, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్‌ల సమక్షంలో శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. జిల్లాలోని భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, కమలాపూర్ మండలం వారీగా ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్, వార్డుస్థానాలకు ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు,

(మిగతా 6లో..)

వాహనాల తనిఖీలో రూ.4.38 లక్షలు స్వాధీనం



చంద్రుగొండ క్రాస్ రోడ్ వద్ద అధికారులు స్వాధీనం చేసుకున్న నగదు

నెక్కొండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా నెక్కొండ మండలం చంద్రుగొండ క్రాస్ రోడ్ వద్ద శుక్రవారం సాయంత్రం ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు రూ.4.38 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఎలక్షన్ ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి పుష్పలత తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాది కొత్తగూడెం జిల్లా చింతలపాడు మండలం గుండాల గ్రామానికి చెందిన గాందర్ల సతీష్‌కుమార్, అతడి భార్య స్వప్న కారులో పర్వతగిరి మండలం అన్నారం షరీఫ్ వెళ్లి అక్కడి నుంచి కరీంనగర్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో చంద్రుగొండ క్రాస్ రోడ్ వద్ద అధికారులు వారి వాహనాన్ని తనిఖీ చేయగా రూ.4.38 లక్షలు బయటపడ్డాయి. వాటికి సంబంధించి సతీష్‌కుమార్ ఆధారాలు చూపకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు. ఆ సమయంలో కలెక్టర్ సత్యశారద కూడా ఉన్నారు. కాగా, సతీష్‌కుమార్ హైదరాబాద్‌లో వ్యాపారం చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పి.రవి, పీసీ రమేశ్, జీపీవో రజినీకాంత్ ఉన్నారు.

కల్యాణ మండప పనుల్లో కదలిక

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆదేశాలకు మోక్షం

6



గ్రానైట్ రాతి స్తంభాలను వేయుస్తంభాల ఆలయానికి తరలిస్తున్న సిబ్బంది

ఈశ్వరాచారి త్యాగాన్ని వృథాకానివ్వం

- శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్

6



అమరవీరుల స్తూపం వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న బీసీ సంఘాల నాయకులు, బీఆర్ఎస్ నాయకులు



బీఆర్ఎస్ కార్యాలయంలో మాట్లాడుతున్న తక్కళ్లపెల్లి రవీందర్‌రావు, చిత్రంలో వినయ్‌భాస్కర్ తదితరులు

కేసీఆర్ స్వరాష్ట్ర పోరాటం ఆదర్శనీయం

దీక్షా దివస్‌లో ఎమ్మెల్సీ తక్కళ్లపెల్లి రవీందర్‌రావు

హనుమకొండ టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ స్వరాష్ట్ర పోరాటం నేటి యువతకు ఆదర్శమని, కేసీఆర్ పోరాట పటిమను విద్యార్థులకు తెలియజేయాలని ఎమ్మెల్సీ తక్కళ్లపెల్లి రవీందర్‌రావు సూచించారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో దీక్షా దివస్ కార్యక్రమం నిర్వహించారు. బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

ఈ సందర్భంగా తక్కళ్లపెల్లి రవీందర్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రాంత చరిత్ర, వెనుకబాటు, 60 ఏళ్ల అణచివేత, 14 ఏళ్ల కేసీఆర్ స్వరాష్ట్ర పోరాటం, 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలన, సంక్షేమం, అభివృద్ధి నేటితరానికి వివరించాలని బీఆర్ఎస్ శ్రేణులను కోరారు. దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. తెలంగాణ యువత స్వరాష్ట్రాన్ని సాధించేందుకు ప్రాణాలను అర్పించారని, వారి ప్రాణ త్యాగాలే నేటి స్వరాష్ట్రం అన్నారు. ఈ కార్యక్రమంలో కేయూ ప్రొఫెసర్ దినేష్‌కుమార్, కేయూ బీఆర్ఎస్వీ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్, కేయూ విద్యార్థి జేఏసీ చైర్మన్ కత్తెరపెల్లి దామోదర్, బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల శరత్‌చంద్ర, గంద్రకోట రాకేష్ యాదవ్, గొల్లపెల్లి వీరస్వామి, వస్తం అనిల్‌కుమార్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ ఆరోగ్యంగా ఉండాలని దర్గాలో ప్రార్థనలు

మాజీ సీఎం కేసీఆర్ ఆయురారోగ్యాలతో ఉండాలని బీఆర్ఎస్ పార్టీ మైనారిటీ విభాగం మహ్మద్ నయీమొద్దీన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అబ్దుల్ నదీషా దర్గా గిలాఫ్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు సోని, షఫీ, అఫ్జల్, మహమూద్, ఖలీల్ అహ్మద్, ఇస్మాయిల్, సర్దార్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నగరానికి చినజీయర్ స్వామి

హనుమకొండ కల్చరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పరమహంస పరివ్రాజయ ఆచార్యుడు, వేద విశ్వవిద్యాలయ వ్యవస్థాపకుడు, పద్మ విభూషణ్ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి శనివారం వరంగల్ నగర పర్యటనకు వస్తున్నారు. స్వామివారు హనుమకొండలోని శోభ తిరుమల్‌రెడ్డి గృహంలో ఉదయం భక్తులకు తీర్థగోష్ఠి నిర్వహించనున్నారు. అనంతరం మధ్యాహ్నం 11గంటల ప్రాంతంలో అన్నసాగర్‌లోని ఎస్ఆర్ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఎనగందుల వరదారెడ్డి సుమతిదేవి ఆధ్వర్యంలో నిర్వహించే ఆధ్యాత్మిక కార్యక్రమంలో స్వామి పాల్గొంటారని వికాస తరంగిణి చైర్‌పర్సన్ డాక్టర్ బచ్చు రాధాకృష్ణ చెప్పారు. అన్నాసాగర్‌లోని శ్రీ రంగనాథ స్వామి ఆలయాన్ని కూడా స్వామివారు సందర్శించనున్నారు.

పని బారెడు.. జీతం మూరెడు..

- శ్రమకు తగ్గ ఫలితం లేక నలిగిపోతున్న హోంగార్డులు
- అన్ని విభాగాల్లో రాణిస్తున్నా.. గుర్తింపు శూన్యం
- వర్తించని రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, కారుణ్య నియామకాలు, ఆరోగ్య భద్రత
- నేడు హోంగార్డుల 63వ రైజింగ్ డే



వరంగల్ క్రైం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కానిస్టేబుళ్లకు దీటుగా పని చేస్తున్న హోంగార్డులకు శ్రమకు తగ్గ ప్రతిఫలం దక్కకపోవడంతో నిరాశకు లోనవుతున్నారు. రోడ్డెక్కి నోరువిప్పలేక లోలోపల నలిగిపోతున్నారు. పోలీస్ విధులతో పాటు అదనంగా అధికారుల ఇళ్లలో వెట్టిచాకిరి చేస్తున్నా పాలకులకు తమపై కనికరం పుట్టడం లేదని వాపోతున్నారు. ప్రతీ విధుల్లో తమను వినియోగించుకుంటూ ప్రతిఫలాలు అందిండంలో మాత్రం సవతితల్లి ప్రేమ చూపిస్తున్నారని హోంగార్డులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు, పోలీస్ ఉన్నతాధికారులు తమ శ్రమను గుర్తించి కానిస్టేబుళ్లతో సమానం గుర్తించాలని హోంగార్డుల వేడుకుంటున్నారు.

వ్యక్తిగత పనులకు వినియోగం

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని 3 జోన్లలో జనరల్ (జీడీ), అదర్ డ్యూటీ (ఓడీ)ల్లో కలిపి సుమారు 850 మంది హోంగార్డులు విధులు నిర్వర్తిస్తున్నారు. కొంత మంది పోలీస్ అధికారులు వారిని వ్యక్తిగత పనులకు వినియోగిస్తూ వెట్టిచాకిరి చేయించుకుంటున్నారు. పేరుకు ఠాణాలు, అధికారుల కార్యాలయాల్లో విధులకు కేటాయింపు.. తీరా అక్కడికి వెళ్లాక కొందరు అధికారుల కుటుంబసభ్యులకు డ్రైవర్లుగా, పిల్లలను పాఠశాలకు పంపించడం, తీసుకురావడానికి వాడుతున్నారు. మరికొంత మంది అధికారులు మాత్రం ఠాణాలకు రానీయకుండా పూర్తిగా ఇంటి పనులకే వారి సేవలను వినియోగిస్తున్నారు. అధికారులకు ఎదురుచెప్పలేక సర్దుకుపోతున్నట్లుగా తెలుస్తోంది. అధికారులు, వారి కుటుంబ సభ్యులను సైతం మెప్పించడం తమ వల్ల కావడంలేదని పలువురు హోంగార్డులు వాపోతున్నారు.

సుదీర్ఘ సేవలకు వర్తించని ప్రతిఫలాలు

బెనిఫిట్స్‌ను హోంగార్డులకు అందించడంతో పాలకులు పక్షపాతం వహిస్తున్నారని విచారం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కారుణ్య నియామకాలున్నా వాటిని నిలిపివేశారు. ఏళ్లుగా పోలీస్‌శాఖలో సేవలను వినియోగించుకొని రిటైర్‌మెంట్ సమయంలో ఎలాంటి బెనిఫిట్స్ ఇవ్వకుండా సాగనంపుతున్నారని, సొప్పో, రోగమో వస్తే వైద్యం చేయించుకోవడానికి ఆరోగ్య భద్రత కార్డు లేదని వాపోతున్నారు. యేటా యూనిఫామ్ అలవెన్స్ కోసం రూ.7,500 ఇవ్వాల్సి ఉండగా, నాలుగేళ్ల నుంచి నిలిపివేశారని, సహజ మరణానికి సైతం రూ.5 లక్షలు ఇవ్వాలని ఏడాది కిందటే సర్క్యులర్ జారీ చేసినా ఇప్పటివరకు అమలులోకి రాలేదు. కొన్ని రాష్ట్రాల్లో వేతనం రూ.43,000 ఉన్నా తెలంగాణలో మాత్రం ట్రాఫిక్ మినహా ఇతర విభాగాల్లో చేసే హోంగార్డులకు రూ.30,000 మాత్రమే ఇస్తున్నారని ఆవేదన వెళ్లగక్కుతున్నారు. రిటైర్‌మెంట్ అయ్యాక ప్రభుత్వం అందించే ఆసరా పెన్షన్‌కు దరఖాస్తు చేసుకుంటే అధికారులు తమను ప్రభుత్వ ఉద్యోగులుగా భావించి పెన్షన్ ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారని అంటున్నారు.

పరేడ్ గ్రౌండ్‌లో రైజింగ్ వేడుకలకు ఏర్పాట్లు

డిసెంబర్ 6న హోంగార్డుల 63వ రైజింగ్ డేను పురస్కరించుకొని చాలా ఏళ్ల తర్వాత వరంగల్ పోలీస్ కమిషనరేట్ హోంగార్డు విభాగం ఆధ్వర్యంలో పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శనివారం రైజింగ్‌డే వేడుకల ఏర్పాట్లను సిద్ధం చేశారు. ఈ సందర్భంగా రెండు రోజుల కిందటే పురుష హోంగార్డులకు వాలీబాల్, టగ్ ఆఫ్ వార్, మహిళలకు లెమన్ విత్ స్పూన్ క్రీడాపోటీలు నిర్వహించారు. రైజింగ్ డే సందర్భంగా హోంగార్డులతో పరేడ్ నిర్వహించి, విధుల్లో ప్రతిభ చూపిన వారి ప్రశంసాపత్రాలు అందజేయడంతో పాటు క్రీడల్లో విజేతలకు బహుమతులు అందజేయనున్నారు.

హాల్ మార్కింగ్ టెక్నికల్ అడ్వైజరీగా శిరీష



హనుమకొండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల మండలి (ట్రస్ట్) దక్షిణాది రాష్ట్రాల కమిటీకి హాల్ మార్కింగ్ టెక్నికల్ అడ్వైజరీగా సీహెచ్ శిరీషను వినియోగదారుల మండలి జాతీయ కమిటీ నియమించినట్లు వినియెగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి తెలిపారు. వరంగల్‌లో 8 హాల్ మార్కింగ్ సెంటర్లు, తెలంగాణతో సహా దక్షిణాది రాష్ట్రాల్లో 36 సెంటర్లు ఉన్నాయి. వీటిద్వారా బంగారు ఆభరణాల నాణ్యత ధృవీకరణ జరుగుతోంది. ఆభరణాల కొనుగోలులో వినియోగదారులు నిరంతరం మోసపోతున్న దృష్ట్యా వారికి హాల్ మార్కింగ్ యూనిక్ ఐడెంటిఫికేషన్ గురించి అవగాహన కలిగించేందుకు చైతన్య కార్యక్రమాలను నిర్వహించడం, ఫిర్యాదుల నమోదులో సాంకేతిక అవసరం ఉన్నందువల్ల శిరీషను దక్షిణాది రాష్ట్రాల కమిటీకి టెక్నికల్ అడ్వయిజరీగా నియమించినట్లు చక్రపాణి తెలిపారు.

ప్రముఖ వ్యాపారి
యాదవరెడ్డి కన్నుమూత

జనగామ కల్చరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ వ్యాపారి, టెక్స్‌మో డీలర్ చెంచారపు యాదవరెడ్డి (82) వృద్ధాప్య సమస్యలతో శుక్రవారం కన్నుమూశారు. విషయం తెలుసుకున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బాణాపురంలోని ఆయన నివాసానికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నీటి పారుదల రంగంలో యాదవరెడ్డి టెక్స్‌మో మోటర్ల తయారీ, విక్రయాలతో ఆదరణ పొందారు.

నిబంధనలను
పటిష్ఠంగా అమలు చేయాలి

(5వ పేజీ తరువాయి)

జీపీవోలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. స్థానికత, విధులు నిర్వర్తిస్తున్న మండలం తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని ర్యాండమైజేషన్ ద్వారా స్థానికేతర సిబ్బందిని పోలింగ్ విధుల కోసం ఎంపిక చేశారు. జిల్లాలోని మొదటి విడతలో ఉన్న 69 గ్రామపంచాయతీల సర్పంచ్, 658 వార్డుస్థానాలకు ఎన్నికల నిర్వహణ కోసం 20శాతం రిజర్వ్ స్టాఫ్ కలుపుకుని మొత్తం 761 ప్రిసైడింగ్ అధికారులు, 1149 ఓపీఓలను కేటాయించారు. ర్యాండమైజేషన్‌లో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీపీఓ లక్ష్మీరమాకాంత్, అధికారులు పాల్గొన్నారు.

మహిళల కోసం రెండు ప్రైవేటు బిల్లులు

- లోక్‌సభలో ప్రవేశపెట్టిన ఎంపీ కడియం కావ్య
- తెలంగాణ నుంచి 3 దశాబ్దాల కాలంలో మొదటిసారి
- మూజువాణి ఓటుతో బిల్లుల ఆమోదం

హనుమకొండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మహిళలకు రక్షణ, సౌకర్యాలు, సామాజిక భద్రతను బలోపేతం చేసే దిశగా వరంగల్ ఎంపీ కడియం కావ్య శుక్రవారం లోక్‌సభలో రెండు కీలక ప్రైవేట్ బిల్లులను ప్రవేశపెట్టారు. మూడు దశాబ్దాల తర్వాత తెలంగాణ నుంచి ఒక మహిళా ఎంపీ ఇలాంటి ప్రత్యేక బిల్లును ప్రవేశపెట్టడం ఇదే తొలిసారి. ఉద్యోగ రంగంలో నెలసరి సమయంలో మహిళలకు అవసరమైన సౌకర్యాలు, అందుబాటులో గదులు, శుభ్రమైన రెస్ట్ రూములు, తగిన ఆరోగ్య వసతులు కల్పించేందుకు చట్టపరమైన నిబంధనలు తప్పనిసరి చేయాలని మొదటి బిల్లులో కావ్య ప్రతిపాదించారు.

మహిళల ఆరోగ్యం, ఉద్యోగ ఉత్పాదకత, భద్రత దృష్ట్యా ఈ చర్య అత్యంత కీలకమని ఆమె స్పష్టం చేశారు. రెండో బిల్లులో ఒంటరి మహిళలు, వితంతువులు, ఆపన్నస్థితిలో ఉన్న స్త్రీలకు ప్రభుత్వం ద్వారా అత్యవసర సహాయం, ఆధార వేతనాలు, గృహ భద్రత, సామాజిక సంక్షేమ చర్యలు తక్షణం అందేలా ప్రత్యేక విధానాన్ని ప్రవేశపెట్టాలని కోరారు. ఈ రెండు బిల్లులను లోక్‌సభ మూజువాణి ఓటుతో ఆమోదించగా, మహిళ సాధికారత దిశగా ఇది మరొక ముఖ్యమైన అడుగుగా భావిస్తున్నారు. వరంగల్ ఎంపీ ప్రవేశపెట్టిన ఈ బిల్లులు దేశవ్యాప్తంగా మహిళా సంక్షేమానికి మార్గదర్శకంగా ఉండనున్నాయని మహిళా సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

మహిళలు, బాలల సంక్షేమంపై గళం

మహిళల సాధికారత, బాలల సంక్షేమం, పోషణ, మహిళల రక్షణ సేవల అమలు సమాజ పురోగతికి కీలకమని ఎంపీ కావ్య అన్నారు. శుక్రవారం ఈ అంశాలను లోక్‌సభలో లేవనెత్తారు. ఎంపీ అడిగిన ప్రశ్నలకు కేంద్ర మహిళ, శిశు అభివృద్ధి శాఖ సహాయ మంత్రి సావిత్రి ఠాకూర్ సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ కావ్య మాట్లాడుతూ.. మహిళలు, బాలల సంక్షేమ పథకాలు వరంగల్‌లో మరింత వేగంగా అమలు చేయాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో పోషకాహార లోపం, లింగ వివక్ష తగ్గించే దిశగా ఇవి మరింత ప్రభావవంతంగా పని చేయాలని కోరారు.

క్రైం న్యూస్



మృతి చెందిన రామ్ సింగ్

విద్యుత్ షాక్‌తో కార్మికుడి మృతి

మరో ఇద్దరికి గాయాలు

రాయపర్తి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండూరు గ్రామంలో బోరు బండి పనులు సర్దుకుంటుండగా ప్రమాదవశాత్తు 11 కేవీ వైరు తగిలి బోరు బండి కార్మికుడు మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలైన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. రాయపర్తి ఎస్ఐ ముత్యం రాజేందర్ కథనం ప్రకారం.. కొండూరు గ్రామానికి చెందిన తోగర్ శివకుమార్ ఇంటి ఆవరణలో బోరు వేసి, తిరిగి సామాన్లు సర్దుకుంటున్న సమయంలో బోరు బండి పైనే ఉన్న 11 కేవీ వైరు తగిలి బోరు బండితో పాటు పరిసరాలు విద్యుత్ షాక్‌కు గురయ్యాయి. దీంతో చత్తీస్ ఘడ్‌కు చెందిన రామ్‌సింగ్(27) అనే కార్మికుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు కార్మికులు సీతారాం, తూలు గాయపడ్డారు. దీంతో వారిని ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ దినసరి కూలీ మృతి

మడికొండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ దినసరి కూలీ మృతి చెందిన ఘటన కాజీపేట మండలం కడిపికొండలో చోటు చేసుకుంది. మడికొండ ఎస్సై పెగడ రాజకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కడిపికొండకు చెందిన తాపీమేస్త్రీ బస్కే రాజు (38) కొంత కాలంగా మద్యం సేవిస్తూ అప్పుడప్పుడు భార్య సుగుణతో గొడవ పడుతుండేవాడు. గురువారం సాయంత్రం భార్యతో గొడవపడగా ఆమె తమ మామయ్య వారి ఇంటికి వెళ్లింది. ఆ సమయంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న రాజు ఫ్యాన్‌కు తాడుతో ఉరి వేసుకున్నాడు. రాత్రి సుమారు 7.30 గంటల ప్రాంతంలో రాజు చిన్న కూతురు ట్యూషన్‌కు వెళ్లి ఇంటికి చేరుకుంది. ఇంట్లో తండ్రి రాజు ఉరివేసుకొని కనిపించాడు. ఆమె వెంటనే తన తల్లికి సమాచారం అందించింది. తల్లి తన మామయ్యతో కలిసి రాజును ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అతడు రాత్రి 10 గంటల ప్రాంతంలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారని పేర్కొన్నారు. భార్య సుగుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రాజకుమార్ తెలిపారు.

చిట్టీలు కట్టలేక..

పురుగుల మందు తాగి గీత కార్మికుడి ఆత్మహత్య

హసన్‌పర్తి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం దేవన్నపేట శివారు ఓఆర్ఆర్ రింగురోడ్డు సమీపంలో చోటు జరిగింది. ఇన్‌స్పెక్టర్ వట్టె చేరాలు కథనం ప్రకారం.. దేవన్నపేటకు చెందిన జనగాని నాగరాజు (40), లావణ్య దంపతులకు ఇద్దరు సంతానం. వీరికి స్పందన, మణికంఠ (17) ఉన్నారు. నాగరాజు 20 రోజుల కిందట అయ్యప్ప మాల వేసుకొని దేవన్నపేట శివారు ఓఆర్ఆర్ సమీపంలోని ఓ కుటీరంలో ఉంటున్నాడు. గీతకార్మికుడిగా కుల వృత్తి చేసుకుంటూ వస్తున్న డబ్బులు సరిపోక చిట్టీలు ఎత్తుకొని కట్టలేని పరిస్థితిల్లో మనస్తాపం చెందిన నాగరాజు శుక్రవారం దేవన్నపేట సమీపంలోని ఓఆర్ఆర్ శివారులోలో పురుగులు మందుతాగి ఆత్మహత్య చేసుకొని మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య స్పందన ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వట్టె చేరాలు తెలిపారు.

ఇద్దరి మృతికి కారణమైన వ్యక్తికి జైలు

వరంగల్ లీగల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో కారు నడిపి భార్యాభర్తల మృతికి కారణమైన వ్యక్తికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.7వేల జరిమానా విధిస్తూ వరంగల్ జిల్లా మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి జి.ప్రేమలత శుక్రవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. 2017 ఫిబ్రవరి 27న వరంగల్ జిల్లా పైడిపల్లి గ్రామానికి చెందిన కోట అజయ్ మద్యం సేవించి నిర్లక్ష్యంగా కారు నడిపి బైక్‌పై వెళ్తున్న కొత్తగూడ మండలం ఓటాయి గ్రామానికి చెందిన భార్యాభర్తలు చిలుకమారి శ్యాంసుందర్, సరితను పాకాల వాగు దాటుతుండగా ఢీకొట్టాడు. దీంతో తీవ్రగాయాలైన ఇద్దరిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించారు.

దీంతో శ్యాంసుందర్ సోదరుడు చిలుకమారి వెంకటేశ్వర్లు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఖానా పురం పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువైనందున నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కోర్టు పీసీ ఎస్.మహేష్ సాక్షు లను ప్రవేశపెట్టగా దర్యాప్తు అధికారులుగా అప్పటి ఎస్సై గురుస్వామి, సీఐ బోనాల కిషన్ వ్యవహరించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ భూక్య వెంకట్రాం కేసు వాదించారు.

కేయూ పరీక్షల నియంత్రణాధికారిగా రాజేందర్ కొనసాగింపు

కేయూ క్యాంపస్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్‌ను మరోఏడాది పాటు కొనసాగిస్తూ రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలన భవనంలో కేయూ వీసీ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలు రాజేందర్‌కు ఉత్తర్వులు అందచేశారు. రాజేందర్‌ను పలువురు అభినందించారు.

జంతుశాస్త్రం బీవోఎస్‌గా షమిత

కేయూ జంతుశాస్త్రం పాఠ్య ప్రణాళిక సంఘం చైర్‌పర్సన్‌గా షమిత నియమతులయ్యారు. ఈ మేరకు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ఉత్తర్వులు జారీ చేశారు. రెండేళ్లకాలానికి పదవిలో కొనసాగుతారు. కేయూ పరిపాలన భవనంలో కేయూ వీసీ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలు షమితకు అందచేశారు. ఇప్పటి వరకు బీవోఎస్‌గా కొనసాగిన ఈసం నారాయణను నుంచి షమిత బాధ్యతలు చేపడుతారు. షమితను పలువురు అభినందించారు.

కల్యాణ మండప
పనుల్లో కదలిక

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆదేశాలకు మోక్షం

హనుమకొండ కల్చరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలోని కల్యాణ మండప నిర్మాణపు పనుల్లో చివరి దశగా మిలిగిన పనులకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. శుక్రవారం మిగిలిన కొద్ది పాటి పనులను పూర్తిచేయడానికి పురావస్తు శాఖ అధికారులు, సిబ్బంది నడుం బిగించారు. కల్యాణ మండప పైభాగం మిగిలిన ఉన్న కొద్దిశాతం పనులు పూర్తి చేయడం, కల్యాణ మండపం లోపలి భాగంలో నాట్య మండపం పూర్తి చేయడానికి పనులకు శ్రీకారం చుట్టారు. సీనియర్ కన్జర్వేషన్ అసిస్టెంట్ ఎం.మల్లేశం, ఇంజనీరింగ్ అధికారి కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో సిబ్బంది పనులను ప్రారంభించారు. ఇందులో భాగంగా పద్మాక్షి అమ్మవారి ఆలయం పక్కన ఉన్న స్టాక్ యార్డ్ నుంచి నెంబరింగ్ ప్రకారం గ్రానైట్ రాతి స్తంభాలను వేయిస్తంభాల ఆలయానికి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. మొత్తం మీద రెండు మూడు వారాల్లోగా కల్యాణ మండప పనులను వంద శాతం పూర్తి చేస్తామని అధికారులు స్పష్టం చేశారు.

గత నెల నవంబరు 29వ తేదీన వరంగల్ నగర పర్యటనలో భాగంగా కేంద్ర పురావస్తు, బొగ్గుగనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి వేయిస్తంభాల ఆలయాన్ని సందర్శించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో కల్యాణ మండప పనులపై ఆరా తీసి మిగిలిన పనులపై అధికారులను మందలించారు. ఈ క్రమంలో త్వరితగతిన పనులను పూర్తి చేసి తనకు నివేదిక ఇవ్వాలని హుకుం జారీ చేసిన క్రమంలో మిగిలి ఉన్న పనులకు శుక్రవారం శ్రీకారం చుట్టడం గమనార్హం.

ఈశ్వరాచారి
త్యాగాన్ని వృథా కానివ్వం..

శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్

హనుమకొండ టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈశ్వరాచారి మృతికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల వైఖరే కారణమని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ మండిపడ్డారు. శుక్రవారం హనుమకొండలోని అమరవీరుల స్థూపం వద్ద మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, బీసీ సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మ దహనం చేశారు. ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తుండగా పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. కొద్ది సేపు పోలీసులకు, బీఆర్ఎస్ శ్రేణులకు తోపులాట జరిగింది. ఈ సందర్భంగా ప్రకాష్, బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి కొవ్వొత్తులతో ఈశ్వరాచారికి నివాళులర్పించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని మాయమాటలు చెప్పి గతంలో ఉన్న రిజర్వేషన్లను తగ్గించి బీసీలను అణగదొక్కారని అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకపోవడంతో బీసీ సమాజానికి అన్యాయం జరిగిందని భావించి కూకట్‌పల్లికి చెందిన శ్రీసాయి ఈశ్వరాచారి ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని అన్నారు. నాడు తెలంగాణ రాష్ట్రం కోసం శ్రీకాంతాచారి, నేడు బీసీ రిజర్వేషన్ల కోసం ఈశ్వరాచారి ప్రాణత్యాగాలు చేశారని, బీసీ బిడ్డల త్యాగాలను వృథా కానివ్వమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ గౌడ్, బీసీ జేఏసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్, కుడా మాజీచైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ జేఏసీ కన్వీనర్ జోరిక రమేష్, బీసీ సంఘం ఉమ్మడి జిల్లా కో కన్వీనర్ పులి రజనీకాంత్, పోలెపల్లి రాంమూర్తి, బుద్దె వెంకన్న, చిర్ర రాజుగౌడ్, కాసగాని అశోక్‌గౌడ్, బీమగాని యాదగిరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డంగా బుక్కైన అదనపు కలెక్టర్

(5వ పేజీ తరువాయి)

చిక్కారు. ఈ సంఘటన ఉద్యోగ వర్గాల్లో తీవ్ర సంచలనం సృష్టించింది. కలెక్టర్ తర్వాత స్థానంలో ఉన్న ఉన్నతాధికారి అడ్డంగా బుక్కయిపోవడం కలకలం రేపింది. ఏసీబీ అధికారుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి... హనుమకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్‌గా ఎ.వెంకట్ రెడ్డి పని చేస్తున్నారు. ఆయన జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో)గా అదనపు బాధ్యతలు కూడా నిర్వర్తిస్తున్నారు. హనుమకొండ కొత్తూరు జెండాలోని క్రియేటివ్ పాఠశాల కరస్పాండెంట్ పాశికంటి సతీష్‌కుమార్ తన పాఠశాల అనుమతుల రెన్యూవల్ కోసం నెల రోజులుగా డీఈవో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు. కార్యాలయంలో సెక్షన్ క్లర్క్‌లుగా విధులు నిర్వర్తిస్తున్న జూనియర్ అసిస్టెంట్‌లు మనోజ్, గౌస్‌లను సంప్రదించగా.. వారు ఇన్‌చార్జి డీఈవో వెంకట్‌రెడ్డితో మాట్లాడి రూ.లక్ష బేరం సెట్ చేశారు. రెన్యూవల్ అనుమతులు ఇవ్వాలంటే రూ.లక్ష ఇవ్వాలని కరస్పాండెంట్ సతీష్‌కుమార్‌పై ఒత్తిడి తీసుకుచ్చారు. తాను అంత ఇచ్చుకోలేనని సతీష్ కుమార్ తెలుపగా, చివరకు రూ.60వేలు ఫైనల్ చేశారు. అయితే వారి వేధింపులతో విసిగిపోయిన ఆయన ఏసీబీ అధికారులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. వారు పూర్తి విచారణ జరిపి లంచం వేధింపులు నిజమేనని నిర్ధారణకు వచ్చారు.

ఈ క్రమంలో లంచగొండులను పట్టుకునేందుకు పక్కా స్కెచ్ వేశారు. వారి సూచన మేరకు సతీశ్‌కుమార్ శుక్రవారం డీఈవో కార్యాలయానికి వెళ్లి జూనియర్ అసిస్టెంట్లు మనోజ్, గౌస్‌లను కలిసి లంచం డబ్బులు తీసుకువచ్చినట్టు తెలిపాడు. అయితే వారు.. 'ఇక్కడ కాదు, సారు కలెక్టరేట్‌లో వున్నారు.. అక్కడే తీసుకుంటాం..' అని తెలిపారు. అనంతరం తమ తోపాటే సతీశ్‌ను వారు కలెక్టరేట్‌కు తీసుకువెళ్లారు. అక్కడ సతీశ్ నుంచి రూ.60వేలు తీసుకొని అదనపు కలెక్టర్ చాంబర్‌లోకి వెళ్లి, నగదు అప్పగిస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ముగ్గురినీ అదుపులోకి తీసుకున్నారు. కాగా, వరంగల్ రేంజ్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య ఆధ్వర్యంలో విచారణ జరిపారు. ముగ్గురినీ ఏసీబీ కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించనున్నట్లు అధికారులు వెల్లడించారు. కలెక్టర్ చాంబర్ ఎదురుగా వున్న చాంబర్ వద్ద ఏసీబీ ఆపరేషన్ జరగడం చర్చనీయాంశంగా మారింది.



సభా వేదికపై సీఎంకు నాగలి బహుకరిస్తున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



బహిరంగ సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

హోరెత్తిన సీఎం సభ

ఘన స్వాగతం పలికిన కాంగ్రెస్ నేతలు

- భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు, జనం
- గంటన్నర పాటు ట్రాఫిక్ జామ్
- బీజేపీ నాయకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

నర్సంపేట టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నర్సంపేట పర్యటనతో కార్యకర్తల్లో జోష్ వచ్చింది. సభకు భారీ ఎత్తున జనం తరలివచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నంత సేపు సభలో జనం కేకలు మిన్నంటాయి. చాకలి ఐలమ్మ, కాకతీయులు, దొడ్డి కొమురయ్య, రుద్రమదేవి లాంటి పోరాట వీరులను సీఎం గుర్తుచేస్తూ కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపారు. సభకు నర్సంపేట నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున జనం రావడంతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది.

ఘన స్వాగతం

సీఎం రేవంత్‌రెడ్డికి శుక్రవారం నర్సంపేటలో కాంగ్రెస్ నేతలు ఘన స్వాగతం పలికారు. హెలికాప్టర్ దిగగానే ముందుగా మంత్రులు సీతక్క, కొండా సురేఖ, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పుష్పగుచ్ఛాలు అందజేశారు. అనంతరం జిల్లా అధికార యంత్రాంగం స్వాగతం పలికింది. హెలికాప్టర్‌లో సీఎంతో పాటు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎం ముఖ్య సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి వచ్చారు.

భారీ బందోబస్తు..

సీఎం పర్యటన సందర్భంగా వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పాకాల రోడ్డులోని మెడికల్ కళాశాల ఎదురు నుంచి వరంగల్ రోడ్డు గిర్నిబావి వరకు , అదేవిధంగా మహబూబాబాద్ రోడ్డుకు ఖానాపూర్ మండలం బుధరావుపేట వరకు పోలీసులు అడుగడుగునా పహారా కాశారు. మల్లంపల్లి రూట్‌లో నర్సంపేట రహదారి నుంచి నల్లెబెల్లి వరకు బందోబస్తు నిర్వహించారు. అరగంటకో సారి పెట్రోలింగ్ నిర్వహించారు.

బీజేపీ కార్యకర్తల ఆందోళన

సీఎం రేవంత్‌రెడ్డి హిందువుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు క్షమాపణలు చెప్పిన తర్వాతే నర్సంపేటకు రావాలని బీజేపీ నాయకులు ఆం దోళన చేపట్టారు. సీఎం రాక ముందు నర్సంపేట ప్రధాన రహదారిపై బైఠాయించారు. దీంతో సీఎం సభకు వెళ్లే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకుల వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు ప్లకార్డులు చేతపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు, బీజేపీ నాయకుల మధ్య తోపులాట జరిగింది. అనంతరం బీజేపీ నాయకులను పోలీస్‌స్టేషన్‌కు తరలించి సొంత పూచికత్తుపై విడుదల చేశారు.


సీఎంకు స్వాగతం పలుకుతున్న అర్చకులు

గంటన్నర పాటు ట్రాఫిక్ జామ్

నర్సంపేటలోని పాకాల రోడ్డు నుంచి అంబేద్కర్ సెంటర్, వరంగల్ రోడ్డు వరకు సుమారు గంటన్నర పాటు ట్రాఫిక్ జామ్ అయింది. ఎటు చూసినా ప్రజలు, నాయకులు, కార్యకర్తల వాహనాలు రద్దీ ఉండడంతో పోలీసులు కష్టపడి ట్రాఫిక్‌ను నియంత్రణలోకి తెచ్చారు. మహబూబాబాద్ వెళ్లే వాహనాలను మార్కెట్ బైపాస్ నుంచి ఖానాపురం రోడ్డు వరకు మళ్లించారు. భారీ ఎత్తున జనం తరలిరావడంతో వాహదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. సభలో మహిళలకు తాగునీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడ్డారు.


ఎమ్మెల్యే దొంతి కుర్చీని తనవైపు లాక్కుంటున్న సీఎం

పర్యటన ఇలా సాగింది..

- సీఎం రేవంత్‌రెడ్డి 3.30 గంటలకు నర్సంపేట మెడికల్ సమీపంలో హెలికాప్టర్‌లో దిగారు.
- ప్రత్యేక కాన్వాయ్‌లో 3.40 గంటలకు సభా స్థలి వద్దకు చేరుకున్నారు.
- 3.45 గంటలకు సభావేదిక పక్కన వర్చువల్‌గా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.
- ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి 3.50 గంటలకు శాలువా కప్పి ముఖ్యమంత్రిని సభా స్థలికి ఆహ్వానించారు.
- సభ నుంచి 5.03 గంటలకు సీఎం హెలిప్యాడ్ వద్దకు బయలుదేరాడు.
- 5.12 గంటలకు హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కి తిరుగు పయనమయ్యారు.


రిమోట్ ద్వారా శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్న సీఎం

మాది చేతల ప్రభుత్వం

- విడతలవారీగా సంక్షేమ పథకాల అమలు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి


ఎమ్మెల్యే దొంతి, ఎంపీ బలరాంతో కలిసి సీఎం అభివాదం

నర్సంపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గత పదేళ్ల రాష్ట్రాన్ని పాలించిన ప్రభుత్వం మాదిరిగా త తమది మాటల ప్రభుత్వం కాదని.. చేతల ప్రభుత్వమని గృహ నిర్మాణ శాఖ, సమాచార శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నర్సంపేట పట్టణం వైద్య కళాశాల సమీపంలో నర్సంపేట ఎమ్మె ల్యే దొంతి మాధవరెడ్డి అధ్యక్షతన సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి పాల్గొన్న సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆర్థిక పరిస్థితులు సహకరించకున్నా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అంచలంచెలుగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. పేదలకు అండదండగా ఉంటూ వారి సంక్షేమం కోసం, రాష్ట్రాభివృద్ధి కోసం సీఎం రేవంత్‌రెడ్డి పాటుపడుతున్నారని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచ దేశాలతో పోటీపడేలా సీ ఎం కృషి చేస్తున్నారన్నారు.అభివృద్ధి మాటున సొమ్మును కొల్లగొట్టి మధ్యలో ఆగిన అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా తమ ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తుందన్నారు. అర్హులకు రేషన్‌కార్డులు, 200యూనిట్ల వరకు ఉచి త విద్యుత్, సన్నం బియ్యం, అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్ల అందించామన్నారు. గత ప్రభుత్వం ఇళ్ల ఇస్తే కమీషన్లు రావని కాళేశ్వరం కట్టారని మంత్రి పొంగులేటి అన్నారు. పేదలు ఆత్మగౌరవంతో ఉండాలని ప్రతి నియోజకవర్గానికి 3,500ఇళ్ల చొప్పున రాష్ట్రం లో నాలుగు లక్షల ఇళ్లు మంజూరు చేశామన్నారు. విడతల వారీగా అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేస్తామన్నారు. నర్సంపేట సభకు లక్ష మంది వచ్చి సీఎం రేవంత్‌రెడ్డికిస్వాగతం పలకడం అభినందనీయమన్నారు. ఏ ఎన్నికలు జరిగినా ప్రజా ప్రభుత్వాన్ని మహిళలు, ప్రజలు దీవించాలని మంత్రి శ్రీనివాస్‌రెడ్డి కోరారు.

మరో 15ఏళ్లపాటు ఆయనే సీఎం: ఎంపీ బలరాం నాయక్

పదేళ్ల పాటు బీఆర్ఎస్ దుర్మార్గపు పాలన సాగిందని, భద్రాచలం రాములోరు.. యదగిరి నర్సింహస్వామి కృప వల్ల రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం వచ్చిందని ఎంపీ బలరాం నాయక్ అన్నారు. మరో 15ఏళ్లపాటు సీఎం రేవంత్‌రెడ్డి పాలన కొనసాగిస్తారన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ప్రజల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు.

నర్సంపేట అభివృద్ధికి నిధులివ్వండి: ఎమ్మెల్యే దొంతి

నర్సంపేట నియోజకవర్గ అభివృద్ధికి, సంక్షేమ కార్యక్రమాలకు అవసరమైన నిధులను మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సభా వేదికపై నుంచి కోరారు. బొటానికల్ సెంటర్, పాకాల పర్యాటక కేంద్రం ఏర్పాటు తదితర అభివృద్ధి పనుల కోసం రూ.1000కోట్లతో కూడిన ప్రాజెక్టు రిపోర్టును పరిశీలించి నిధులు అందించాలని దొంతి కోరారు. ఇందుకు సీఎం స్పందిస్తూ దొంతి బలంగా ఉంటే తాను బలంగా ఉంటానని తన ప్రసంగంలో పేర్కొన్నారు.



నర్సంపేటలో శుక్రవారం ప్రజాపాలన విజయోత్సవ సభకు హాజరైన వైద్య విద్యార్థులు, పార్టీ శ్రేణులు, జనం

నిబంధనలు ఉల్లంఘిస్తే కొరడా

- బీఎన్ఎస్‌తో పాటు పంచాయతీరాజ్ చట్టంలో 'కోడ్' సెక్షన్లు
- జరిమానా, జైలు శిక్షలతో కఠినంగా చట్టాలు

కేసముద్రం, డిసెంబరు 5, (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల నియామవళిని ఉల్లంఘిస్తే చర్యలు తీసుకునేందుకు భారత న్యాయ సంహిత (బీఎన్ఎస్)తో పాటు తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం-2018లో సెక్షన్లను రూపొందించారు. బీఎన్ఎస్‌లో 169 నుంచి 177 వరకు సెక్షన్లు ఉండగా పంచాయతీరాజ్ చట్టంలో 212 నుంచి 219 సెక్షన్లు పొందుపర్చారు. బీఎన్ఎస్ 163 (సీఆర్‌పీసీ 144) చట్టాన్ని ఎన్నికలు నిర్వహించే ప్రాంతాల్లో ప్రభుత్వం అమలు చేస్తుంది. ఇందులో భాగంగా నలుగురికన్నా ఎక్కువ మంది ఒకేచోట గుమికూడి ఉండవద్దు. అనుమతి లేకుండా ర్యాలీలు, సమావేశాలు, ప్రచారం నిర్వహించడం, ఆయుధాలతో తిరగడంపై నిషేధం అమలులో ఉంటుంది. బీఎన్ఎస్ 169 అభ్యర్థి, ఓటు హక్కు పదాలను నిర్వచిస్తుంది. 170 సెక్షన్ ప్రకారం ఎవరైనా ఓటరు, అభ్యర్థి డబ్బులు, బహుమతి, ఇతర వస్తువులను ఓటుహక్కు వాడుకునేందుకు ఇవ్వడం, తీసుకోవడం ప్రలోభపెట్టడాన్ని నేరంగా పరిగణిస్తారు.

171 సెక్షన్‌ను ఓటరును, అభ్యర్థిని మతపరంగా అనేక రకాలుగా బెదిరిస్తూ ఒత్తిడి తీసుకువస్తే చర్యలు తీసుకుంటారు. 172 ప్రకారం ఒక వ్యక్తికి బదులుగా మరొకరు ఓటు వేయడం, చనిపోయిన వ్యక్తి పేరిట ఓటువేసి మోసం చేయడాన్ని నేరంగా నమోదు చేస్తారు. 173 ద్వారా లంచం ఇచ్చిన వ్యక్తికి ఒక సంవత్సరం జైలు లేదా జరిమానాని విధించడాన్ని సూచిస్తుంది. 174 ప్రకారం 171, 172 సెక్షన్ల నేరాలు చేసిన వారికి ఒక సంవత్సరం జైలు లేదా జరిమానా లేక రెండు విధించే అవకాశం ఉంది. 175లో అభ్యర్థి వ్యక్తిత్వంపై ఫలితాన్ని ప్రభావితం చేయాలనే ఉద్దేశంతో తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తే చర్యలు తీసుకునే అవకాశం ఉంది. 176 సెక్షన్ ప్రకారం అభ్యర్థి అనుమతి లేకుండా బహిరంగ సభ, హోర్డింగుల ద్వారా ప్రచారం, ప్రకటనలు, ఖర్చు చేయడాన్ని నేరంగా పరిగణిస్తారు. 177లో ఎన్నికల ఖర్చులకు సంబంధించిన వివరాలు సరిగా ఇవ్వకపోతే కేసు నమోదు చేసి రూ.5వేల జరిమానా విధిస్తారు.



పంచాయతీరాజ్ చట్టంలోను ఎన్నికల సెక్షన్లు..

బీఎన్ఎస్‌తో పాటు తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం-2018లోను ఎన్నికల నియామవళి ఉల్లంఘనకు చర్యలు తీసుకునేందుకు 212 నుంచి 219 వరకు సెక్షన్లు ఏర్పాటు చేశారు. సెక్షన్ 212 ప్రకారం ఎన్నికల్లో చట్ట విరుద్ధంగా వాహనాలు అద్దెకు తీసుకోవడం, సెక్షన్ 213 ఎన్నికల సందర్భంగా వర్గాల మధ్య వైషమ్యాలు పెంచే విధంగా ప్రోత్సహించడాన్ని నేరంగా పరిగణిస్తారు. 214 సెక్షన్ ప్రకారం పోలింగ్ తేదీకి ముందు సభలు, ప్రదర్శనలు, ర్యాలీలు, సమావేశాలను నిర్వహించడం, 215 సెక్షన్ ఎన్నికల ప్రచారంలో అల్లరి సృష్టించడం, 216లో అనుమతి లేకుండా కరపత్రాలు, పోస్టర్లు, తదితర ముద్రణలు, 217 సెక్షన్ ప్రకారం ఓటింగ్, కౌంటింగ్, లెక్కల గోప్యతను అధికారులు, సిబ్బంది కాపాడడంలో విఫలమైతే శిక్షార్హులవుతారు. 218 సెక్షన్ ఎన్నికల అధికారులు, సిబ్బంది అభ్యర్థుల తరఫున పనిచేయడం, ఓటింగ్‌ను ప్రభావితం చేస్తే చర్యలు తీసుకునేందుకు ఏర్పాటు చేశారు. 219 ప్రకారం పోలింగ్ స్టేషన్లలో, సమీపంలో వందమీటర్ల వరకు ఎన్నికల ప్రచారం నిర్వహించడం నేరంగా పరిగణిస్తారు. ఈ సెక్షన్లకు ఆయా నేరాలకు జరిమానాలు, మూడునెలల నుంచి మూడు సంవత్సరాల జైలు శిక్షలు విధించే అవకాశం ఉంది.

ఎక్కువ చోట్ల పోటీ చేయడం చెల్లదు

ఎన్నికల సంఘం అధికారులు

వరంగల్ కలెక్టరేట్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఒకటి కంటే ఎక్కువ స్థానాలకు నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థులకు ఎన్నికల సంఘం అధికారులు ముఖ్య సూచనలు చేస్తున్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థి రెండు చోట్ల పోటీ చేసే అవకాశం ఉంటుంది. కాని పంచాయతీ ఎన్నికల్లో ఈ నిబంధనలు వర్తించవు. ఇది తెలియక కొంతమంది రెండు వార్డులకు, లేదా సర్పంచ్-వార్డు సభ్యుడిగా రెండింటికీ నామినేషన్లు వేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు, పంచాయతీ ఎన్నికలకు, పార్లమెంట్ లేదా శాసనసభ ఎన్నికలకు మధ్య స్పష్టమైన చట్టపరమైన తేడా ఉంది. ఈ తేడాను గమనించకపోవడం వల్ల అనేక మంది అభ్యర్థులు తీవ్రంగా నష్టపోయిన సంఘటనలు ఉన్నట్లు అధికారులు గుర్తు చేస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొంతమంది అభ్యర్థులు రెండు వార్డులకు లేదా ఒక వార్డుకు, సర్పంచ్ పదవికి ఏకకాలంలో నామినేషన్లు సమర్పించినట్లు ఎన్నికల అధికారుల దృష్టికి వచ్చింది. ఇటువంటి సందర్భంలో నామినేషన్ల ఉపసంహరణకు కేటాయించిన చివరి రోజున అభ్యర్థి తాను పోటీ చేయాలనుకున్న ఒక స్థానాన్ని తప్ప మిగతా వాటిని ఉపసంహరించుకోవాలి. లేదంటే వారి అభ్యర్థిత్వం అన్ని స్థానాల్లోనూ రద్దవుతుంది. దీనివల్ల మొదటికే మోసం వస్తుంది. చివరికి ఏ స్థానంలోనూ పోటీ చేసేందుకు అవకాశం ఉండదు. అందువల్ల నామినేషన్ వేసిన అభ్యర్థులు తమ పత్రాల పరిశీలన పూర్తయ్యాక తాము ఒక్క స్థానంలో మాత్రమే పోటీలో ఉన్నామని నిర్ధారించుకోవాలని ఎన్నికల అధికారులు సూచిస్తున్నారు.


మంత్రి కొండా సురేఖకు ఆహ్వాన పత్రం అందిస్తున్న పెరిక సంఘం ప్రతినిధులు

'పెరిక' సమావేశానికి రండి..

మంత్రి కొండా సురేఖను ఆహ్వానించిన సంఘం ప్రతినిధులు

వరంగల్ సిటీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈనెల 7న వరంగల్ ఎంకెనాయకుడు కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించే పెరిక కుల వరంగల్ జిల్లా సర్వసభ్య సమావేశానికి హాజరు కావాలని రాష్ట్ర అటవీ, దేవాదాయ, పర్యావరణశాఖ మంత్రి కొండా సురేఖను సంఘం ప్రతినిధులు ఆహ్వానించారు. ఈ మేరకు శుక్రవారం ఆమె నివాసంలో కలిసి ఆహ్వాన పత్రం అందించారు. అదే రోజు పెరికకుల వెబ్ సైట్‌ను ప్రారంభించాలని కోరారు. ఈ సమావేశానికి పెరిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గటిక విజయ్‌కుమార్, గౌరవ అధ్యక్షుడు ముద్దా లింగయ్య, ముఖ్య సలహాదారు, మాజీ ఎమ్మెల్యే శ్రీరాం భద్రయ్య తదితరులు హాజరవుతారని, ఈ సందర్భంగా జిల్లా కమిటీని ఎన్నుకుంటామని మంత్రికి వివరించారు. మంత్రిని కలిసినవారిలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కీత విజయ్‌కుమార్, నాయకులు బరుపాటి సంపత్‌కుమార్, అల్లం రాజేష్‌వర్మ, వనపర్తి శ్రీనివాస్, బెడిద వీరన్న, ఏసిరెడ్డి ప్రభాకర్, అంకతి అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందలో యువ రైతు ఆత్మహత్య

అప్పుల బాధతో మనస్తాపం


రాకేష్ (ఫైల్)

వర్ధన్నపేట రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పదెకరాలు కౌలుకు తీసుకుని వరి పంట వేస్తే అకాల వర్షానికి చేతికందక మనస్తాపం చెంది ఓ యువరైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామానికి చెందిన మైదం రాములు-రమ దంపతుల కుమారుడు మైదం రాకేష్(28) అవివాహితుడు. ఇంటివద్దే ఉంటూ తమకున్న 2 ఎకరాలతో పాటు పక్కనే ఉన్న 10 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. అప్పు చేసి రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టి వరి పంట వేశాడు. పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షంతో నేలకొరిగింది. దీంతో తీవ్ర మనస్తాపం చెంది ఈ నెల 4న పురుగుల మందు తాగి ఇల్లంద శివారులో అపస్మారక స్థితిలో పడిపోయాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు వెంటనే వరంగల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం రాకేష్ మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. బాధిత కుటుంబాన్ని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ పరామర్శించారు.

(5వ పేజీ తరువాయి)

రాష్ట్రంలో రెండేళ్ళ ప్రజాపాలన పూర్తి చేసుకున్నామన్నారు. బీఆర్ఎస్ పార్టీ పదేళ్ల పాలనలో డబ్బులు సంపాదించుకున్నారే తప్ప ప్రజల జీవన ప్రమాణాలు మారలేదన్నారు. రాష్ట్రంలో కోటి 56 లక్షల మె ట్రిక్ టన్నుల వరి సాగు చేసి పంజాబ్, హర్యానా రాష్ట్రాలను అధిగమించామన్నారు. ఇందిరమ్మ ప్రజాపాలనలో చివరి గింజ వరకు ధాన్యాన్ని మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ అందించి కొనుగోలు చేస్తామన్నారు.

రైతు భరోసా కింద కోటి 50లక్షల మందికి రూ.9వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. రూ.2లక్షలచొప్పున 25 లక్షల 35 వేల మంది రైతులకు రూ.20,6014 కోట్లు రుణమాఫీ చేశామన్నారు. ఎన్నికల ముందుఇచ్చిన మాటలను నిలుపుకున్నామన్నారు.

హైదరాబాద్ తరహాలో వరంగల్ అభివృద్ధి

మహిళలను కోటీశ్వరులను చేస్తాం..

రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరుల చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మహిళలను ఆర్టీసీ బస్సుల యజమానులను చేస్తున్నామని, వారికే పెట్రోల్ బంకుల నిర్వాహణ, సౌర విద్యుత్ ఏర్పాటు బాధ్యలను అప్పగిస్తున్నామని అన్నారు. 65 లక్షల మంది ఆడబిడ్డలకు చీరలను అందించామని, త్వరలో మరో 25 లక్షల చీరలను అందిస్తామని అన్నారు. చీఫ్ సెక్రటరీ, జిల్లా కలెక్టర్‌లకు ఆడపడుచులకు చీరలందించే బాధ్యతలను అప్పగిస్తున్నామన్నారు. రాష్ట్రంలో కోటి 10లక్షల మందికి రేషకార్డులు అందించి సన్న బియ్యం అందిస్తున్నామన్నారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేశామని నియోజకవర్గానికి 3వేల 500 చొప్పున ఇళ్ల మంజూరి చేశామన్నారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి కోరిక మేరకు నర్సంపేటకు మరో 3వేల నుంచి 3500 ఇళ్ల మంజూరి చేస్తామని, ఈ బాధ్యతను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్కను అప్పగిస్తున్నానని సీఎం అన్నారు.

చదువు తలరాతను మారుస్తుంది..

చదువు విద్యార్థుల తలరాతలను మారుస్తుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. దళిత, గిరిజన మైనారిటీ, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు చదువుకుంటే ఐఎఎస్, ఐపీఎస్, డాక్టర్ తదితర ఉద్యోగాలతో జీవితంలో స్థిరపడతారని అన్నారు. 61వేల 379 ఉద్యోగాలను భర్తీ చేశామని, మరో 40వేల ఉద్యోగాల భర్తీకి ప్రయత్నాలు చేస్తున్నామని అన్నారు. సీఎం సభలో నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ బలరాంనాయక్, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, మంత్రులు కొండా సురేఖ, సీతక్క, వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ, నాగరాజు, మురళీనాయక్, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య తదితర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాములను తనిఖీ చేసిన కలెక్టర్

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులోని జిల్లా వేర్‌హౌస్ గోదాములలో భద్రపరిచిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషిన్ల (ఈవీఎం)లను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డితో కలిసి శుక్రవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మూడెళ్లకోసారి నిర్వహించే సాధారణ తనిఖీలలో భాగంగా ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులోని జిల్లాకు సంబంధించి స్ట్రాంగ్ రూంలను భద్రపరిచిన ఈవీఎంలను పరిశీలించారు. ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూం గోదాంలకు సంబంధించిన రికార్డులు, కట్టుదిట్టమైన భద్రత చర్యలు, సీసీ కెమెరాల పర్యవేక్షణ గురించి వివరాలను ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.



ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ స్నేహ శబరీష్



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న వల్లంపట్ల నాగేశ్వర్‌రావు

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

మడికొండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాజీపేట మండలం కుమ్మరి గూడెం మాజీ సర్పంచ్ ప్రముఖ సామాజిక వేత్త నల్లమారి రమేష్ తల్లి లక్ష్మిజన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం గ్రామంలోని వృద్ధులు, అనాథలకు దుప్పట్లను పంపిణీ చేశారు. ప్రముఖ రచయిత, జాతీయ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వల్లంపట్ల నాగేశ్వర్‌రావు చేతుల మీదుగా దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఐసీడీఎస్ ఆఫీసర్ జయంతి, సీడీపీవో విశ్వజ, మాజీ సర్పంచ్ నల్లమారి రమేష్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

రేపు ఇందిరానగర్‌లో ఉచిత వైద్య శిబిరం

వడ్డెపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ రోడ్డులోని ఇందిరానగర్‌లోని ఒద్దిరాజు అపార్ట్‌మెంట్ ప్రాంగణంలో ఇందిరానగర్ డెవలప్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9గంటల నుంచి ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు కమిటీ ప్రధాన కార్యదర్శి తేళ్ల కిశోర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ డాక్టర్ల పర్యవేక్షణలో కంటి పరీక్షలు, డెంటల్, కిడ్నీ, కొలస్ట్రాల్, బోన్ డెన్సిటీ, సీబీపీ పరీక్షలను నిర్వహిస్తారని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేలల సంరక్షణ మనందరి బాధ్యత

హసన్‌పర్తి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నేలల సంరక్షణ మనందరి బాధ్యత అని వరంగల్ ప్రాంతీయ పరిశోధనా స్థానం డైరెక్టర్ ఆర్.ఉమారెడ్డి అన్నారు. మండలంలోని అనంతసాగర్ ఎస్సార్ విశ్వవిద్యాలయం వ్యవసాయ కళాశాలలో ప్రపంచ నేలల దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఎస్సార్ విశ్వవిద్యాలయం వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ జి.భూపాల్‌రాజ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి డాక్టర్ ఉమారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నేలల ఆరోగ్య సంరక్షణకు, నేలల సామర్థ్యానికి పంటల అవశేషాలు ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో నేలల విభాగం అధ్యాపకులు డాక్టర్ వైభవ్, డాక్టర్ రవళి, లక్ష్మీప్రసన్న, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వరంగల్ డాక్టర్ ఉమారెడ్డి

వేణుగోపాల్ సేవలు అభినందనీయం

న్యూశాయంపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బెస్ట్ సిటిజన్ అవార్డు గ్రహీత, న్యూశాయంపేటకు చెందిన సమాజ సేవకుడు వేల్పుల వేణుగోపాల్ చేస్తున్న సేవలు అభినందనీయమని 31వ డివిజన్ కార్పొరేటర్ మామిండ్ల రాజు యాదవ్ కొనియాడారు. ప్రజాసేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం న్యూశాయంపేటలోవేల్పుల వేణుగోపాల్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేణుగోపాల్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన వారికి కార్పొరేటర్ రాజు, వేణుగోపాల్ సర్టిఫికెట్‌లను పంపిణీ చేశారు. అనంతరం సుర్జిత్‌నగర్ పేదలకు భోజనం పంపిణీ చేశారు.



రక్తదానం చేసిన వ్యక్తికి సర్టిఫికెట్ ఇస్తున్న కార్పొరేటర్ రాజు, వేణుగోపాల్

కుక్కల దాడిలో గొర్రెల మృతి

రెడ్డికాలనీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కుక్కల దాడిలో గొర్రెలు మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. 4వ డివిజన్‌లోని యాదవనగర్‌లో వీధికుక్కల దాడిలో సుమారు 18 గొర్రెలు మృతి చెందాయి. గొర్రెల యజమాని రాజయ్య యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇంటి ఆవరణలో ఉన్న గొర్రెల మందలో చొరబడిన వీధి కుక్కలు గొర్రెలపై దాడి చేశాయి. గమనించిన యజమాని రాజయ్య యాదవ్ కుక్కలను తరిమికొట్టగా అప్పటికే గొర్రెలు మృతి చెందాయి.

వర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులర్ చేయాలి

కేయూ క్యాంపస్ డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 12వర్సిటీల్లో 1365 మంది కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని రాష్ట్ర ఆల్ వర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ అసోషియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌కుమార్‌లోథ్ డిమాండ్ చేశారు. శుక్రవారం జరిగిన కాంట్రాక్టు అధ్యాపకుల సమావేశంలో శ్రీధర్‌లోథ్ మాట్లాడారు. ఈ నెల7న ఉస్మానియా వర్సిటీలో సీఎం రేవంత్‌రెడ్డితో జరిగే సమావేశంలో తమను రెగ్యులర్ చేస్తామని ప్రకటించాలని అన్నారు. అలాగే 7వ వేతన ఒప్పందం మేరకు బేసిక్‌పే, డీఏ, హెచ్‌ఆర్‌ఏ ఇవ్వాలని అన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ దామెర భిక్షపతి, డాక్టర్ పుల్లా రమేశ్, సతీశ్, బ్రహ్మయ్య, సాయి చరణ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీధర్‌కుమార్‌లోథ్

కేయూ, ఓయూ విద్యార్థుల అరెస్టు అక్రమం

మానవ హక్కుల వేదిక ఖండన

హనుమకొండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మారేడుమిల్లి ఎన్‌కౌంటర్‌పై నిజనిర్ధారణకు వెళ్లిన కాకతీయ, ఉస్మానియా వర్సిటీల విద్యార్థులను నిర్బంధించడాన్ని మానవ హక్కుల వేదిక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు కేవీ జగన్నాథరావు, కార్య దర్శి వై.రాజేశ్ ఒక ప్రకటనలో ఖండించారు. వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం కాకతీయ, ఉస్మానియా విశ్వవిద్యాలయాల విద్యార్థుల బృం దం గత నెల మారేడుమిల్లిలో జరిగిన ఎన్‌కౌంటర్‌పై నిజ నిర్ధారణ కోసం అక్కడికి వెళ్లగా, ఆంధ్రప్రదేశ్ పోలీసులు వారిని ఉదయం అక్రమంగా నిర్బంధించడం అన్యాయమని పేర్కొన్నారు. 12 మంది విద్యార్థులు, జీప్ డ్రైవర్, వారికి సహాయంగా వచ్చిన ఒక ఆదివాసీ యువకుడు మొత్తం 14 మందిని ఎటువంటి కారణం లేకుండా అడ్డగించి అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు పోలీసుస్టేషన్‌కు తరలించి నిర్బంధించారని తెలిపారు. ఇది రాజ్యాంగబద్ధ హక్కులను కాలరాయడమేనని, ఈ విద్యార్థులను వెంటనే బేషరతుగా విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

నగర సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలి..

సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి

హనుమకొండ చౌరస్తా, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగరంలో అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఆ సమస్యల పరిష్కారం కోసం సమరశీల పోరాటాలు చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎం.శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారంహనుమకొండ రాంనగర్‌లోని సీపీఎం జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బొట్ల చక్రపాణి అధ్యక్షతన హనుమకొండ పట్టణ సమస్యలపై నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశంలో శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 2015లో స్మార్ట్ సిటీ పేరుతో 100నగరాలను అభివృద్ధి చేస్తామని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చి ఏళ్ల గడుస్తున్న నేటికీ ఎలాంటి అభివృద్ధి చేయలేదని ఎద్దేవా చేశారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు మున్సిపాలిటీ లకు ఇవ్వవలసిన గ్రాండ్లను సకాలంలో విడుదల చేయక పోవడమే కాకుండా విడుదలైన కొద్దిపాటి డబ్బులను పేదలు నివసించే ప్రాంతాల్లో కాకుండా ప్రధాన రహదారులు, కూడళ్లను అభివృద్ధి చేయడం ఎంత వరకు సమంజసమని ఆయన విమర్శించారు. మున్సిపాలిటీ పాలకవర్గం చెత్త, వాటర్, పేరుతో ప్రజలపైన భారాలు మోపుతున్నారని ఆయన మండిపడ్డారు. పేదలు నివసించే కాలనీలల్లో పట్టాలు ఇవ్వాలని, రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటుచేయడంతో పాటు హౌస్‌హోల్డర్ సమస్యను పరిష్కరించాలని శ్రీనివాస్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి జి.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో 35డివిజన్లలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధ్యయనం చేసి, ఆ సమస్యల పరిష్కారం కోసం ఇదే నెలలో ఉద్యమం చేయడానికి పార్టీ శ్రేణులు, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. సమస్యలతో బాధపడుతున్న ప్రజలంతా పార్టీ నాయకత్వంలో జరిగే పోరాటాల్లో భాగస్వాములు కావాలని ప్రభాకర్‌రెడ్డి కోరారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.చుక్కయ్య, రమేష్, జిల్లా కమిటీ సభ్యులు ఉప్పలయ్య, గొడుగు వెంకట్, వాంకుడోతు వీరన్న, గుమ్మడి రాజులు, మంద సంపత్, దీప, ఎం.రమాదేవి, ఇంజపెల్లి రాజు, మల్లేశం, కారు ఉపేందర్, రవి, పుల్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

లాటా కార్యవర్గ సభ్యుడిగా ప్రుధ్వీష్



నయీంనగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అమెరికాలోని లాస్ ఏంజెల్స్ తెలుగు అసోసియేషన్ (లాటా) కార్యవర్గ సభ్యుడిగా హనుమకొండకు చెందిన కాసుల ప్రుధ్వీష్ ఎన్నికయ్యారు. లాటా సభ్యుల మద్దతుతో ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆయనకు ఈ పదవి దక్కింది. ఈ సందర్భంగా ప్రుధ్వీష్ మాట్లాడుతూ..తెలుగు సమాజసేవ, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణలో తనవంతు సేవలందిచానని చెప్పారు. విదేశాల్లో తెలుగు సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు తోడుగా యువత, భవిత అభివృద్ధి దిశగా లాటా సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలను మరింత విస్తరించేందుకు తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రుధ్వీష్ విజయం పట్ల లాటా బాధ్యులు, ఓరుగల్లుకు చెందిన సుపరిచితులు అభినందనలు తెలిపారు.

మోషన్ టాలెంట్ టెస్టు టాపర్లకు అవార్డ్స్ అందజేత

హనుమకొండ టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని మోషన్ టాలెంట్ టెస్టులో ఉత్తమ ప్రతిభ కనబర్చిన టాప్ 10 మంది విద్యార్థులకు అవార్డులు అందజేసినట్లు మోషన్ కాలేజీ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సన్మానించి అవార్డులను అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోషన్ కాలేజీ మొదటి బ్యాచ్‌లోనే అనేక మంది విద్యార్థులు మెడికల్ సీటు సాధించారని తెలిపారు. సీనియర్ అధ్యాపకులు కోట మెటీరియల్ అందివ్వడంతో ఉత్తమ ఫలితాలు వస్తున్నాయని తెలిపారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి ఫీజులో 40శాతం రాయితిని వినయోగించుకోవాలన్నారు. అడ్మిషన్స్, ఇతర వివరాల కోసం సెల్ నంబర్ : 9703000850 / 851/ 852లలో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మోషన్ కాలేజీ ప్రిన్సిపాల్ ముత్యాల శ్రీనివాస్, కోట అధ్యాపకులు అనూప్‌కుమార్, సురేందర్‌సాహి, మితున్, పాటక్, కాలేజీ సిబ్బంది రాజు, లక్ష్మణ్, మౌనిక, ఉమ తదితరులు పాల్గొన్నారు.



మోషన్ టాలెంట్ టెస్టు టాపర్లకు అవార్డ్స్ అందిస్తున్న చైర్మన్ వేణుగోపాల్ గౌడ్

జూడో క్రీడాకారిణికి ఆర్థిక సహాయం

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మణిపూర్ రాష్ట్రంలోని ఇంపాల్‌లో జరిగే జాతీయస్థాయి జూడో పోటీలకు ఎంపికైన వరంగల్ క్రీడాకారిణి బి.స్పందనకు కుడా చైర్మెన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి ఆర్థిక సహాయం అందించారు. శుక్రవారం హనుమకొండలోని తన నివాసంలో స్పందనను పిలిచి రూ. 20వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ.. ప్రతిభకు పేదరికం అడ్డుకాదని అన్నారు. జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి జిల్లా కీర్తిని చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జూడో అసోసియేషన్ అధ్యక్షుడు కైలాసం యాదవ్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సంతోష్‌కుమార్, టెక్నికల్ కౌన్సిల్ కార్యదర్శి నాగరాజు, సభ్యులు సుధాకర్ పాల్గొన్నారు.



జూడో క్రీడాకారిణికి ఆర్థిక సహాయం అందిస్తున్న వెంకట్రాంరెడ్డి

బీజేపీలో చేరిన రిటైర్డ్ డీఈ పేరం గోపికృష్ణ

రాంనగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లికి చెందిన రిటైర్డ్ డీఈ పేరం గోపీకృష్ణ శుక్రవారం హైదరాబాద్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. ఇరిగేషన్‌శాఖలో డీఈగా విధులు నిర్వర్తిస్తున్న గోపికృష్ణ ఇటీవలే రాజకీయాలపై ఆసక్తితో ఉద్యోగానికి వలంటరీ రాజీనామా చేసి బీజేపీ పార్టీలో చేరాడు. ఈ సందర్భంగా గోపికృష్ణకు జిల్లా అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపి పార్టీ బలోపేతానికి కృషిచేయాలని సూచించారు.



గోపికృష్ణకు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న బీజేపీ చీఫ్ రాంచందర్‌రావు

వడ్డెపల్లి దళిత యూత్ అధ్యక్షుడిగా ప్రసన్న కుమార్

వడ్డెపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వడ్డెపల్లి దళిత యూత్ కమిటీ సమావేశం శుక్రవారం హనుమకొండ వడ్డెపల్లి చర్చి జంక్షన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వడ్డెపల్లి దళిత యూత్ అధ్యక్షుడిగా తాళ్లపల్లి ప్రసన్న కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఇమ్మడి సంజీవ్, కోశాధికారిగా తాళ్లపల్లి రాజ్‌కుమార్, గౌరవ అధ్యక్షుడిగా టి.యోబు ఎన్నికయ్యారు.

ఉపాధ్యక్షుడిగా నల్ల రవికిరణ్, జాయింట్ సెక్రటరీగా నల్ల ఇమ్మానియల్, అడ్వయిజర్లుగా ఇమ్మడి లోహిత రాజు, తాళ్లపల్లి విజయ్‌కుమార్, ఇల్లందుల భాస్కర్‌లను ఎన్నుకున్నారు.

డిజిటల్ యుగానికి అనుగుణంగా భారత చట్టాలు

తెలంగాణ లా సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ విజయలక్ష్మి

కేయూ క్యాంపస్ డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ యుగానికి అనుగుణంగా నూతన భారతీయ శిక్ష స్మృతి చట్టాలు రూపొందించారని ఓయూ న్యాయశాస్త్ర విభాగం, తెలంగాణ లా సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ బి.విజయలక్ష్మి చెప్పారు. శుక్రవారం సుబేదారిలోని యూనివర్సిటీ లా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నిమ్మ సుదర్శన్ అధ్యక్షతన భారత కొత్త క్రిమినల్ చట్టాలు,. భారతీయ న్యాయ సంహిత-2023 అనే అంశంపై విస్తృత ఉపన్యాసం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా విజయలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భారతీయ న్యాయ సంహిత ముఖ్య లక్షణాలను వివరించారు. నూతనంగా ప్రవేశపెట్టిన (ఐపీసీ)తో పోలిస్తే నూతన సెక్షన్లను క్షుణ్ణంగా పేర్కొన్నారు. నూతన చట్టాలు -నేరాలను నిర్వహించారు. కేయూలా డీన్ ప్రొఫెసర్ ఎం.శ్రీనివాస్, మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మజారాణి, మాజీ ప్రిన్సిపాల్ సుధాకర్, అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ బి.కిషన్, ఏఆర్ డాక్టర్‌కోలా శంకర్, అధ్యాపకులు హరిప్రసాద్, ఎడ్ల ప్రభాకర్, వేదశ్రీ, లక్ష్మణ్, స్కాలర్లు, విలద్యార్థులు పాల్గొన్నారు. సమావేశంలో విజయలక్ష్మిని శాలువు, పుష్పగుచ్ఛం అందచేసి ఘనంగా సన్మానిం చారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ విజయలక్ష్మి, సుదర్శన్ తదితరులు



54వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాయిని

ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తుంది

రాంనగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తోందని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం 6, 54వ డివిజన్‌లలో సుమారు రూ.4.26కోట్లతో నిర్మించబోయే తాగునీటి పైపులైన్, సీసీ డ్రైన్, సీసీరోడ్ల నిర్మాణ పనులకు స్థానికులతో కలిసి ఎమ్మెల్యే నాయిని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల నాటికి ఒక్క చుక్క వర్షపునీరు లేకుండా త్వరలోనే 1000కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయబోతున్నట్లు వెల్లడించారు. అదే విధంగా కిరాయి ఇండ్లలో ఉండే కుటుంబాలు దహన సంస్కారాలకు ఇబ్బందులు పడొద్దనే ఆలోచనతో పోచమ్మకుంట స్మశానవాటికలో ప్రత్యేక గదుల నిర్మాణం కోసం శంకుస్థాపన చేశామన్నారు. ఈ కార్యక్రమంలో 54వ డివిజన్ కార్పొరేటర్ గుంటి రజిత శ్రీనువాస్, 6వ డివిజన్ కార్పొరేటర్ చెన్నం మధు, స్థానికులు కూచన రవళి, సోదా రామకృష్ణ, శనిగరం విజయ్‌కుమార్, దారబోయిన సతీష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా నగరంలోని శనివారం న్యూశాయంపేట సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రకాశ్‌రెడ్డి పేట, గణేశ్‌నగర్ విల్లాస్ ఏరియా, జూలైవాడ ఏరియాలో ఉదయం 9 గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి తెలిపారు.

కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను హరిస్తే సహించం

ఏఐయూఈసీ జాతీయ ఉపాధ్యక్షుడు పుల్లా శ్రీనివాస్

కేయూ క్యాంపస్ డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ 29 చట్టాల రద్దు చేసిందని ఆల్ ఇండియా యూనివర్సిటీ ఉద్యోగుల సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ పుల్లా శ్రీనివాస్ ధ్వజమెత్తారు. శుక్రవారం కేయూలోని సాంకేతిక ఉద్యోగుల సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో పుల్లా శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. దేశంలో కార్మిక వర్గం సాధించుకున్న 29 కార్మిక సంక్షేమ చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రద్దు చేసిందని అన్నారు.

ట్రేడ్ యూనియన్, భవిష్యత్ నిధి, కనీస వేతన చట్టం, 8గంటల పనివేళలు, మాతృత్వ సెలవు, గ్రాట్యూటీ, ఈఎస్ఐ, ఫించన్ సౌకర్యాలను రద్దు చేసిందని అన్నారు. ఉద్యోగులు యాజమాన్యాల కనుసన్నల్లో పనిచేసే విధంగా చెప్పుచేతుల్లో పెట్టుకుందని అన్నారు. కేంద్రం కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దుకు వ్యతిరేకంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కుట్సా ప్రధాన కార్యదర్శి నలుబోలు రాము, వాలే నందయ్య, మెట్టు రవి, వై.ప్రేమ్‌సాగర్, వై.బాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పుల్లా శ్రీనివాస్



పోటీల్లో పాల్గొన్న దివ్యాంగ విద్యార్థులు

దివ్యాంగ విద్యార్థులకు ఆటల పోటీలు

ఐనవోలు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రపంచ వికలాంగుల దినోత్సవంలో భాగంగా శుక్రవారం ఐనవోలు పాఠశాలలో దివ్యాంగ విద్యార్థుల కు ఆటల పోటీలు నిర్వహించారు. విద్యార్థుల్లో సమానత్వం, సానుభూతి, వికలాంగుల, సామర్థ్యాలపై అవగాహన పెంపొందించేలా కార్యక్రమా లు రూపొందించినట్లు ఎంఈవో పులి ఆనందం, జిల్లా ఐఈ కోఆర్డినేటర్ బద్దం సుదర్శన్‌రెడ్డిలు తెలిపారు. చిత్రలేఖనం, వ్యాసరచన, ఎలక్యూషన్, క్విజ్ ఫన్ గేమ్స్‌ను నిర్వహించి ప్రతీ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటేశ్వర్ రావు, బీమల్ల సారయ్య, ఉపాధ్యాయులు లక్ష్మి, విజయ, ఐఆర్పీ భవన్‌కుమార్, వసంతలు పాల్గొన్నారు.

వేలేరు మండలంలో చింతలతండా, బండతండా ఏకగ్రీవం

వేలేరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వేలేరు మండలంలోని చింతలతండా, బండతండా గ్రామ పంచాయ తీలు ఏకగ్రీవ మైయ్యాయి. చింతలతండా సర్పంచ్‌గా మాలోత్ రాజు నాయక్, ఉపసర్పంచ్‌గా మాలోత్ భాస్కర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చింతలతండా సర్పంచ్ ఎస్టీకి కేటాయించారు. దీంతో మాలోతు రాజు ఒక్కరే సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేయడంతో రాజు ఏకగ్రీవం అయ్యారు. వీటితో పాటు ఎనిమిది మంది వార్డు అభ్యర్థులు కూడా ఏకగ్రీవమయ్యారు. రాజు, భాగ్య, లీలామ్మ, స్రవంతి, తిరుపతి, కవిత, సతీష్ ఏకగ్రీంగా ఎన్నిక అయ్యారు. గ్రామంలో మొత్తం 648 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 337మంది పురుషులు, 311 మంది మహిళలు ఉన్నారు. ఇదే మండలంలోని బండతండా గ్రామ పంచాయతీ ఎస్టీ మహిళకు కేటాయించగా సర్పంచ్‌గా మాలోత్ అరుణ ఒక్కరు మాత్రమే నామినేషన్ దాఖలు చేయడంతో సర్పంచ్‌గా అరుణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

గ్రామంలో ఆరు వార్డులు ఉండగా వార్డు సభ్యులు సైతం ఏకగ్రీవమైయే అవకాశం ఉందని సమాచారం. సర్పంచ్‌గా ఎన్నికైన అరుణ గ్రామ పంచాయతీ అభివృద్ధి కోసం రూ. లక్షతో పాటు గ్రామంలో హనుమాన్ దేవాలయ అభివృద్ధి కోసం తమ వంతు సాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిసింది.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
శనివారం • 6 డిసెంబరు 2025

మళ్లీ ధరిస్తే!

కొంతమంది విడిచిన దుస్తులను మళ్లీ మళ్లీ ధరిస్తూ ఉంటారు. ఇలా చేయడంవల్ల చర్మ వ్యాధులతోపాటు పలు అనారోగ్య సమస్యలు ఎదురవుతాయిని నిపుణులు చెబుతున్నారు.

- వేసవిలోనే కాదు ఏ కాలంలోనైనా శరీరానికి కొద్దిపాటి చెమట పడుతూ ఉంటుంది. శరీరం మీద ధరించిన దుస్తులు ఈ చెమటను పీల్చుకుంటాయి. ఇలాంటి దుస్తులను మాటిమాటికీ ధరిస్తూ ఉంటే వాటి మీద ఫంగస్‌లు, బ్యాక్టీరియాలు వృద్ధి పొందుతాయి. ఈ హానికారక క్రిములు చర్మం మీద చేరి దద్దుర్లు, దురద, అలెర్జీలను కలిగిస్తాయి. కాబట్టి స్నానం చేసిన తరువాత..



శుభ్రంగా ఉతికి ఆరబెట్టిన దుస్తులను మాత్రమే ధరించాలి.
- కుటుంబ సభ్యులు కూడా.. ఒకరి దుస్తులను మరొకరు వేసుకోకపోవడమే మంచిది. దుస్తుల వల్లే అంటు వ్యాధులు, చర్మ సమస్యలు ఎక్కువగా ప్రబలుతుంటాయి.
- పట్టు బట్టలు, జీన్స్, మందపాటి ప్యాంట్లు తదితరాలను కొద్దిసేపు మాత్రమే ధరించి విడిచినట్లయితే... వాటిని గాలి తగిలేలా ఆరబెట్టి మరోసారి ధరించవచ్చు. వదులుగా ఉండే దుస్తులను కూడా మరోసారి ప్రయత్నించవచ్చు. అలాగని రెండు లేదా మూడు సార్లకు మించి వేసుకోకూడదు.
- బిగుతుగా ఉండే దుస్తులు, ఇన్నర్ వేర్‌లను మరోసారి ధరించకూడదు.
- రోజంతా ధరించి ఉన్న వాటిని, గంటసేపు మాత్రమే ధరించినప్పటికీ ఎక్కువగా చెమట పట్టిన దుస్తులను మరోసారి వేసుకోకూడదు.
- రోజువారీ ధరించే టీ షర్టులు, టాప్స్, సల్వార్స్ తదితరాలు శరీరాన్ని అంటిపెట్టుకుని ఉంటాయి. వీటిని ఒకసారి ధరించిన తరువాత ఉతకకుండా మరోసారి వేసుకోకూడదు.
- జిమ్‌కు వెళ్లేటప్పుడు, వ్యాయామం చేసేటప్పుడు ధరించిన దుస్తుల మీద అధికంగా చెమట, శరీరం నుంచి వెలువడే టాక్సిన్లు చేరి ఉంటాయి. ఈ దుస్తులను కూడా ఉతకకుండా మరోసారి ధరించకూడదు.

వంటిల్లు



పచ్చి బొప్పాయిలో ఎన్నో పోషకాలు ఉంటాయి. ఇవి ఆరోగ్యాన్ని పెంపొందించడమే కాకుండా శరీరాన్ని దృఢంగా మారుస్తాయి. దీనితో పచ్చడి, కూర, పులుసు, హల్వా, సలాడ్ లాంటివి చేసుకుని తింటూ ఉంటాం. ఇవి కాక పచ్చి బొప్పాయితో సులువుగా తయారుచేసే విభిన్న వంటకాలు మీ కోసం...

పచ్చి బొప్పాయితో పసందుగా

థాలీపీట్

కావాల్సిన పదార్థాలు

పచ్చి బొప్పాయి తురుం- ఒకటిన్నర కప్పులు, బియ్యప్పిండి- రెండు కప్పులు, సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు- అర కప్పు, పచ్చి మిర్చి- మూడు, జీలకర్ర- ఒక చెంచా, కొత్తిమీర తరుగు- కొద్దిగా, నూనె- తగినంత, కరివేపాకు- రెండు రెమ్మలు, నువ్వులు- అర చెంచా, ఉప్పు- ఒక చెంచా, అల్లం తురుం- ఒక చెంచా, పచ్చి కొబ్బరి తురుం- పావు కప్పు



తయారీ విధానం

వెడల్పాటి గిన్నెలో పచ్చి బొప్పాయి తురుం, బియ్యప్పిండి, ఉల్లిపాయ ముక్కలు, పచ్చి మిర్చి ముక్కలు, నువ్వులు, జీలకర్ర, అల్లం తురుం, పచ్చి కొబ్బరి తురుం, కొత్తిమీర తరుగు, కరివేపాకు, ఉప్పు వేసి ముద్దలా కలపాలి. ఈ మిశ్రమాన్ని అయిదు నిమిషాలపాటు నాననివ్వాలి. స్టవ్ మీద పాన్ పెట్టి అర చెంచా నూనె రాసి వేడిచేయాలి. బట్టర్ పేపర్ మీద కొద్దిగా నూనె రాసి దాని మీద చిన్న పిండి ముద్దను పలుచగా పరచాలి. దీన్ని వేడెక్కిన పాన్ మీద వేసి చిన్న మంట మీద రెండు వైపులా ఎర్రగా వేయించి పళ్లెంలోకి తీయాలి. దీన్ని టమాటా సాస్, గ్రీన్ చట్నీలతో సర్వ్ చేసుకోవచ్చు.

పేఠా

కావాల్సిన పదార్థాలు

పచ్చి బొప్పాయి కాయలు- రెండు, కిళ్లీలో వాడే సున్నం- ఒక చెంచా, చక్కెర- మూడు కప్పులు



తయారీ విధానం

పచ్చి బొప్పాయి కాయలను శుభ్రంగా కడిగి తొక్క తీసి మధ్యకు కోయాలి. లోపలి గింజలను తీసివేసి మరోసారి శుభ్రంగా కడగాలి. వీటి మీద రెండు వైపులా ఫోర్క్‌తో రంధ్రాలు చేసి ఆపైన చిన్న ముక్కలుగా కోసి పెట్టుకోవాలి. పెద్ద గిన్నెలో సగానికి పైగా నీటిని తీసుకుని అందులో సున్నం వేసి కలపాలి. ఈ నీళ్లలో బొప్పాయి ముక్కలు వేసి అయిదుగంటలసేపు నానబెట్టాలి. తరువాత ఈ ముక్కలను మంచినీళ్లలో వేసి అయిదారుసార్లు కడగాలి. స్టవ్ మీద గిన్నె పెట్టి అందులో సగానికిపైగా నీళ్లు పోసి అరచెంచా ఉప్పు వేసి వేడిచేయాలి. అందులో బొప్పాయి ముక్కలు వేసి అవి మెత్తబడేవరకూ ఉడికించాలి. తరువాత స్టవ్ మీద నుంచి దించి నీళ్లు వంచేసి మరోసారి మంచినీళ్లు పోసి ముక్కలను కడగాలి. ఒక కడాయిని తీసుకుని అందులో ఉడికించిన బొప్పాయి ముక్కలు, రెండున్నర కప్పుల చక్కెర వేసి బాగా కలపాలి. దీనిమీద మూతపెట్టి గంటసేపు ఉంచాలి. తరువాత కడాయిని స్టవ్ మీద పెట్టి అందులో అర కప్పు చక్కెర వేసి కలపాలి. చక్కెర మొత్తం కరిగి పాకంలా మారి ముక్కలకు పట్టేవరకూ గరిటెతో కలుపుతూ చిన్న మంట మీద ఉడికించాలి. పావు గంట తరువాత నీరంతా ఇగిరి ముక్కలు పొడిపొడిగా మారతాయి. వెంటనే కడాయిని స్టవ్ మీద నుంచి దించి చల్లార్చాలి. ఇలా తయారు చేసిన పేటా.. లోపల జ్యూసీగా పైన పొడిపొడిగా ఉంటుంది. దీన్ని పిల్లలు ఇష్టంగా తింటారు.



నిల్వ పచ్చడి

కావాల్సిన పదార్థాలు

పచ్చి బొప్పాయి- ఒకటి(నాలుగు కప్పుల ముక్కలు), పచ్చళ్ల కారం- ఒకటిన్నర కప్పులు, ఆవపిండి- ఒకటిన్నర కప్పులు, పచ్చళ్ల ఉప్పు- ముప్పావు కప్పు, వెల్లుల్లి రెబ్బలు- పావు కప్పు, నువ్వుల నూనె- రెండు కప్పులు, నిమ్మరసం- అర కప్పు, మెంతి పిండి- ఒక చెంచా, పసుపు- పావు చెంచా, అల్లం తరుగు- ఒక చెంచా, నిమ్మ ఉప్పు- ఒక చెంచా

తయారీ విధానం

- బొప్పాయి కాయను శుభ్రంగా కడిగి తొక్క తీయాలి. తరువాత మధ్యకు కోసి గింజలు తీసివేసి చిన్న ముక్కలుగా తరగాలి. వీటిని రెండు గంటలసేపు ఎండలో ఆరబెట్టాలి.
- వెడల్పాటి గిన్నెలో పచ్చి బొప్పాయి ముక్కలు, కారం, ఆవ పిండి, ఉప్పు, వెల్లుల్లి రెబ్బలు, మెంతి పిండి, పసుపు, అల్లం తరుగు, నిమ్మ ఉప్పు వేసి చేత్తో బాగా కలపాలి. తరువాత నూనె పోసి కలపాలి. ఆపైన నిమ్మరసం వేసి కలపాలి. ఉప్పు సరిచూసుకోవాలి. ఈ పచ్చడిని గాలి చొరబడని ప్లాస్టిక్ డబ్బాలో భద్రపరచుకోవాలి. మూడు రోజుల తరువాత ఈ పచ్చడిని వెడల్పాటి గిన్నెలోకి తీసి మరోసారి బాగా కలపాలి. తరువాత అదే డబ్బాలోకి సర్ది పెట్టాలి. ఇలా తయారుచేసిన బొప్పాయి పచ్చడి మూడు నెలల వరకూ నిల్వ ఉంటుంది. ఇది వేడి అన్నం, ఉప్మా, దోశల్లోకి రుచిగా ఉంటుంది.





భోజన కుతూహలం

వాతవ్యాధులకు ఔషధం పనస

'భోజనకుతూహలం' గ్రంథంలో పనసకాయ, పనసపండుల గురించి, వాటి ఆహార, ఔషధ ధర్మాల గురించి అనేక విశేషాలున్నాయి. ఈ గ్రంథం ప్రకారం పక్వం కాని పనసకాయ వగరు, తీపి రుచులు కలిగి ఉంటుంది. చాలా కష్టంగా

పొట్టెంకలు

పనసాకుల దొన్నెలో ఇడ్లీపిండి వేసి ఉడికించినవాటిని కోనసీమలో పనస పొట్టెంకలు అంటారు. పనస, అరటి, పసుపు ఆకులు, తమలపాకులు, మర్రి ఆకులూ ఇలాంటి వాటితో ఇడ్లీలు, ఉండ్రాళ్లు, ఆవిరిమీద ఉడికించిన బూరెలు ఇలాంటివి చేసుకునే అలవాటు తెలుగువారిలో వివిధ ప్రాంతాల్లో ఉంది. ఆకులతో కలిపి ఆవిరిమీద ఉడికించినందు వలన ఆ ఆకుల్లోని ఔషధ గుణాలు అందటమే కాకుండా, అదనపు రుచి, పరిమళాలు కూడా అందుతాయి.

అరుగుతుంది. బాగా వేడి చేస్తుంది. స్థూలకాయాన్ని పెంచుతుంది. దప్పికని కలిగిస్తుంది. వాతాన్ని అదుపు చేస్తుంది. అందుకనే పనసపొట్టు కూరని వండిన తర్వాత తేలికగా అరగటం కోసం చివరలో కొద్దిగా ఆవపిండి కలుపుతారు. ఇక బాగా మగ్గిన పనసపండు శీతల స్వభావం కలిగి ఉంటుంది. శరీరధాతువులను పెంచుతుంది. శారీరక, మానసిక ఉత్తేజాన్ని ఇస్తుంది. నడుము, మణికట్టు, నరాలకు బలం చేకూరుస్తుంది. వాత వ్యాధులు ఉన్న వారికి పనస తొనలు మేలు చేస్తాయి. అయితే జీర్ణశక్తి సమస్యలు ఉన్నవారు- పనసపండును దూరంగా ఉంచటమే మేలని భోజనకుతూహలం గ్రంథంలో పేర్కొన్నారు. పేవుల్లో వాపు, ఎసిడిటీ ఉన్నవారు పనసపండును తినకపోవటమే మంచిది. పనస గింజలు, తొనలు ఎక్కువగా తినకూడదు.



పనస తొనలు తిన్న తర్వాత పాలు, పాల పదార్థాలకు తీసుకోవద్దని భోజనకుతూహలం చెబుతోంది. ఇదే విధంగా చేపలు, మద్యం, అతి చల్లని పానీయాలు కూడా తినకూడదు.

పనస తాండ్ర

మిగల ముగ్గిన పనస పండు గుజ్జుని పలుచగా ఒక తెల్లని వస్త్రం మీద పరచి ఎండలో వరుసగా కొన్నిరోజులు ఆరబెట్టితే దానిని పనసతాండ్ర అంటారు. దీనికి తేలికగా అరిగే స్వభావం కలిగి ఉంటుంది. అందుకే దీనికి పనస వర్ధని అనే పేరు కూడా ఉంది. ఈ తాండ్ర పనసపండు లాగా వేడి చెయ్యదు. రక్తస్రావాన్ని అరికడ్తుంది. శరీరధాతువుల క్షీణించేవారికి, ఎదిగే పిల్లలకు ఇది పోషకంగా ఉపకరిస్తుంది. మన దగ్గర పనస తాండ్రకు తక్కువగా చేస్తారు.

• గంగరాజు అరుణాదేవి

ఇంట్లో ప్రశాంతంగా

ఇంట్లో ఉన్నంతసేపు సంతోషకరమైన అనుభూతి కలగాలంటే ఇల్లు శుభ్రంగా ఆహ్లాదకరంగా ఉండాలి. దీంతోపాటు చిన్న చిట్కాలు పాటిస్తే మనసు ప్రశాంతంగా సేదదీరుతుంది.



- ఇంట్లో సామాన్లను పొందికగా సర్దుకోవాలి. ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలి. గాలి, వెలుతురు ఇంట్లోకి ప్రసరించేలా కిటికీలు, గుమ్మం తలుపులు తెరచి ఉంచుకోవాలి. దీనివల్ల తాజా అనుభూతి కల్గుతుంది. మానసిక ఒత్తిడి తగ్గుతుంది.
- ఇంటి గోడలకు లేత రంగులను ఎంపిక చేసుకోవడం మంచిది. ప్రకృతిని గుర్తుకు తెచ్చే తేలికపాటి రంగులు మానసిక ప్రశాంతతను పెంపొందిస్తాయి.
- ఇంట్లో ప్రతి గదిలో ఇండోర్ ప్లాంట్స్‌ను ఏర్పాటు చేసుకోవాలి. పచ్చని మొక్కలను చూసినప్పుడు సానుకూల దృక్పథం పెరుగుతుంది. ఆందోళన తగ్గి మనసు తేలికపడుతుంది.
- ఇంట్లో అవసరం లేని వాడని వస్తువులను దాచి ఉంచకూడదు. వాటివల్ల తెలియకుండానే చికాకు పెరుగుతుంది. వాటితోపాటు విరిగిన, పాడైన సామాన్లను ఎప్పటికప్పుడు తొలగించడం మంచిది.



న్యూజెర్సీలో నయా చరిత్ర

భారతీయులు ప్రపంచంలో ఎక్కడ ఉన్నా తమ ప్రత్యేకతను చాటుకుంటూనే ఉంటారు. రంగం ఏదైనా తమకంటూ ఓ గుర్తింపు తెచ్చుకుంటూ ముందుకు సాగుతుంటారు. అలాంటి వారిలో ఒకరు అమెరికాలోని న్యూజెర్సీకి చెందిన మమతా సింగ్. జెర్సీ నగరంలో ప్రజా పదవికి ఎన్నికైన మొట్టమొదటి భారతీయ అమెరికన్ మహిళగా కౌన్సిల్ ఎట్ లార్జ్ స్థానాన్ని కైవసం చేసుకోవడం ఒక అరుదైన విజయంగా విశ్లేషకులు భావిస్తున్నారు. అమెరికాలోనే అత్యధిక భారతీయ సంతతి ప్రజలు నివసించే న్యూజెర్సీ రాష్ట్రంలోని ప్రసిద్ధ వాణిజ్య జిల్లా అయిన ఇండియా స్క్వేర్‌ను ముద్దుగా 'లిటిల్ ఇండియా' అని పిలుచుకుంటారంటే ఈ నగరంపై మన భారతీయ సంస్కృతిప్రభావం ఎంతుందో అర్థంచేసుకోవచ్చు. అయినప్పటికీ మమతా సింగ్ గెలిచే వరకు ఏ ఒక్క భారతీయ సంతతి వ్యక్తి కూడా ఈ నగరంలో ప్రజా పదవికి ఎన్నిక కాకపోవడం ఆశ్చర్యపరిచే విషయమే. జెర్సీ సిటీ లోనే పుట్టిపెరిగిన మమత తనను తాను ఒక వలసదారునని గర్వంగా ప్రకటించుకుంటారు. ప్రజాసేవలో తన అనుభవం సిటీ కౌన్సిల్‌లోని పౌరులందరికీ ఉపకరిస్తుందంటారు. మమతా సింగ్ జెర్సీ సిటీలో మహిళలు, పిల్లలు, ఉద్యోగాలు చేసే తల్లిదండ్రులకు అండగా నిలిచేందుకు 'జెర్సీ ఫ్యామిలీస్' అనే నెట్‌వర్క్‌ను స్థాపించారు. అలాగే అమెరికాలో భారతీయ కుటుంబాలు తమ సంస్కృతి, సంప్రదాయాలను కొనసాగించేందుకు, ఉత్సవాలను జరుపుకొనేందుకు 'ఇండియన్స్ ఇన్ జెర్సీ సిటీ' అనే గ్రూప్‌ను కూడా స్థాపించారు.

లువానా లోప్స్ లారా.. ఇప్పుడీ పేరు వ్యాపార ప్రపంచంలో మార్మోగుతోంది. ఓ సాధారణ మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన లారా ప్రపంచంలో స్వయంకృషితో ఎదిగిన అతికొద్దిమంది బిలియనీర్ల సరసన చేరారు. 29 ఏళ్ల ఈ బ్రెజిల్ యువ పారిశ్రామికవేత్త ప్రపంచంలోనే అతిపిన్న మహిళా బిలియనీర్‌గా చరిత్ర సృష్టించారు. గతంలో ఈ స్థానంలో ఉన్న స్కేల్ ఏఐ సహ వ్యవస్థాపకురాలు లూసీ గువాను లారా వెనక్కి నెట్టేశారు. లారా స్థాపించిన ప్రిడక్షన్ మార్కెట్ స్టార్టప్ 'కల్షి' మార్కెట్ విలువ 11 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.90,200 కోట్లు)కు చేరుకోవడంతో ఆమె వ్యక్తిగత వాటా విలువ 1.3 బిలియన్ డాలర్లకు చేరుకుంది. తద్వారా ఆమె ఈ ఘనత అందుకున్నారు.

అతి పిన్న బిలియనీర్

ట్రెండింగ్



లువానా లోప్స్ లారా.. ఇప్పుడీ పేరు వ్యాపార ప్రపంచంలో మార్మోగుతోంది. ఓ సాధారణ మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన లారా ప్రపంచంలో స్వయంకృషితో ఎదిగిన అతికొద్దిమంది బిలియనీర్ల సరసన చేరారు. 29 ఏళ్ల ఈ బ్రెజిల్ యువ పారిశ్రామికవేత్త ప్రపంచంలోనే అతిపిన్న మహిళా బిలియనీర్‌గా చరిత్ర సృష్టించారు. గతంలో ఈ స్థానంలో ఉన్న స్కేల్ ఏఐ సహ వ్యవస్థాపకురాలు లూసీ గువాను లారా వెనక్కి నెట్టేశారు. లారా స్థాపించిన ప్రిడక్షన్ మార్కెట్ స్టార్టప్ 'కల్షి' మార్కెట్ విలువ 11 బిలియన్ డాలర్ల (దాదాపు రూ. 90,200 కోట్లు) చేరుకోవడంతో లారా వ్యక్తిగత వాటా విలువ 1.3 బిలియన్ డాలర్లకు చేరుకుంది. తద్వారా ఆమె ఈ ఘనత అందుకున్నారు.

డ్యాన్సర్ నుంచి పారిశ్రామికవేత్తగా

బ్రెజిల్‌లో పుట్టిన లారా ప్రతిష్ఠాత్మక బోల్షోయ్ థియేటర్ స్కూల్‌లో ప్రొఫెషనల్ బ్యాలరీనా (డ్యాన్సర్)గా శిక్షణ తీసుకున్నారు. చదువులోనూ మెరికలా ఉండేవారు. బ్రెజిలియన్ ఆస్ట్రానమీ ఒలింపియాడ్‌లో బంగారు పతకం, శాంటా క్యాటరీనా మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్‌లో కాంస్య పతకం గెలుచుకున్నారు. హైస్కూల్ విద్య తర్వాత ఆస్ట్రియాలో కొంతకాలం పాటు నృత్య ప్రదర్శనలు ఇచ్చి ఎంతోమంది మన్ననలు అందుకున్నారు. ప్రతి రోజు న్యూస్ వినడాన్ని ఇష్టపడే లారాకు చిన్నప్పటి నుంచే వ్యాపార మెళకువలు అబ్బాయి. అవే ఆమెను ఆ తర్వాతి కాలంలో విజయవంతమైన పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దాయి. అమెరికాలోని మసాచుసెట్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి కంప్యూటర్ సైన్స్‌లో డిగ్రీ పట్టా పుచ్చుకున్న లారా 2019లో తన సహ విద్యార్థి అయిన తారెక్ మన్సూర్‌తో కలిసి రియల్ వరల్డ్ సంఘటనలైన ఎన్నికలు, ద్రవ్యోల్బణం, క్రీడల నుంచి పాపప్ సంస్కృతి వంటి భవిష్యత్ ఈవెంట్లపై ప్రజలు నేరుగా ట్రేడింగ్ చేయడానికి వీలు కల్పించే వేదిక 'కల్షి'ని స్థాపించారు. ఈ వ్యవస్థను ఒక నియమిత కాంట్రాక్ట్ మార్కెట్‌గా ఆపరేట్ చేయడానికి ప్రభుత్వ ఆమోదం కోసం ఈ ఇద్దరు కలిసి అనేక న్యాయపోరాటాలు చేసి విజయం సాధించారు. అమెరికా అధ్యక్ష ఎన్నికలకు ముందు ఫలితాన్ని సరిగా అంచనా వేయడం ద్వారా రూ. 4,100 కోట్ల విలువైన వ్యాపారం చేశారు. ఈ ఏడాది జూన్‌లో 2 బిలియన్ డాలర్లుగా ఉన్న కల్షి మార్కెట్ విలువ డిసెంబర్ నాటికి 11 బిలియన్ డాలర్లకు చేరుకుంది. దీంతో లారా, తారెక్ ఇద్దరూ బిలియనీర్లుగా మారగా, లారా ప్రపంచంలోనే అతి పిన్న వయస్కురాలైన మహిళా బిలియనీర్‌గా రికార్డులకెక్కారు. లారాకు ప్రస్తుతం ఈ కంపెనీలో 12 శాతం వాటా ఉంది. దీని విలువ దాదాపు 1.3 బిలియన్ డాలర్లు.



మనలాగే నమ్మకాలు

బ్రెజిలియన్లకు మనలానే నమ్మకాలు ఎక్కువ. భారతీయుల్లానే వారు కూడా 'కుడి'కి అత్యధిక ప్రాధాన్యం ఇస్తారు. "నేను ఉదయం లేవగానే తొలుత కుడికాలినే నేలపై మోపుతాను. దేవుడిపైనా, పునర్జన్మలపైనా నమ్మకం ఉంది. చిన్నప్పుడు పరీక్షలంటే విపరీతంగా భయపడేదానిని. అందుకే స్కూలుకు వెళ్లడానికి అరగంట ముందు దేవుడిని ప్రార్థించేదానిని. కంప్యూటర్ సైంటిస్ట్, రచయిత పాల్ గ్రాహమ్‌ను 'ఎక్స్'లో ఫాలో అవుతుంటాను. రోజుకు దాదాపు మూడు గంటలపాటు మొబైల్ చూడటం అలవాటు. అలాగే, వారానికి ఒక డాక్యుమెంటరీ తప్పనిసరిగా చూడాల్సిందే. 'స్వాన్‌లేక్' నృత్యమంటే నాకు ఎంతో ఇష్టం" అని చెప్పే లారా సాంకేతిక ప్రపంచంలోనే కాకుండా ఆర్థిక మార్కెట్లోనూ ఒక యువశక్తిగా, స్ఫూర్తిదాయకమైన మహిళగా నిలిచారు.

పెదవులు పగులుతున్నాయా?

చలికి పెదవులు పగులుతూ రక్తం చిందుతూ ఉంటాయి. దీంతో తీవ్రమైన నొప్పి వేధించడంతోపాటు ఆహారం తీసుకోవడం కూడా ఇబ్బందిగా అనిపిస్తుంటుంది. అలాంటప్పుడు చిన్న చిట్కాలు పాటించి పెదవుల పగుళ్లను తగ్గించుకోవచ్చు.



- కొద్దిగా కలబంద గుజ్జును తీసుకుని రెండు సార్లు నీళ్లలో ముంచి ఆపైన పెదవులకు పట్టించాలి. అరగంట తరువాత నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా రోజుకు రెండుసార్లు చేస్తూ ఉంటే కలబందలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు.. పెదవుల పగుళ్లను నివారిస్తాయి.
- చిన్న గిన్నెలో రెండు చెంచాల ఆలివ్ ఆయిల్, ఒక చెంచా కొబ్బరినూనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని చూపుడు వేలితో కొద్ది కొద్దిగా తీసుకుంటూ పెదవులకు రాయాలి. ఇలా రోజుకు నాలుగైదు సార్లు చేస్తూ ఉంటే పెదవులకు తగినంత తేమ అంది మృదువుగా మారతాయి. నొప్పి కూడా తగ్గుతుంది. అలాగే రెండు చెంచాల తేనెలో ఒక చెంచా ఆలివ్ ఆయిల్ కలిపి పెదవులకు రాసుకున్నా మంచి ఫలితం కనిపిస్తుంది.
- రాత్రి పడుకునేముందు కీర రసాన్ని లేదా చల్లని గ్రీన్ టీని పెదవులకు పట్టించాలి. ఉదయానికల్లా నొప్పి తగ్గుతుంది. ఇలా రోజూ చేస్తూ ఉంటే పెదవులు తేమతో నిండి క్రమంగా పగుళ్లు తగ్గుతాయి.
- తరచూ పెదవులకు పేరిన నెయ్యి రాసుకుంటూ ఉంటే పగుళ్లు రావు. పెదవులమీద పేరుకున్న మృతకణాలు తొలగిపోయి రక్తప్రసరణ మెరుగవుతుంది. తగినంత తేమ అంది పెదవులు మృదువుగా మెరుస్తుంటాయి.
- గిన్నెలో చెంచా కీవీ పండు గుజ్జు తీసుకుని అందులో అర చెంచా పెరుగు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని పెదవులకు పట్టించి పావుగంట తరువాత మంచి నీటితో శుభ్రం చేసుకుంటే ఉపశమనం కలుగుతుంది. రెండు చెంచాల బొప్పాయి పండు గుజ్జులో చెంచా తేనె కలిపి పెదవులకు పట్టించినా ఫలితం కనిపిస్తుంది.
- గుప్పెడు గులాబీ రేకులను రోట్లో వేసి పాల చుక్కలు చిలకరిస్తూ మెత్తగా నూరాలి. ఈ పేస్టును రాత్రి పడుకునేముందు పెదవులకు పట్టించాలి. ఉదయాన్నే గోరువెచ్చని నీటితో కడిగేసుకుంటే పగుళ్లు తగ్గడమే కాకుండా పెదవులు ఎర్రగా మృదువుగా మారతాయి.

మీకు తెలుసా!

యాలకుల్లో బి, సి విటమిన్లు; కాల్షియం, పొటాషియం, మెగ్నీషియం తదితర మినరల్స్; యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉంటాయి. ఒక గ్లాసు గోరువెచ్చని నీటిలో అర చెంచా యాలకుల పొడి కలుపుకుని వారానికి రెండుసార్లు తాగుతూ ఉంటే శరీరంలో పేరుకున్న వ్యర్థాలు తొలగిపోతాయి. చర్మం పొడిబారకుండా ఉంటుంది. చలికి పెదాలు పగులకుండా మృదువుగా మారతాయి. మాడు మీద చుండ్రు సమస్యలు రావు. చిన్న గిన్నెలో రెండు చెంచాల కొబ్బరి నూనె, ఒక చెంచా చక్కెర, ఒక చెంచా యాలకుల పొడి వేసి బాగా కలిపి ముఖానికి పట్టించి మర్దన చేస్తే మృతకణాలన్నీ తొలగిపోతాయి. ముఖం కాంతివంతంగా మారుతుంది.

కావాలనే సంక్షోభం?

(మొదటి పేజీ తరువాయి)

సర్వీసుల రద్దు, జాప్యం వంటి చర్యలతో ప్రయాణికులకు ఇబ్బందులు సృష్టించడం ద్వారా నిబంధనల సడలింపు కోసం యాజమాన్యం ప్రయత్నించిందా? అంటే తాజా పరిణామాలు అవుననే అంటున్నాయి. పైలట్లు, క్యాబిన్ సిబ్బంది, గ్రౌండ్ స్టాఫ్ సహా ఇండిగో సిబ్బంది సంతకాలు చేసి, రాసినట్లుగా పేర్కొంటున్న ఓ బహిరంగ లేఖ ఈ అనుమానాలకు బలం చేకూర్చుతోంది. శుక్రవారం వెలుగులోకి వచ్చిన ఈ లేఖ వైరల్‌గా మారింది. ఈ సంక్షోభానికి కారణం కేవలం నిర్వహణలో వైఫల్యం కాదని.. ప్రణాళికలు, ఫ్రంట్‌లైన్ ఉద్యోగుల రక్షణలో వైఫల్యమని ఇండిగో సిబ్బంది లేఖలో పేర్కొన్నారు. సంక్షోభానికి కారణమైన నిర్ణయాలు తీసుకున్న వారంతా తాజా పరిణామాలకు దూరంగా ఉన్నారని.. ఇందుకు సంబంధంలేని ఉద్యోగులు మాత్రం ప్రయాణికుల ఆగ్రహాన్ని చవిచూస్తున్నారని వాపోయారు. డీజీసీఏ నిబంధనలు అమల్లోకి వచ్చిన సమయంలోనే భారీగా విమాన సర్వీసులు రద్దవడం యాదృచ్ఛికం కాదని.. దీని వెనకున్న కారణాలను విస్మరించరాదన్నారు. సంక్షోభాన్ని సృష్టించి, డీజీసీఏ నిబంధనల సడలింపు కోసమే నిర్వహణా వైఫల్యం జరిగినట్లుగా ఉందని అభిప్రాయపడ్డారు. ఈ వ్యవహారంలో ఫ్రంట్‌లైన్ సిబ్బందిని వాడుకొని, వారి సమస్యలను పరిష్కరించుకున్నట్లుగా కనిపిస్తోందని పేర్కొన్నారు. డీజీసీఏ మీద ఒత్తిడి తెచ్చే వ్యూహంలో భాగంగానే ఇదంతా చేస్తున్నట్లుగా ఉందని.. ఈ విషయంలో యాజమాన్యం పారదర్శకంగా వ్యవహరించాలని, ఫ్రంట్‌లైన్ సిబ్బంది తప్పేంలేదని ప్రయాణికులకు తెలియజేయాలని అభిప్రాయపడ్డారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతంకాకుండా చూడాలన్నారు.

డీజీసీఏ కీలక నిర్ణయం

ఇండిగో విమాన సర్వీసుల సంక్షోభంతో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) పైలట్ల విధులకు సంబంధించి ఇండిగోకు ఊరట కల్పించేలా పైలట్ల వారాంతపు విశ్రాంతి (వీక్లీ రెస్ట్) నిబంధనలో మార్పులు చేస్తూ శుక్రవారం ఓ ప్రకటన చేసింది. వందలాది సర్వీసుల రద్దుతో సతమతమవుతున్న ఇండిగో.. నిబంధనలు సడలించాలంటూ డీజీసీఏను ఆశ్రయించింది. ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్స్ (ఎఫ్‌డీటీఎల్) నుంచి ఉపశమనం కల్పించాలని కోరింది. దీంతో పైలట్ల విధులకు సంబంధించి తాజా మార్పులు చేపట్టింది. ఇవి తాత్కాలికం మాత్రమేనని పేర్కొంది. గతంలో పైలట్లకు వారంలో విశ్రాంతి సమయాన్ని 36గంటల నుంచి 48గంటలకు



పెంచగా ఇప్పుడు ఈ వీక్లీ రెస్ట్‌ను సెలవుగా పరిగణించనున్నట్లు డీజీసీఏ ప్రకటించింది. అంతకుముందు, డీజీసీఏ కొత్త నిబంధనల ప్రకారం..వీక్లీ రెస్ట్‌ను సెలవుగా పరిగణించే అవకాశం లేదు. వీక్లీ రెస్ట్ పీరియడ్, సెలవులను వేర్వేరుగా చూసేవారు. పైలట్ల అలసట సమస్య పరిష్కారానికి ఈ కఠిన నిబంధనలు తెచ్చారు. కానీ, ఇండిగో విమానాల రద్దు నేపథ్యంలో ఈ నిబంధనను కాస్త సడలించారు. ఇక, పైలట్ల రాత్రి విధులపై ఉన్న నిబంధనల విషయంలో డీజీసీఏ.. ఇండిగోకు భారీ ఉపశమనం కల్పించింది. పైలట్లు వరసగా రెండు కంటే ఎక్కువ రాత్రి షిఫ్ట్‌లు చేయకూడదనే నిబంధనను తాత్కాలికంగా ఉపసంహరించుకున్నట్లు తెలిపింది. ఇండిగో పైలట్లు వారంలో ఆరు నైట్ డ్యూటీలు నిర్వహించే అవకాశాన్ని కల్పించింది. ప్రస్తుత గందరగోళాన్ని నివారించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఈ మినహాయింపులు వచ్చే ఫిబ్రవరి 10వరకు అమల్లో ఉంటాయని, ప్రతి 15 రోజులకోసారి వీటిపై సమీక్ష నిర్వహిస్తామని పేర్కొంది. ఇండిగో వ్యవహారంపై కేంద్ర పౌరవిమానయాన శాఖ ఉన్నతస్థాయి దర్యాప్తుకు ఆదేశించింది. పరిస్థితులను సమీక్షించేందుకు నలుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసింది. ఈ కమిటీ విమానాల రాకపోకల్లో అంతరాయాలకు కారణాలను గుర్తించడం, ఎఫ్‌డీటీఎల్ నిబంధనలనుగుణంగా మానవ వనరుల సర్దుబాటు, రోస్టర్‌ను తయారు చేస్తున్నారా?లేదా? అన్నది పరిశీలించడం వంటి పనులు చేయాలి. 15 రోజుల్లోగా డీజీసీఏకు నివేదికను సమర్పించాలి. కేంద్ర పౌర విమానయాన శాఖ ఇండిగో సంక్షోభం నేపథ్యంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది.

> **భారీగా పైలట్ల కొరత..**
>
> దేశంలో విమాన పైలట్ల కొరత భారీగా ఉంది. డీజీసీఏ ప్రకారం 26,500 మంది లైసెన్స్‌డ్ పైలట్లు ఉన్నారు. కానీ, వీరిలో భారత్‌లో విమానయాన సంస్థల్లో పనిచేస్తున్న వారు 11,700 మందే. వేతనాలు ఎక్కువగా వస్తుండడంతో కొందరు విదేశాలకు వెళ్లారు. మరికొందరు వివిధ కారణాలతో క్రియాశీలంగా లేరు. ఇండిగోలో ఏ320 విమానాలను నడిపేందుకు 2422 మంది కెప్టెన్లు, 2153 మంది ఫస్ట్ ఆఫీసర్లు కావాల్సి ఉండగా.. 2357 మంది కెప్టెన్లే ఉన్నారు. ఫస్ట్ ఆఫీసర్లు మాత్రం 2,194 మంది ఉన్నారు. ఒక స్వల్పకాలిక నివేదిక ప్రకారం భారత్‌లోని విమానయాన సంస్థలకు 2030 నాటికి 22,400 మంది పైలట్లు కావాలి. కానీ, ప్రస్తుతం మనదేశంలో విధుల్లో ఉన్న లైసెన్స్‌డ్ పైలట్లు 11,700 మందే!

ఇండిగోపై చర్యలు తీసుకుంటాం: రామ్మోహన్

ఇండిగో సంక్షోభం అతి త్వరలోనే సమసిపోతుందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు చెప్పారు. ప్రభుత్వ చర్యల కారణంగా వచ్చే మూడు రోజుల్లో ఇండిగో విమాన సర్వీసులన్నింటినీ పునరుద్ధరించే అవకాశం ఉందన్నారు. ఎఫ్‌డీటీఎల్ నిబంధనలను దేశంలోని విమానయాన సంస్థలన్నీ అమలు చేస్తున్నాయని, వాటికెలాంటి ఇబ్బందులూ లేవని.. ఒక్క ఇండిగోలోనే సమస్యలు తలెత్తాయని గుర్తుచేశారు. తప్పంతా ఇండిగో యాజమాన్యానిదేనన్నారు. "సంస్థపై తప్పనిసరిగా చర్యలు తీసుకుంటాం. ప్రయాణికులకు మెరుగైన సేవలందేలా చూడడం మా విధి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యతా మాదే. దర్యాప్తు అనంతరం కచ్చితంగా చర్యలు తీసుకుంటాం"అని రామ్మోహన్‌నాయుడు స్పష్టం చేశారు. కాగా ఇండిగోకు ఊరట కల్పించేందుకు డీజీసీఏ నిబంధనలను సడలించడంపై పైలట్ల సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఇది ప్రమాదకర పరిస్థితులకు దారి తీస్తుందని పేర్కొన్నాయి.

కాగా ఇండిగో సంక్షోభం కారణంగా నాలుగో రోజూ ప్రయాణికులకు ఇబ్బందులు తప్పలేదు. శుక్రవారం ఇండిగో వెయ్యికి పైగా విమాన సర్వీసులను రద్దు చేసింది. ఢిల్లీ నుంచి బయల్దేరాల్సిన అన్ని విమానాలూ (దాదాపు 235) రద్దయ్యాయి. శంషాబాద్ విమానాశ్రయంతోపాటు దేశంలోని ప్రధాన నగరాల్లో ఇండిగో ప్రయాణికుల పరిస్థితి దారుణంగా మారింది. శుక్రవారం శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి రాకపోకలు సాగించాల్సిన 155 విమాన సర్వీసులు రద్దయ్యాయి. ముంబై నుంచి 104, బెంగళూరు నుంచి 102 విమానాలు రద్దయ్యాయి. కాగా ఈ నెల 10-15 నాటికి విమాన సర్వీసులు సాధారణ స్థితికి చేరుకునే అవకాశం ఉందని ఇండిగో సీఈవో పీటర్ ఎల్బర్స్ తెలిపారు. శనివారం 1000కన్నా తక్కువ విమానాలే రద్దవుతాయని భావిస్తున్నామన్నారు.



బెంగళూరు ఎయిర్‌పోర్టులో విమానాల రద్దు కారణంగా లగేజీతో ప్రయాణికుల ఇబ్బందులు

విమానం రద్దు.. వర్చువల్‌గా రిసెప్షన్

నవజంటకు అనూహ్య పరిస్థితి

బెంగళూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విమాన సర్వీసు రద్దుతో ఓ నవదంపతులకు అనూహ్య పరిస్థితి ఎదురైంది. కర్ణాటకలోని హుబ్బళ్లిలో వారి వివాహ రిసెప్షన్‌కు బంధువులు అందరూ హాజరైనా నవదంపతులు మాత్రం రాలేకపోయారు. చివరకు వర్చువల్‌గా హాజరై మమ అనిపించారు. ఇండిగో విమానం రద్దుతో వారు భువనేశ్వర్‌లో చిక్కుకుపోవడంతో ఈ పరిస్థితి ఎదురైంది. బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పనిచేసే సంగమ్ దాస్, మేఘా క్షీరసాగర్‌కు నవంబరు 23న భువనేశ్వర్‌లో వివాహమైంది. ఈనెల 3న వధువు స్వస్థలం హుబ్బళ్లిలోని గుజరాత్ భవన్‌లో భారీ ఖర్చుతో రిసెప్షన్‌కు ఏర్పాట్లు చేశారు. ఈ రిసెప్షన్‌కు రావడానికి ఈనెల 2న భువనేశ్వర్, బెంగళూరు, హుబ్బళ్లి రూట్‌లో వధూవరులు ఇండిగో విమాన టికెట్లు బుక్ చేసుకున్నారు. ఇదే సమయంలో ఇండిగోలో నిర్వహణ సంక్షోభం తలెత్తడంతో వారి విమా న సమయం పలుమార్లు వాయిదా పడి చివరికి రద్దయింది. వారు వచ్చేందుకు వేరే దారి లేకపోవడంతో రిసెప్షన్ హాల్‌లో పెద్ద స్ర్కీన్ ఏర్పాటు చేయడంతో వీడియో కాల్ ద్వారా వేడుకకు హాజరయ్యారు. స్ర్కీన్‌పై కనిపిస్తున్న నవజంటను బంధువులు ఆశీర్వదించారు.



'మ్యాచ్‌ఫిక్సింగ్' గుత్తాధిపత్యం వల్లే ఇండిగో సంక్షోభం



న్యూఢిల్లీ, డిసెంబరు 5: మోదీ ప్రభుత్వ గుత్తాధిపత్య విధానం వల్లే 'ఇండిగో' సంక్షోభం తలెత్తిందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ప్రతి రంగంలోనూ న్యాయబద్ధమైన పోటీ ఉండాలని.. మ్యాచ్‌ఫిక్సింగ్‌తో కూడిన గుత్తాధిపత్యాలు పనికిరావని శుక్రవారం 'ఎక్స్'లో వ్యాఖ్యానించారు. ఇండిగో సంస్థ గురు, శుక్రవారాల్లో భారీగా విమాన సర్వీసు లను రద్దు చేయడంతో వేల మంది ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యం కలగడం తెలిసిందే. దీనిపై రాహుల్ తీవ్రంగా స్పందించారు. విమానాల ఆలస్యం, రద్దు, నిస్సహాయత కారణంగా సాధారణ భారతీయులు మూల్యం చెల్లించుకుంటున్నారని తెలిపారు. ఈస్టిండియా కంపెనీ 150ఏళ్ల కిందటే దేశం దాటి వెళ్లిపోయిందని.. ఇన్నేళ్లకు కొత్త జాతి ఏకస్వామ్యవాదులు దాని స్థానంలో వచ్చారంటూ గత ఏడాది ఓ పత్రికకు తాను రాసిన వ్యాసాన్ని ఈ సందర్భంగా ఆయ న షేర్ చేశారు. 'విమానాశ్రయాల్లో ప్రస్తుతం జరుగుతున్నది గుత్తాధిపత్యం లేదా ఏకాధిపత్యం ఫలితమే. స్లిప్పర్లు వేసుకునే వారు విమానాలు ఎక్కుతారని చెప్పారు. కానీ ఇప్పుడు ప్రయాణికులు, ఇండిగో సిబ్బంది పరస్పరం బూట్లు, చెప్పులు విసురుకుంటున్నారు' అని ఏఐసీసీ మీడియా విభాగం ఇన్‌చార్జి పవన్ ఖేరా ఎద్దేవాచేశారు. దేశంలో చాలా రంగాలు కొద్ది మంది చేతుల్లోనే ఉన్నాయని, ఈ ప్రభుత్వం వల్లే ఇలా జరుగుతోందని.. ఇది ఆర్థిక వ్యవస్థకు, ప్రజాసామ్యానికి, దేశానికీ ఆరోగ్యకరంకాదని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకాగాంధీ అన్నారు. విమానయాన పరిశ్రమలో ఒకప్పుడు పోటీ ఉండేదని.. మోదీ ప్రభుత్వం దాన్ని రెండు కంపెనీల చేతుల్లో పెట్టిందని.. ప్రయాణికుల ప్రయోజనాలకంటే కార్పొరేట్ పేరాశకే ప్రాధాన్యమిస్తోందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ధ్వజమెత్తారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★



జపాన్‌లో ప్రభాస్ సందడి

ప్రభాస్ నటించిన 'బాహుబలి ది ఎపిక్' సినిమాను జపాన్‌లో ప్రదర్శిస్తున్నారు. దీంతో చిత్ర నిర్మాత శోభు యార్లగడ్డతో కలిసి ప్రభాస్ జపాన్ వెళ్లారు. అక్కడి అభిమానులతో కలిసి 'బాహుబలి ది ఎపిక్' చూశారు. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు నెట్టింట వైరల్ అయ్యాయి.

ఆ ప్రశంసలు నమ్మకాన్ని పెంచాయి

'అఖండ' సమస్య పరిష్కారానికి నా వంతు ప్రయత్నం చేశా

- నిర్మాత సురేశ్‌బాబు

తెలుగు చలన చిత్ర పరిశ్రమలో వ్యాపార కోణం మరీ ఎక్కువగా రచ్చకెక్కడం దురదృష్టకరం. ప్రస్తుతం ప్రతి ఒక్కరూ 'సమస్య, డబ్బులు' అని చర్చిస్తున్నారు. అసలు ఇవన్నీ ఎందుకు? ప్రేక్షకులు సినిమాను ఆస్వాదించడమే మనకు ముఖ్యం' అని నిర్మాత డి. సురేశ్‌బాబు వ్యాఖ్యానించారు. ఆర్థిక లావాదేవీల కారణంగా 'అఖండ' చిత్రం విడుదల నిలిచిపోయిన విషయాన్ని విలేకరులు ప్రస్తావించగా ఆయన పై విధంగా స్పందించారు. ఈ సందర్భంగా సురేశ్‌బాబు మాట్లాడుతూ 'ఆర్థికపరమైన విషయాలను బహిరంగంగా చర్చించకూడదు. అందుకే నేను ఆ వివాదం లోతుల్లోకి వెళ్లడం లేదు. అయితే సమస్య పరిష్కారం కోసం నా వంతు ప్రయత్నం మాత్రం చేశాను. ఈ రోజే ఆ వివాదం పూర్తిగా సమసిపోయి, సినిమా విడుదలవ్వాలని కోరుకుంటున్నాను. పరిశ్రమలో ఆర్థిక పరమైన ఇబ్బందులు ఎప్పుడూ ఉండేవే. గతంలో మా ల్యాబులు ఉన్నప్పుడూ ఉన్నాయి. కాబట్టి నిర్మాతలు వీటికి ముందే సిద్ధమవ్వాలి' అని తెలిపారు.



"పెళ్లి చూపులు, కేరాఫ్ కంచరపాలెం' చిత్రాల తర్వాత ఆ స్థాయిలో ఎఫర్ట్ పెట్టి తీసిన చిత్రం 'సైక్ సిద్ధార్థ్'. ఇలాంటి సినిమాకు తప్పకుండా సపోర్ట్ చేయాలనిపించింది. అందుకే మేము విడుదల చేస్తున్నాం' అని నిర్మాత డి. సురేశ్‌బాబు అన్నారు. శ్రీనందు హీరోగా వరుణ్ రెడ్డి దర్శకత్వం వహించిన చిత్రమిది. శ్యామ్ సుందర్‌రెడ్డి తుడుతో కలిసి శ్రీనందు నిర్మించారు. ఈ నెల 12న విడుదలవుతోంది. ఈ సందర్భంగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో సురేశ్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శ్రీనందు మాట్లాడుతూ 'సురేశ్‌బాబు గారి సూచనల వల్ల సినిమా అద్భుతంగా వచ్చింది. ఆయన ఈ సినిమాను కొన్న రోజు నా ఆనందానికి హద్దులు లేవు. కే. రాఘవేంద్రరావు గారు మా సినిమా చూసి ప్రశంసించడం మా సినిమా విజయంపై నమ్మకాన్ని పెంచింది' అని తెలిపారు. ప్రేక్షకులు ఆద్యంతం ఆస్వాదించేలా మా చిత్రం ఉంటుందని కథానాయిక యామిని భాస్కర్ చెప్పారు.

కన్నని కందస్వామి నేతృత్వంలో జపాన్ నుంచి వచ్చిన అభిమానులు హీరో రామ్‌చరణ్‌ని హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా రామ్‌చరణ్ వారికి ఒక చిన్న బ్యాట్, టీషర్ట్‌ను బహూకరించారు. 'పెద్ది' సినిమా ప్రమోషన్ కోసం జపాన్ వచ్చినప్పుడు తప్పకుండా కలుస్తానని రామ్‌చరణ్ వారికి హామీ ఇచ్చారు.






సరికొత్త 'అమరకావ్యం'



ధనుష్, కృతి సనన్ జంటగా ఆనంద్ ఎల్ రాయ్ దర్శకత్వంలో భూషణ్ కుమార్ నిర్మించిన సరికొత్త ప్రేమ కథా చిత్రం 'తేరే ఇష్క్ మై'. 'అమరకావ్యం' పేరుతో తెలుగులో ఇటీవలె విడుదలైన ఈ చిత్రం థియేటర్లలో సందడి చేస్తోంది. ధనుష్, కృతి సనన్ నటనకు ప్రేక్షకులు ఫిదా అవుతున్నారు. ప్రస్తుతం తెలుగు ట్రైలర్ ఇంటర్నెట్‌లో హల్‌చల్ చేస్తోంది. హీరో, హీరోయిన్ల మధ్య ప్రేమ, ప్రేమను కోల్పోయిన బాధ నుంచి హీరో బయటకు రావడం వంటి సన్నివేశాలను ట్రైలర్‌లో చాలా చక్కగా చూపించారు. ఈ సినిమాకు ఏ.ఆర్.రెహ్మాన్ సంగీతం సమకూర్చారు.

భయంకరంగా ఉంది కానీ బావుంది అన్నారు



మన్నె శ్రీనివాస్

జెనీలియా ప్రధాన పాత్రలో రూపొందిన 'కథ' చిత్రంతో దర్శకుడిగా విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు శ్రీనివాస్ మన్నె. ఈ సారి తన పంథా మార్చి 'ఈషా' అనే హారర్ చిత్రంతో ప్రేక్షకుల ముందుకొస్తున్నారు. అఖిల్ రాజ్, త్రిగుణ్, హెబ్బాపటేల్ ప్రధాన పాత్రలు పోషించగా, హేమ వెంకటేశ్వరరావు నిర్మించారు. ఈ నెల 12న విడుదలవుతున్న సందర్భంగా శ్రీనివాస్ మన్నె మీడియాతో మాట్లాడారు. 'నిర్మాత కేఎల్ దామోదర ప్రసాద్ ప్రోత్సాహంతో ఆయన సమర్పణలో 'ఈషా' చేశాను. ఈ సినిమాలో హారర్‌తోపాటు మనిషి చావు పుట్టుకలు, దైవత్వం, సృష్టి పరిణామ క్రమం లాంటి అంశాలను అంతర్లీనంగా చర్చించాం. సాంకేతికంగా సినిమా చాలా ఉన్నతంగా ఉంటుంది. సినిమాలో భయపెట్టే అంశాలు చాలా ఉన్నాయి. గుండె ధైర్యం లేనివాళ్లు ఈ సినిమా చూడకూడదు. సెన్సార్ వాళ్లు సినిమా చూసి 'చాలా భయంకరంగా ఉంది కానీ బావుంది' అన్నారు. ఆత్మలు ఉన్నాయా? లేవా? అనేది సినిమా చూస్తే తెలుస్తుంది. కొన్ని సన్నివేశాల్లో ప్రేక్షకులు వణికిపోతారు. నిర్మాతలు బన్నీ వాసు, వంశీ నందిపాటి ఈ సినిమాను అన్ని వర్గాల ప్రేక్షకులకు చేరువ చేస్తారు' అని చెప్పారు.

శంబాలా.. వింత ప్రపంచం!



ఆది సాయికుమార్ హీరోగా నటించిన థ్రిల్లర్ మూవీ 'శంబాలా' ఈ నెల 25న విడుదల కానుంది. యుగంధర్ ముని దర్శకత్వంలో రూపుదిద్దుకున్న ఈ చిత్రానికి 'ఎ మిస్టికల్ వరల్డ్' అనేది ట్యాగ్‌లైన్. ఈ సినిమాను తెలంగాణ ప్రాంతంలో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ సంస్థ విడుదల చేస్తోంది. 'మా ప్రయాణంలో మైత్రివారు కూడా జాయిన్ కావడం చాలా ఆనందంగా ఉంది. హై టెక్నికల్ స్టాండర్డ్స్‌తో, గ్రాండ్ విజువల్స్‌తో సినిమా ఉంటుంది' అని నిర్మాతలు రాజశేఖర్ అన్నభిమోజు, మహీధర్ రెడ్డి చెప్పారు. ఈ చిత్రంలో ఆది సాయికుమార్ సరసన అర్చన్ అయ్యర్ కథానాయికగా నటించారు. శ్వాసిక కీలక పాత్ర పోషించారు. రవివర్మ, మీసాల లక్ష్మణ్, మధునందన్ కీలక పాత్రల్లో నటించారు.



ప్రత్యేక గీతం మెరుపులు!

సందీప్‌కిషన్ హీరోగా లైకా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తున్న యాక్షన్ అడ్వంచర్ కామెడీ చిత్రం 'సిగ్మా'. జాసన్ సంజయ్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం షూటింగ్ ముగింపు దశకు చేరుకుంది. ఇందులో కొన్ని ప్రత్యేక అతిథి పాత్రలు ఉన్నాయి. అలాగే హీరోయిన్ కేథరిన్ థ్రెస్సా ఓ స్పెషల్ సాంగ్ చేస్తున్నారు. ఇందుకోసం సంగీత దర్శకుడు తమన్ ఓ పవర్‌ఫుల్ ట్రాక్ రెడీ చేశారు. సందీప్‌కిషన్, కేథరిన్‌పై ఓ కలర్‌ఫుల్ సెట్‌లో చిత్రీకరించిన ఈ పాట సినిమాకు హైలైట్‌గా నిలుస్తుందని అంటున్నారు. చెన్నై, తలకోన, థాయ్‌లాండ్‌లో తమిళ, తెలుగు భాషల్లో 'సిగ్మా' షూటింగ్ ఏక కాలంలో జరిగింది. వచ్చే ఏడాది వేసవిలో ఈ చిత్రం విడుదల కానుంది.

నేనేం నిధులు దుర్వినియోగం చేయలేదు

తమ్మారెడ్డి భరద్వాజ



'గతంలో నేను కొంతకాలం చిత్రపురి కాలనీ కమిటీలో సభ్యుడిగా ఉన్నాను. ప్రస్తుతం చిత్రపురి కాలనీ ప్రాజెక్టు మొత్తం విలువ రూ.500 కోట్లు. నేను సభ్యుడిగా చేరేనాటికి అది రూ.180 కోట్లు మాత్రమే. అయితే వందల కోట్లు తినేశారనే దుష్ప్రచారం జరుగుతోంది. ప్రాజెక్టు విలువే రూ.500 కోట్లయితే వందల కోట్ల అవినీతికి ఆస్కారం ఎక్కడుంటుంది. నేనేమీ డబ్బులు తినలేదు. నిధులు దుర్వినియోగం చేయలేదు. గతంలో చిత్రపురి కమిటీలో సభ్యుడిగా ఉన్నందునే నా పేరు నివేదికలో ఉంది. ఆ నివేదిక పూర్తిగా చదివితే అర్థమవుతుంది' అని అన్నారు దర్శకనిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ. చిత్రపురి కాలనీ హౌజింగ్ సొసైటీలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపిన గోల్కొండ కో ఆపరేటివ్ డిప్యూటీ రిజిస్ట్రార్ రాష్ట్ర ప్రభుత్వానికి ఇటీవలె ఓ నివేదికను అందజేసిన విషయం తెలిసిందే. ఈ నివేదికలో తన పేరు చేర్చడంపై తమ్మారెడ్డి భరద్వాజ 'చిత్రజ్యోతి'తో మాట్లాడారు. 'కమిటీలో ఉన్నవారందరినీ బాధ్యుల్ని చేస్తున్నారు. 2005 నుంచి 2010 వరకు ఎలాంటి అక్రమాలు జరగలేదని నివేదికలో పేర్కొన్నారు. ఆ సమయంలో కొంత కాలం నేను సెక్రటరీగా ఉన్నాను. 2010 నుంచి 2015 వరకు కొన్ని అవకతవకలు జరిగాయని చెప్పారు. 2015 తర్వాత నేను, మరో ముగ్గురు సభ్యులం కమిటీ నుంచి రిలీవ్ అయ్యాం. అప్పటి నుంచి జరిగిన వ్యవహారాలకు నాకు సంబంధం లేదు. అయితే నేను కమిటీలో ఉన్న సమయంలో సభ్యుడొకరు రూ. 30 లక్షలు వాటర్ వర్క్స్ కోసం చెల్లించారు. ఆ వివరాలను మినిట్స్‌లో రాయలేదు. దాన్ని గమనించకపోవడం నా బాధ్యతా రాహిత్యమే. అందుకే నాకు భారమైనప్పటికీ నివేదికలో పేర్కొన్న ప్రకారం డబ్బు కట్టేందుకు సిద్ధంగా ఉన్నాను. ఇది నేను వ్యక్తిగతంగా తీసుకున్న నిర్ణయం. నివేదికలో పేర్లు ఉన్న వారంతా కడతారా లేదా అన్నది వారి ఇష్టం. అలాగే నివేదికపై నేను కోర్టుకు వెళ్లే అవకాశమున్నా వెళ్లడం లేదు' అని చెప్పారు.

60 వేలు లంచం తీసుకుంటూ
అదనపు కలెక్టర్ అరెస్టు

(మొదటిపేజీ తరువాయి)

మనోజ్, గౌస్‌లను ఏసీబీ అధికారులు శుక్రవారం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. హనుమకొండ జిల్లా పరిధిలోని కొత్తూరు జెండా ప్రాంతంలోని ప్రైవేటు పాఠశాల క్రియేటివ్ పాఠశాల రెన్యూవల్ కోసం దరఖాస్తు చేసిన కరస్పాండెంట్ పాశికంటి సతీశ్ కుమార్‌ను తన ఇద్దరు జూనియర్ అసిసెంట్ల ద్వారా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి రూ. లక్ష లంచం డిమాండ్ చేశారు. దీంతో రూ.60 వేలు చెల్లించడానికి మనోజ్, గౌస్‌లతో ఒప్పందం కుదుర్చుకున్న పాశికంటి సతీశ్ కుమార్ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వారి సూచన మేరకు శుక్రవారం సాయంత్రం డబ్బులివ్వడానికి డీఈఓ కార్యాలయానికి వెళ్లిన సతీశ్ కుమార్‌ను జూనియర్ అసిస్టెంట్లు కలెక్టరేట్‌కు తీసుకెళ్లారు. అక్కడ అతడి వద్ద రూ.60 వేల నగదు తీసుకుని అదనపు కలెక్టర్ చాంబర్‌లోకి వెళ్లారు. వారి వెంటే చాంబర్‌లోకి వెళ్లిన ఏసీబీ అధికారులు.. అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్లు మనోజ్, గౌస్‌లను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారిని అరెస్టు చేసినట్లు ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపారు. వీరితోపాటు మరో ఇద్దరు ప్రభుత్వోద్యోగులను కూడా ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. సమాచార హక్కు చట్టం కింద తేరట్‌పల్లి గ్రామంలో భూమి అక్రమ రిజిస్ట్రేషన్ వివరాల కోసం పిటిషన్ దాఖలు చేసిన రైతును నల్లగొండ జిల్లా ఉమ్మడి చండూరు (గట్టుప్పల్) ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఉన్న డిప్యూటీ తహసీల్దార్ రూ.20 వేలు డిమాండ్ చేశారు. దీంతో ఏసీబీ అధికారులను ఆశ్రయించిన సదరు రైతు.. వారి సూచన మేరకు గురువారం రాత్రి హైదరాబాద్‌లోని చంద్రశేఖర్ నివాసంలో సదరు రైతు లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టులో హాజరు పర్చగా చంద్రశేఖర్‌ను జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించారు. ఇందిరమ్మ ఇల్లు లబ్దిదారుడికి మొదటి విడత రూ.లక్ష బిల్లు మంజూరు చేయడానికి మంచిర్యాల జిల్లా కన్నెపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి గొల్లపల్లి రాజ్‌కుమార్ రూ.10 వేలు లంచం అడిగాడు. తానంత ఇచ్చుకోలేనని రూ.5,000లకు బేరం కుదుర్చుకున్న బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచన మేరకు బెల్లంపల్లి పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బాధితుడు శుక్రవారం రాత్రి రూ.5,000 నగదు ఇస్తుండగా కార్యదర్శి రాజ్‌కుమార్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు.

జాతీయ న్యాయ సేవల అథారిటీ బోర్డు సభ్యుడిగా జస్టిస్ శ్యాంకోషీ


జస్టిస్ శ్యాంకోషీ

హైదరాబాద్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి, స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ శ్యాంకోషీ జాతీయ న్యాయ సేవల అథారిటీ బోర్డు సభ్యుడిగా ఎంపికయ్యారు. ఈ బోర్డుకు దక్షిణాది రాష్ట్రాల నుంచి ఎంపికైన తొలి వ్యక్తిగా ఆయన నిలిచారు. ప్రస్తుతం ఎంపికైన తొమ్మిది మంది సభ్యుల్లో హైకోర్టు సిట్టింగ్ జడ్జిగా పనిచేస్తున్నది జస్టిస్ శ్యాంకోషీ ఒక్కరే కావడం విశేషం. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో సంప్రదింపులు జరిపిన అనంతరం కేంద్ర న్యాయశాఖ ఈ మేరకు నోటిఫికేషన్ జారీచేసింది.

వ్యక్తిగత హాజరు నుంచి హైడ్రా కమిషనర్‌కు మినహాయింపు

హైదరాబాద్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట్‌లోని బతుకమ్మకుంట పునరుద్ధరణకు సంబంధించి దాఖలైన కోర్టు ధిక్కరణ పిటిషన్‌లో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు హైకోర్టులో ఊరట లభించింది. భవిష్యత్తులో జరిగే విచారణకు వ్యక్తిగతంగా హాజరుకాకుండా ఆయనకు మినహాయింపు ఇస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. బతుకమ్మకుంటకు సంబంధించిన భూ వివాదం కేసు పెండింగ్‌లో ఉండగానే భూస్వరూపాన్ని మార్చారని పేర్కొంటూ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైంది. దీనిపై జస్టిస్ మౌషమీ భట్టాచార్య, జస్టిస్ మధుసూదన్‌రావుల ధర్మాసనం మరోసారి విచారణ చేపట్టింది. శుక్రవారం వ్యక్తిగతంగా హాజరైన హైడ్రా కమిషనర్ రంగనాథ్.. ముందస్తు షెడ్యూల్ వల్ల గత విచారణకు రాలేకపోయినట్లు నివేదించారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఆయనకు మినహాయింపు ఇచ్చింది. విచారణను ఈనెల 18కి వాయిదా వేసింది.

సీఎంగారూ.. పోలీసులపై ఎందుకీ కక్ష: హరీశ్

హైదరాబాద్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నిత్యం ప్రజల భద్రత కోసం కృషిచేసే పోలీసులకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యాన్ని దూరంచేసి, నిమ్స్ ఆస్పత్రికే పరిమితం చేయడం శోచనీయమని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. రేవంత్‌రెడ్డి పాలనలో పోలీసుల ఆరోగ్యభద్రత గాల్లో దీపంలా మారిందని, ప్రజల ప్రాణాలకు రక్షగా ఉండే పోలీసులకే రక్షణ కరువైన దిక్కుమాలిన ప్రభుత్వమిదని శుక్రవారం ఎక్స్ వేదికగా ఆయన విమర్శించారు. సీఎం గారూ పోలీసులపై ఎందుకీ కక్ష అని నిలదీశారు. ప్రభుత్వం ప్రైవేటు ఆస్పత్రులకు పెండింగ్ బకాయిలు చెల్లించకుండా ఆరోగ్యభద్రత ద్వారా పోలీసులకు అందించే వైద్య చికిత్సలను నిమ్స్ ఆస్పత్రికే పరిమితం చేయడం దుర్మార్గమని ఆయన మండిపడ్డారు.

ఐబొమ్మ రవికి మరో 3 రోజుల కస్టడీ

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఐబొమ్మ రవిని మరో 3 రోజుల పాటు విచారణ చేసేందుకు న్యాయస్థానం పోలీసు కస్టడీకి అనుమతించింది. రవిని ఇప్పటికే రెండుసార్లు కస్టడీలోకి తీసుకున్న పోలీసులు 8 రోజుల పాటు విచారణ చేశారు. ఈ విచారణలో అనేక విషయాలను రాబట్టారు. అయితే, అతడిని మరింత లోతుగా విచారణ చేసేందుకు మరో 3 రోజులు పోలీస్ కస్టడీకి ఇవ్వాల్సిందిగా సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మరోవైపు, రవికి బెయిల్ మంజూరు చేయాలని, అతడి తరఫు న్యాయవాది పిటిషన్ దాఖలు చేశారు. దీంతో ఇరువర్గాల వాదనలు విన్న న్యాయస్థానం రవిని పోలీస్ కస్టడీకి అనుమతిస్తూ శుక్రవారం ఆదేశాలిచ్చింది. సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు నిందితుణ్ని చంచల్‌గూడ జైల్లో శనివారం అదుపులోకి తీసుకోనున్నారు.

యంగ్ ఇండియన్‌కు విరాళాల వివరాలివ్వండి

- టీపీసీసీ ఉపాధ్యక్షుడు అనిల్‌కు ఢిల్లీ ఈఓడబ్ల్యూ నోటీసులు

హైదరాబాద్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హెరాల్డ్ కేసుకు సంబంధించి తెలంగాణకు చెందిన మరో కాంగ్రెస్ నేతకు శుక్రవారం నోటీసులు అందాయి. టీపీసీసీ ఉపాధ్యక్షుడు గాలి అనిల్‌కుమార్‌కు ఢిల్లీ పోలీస్ ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్ (ఈఓడబ్ల్యూ) ఈ నోటీసులు పంపింది. యంగ్ ఇండియన్ సంస్థకు అనిల్‌కుమార్ ఇచ్చిన విరాళాలకు సంబంధించిన వివరాలు ఈ నెల 22 కల్లా వెల్లడించాలని ఆ నోటీసుల్లో ఈఓడబ్ల్యూ పేర్కొంది.

జనవరి 2 నుంచి 8 వరకు తిరుమలకు వచ్చే అందరికీ వైకుంఠ ద్వార దర్శనం

- టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్


తిరుమల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): 'వైకుంఠద్వార దర్శనాలన్నీ ఆన్‌లైన్‌లోనే ఇస్తున్నారని కొందరు భక్తులు అపోహపడుతున్నారు. ఇది నిజం కాదు. తొలి మూడు రోజులకు మాత్రమే ఈ-డిప్‌లో దర్శనాలు కేటాయించాం. మిగిలిన ఏడు రోజులూ తిరుమలకు నేరుగా వచ్చే భక్తులందరికీ క్యూలైన్ ద్వారానే వైకుంఠ ద్వార దర్శనాలు కల్పిస్తాం' అని టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ స్పష్టం చేశారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో శుక్రవారం జరిగిన డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో ముందుగా భక్తులకు ఆయన ఈ వివరణ ఇచ్చారు. వైకుంఠ ద్వారాలు తెరచి ఉంచే పది రోజుల్లో స్వామివారి కైంకర్యాలకుపోను 182 గంటల దర్శన సమయం ఉండగా, ఇందులో సామాన్య భక్తులకే 164.15 గంటలు కేటాయించామని చెప్పారు. జనవరి 2 నుంచి 8వ తేదీ వరకు ఎలాంటి టికెట్లు, టోకెన్లు లేకపోయినా నేరుగా తిరుమలకు వచ్చి వైకుంఠం క్యూకాంప్లెక్స్ ద్వారా వైకుంఠద్వార దర్శనం చేసుకోవచ్చని తెలిపారు.

విత్‌డ్రా చేసుకోండి
లేదంటే తీవ్ర పరిణామాలుంటాయ్

- సర్పంచ్ అభ్యర్థిని బెదిరిస్తూ దళం పేరుతో లేఖ!
- ఆసిఫాబాద్ జిల్లాలో ఘటన

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)


కొత్తగూడెం జిల్లా కాకర్లలో నామినేషన్ ఫీజు కోసం చందాలు వసూలు చేస్తున్న మహిళా అభ్యర్థి బానోత్ బద్రి భర్త; చిత్రంలో బద్రి


దళం పేరుతో అందజేసిన హెచ్చరిక లేఖ

నామినేషన్ ఉపసంహరించుకోవాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఉంటాయంటూ ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలం రన్‌వెల్లి సర్పంచ్‌గా నామినేషన్ వేసిన మహిళా అభ్యర్థి జాడి దర్శనకు దళం పేరుతో ఉత్తరం రావడం తీవ్ర కలకలంరేపింది. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మద్దతుతో జాడి దర్శన ఇదివరకే నామినేషన్ వేశారు. దర్శన మామ బాబు పశువులు మేపేందుకు ప్రాణహిత కాలువ వద్దకు వెళ్లారు. గురువారం సాయంత్రం బైక్‌పై వచ్చిన ఓ వ్యక్తి, బాబు తలకు తుపాకీ గురిపెట్టి.. "ఇది నీ కొడుక్కి (దర్శన భర్త రంజిత్) ఇవ్వు" అంటూ తాను ఇచ్చిన ఉత్తరాన్ని అతడి చేతుల్లో పెట్టాడు. ఈ విషయాన్ని బాబు తన కుటుంబసభ్యులకు చెప్పడంతో వారు కౌటాల సీఐ సంతోష్‌కు ఫిర్యాదు చేశారు. శుక్రవారం సాయంత్రం పోలీసులు గ్రామంలో కవాతు నిర్వహించారు. ఎలాంటి భయాందోళనలకు గురవ్వొద్దని, గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తామని అభ్యర్థి కుటుంబానికి పోలీసులు భరోసా ఇచ్చారు. కాగా ఎన్నికల్లో పోటీ చేసేవారు నామినేషన్ వేసేలోపే రూ.2లక్షలు ఖర్చుచేశారని.. ఓటును నోటుతో కొనుగోలు చేయాలనుకుంటున్నారని, అందుకే.. నామినేషన్ ఉపసంహరించుకోవాలని తాము హెచ్చరిస్తున్నామని, దీనిపై పోలీసులను సంప్రదిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయంటూ ఆ లేఖలో ఉంది. కాగా గద్వాల రూరల్ ఈడిగోనిపల్లిలో సర్పంచ్ పదవి కోసం వేలంపాట ఒకరు పాడగా, నాటకీయ పరిణామాల మధ్య మరొకరు సర్పంచ్ అయ్యారు. ఆ గ్రామాన్ని బీసీ మహిళకు రిజర్వ్ చేశారు. సర్పంచ్ పదవిని వేలంపాట ద్వారా ఏకగ్రీవం చేద్దామని, వచ్చి డబ్బుతో హనుమాన్ ఆలయానికి బాటను కొనుగోలు చేద్దామని పెద్దలు నిర్ణయించారు. వేలంపాటలో నలుగురు పోటీపడ్డారు. తన భార్య సరస్వతిని సర్పంచ్‌గా ఎన్నుకొంటే రూ.9.8 లక్షలు ఇస్తానంటూ రాఘవేంద్ర అనే వ్యక్తి వేలంపాట పాడి నెగ్గారు. అయితే ఉప సర్పంచ్‌గా తనకు నచ్చిన మెంబర్‌ను ఎన్నుకుంటానని ఆయన షరతుపెట్టారు. దీనికి రమేశ్ అనే వ్యక్తి అడ్డుచెప్పారు. పెద్దలు మాత్రం రాఘవేంద్రకే మద్దతు పలికి అడ్వాన్సుగా రూ.లక్ష తీసుకున్నారు. మర్నాడు రాఘవేంద్ర భార్య సరస్వతి నామినేషన్ వేయాల్సి ఉంది. అయితే అంతకు ముందే తనభార్య రాణితో రమేశ్ నామినేషన్ వేయించారు. దీనిపై అభ్యంతరం చెప్పిన రాఘవేంద్ర విషయం పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. 'వేలంపాట డబ్బులు ఎవరు ఇస్తే ఏముంది? ఇచ్చిన అడ్వాన్సుకు రెండింతల డబ్బు తీసుకో, లేదంటే నామినేషన్ వేసుకో' అంటూ వారు రాఘవేంద్రకు చెప్పారు. రాఘవేంద్ర, పెద్దల మాటను గౌరవించి వేలంపాట పాడినా నామినేషన్ వేయలేదు. రమేశ్ భార్య రాణి మాత్రమే నామినేషన్ వేయడంతో ఆమెకే సర్పంచ్ పదవి దక్కింది. అలాగే 8 మంది వార్డు సభ్యులు ఏకగ్రీవం అయ్యారు. ఇక్కడే కథ అడ్డం తిరిగింది. ఏకగ్రీవమైన సర్పంచ్ తాను డబ్బులు ఇస్తానని చెప్పలేదని, ఆంజనేయ స్వామి ఆలయానికి బాటను కొని ఇవ్వలేనని చేతులెత్తేసినట్లు గ్రామస్థులు చెబుతున్నారు.

పోటీలో తల్లి.. పోస్టర్లలో కొడుకు

నిజామాబాద్ జిల్లా పోతంగల్ ఫారం గ్రామంలో తల్లి రజియా బేగం నామినేషన్ వేయగా, ఆమె కుమారుడు ఫిరోజ్.. వాల్‌పోస్టర్లలో తన పేరు, ఫొటో ముద్రించుకొని గ్రామాల్లో అంటించడం కలకలం రేగింది. దీన్ని ఎన్నికల నియమావళి ఉల్లంఘన కింద పరిగణించి ఉన్నతాధికారులకు సమాచారం అందించినట్లు మండలాధికారులు వెల్లడించారు. కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం కాకర్లలో ఓ మహిళా సర్పంచ్ అభ్యర్థి బాణోత్ బద్రి నామినేషన్ వేసేందుకు ఊర్లో జోలె పట్టారు. వచ్చిన డబ్బుతో నామినేషన్ వేశారు. సంగారెడ్డి జిల్లా కంది మండలం కవలంపేటలో భార్య యాస్మిన్ సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేయగా, భర్త మహ్మద్ బాబా మెంబర్‌గా నామినేషన్ వేశారు. సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం చింతల్‌ఠాణాకు చెందిన సర్పంచ్ అభ్యర్థి చెర్ల మురళి(50) గురువారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం జిల్లెలగడ్డకు చెందిన లావుడ్య రవి అనే ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీ యజమాని సర్పంచ్‌గా నామినేషన్ వేశారు. తాను ఇప్పటిదాకా సంపాదించుకున్నది చాలని, సమాజంలో మరింత గుర్తింపు పొందాలంటే రాజకీయంగా ఎదగాలన్నది తన కోరిక అని రవి చెప్పారు. కాగా, చివరి విడత ఈనెల 17న జరిగే పంచాయతీ ఎన్నికల పోలింగ్‌కు సంబంధించిన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ శుక్రవారం ముగిసింది. మూడో విడత ఎన్నికల్లో భాగంగా ఖమ్మం జిల్లాలో 11 గ్రామాలు ఏకగ్రీవమయ్యాయి.

పేదింటి ఆడబిడ్డ పెళ్లికి 25వేలు.. గృహప్రవేశానికి 10వేలు

ఇవి.. ఖమ్మం జిల్లా కల్లూరు మండలం పేరువంచ గ్రామంలో సర్పంచ్ అభ్యర్థిగా నిల్చున్న కొండపల్లి శ్రీనివాసరావు ఇచ్చిన హామీలు! ఇవే కాదు.. మొత్తంగా 12 హామీలను ఆయన గ్రామస్థులకు ఇచ్చారు. వీటిని బాండ్ పేపర్‌పై ముద్రించి విడుదల చేశారు. ఆ హామీల్లో ఆడబిడ్డ ప్రసవానికి రూ.10,116, వ్యవసాయ కార్మికులకు సొంతడబ్బుతో ప్రమాద బీమా, అత్యవసరవైద్య చికిత్స కోసం రూ.5వేల నుంచి రూ.10వేల సాయం వంటి హామీలు ఆ పత్రంలో ఉన్నాయి. శుక్రవారం ఆయన నామినేషన్ వేశారు.

పొంగులేటి స్వగ్రామంలో ఎన్నిక ఏకగ్రీవం

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్వగ్రామమైన ఖమ్మం జిల్లా కల్లూరు మండలం నారాయణపురం గ్రామంలో సర్పంచ్, వార్డు మెంబర్ల ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. కాంగ్రెస్ మద్దతుతో గొల్లమండల వెంకటేశ్వర్లు ఒక్కరే నామినేషన్ వేయటంతో ఆయనే సర్పంచ్ కానున్నారు. గ్రామ ప్రముఖులైన పొంగులేటి ప్రసాదరెడ్డి, పొంగులేటి మహేందర్‌రెడ్డి సమక్షంలో గ్రామస్థులు సమావేశమై సర్పంచ్ ఎన్నిక విషయంలో ఏకాభిప్రాయానికి వచ్చారు. గ్రామ అభివృద్ధిని ఆకాంక్షిస్తూ సర్పంచ్ అభ్యర్థిగా వెంకటేశ్వర్లు ఒక్కడితో నామినేషన్ వేయించడంతో పాటు పది వార్డులకు కూడా ఒక్కో అభ్యర్థితోనే నామినేషన్లు వేయించడంతో అవి కూడా ఏకగ్రీవమయ్యాయి. ఈ గ్రామ పంచాయతీని ఎస్సీ జనరల్‌కు రిజర్వ్ చేశారు.


విచారణ జరుపుతున్న పోలీసులు

ఏకగ్రీవానికి వేలంపాట.. 35 మందిపై కేసు

(మొదటిపేజీ తరువాయి)

సిద్దిపేట త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బొగ్గులోనిబండ సర్పంచ్ స్థానానికి పోటీ చేసేందుకు అందే శంకర్, బైరి రాజు, అందే ఆంజనేయులు అనే వ్యక్తులు ముందుకొచ్చారు. సర్పంచ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు మూడు రోజుల క్రితం గ్రామ పెద్దలు వేలంపాట నిర్వహించగా రూ.16.30లక్షలకు అందే శంకర్ గెలిచారని సమాచారం. అయితే, వేలం అనంతరం పోటీ నుంచి తప్పుకున్న మిగిలిన ఇద్దరిలో ఒకరైన బైరి రాజు నామినేషన్ వేయడంతో గ్రామ ప్రజలు శుక్రవారం మరోసారి సమావేశమయ్యారు. ఈ విషయం పోలీసులు దృష్టికి రాగా ఎన్నికల విభాగానికి చెందిన ఎఫ్ఎస్‌టీ ఇన్‌చార్జి వంశీకృష్ణతో కలిసి సీఐ గ్రామంలో విచారణ చేపట్టారు. వేలంపాట విషయం నిజమేనని తేలడంతో ఎన్నికల నిబంధనల ఉల్లంఘనకు పాల్పడిన అభ్యర్థులు, కుల సంఘ పెద్దలు, గ్రామ ఆలయ కమిటీ సభ్యులు కలిపి మొత్తం 35 మందిపై కేసులు నమోదు చేశారు. వేలం పాటకు సంబంధించిన రికార్డులు, 11 వాహనాలను సీజ్ చేశారు. కాగా, వేలంపాటలో గెలుపొందిన అందే శంకర్ ఇప్పటికే రూ.10లక్షలు కులపెద్దలకు ఇచ్చాడని, బైరి రాజు తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నాడని సమాచారం.

వేలం పాటలపై ఈసీ ఏం చేస్తోంది?: డీకే అరుణ



హైదరాబాద్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రలోభాలు, వేలం పాటలతో పంచాయతీలను ఏకగ్రీవం చేస్తుంటే.. ఎన్నికల కమిషన్ ఏం చేస్తోందని బీజేపీ ఎంపీ డీకే అరుణ ప్రశ్నించారు. పార్లమెంటు సమావేశాల సందర్భంగా ఢిల్లీలో ఉన్న ఆమె శుక్రవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదినికి ఫోన్ చేసి మాట్లాడారు. ఏకాభిప్రాయంతో జరిగే ఏకగ్రీవాలను తాము స్వాగతిస్తామని అరుణ అన్నారు. ప్రలోభాలు, వేలం పాటలతో జరిగే ఏకగ్రీవాలు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని స్పష్టం చేశారు. ఏకగ్రీవాల గురించి రెవెన్యూ, పోలీసు అధికారులకు తెలియదని చెప్పడం.. కళ్లుండీ చూడకపోవడమే అవుతుందని అరుణ పేర్కొన్నారు.

స్త్రీ పథకానికి 31 వరకు గడువు

- ఈఎస్ఐలో కొనసాగుతున్న ఉద్యోగులు,కంపెనీల నమోదు ప్రోత్సాహక పథకం
- సరళమైన, ఆన్‌లైన్ విధానంలో రిజిస్ట్రేషన్లు

హైదరాబాద్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): వివిధ రకాల ఉపాధి కల్పనా సంస్థలతో పాటు అందులో పని చేసే వారి నమోదును ప్రోత్సహించేందుకు ఈఎస్ఐసీ ప్రవేశ పెట్టిన స్ప్రీ(స్కీమ్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎంప్లాయర్స్ అండ్ ఎంప్లాయీస్-2025) పథకం గడువు ఈ నెల 31తో ముగియనుంది. ఈఎస్ఐలో ఇప్పటి వరకు నమోదు చేసుకోని కంపెనీలు, సంస్థలు.. అర్హత కలిగిన ఉద్యోగులు, కార్మికుల స్వీయ నమోదును ప్రోత్సహించడానికి ఈ ఏడాది జూలై 1న ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఇందులో భాగంగా పది లేదా అంత కంటే ఎక్కువ మంది కార్మికులను నియమించుకునే కర్మాగారాలు, దుకాణాలు, హోటళ్లు, రెస్టారెంట్లు, సినిమా థియేటర్లు, రవాణా సంస్థలు, ప్రైవేట్ సంస్థలు మొదలైన వాటిని నిర్వహించేవారు ఈఎస్ఐసీ పోర్టల్, శ్రమ్ సువిధా పోర్టల్, ఎంసీఏ పోర్టల్ ద్వారా తమ సంస్థలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఈ ప్రక్రియ పూర్తిగా డిజిటల్, సరళమైనది. ఈ పథకం కింద యజమాని పేర్కొన్న తేదీ నుంచి కవరేజ్ ప్రారంభమవుతుంది. దీనికి గత రికార్డులను సమర్పించాల్సిన అవసరం లేదు. గతానికి సంబంధించిన రికార్డులు తనిఖీలు చేయించుకోవాల్సిన అవసరం లేకుండా ఉద్యోగులు ఈఎస్ఐ చట్టం కింద అందించే సామాజిక భద్రతా ప్రయోజనాలను పొందగలరు. ఇందులో భాగంగా ప్రాథమిక, మాధ్యమిక, తృతీయ స్థాయిలలో సమగ్ర వైద్య సంరక్షణ, ప్రసూతి సమయంలో నగదు ప్రయోజనాలు, విధి నిర్వహణలో ప్రమాదం, మరణం సంభవించినపుడు పరిహారం.. అర్హత గల కార్మికుల పిల్లలు ఈఎస్ఐసీ వైద్య, దంత కళాశాలల్లో వైద్య విద్యా కోర్సుల్లో రిజర్వేషన్లను పొందవచ్చు.

దేశంలోని 668 జిల్లాలలో అమలు

స్ప్రీ పథకం ప్రస్తుతం 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాల్లోని 668 జిల్లాల్లో అమలులో ఉంది. వీటిలో 565 జిల్లాలు పూర్తిగా నోటిఫై అయ్యాయి. ఈఎస్ఐ చట్టం కింద 2017 జనవరి 1 నుంచి ఈ పథకం పొందే కార్మికుల వేతన పరిమితి నెలకు రూ.21 వేలుగా (దివ్యాంగులకు రూ.25వేలు)ఉంది. 2019 జూలై 1 నుంచి ఉద్యోగుల వేతనాల నుంచి 0.75 శాతం వాటా, యజమానుల నుంచి 3.25 శాతం వాటా ఈఎస్ఐకి జమవుతోంది. తెలంగాణలో ఈ పథకం కింద 2024-25 ఆర్థిక సంవత్సరం వరకు 19.16 లక్షల మంది పురుషులు, 5.37 లక్షల మంది మహిళలు, 1.36 లక్షల మంది యజమానులు, 76.64 లక్షల మంది లబ్ధిదారుల కుటుంబ సభ్యులు ఉన్నారు. ఈ పథకం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 70 డిస్పెన్సరీలు, 10 డీసీబీలు, 8 బ్రాంచ్ ఆఫీసుల ద్వారా ప్రాథమిక ఆరోగ్య సౌకర్యాలను అందిస్తోంది. హైదరాబాద్‌లోని సనత్‌నగర్‌లో ఉన్న ఈఎస్ఐసీ వైద్య విద్యా కళాశాల, హాస్పిటల్.. ఈఎస్ఐసీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ద్వారా ఉన్నత స్థాయి ఆరోగ్య సేవలు అందుబాటులో ఉన్నాయి. ఈఎస్ఐసీ ఆసుపత్రుల్లో ప్రత్యేక చికిత్స అందుబాటులో లేని సందర్భాల్లో.. ఇతర ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారు.

ఇంట్లోనే తమ్మీ.. వీధిలో అమీతుమీ!

సర్పంచ్ ఎన్నికల్లో కొన్నిచోట్ల కుటుంబసభ్యుల మధ్యే పోరు.. అన్నదమ్ములు, అత్తాకోడళ్లు, తండ్రీకొడుకులు

- రిజర్వేషన్లు అనుకూలించడంతో ఇప్పుడుకాకపోతే మరెప్పుడూ అవకాశం రాదనే ఉద్దేశంతోనే..
- కొన్నిచోట్ల కుటుంబ తగాదాలతో..

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

సర్పంచ్ ఎన్నికల సీజన్ కావడంతో గ్రామం వర్గాలుగా చీలిపోవడం సహజం! మరి.. కుటుంబాలే రెండుగా చీలిపోతే? ఆ క్షణం దాకా ఇంట్లో కలివిడిగా ఉన్నవాళ్లే పలకరింపులు కూడా లేకుండా చురచుర చూపులు అనే కత్తులతో యుద్ధ వాతావరణాన్ని సృష్టించుకుంటే? గ్రామ వీధుల్లో పరస్పరం వ్యతిరేకంగా ప్రచారంతో సెగలు పుట్టిస్తే? కొన్నిగ్రామాల్లో ఇప్పుడిదే కనిపిస్తోంది. అన్నదమ్ములు, తండ్రీకొడుకులు, తోటికోడళ్లు, అన్నాచెల్లెళ్లు, తల్లీకూతుళ్లు, మామా అల్లుళ్లు, బావబావమరుదులు సర్పంచ్ ఎన్నికల్లో ప్రత్యర్థులుగా నిలబడ్డారు. రిజర్వేషన్లు అనుకూలించడంతో ఇప్పుడు కాకపోతే మరెప్పుడూ అవకాశం రాదని, వచ్చినా అదెప్పుడోనన్న ఉద్దేశంతో 'సర్పంచ్ సాబ్' అనిపించుకునేందుకు 'నేనంటే నేను' అంటూ ఒకే కుటుంబానికి చెందిన వాళ్లు పోటాపోటీగా నామినేషన్లు వేశారు. దగ్గరి బంధువులు, స్నేహితులు నచ్చజెప్పినా ఉపసంహరణకు ససేమిరా అంటూ బరిలో నిలిచారు. మెదక్ జిల్లా రామాయంపేట మండలం ఝాన్సీ లింగాపూర్‌లో ప్రధాన పార్టీల మద్దతుతో తండ్రీకొడుకులు మానెగల రామకృష్ణయ్య, మానెగల వెంకట్ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. తండ్రీకొడుకుల మధ్య ఆస్తి పంపకాలకు సంబంధించి తగాదాలున్నాయని, తండ్రి రామకృష్ణయ్యపై ఆధిపత్యం చాటుకునేందుకే వెంకట్ బరిలోకి దిగారని అంటున్నారు. తండ్రిపై పోటీ వద్దంటూ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు నచ్చజెప్పినా వెంకట్ వినలేదని తెలిసింది. సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం గూడెపుపల్లి గ్రామంలో ఇద్దరు అన్నదమ్ముల మధ్య మనస్పర్థలు ఉండటంతో సతీమణులైన గూడెల్లి శ్యామల, గూడెల్లి స్వప్నలను బరిలోకి దింపారు. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం తిమ్మాయపల్లిలో తల్లి గంగవ్వ, కూతురు సుమలత పోటీపడుతున్నారు. జిల్లాలోని కోరుట్ల మండలం గుంలాపూర్ గ్రామంలో అన్నాచెల్లెళ్ల తేడు శివ కుమార్, రూట్ల స్రవంతి రేసులో నిలిచారు. బీర్‌పూర్ మండ లం ఇందిరానగర్‌లో సమీపబంధువులు పూడూరి శ్రీలత, నారాపాక ఇంద్రజ నామినేషన్లు వేశారు. బీర్‌పూర్ మండలం చిత్రవేణి గూడెంలో మేనమామ చిత్రం మారుతి, మేనల్లుడు పోట్నాక కిరణ్ పోటాపోటీగా నామినేషన్లు సమర్పించారు. కరీంనగర్ జిల్లా చెర్లబూత్కూర్, ఎలబోతారంలో వరుసగా అన్నదమ్ముల పిల్లలు కూర నరేశ్‌రెడ్డి, కూర శ్యాంసుందర్‌రెడ్డి.. బుచ్చల మల్లేశం, బుచ్చల కొమురయ్య, తిమ్మాపూర్ మండలం కొత్తపల్లిలో తోడికోడళ్లు గోదారి లక్ష్మి, గోదారి శోభారాణి నామినేషన్లు దాఖలు చేశారు. మానకొండూర్ మండలం లింగాపూర్‌లో ఇద్దరు తో డికోడళ్లు పోటీకి సై అన్నారు. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం అల్లీపూర్‌లో తోడికోడళ్లు కొత్తపల్లి నర్సయ్య సతీమణి చంద్రకళ, కొత్తపల్లి చిరంజీవి సతీమణి కళ ఎన్నికల్లో నిల్చున్నారు. మంచిర్యాల జిల్లా హాజీపూర్‌లో వదిన, మరిది బరిలో నిలిచారు. ఇక్కడ మాధవరపు వెంకటరమణరావును బీజేపీ బలపరుస్తుండగా, అతడిఅన్న రామారావు సతీమణి శ్రీలతకు బీఆర్ఎస్ మద్దతిస్తోంది. ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూరు మండలం బారెగూడలో తోడికోడళ్లు రేణికుంట్ల రేఖ, రేణుకుంట్ల ధనలక్ష్మి రేసులో నిలిచారు. పెంచికలపేట మండలం పోతెపల్లిలో బాబాయి, అబ్బాయి పోటీ పడుతున్నారు. సర్పంచ్ స్థానం ఎస్సీ జనరల్‌కు కేటాయించగా దుర్గం రాజు, తన సోదరుడి కుమారుడైన దుర్గం పోశన్న బరిలో నిలిచారు. దహెగాం మండలం లగ్గాం గ్రామంలో అన్నదమ్ములు మోరె వెంకన్న, మోరె తిరుపతి, బాబాయి, అబ్బాయిలు కొండ్రె ప్రభాకర్ గౌడ్, కొండ్రె మహేశ్ గౌడ్ బరిలో ఉన్నారు. వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలం తిరుమలాపూర్‌లో ఇద్దరు అత్తాకోడళ్లు బరిలో నిలిచారు. కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం కరడ్‌పల్లిలో ఇద్దరు తోడికోడళ్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

మళ్లీ వచ్చేది మన ప్రభుత్వమే

- అన్ని కాలాలు ఒకేలా ఉండవ్: కేసీఆర్
- కేసీఆర్ దత్తత గ్రామాల్లో ఏకగ్రీవం
- బీఆర్ఎస్ అధినేతను కలిసిన ఎర్రవల్లి, నర్సన్నపేట నూతన సర్పంచ్‌లు


ఎర్రవల్లి నూతన సర్పంచ్ కవితను సత్కరిస్తున్న కేసీఆర్

హైదరాబాద్, మర్కుక్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పాలనలో ప్రగతిబాట పట్టిన గ్రామాలన్నీ కాంగ్రెస్ పాలనలో కునారిల్లిపోతున్నాయని, రాష్ట్రంలో మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. గ్రామాలకు తిరిగి మంచి రోజులు వస్తాయని పేర్కొన్నారు. కేసీఆర్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు దత్తత తీసుకున్న ఎర్రవెల్లి, నర్సన్నపేట గ్రామ సర్పంచ్ స్థానాలతోపాటు ఆ గ్రామాల్లోని పలు వార్డు మెంబర్ స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. ఈ నేపథ్యంలో ఎర్రవల్లి సర్పంచ్‌గా ఎన్నికైన కవిత, నర్సన్నపేట సర్పంచ్‌గా ఎన్నికైన బాల్‌నర్సయ్య, పలువురు వార్డు సభ్యులు సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో మాజీ సీఎం కేసీఆర్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఏకగ్రీవంగా ఎన్నికైనవారిని మాజీ సీఎం సత్కరించి అభినందించారు. అనంతరం ఆ సర్పంచ్‌లు, వార్డు సభ్యులను ఉద్దేశించి మాట్లాడారు. అన్ని కాలాలు ఒకేలా అనుకూలంగా ఉండవని, కొన్ని సమయాల్లో కష్టాలు వస్తాయని, వాటిని ధైర్యంగా ఎదుర్కోవాలని కేసీఆర్ ఉద్బోధించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అందించిన స్ఫూర్తితో స్వయంశక్తితో పల్లెలను అభివృద్ధి చేసుకుంటూ ముందడుగు వేయాలని, గ్రామాభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ఎవరో ఏదో చేస్తారని ఆశించకుండా.. గంగదేవిపల్లిలాంటి అభివృద్ధి చెందిన స్వయం సహాయక గ్రామాలను ఆదర్శంగా తీసుకొని పని చేయాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతో కమిటీలు వేసుకొని, ప్రజాప్రతినిధులు తమ పల్లెల ప్రగతికి కృషి చేయాలన్నారు. బంగ్లాదేశ్‌కు చెందిన సామాజిక ఆర్థికవేత్త, స్వయం సహాయక బృందాల ఏర్పాటుకు స్ఫూర్తిదాత ప్రొఫెసర్ యూనిస్‌తోపాటు దేశానికే చెందిన అన్నా హజారే వంటి వారి కృషిని కేసీఆర్ ఈ సందర్భంగా వారికి వివరించారు.

ఆరు గ్యారంటీల అమల్లో కాంగ్రెస్ విఫలం

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

హైదరాబాద్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు వాటిని పూర్తిగా విస్మరించిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు విమర్శించారు. రెండేళ్లు గడచినా ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయలేకపోయారని రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. రైతు భరోసా, చేయూత, యువ వికాసం, మహాలక్ష్మి, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్ల పేరిట ప్రకటించిన ఆరు గ్యారంటీలలోని అనేక హామీలను గాలికి వదిలేశారన్నారు. ముఖ్యంగా, రూ.2 లక్షల పంట రుణమాఫీని కేవలం మొక్కుబడిగా పూర్తి చేసి చేతులు దులుపుకొన్నారని విమర్శించారు. కౌలు రైతులకు ఇస్తామన్న రూ.12 వేలు, ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, యువ వికాసంలో భాగంగా విద్యార్థులకు రూ.5 లక్షల విద్యాభరోసా కార్డు, ప్రతి మండలానికో అంతర్జాతీయ స్థాయి పాఠశాల వంటి హామీలేవీ అమలుకు నోచుకోలేదన్నారు. నిరుద్యోగ భృతి, పంటలకు రూ.500 బోనస్ ఊసే లేదని ఓ ప్రకటనలో ఆయన విమర్శించారు. ఇదే సందర్భంలో, మేడిపల్లిలో బీసీ యువకుడు ఈశ్వరాచారి ఆత్మహత్యకు కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డిదే పూర్తి బాధ్యత అని రాంచందర్‌రావు పేర్కొన్నారు. బీసీలకు 42% రిజర్వేషన్ అమలు చేయకపోవడంతో పాటు ప్రభుత్వ వివక్ష కారణంగానే ఆ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపించారు.



ఏపీ సీఎం చంద్రబాబును కలిసిన మంత్రి కోమటిరెడ్డి

గ్లోబల్ సదస్సుకు రండి

- ఏపీ సీఎం చంద్రబాబుకు మంత్రి కోమటిరెడ్డి ఆహ్వానం
- తమిళనాడు, జమ్మూకశ్మీర్ సీఎంలకు ఉత్తమ్ ఆహ్వానం
- అసోం సీఎంను కలిసి ఆహ్వాన పత్రిక ఇచ్చిన జూపల్లి..
- సదస్సుకు రావాలంటూ మమతా బెనర్జీకి సీతక్క మెయిల్

అమరావతి/హైదరాబాద్/చెన్నై, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సు-2025కు రావాలని వివిధ రాష్ట్రాల సీఎంలను మంత్రులు ఆహ్వానించారు. శుక్రవారం ఏపీ రాజధాని అమరావతిలో ఆ రాష్ట్ర సీఎం చంద్రబాబును మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కలిశారు. ఈ నెల 8, 9 తేదీల్లో నిర్వహించనున్న గ్లోబల్ సదస్సుకు రావాలని ఆహ్వానించారు. దావోస్ సమ్మిట్ తరహాలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ సంస్థల ప్రతినిధులు, వ్యాపారవేత్తలు, నిపుణులు హాజరవుతున్నారని వివరించారు. కాగా, చంద్రబాబును కలవడానికి ముందు, ఆ తర్వాత కోమటిరెడ్డి విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రానికి చంద్రబాబు సీఎంగా ఉండగా విజన్-2020, ఐటీపై మాట్లాడితే చాలామంది నమ్మలేదని.. ఇప్పుడు బెంగళూరు తర్వాత ఐటీలో హైదరాబాద్ రెండో స్థానంలో ఉందని చెప్పారు. చంద్రబాబు తర్వాత రాజశేఖరరెడ్డి దాన్ని కొనసాగించారని, బీఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్ అభివృద్ధిని పట్టించుకోలేదని విమర్శించారు. తాము చంద్రబాబు సలహాలు కూడా తీసుకుంటామని, తెలుగు రాష్ట్రాలు పోటీపడి అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

సీఎంలను ఆహ్వానించిన మంత్రులు

తెలంగాణ రైజింగ్ సదస్సుకు రావాలని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్‌ను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆహ్వానించారు. శుక్రవారం చెన్నైలోని తమిళనాడు సచివాలయానికి వెళ్లి స్టాలిన్‌తో భేటీ అయ్యారు. అనంతరం ఢిల్లీకి చేరుకున్న ఉత్తమ్.. అక్కడ జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లాను కలిసి సదస్సుకు ఆహ్వానించారు. దీనిపై సీఎం రేవంత్, ఉత్తమ్‌లకు ఒమర్ ధన్యవాదాలు తెలిపారు. హైదరాబాద్ ప్రపంచ స్థాయి నగరంగా అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షించారు. ఇక మంత్రి జూపల్లి అసోంలోని గువహటిలో ఆ రాష్ట్ర సీఎం హిమంత బిశ్వశర్మను కలిసి సదస్సుకు రావాలంటూ ఆహ్వాన పత్రిక అందజేశారు. కాగా, పశ్చిమబెంగాల్‌లో జిల్లాల పర్యటనలో ఉన్న ఆ రాష్ట్ర సీఎం మమతా బెనర్జీని వ్యక్తిగతంగా కలిసే అవకాశం లేకపోవడంతో.. సదస్సులో పాల్గొనాలంటూ ఆమెకు మంత్రి సీతక్క అధికారికంగా మెయిల్ పంపారు.

గ్లోబల్ సమ్మిట్ విజయవంతం కావాలి

- రాష్ట్రాభివృద్ధికి రేవంత్ ప్రయత్నాలు అభినందనీయం
- సీఎం రేవంత్‌రెడ్డికి సోనియాగాంధీ అభినందన సందేశం



న్యూఢిల్లీ/హైదరాబాద్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ విజయవంతం కావాలని ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీ ఆకాంక్షించారు. 2034 నాటికి తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే ప్రయత్నాల్లో ఈ సమ్మిట్ కీలక భూమిక పోషిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డిని అభినందిస్తూ శుక్రవారం సందేశం పంపారు. రాష్ట్రాన్ని అంతర్జాతీయ వేదికపై నిలబెట్టేందుకు రేవంత్ చేస్తున్న ప్రయత్నాలను ఈ సందర్భంగా సోనియా అభినందించారు. రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన కీలక ప్రాజెక్టులు, ప్రణాళికల్లో భాగస్వాములు కావాలనుకునే అంతర్జాతీయ సమాజానికి ఈ సమ్మిట్ ఒక వేదికగా నిలుస్తుందన్నారు. అర్బన్, సెమీ అర్బన్, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి ప్రాజెక్టులకు సమ ప్రాధాన్యమిస్తూ మూడంచెల వ్యూహంతో రాష్ట్రం ముందు కు సాగడం అభినందనీయమన్నారు. తెలంగాణలోని మానవ, సహజ వనరులు, ప్రజల వ్యాపార, సాంకేతిక నైపుణ్యాల అభివృద్ధికి సమ్మిట్ మరింత తోడ్పడుతుందని సోనియా విశ్వాసం వ్యక్తం చేశారు.

గ్లోబల్ సమ్మిట్ పూర్తిగా ఆర్థిక సదస్సే

రానున్న 20ఏళ్ల ప్రణాళికను ప్రకటించే వేదిక

ఇక్కడి విజయాన్ని దావోస్ అంతర్జాతీయ సదస్సులో ప్రదర్శించాలి

సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఈనెల 8వ తేదీ నుంచి భారత్ ఫ్యూచర్ సిటీలో జరగబోయే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ పూర్తిగా ఆర్థిక సదస్సు అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. రాబోయే 20 ఏళ్లలో రాష్ట్ర ఆర్థిక వృద్ధి, అభివృద్ధి ప్రణాళికలను ప్రతిబింబించే 'తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించడం ఈ సదస్సు ప్రధాన లక్ష్యం అని అన్నారు. ఈ మేరకు ప్రజాభవన్‌లో శుక్రవారం సీఎం రేవంత్ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వేదిక వద్ద జరుగుతున్న ఏర్పాట్లు, వరుసగా రెండు రోజుల కార్యక్రమాల గురించి సీఎంకు అధికారులు వివరించారు. విజన్ డాక్యుమెంట్‌కు తుదిరూపు ఇచ్చేందుకు రేవంత్ రెడ్డి పలు సూచనలు చేశారు. భవిష్యత్తు వృద్ధి ప్రణాళికలను ప్రాధాన్యంగా చేర్చాలని, ఈ పత్రాన్ని ప్రజలకు డిజిటల్ రూపంలో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. దావోస్ వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్‌లో ఈ గ్లోబల్ సమ్మిట్ విజయాన్ని ప్రదర్శించాలనే తన ఆలోచనను సీఎం వివరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇతర మంత్రులతో కలిసి శనివారం గ్లోబల్ సమ్మిట్ కార్యక్రమ వివరాలను విడుదల చేయనున్నారు. దేశవ్యాప్తంగా విమానాల రద్దు నేపథ్యంలో, హైదరాబాద్‌కు వచ్చే, వెళ్లే విమాన సౌకర్యాలపై ఎటువంటి ఇబ్బందులు రాకుండా పౌర విమానయాన మంత్రిత్వ శాఖతో సంప్రదించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు.



ప్రజాభవన్‌లో సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొంగులేటి తదితరులు

అన్ని దారులూ ఫ్యూచర్ సిటీ వైపే..

అబ్బురపడేలా రైజింగ్ గ్లోబల్ సదస్సు ఏర్పాట్లు.. ప్రాంగణంలో పనులకు తుది మెరుగులు

- ఆకట్టుకునేలా ఆకృతులు.. భారీ స్థాయిలో స్క్రీన్
- అదిరిపోయే అతిథ్యం.. దేశ విదేశాల వంటకాలు
- భారీ స్థాయిలో భద్రత.. డీజీపీ సమీక్ష
- నేడు సదస్సు పనులను పరిశీలించనున్న సీఎం రేవంత్‌రెడ్డి

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)



మీర్‌ఖాన్‌పేటలో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కోసం జరుగుతున్న ఏర్పాట్లు


నిన్నమొన్నటి వరకు రాళ్లరప్పలు, పొదలతో కనిపించిన మీర్‌ఖాన్‌పేటలోని భారత్ ఫ్యూచర్‌సిటీ ప్రాంతం ఒక్కసారిగా మారిపోయింది. విశాలమైన రహదారులు, రోడ్లకు ఇరువైపులా పచ్చదనం, ధగధగలాడే విద్యుద్దీపాలు, భారీ డిజిటల్ స్క్రీన్లతో మరో ప్రపంచంలా కనిపిస్తోంది. అధికారులు, సిబ్బంది, వేలాది కార్మికులతో సందడి నెలకొంది. హైదరాబాద్ నగరం నుంచి ఫ్యూచర్ సిటీకి రోడ్డు అనుసంధానం పెంచే పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ నెల 8, 9వ తేదీల్లో తలపెట్టిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సు పనులు తుదిదశకు చేరుకున్నాయి. టీజీఐఐసీ ఎండీ, ఫ్యూచర్ సిటీ ఎండీ శశాంక, జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు, మూసీ రివర్ ప్రాజెక్టు ఎండీ నర్సింహారెడ్డి నిత్యం ఇక్కడే ఉండి పనులను పర్యవేక్షిస్తున్నారు. అంతర్జాతీయ స్థాయిలో ప్రాంగణాలను, ఎగ్జిబిషన్ కేంద్రాలను సిద్ధం చేశారు. ప్రధాన ప్రాంగణంతోపాటు ఇతర ప్రాంగణాల్లో మొత్తం 5 నుంచి 6వేల మంది కూర్చునేలా సీట్లు ఏర్పాటు చేస్తున్నారు. సదస్సుకు హాజరయ్యే అతిథుల కోసం హైదరాబాద్ నగరంలోని ప్రముఖ హోటళ్లలో సుమారు వెయ్యి గదులు బుక్ చేసినట్టు తెలిసింది. ఇక అతిథులను సదస్సు ప్రాంగణానికి తరలించేందుకు తెలంగాణ ఆర్టీసీ కొత్తగా వినియోగంలోకి తెచ్చిన విద్యుత్ (ఈవీ) బస్సులను సిద్ధం చేస్తోంది. సదస్సును చూసేందుకు వచ్చే సాధారణ ప్రజల కోసం కూడా విద్యుత్ బస్సులను నడపనుంది. ఎంజీబీఎస్, సీబీఎస్‌తో పాటు ఎంపిక చేసిన మొత్తం 10 ప్రాంతాల నుంచి వీటిని తిప్పనుంది.

అంతా డిజిటల్ మయం

సదస్సు జరిగే ప్రాంతమంతా డిజిటల్ మయంగా మారిపోయింది. సమావేశ ప్రాంగణాల లోపల, బయట భారీ డిజిటల్ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. ప్రధాన ప్రాంగణం బయట ఏర్పాటు చేసిన భారీ స్క్రీన్ అందరినీ ఆకట్టుకుంటోంది. సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర ప్రముఖుల కోసం సదస్సు ప్రాంగణంలో ప్రత్యేక గదులను ఏర్పాటు చేస్తున్నారు. వీఐపీలు, ప్రభుత్వ ప్రతినిధుల చర్చలు, భేటీల కోసం సీఎం ఉండే లాంజ్ పక్కనే వీవీఐపీ లాంజ్ ఏర్పాటు చేశారు. సదస్సుకు వచ్చే ప్రముఖులు, వివిధ కంపెనీల ప్రతినిధులతో రాష్ట్ర ప్రజా ప్రతినిధులకు గెట్ టుగెదర్ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఇతర ప్రజా ప్రతినిధులను ఆహ్వానిస్తున్నారు. ఇక సదస్సులో ప్రముఖ సంగీత దర్శకుడు కీరవాణి, ప్రముఖ అంతర్జాతీయ ఇంద్రజాలికుడు సామల వేణు ప్రదర్శనలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. మరోవైపు అతిథుల కోసం అన్ని దేశాల వంటకాలను సిద్ధం చేయనున్నారు. ఇందుకోసం హైదరాబాద్‌లోని పలు ప్రముఖ హోటళ్లకు బాధ్యతలు అప్పగించారు. కాగా, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి శుక్రవారం గ్లోబల్ సదస్సు ప్రాంగణాన్ని పరిశీలించారు. అతిథులు, కంపెనీల ప్రతినిధులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు ఉండాలన్నారు.

6 వేల మందితో బందోబస్తు.. డీజీపీ సమీక్ష

సదస్సు కోసం కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తున్నారు. ఆరువేల మంది పోలీసులను మోహరించనున్నారు. శుక్రవారం భద్రతా ఏర్పాట్లను డీజీపీ శివధర్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం పోలీసు ఉన్నతాధికారులతో సమీక్షించారు. జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులు వస్తున్నందున 8, 9 తేదీల్లో డెలిగేట్లకు మాత్రమే సదస్సు ప్రాంగణంలోకి అనుమతి ఉంటుందని.. తర్వాత 4 రోజుల పాటు సాధారణ ప్రజలకు ప్రవేశ అవకాశం కల్పిస్తున్నామని డీజీపీ తెలిపారు. మొత్తం మూడంచెల భద్రతా వ్యవస్థ ఉంటుందని.. సదస్సు జరుగుతున్న ప్రాంతం, రాకపోకలు సాగించే మార్గాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.



సదస్సు ప్రాంగణంలో ఏర్పాట్లు

నేడు సీఎం రేవంత్ రాక!

గ్లోబల్ సదస్సు ఏర్పాట్లను పరిశీలించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి శనివారం ఫ్యూచర్‌సిటీకి వెళ్లనున్నట్టు తెలిసింది. సదస్సుకు సంబంధించి సీఎం ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్నారు. శనివారం ఉదయం లేదా సాయంత్రం స్వయంగా పరిశీలించనున్నట్టు తెలిసింది. దీనిపై అధికారిక ప్రకటన వెలువడలేదు.



గ్లోబల్ సమ్మిట్‌పై ఇండిగో ప్రభావం?

- ప్రతినిధుల రాకపోకలకు ఇబ్బందులు
- పరిస్థితిని సమీక్షిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

దేశంలో అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో అంతర్గత సమస్యలతో భారీగా విమాన సర్వీసులు రద్దు చేస్తుండడం రాష్ట్ర ప్రభుత్వ అధికారుల్లో ఆందోళన కలిగిస్తోంది. ఫ్యూచర్ సిటీలో ఈ నెల 8, 9 తేదీల్లో జరిగే గ్లోబల్ సమ్మిట్‌కు హాజరయ్యేందుకు దేశ, విదేశాల నుంచి దాదాపు మూడు వేలమంది ప్రతినిధులు హైదరాబాద్‌కు వస్తున్నారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి దాదాపు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. అయితే ఇదే సమయంలో దేశంలోని ప్రధాన విమానయాన సంస్థ ఇండిగో భారీగా విమాన సర్వీసులు రద్దు చేస్తుండడంతో ప్రభుత్వవర్గాలు ఆందోళన చెందుతున్నాయి. అంతర్గత సమస్యలతో సతమతమవుతున్న ఆ సంస్థకు ఊరటనిస్తూ తాజాగా డీజీసీఏ ఆదేశాలు జారీ చేసింది. గతంలో ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్ విషయంలో ఇచ్చిన ఆదేశాలను తాత్కాలికంగా పక్కనపెట్టింది. ఈ చర్య తమకు ఉపశమనంగా ఇండిగో ప్రకటించినా.. సమస్య పరిష్కరించడానికి కొంత సమయం పడుతుందని తెలిపింది. దేశ వ్యాప్తంగా శుక్రవారం వెయ్యి విమాన సర్వీసులను రద్దు చేసిన ఆ సంస్థ శనివారం ఆ సంఖ్య వెయ్యిలోపే ఉంటుందని తెలిపింది. ఈ నెల 10 నుంచి 15 మధ్యలో తమ సర్వీసులను సాధారణ స్థితికి తీసుకువచ్చే అవకాశాలు ఉన్నట్లు ఇండిగో సీఈవో పీటర్ ఎల్బర్స్ వెల్లడించారు. అయితే ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్ ఈ నెల 8, 9 తేదీల్లో జరుగుతోంది. అప్పటికి ఇండిగో విమాన సర్వీసులు పూర్తిగా సాధారణ స్థితికి వచ్చే అవకాశాలు కనిపించడం లేదు. శుక్రవారం ఒక్క రోజే హైదరాబాద్ నుంచి 156 సర్వీసులను ఇండిగో రద్దు చేసింది. ఈ నేపథ్యంలో గ్లోబల్ సమ్మిట్‌కు వచ్చే ప్రతినిధులకు ప్రయాణ ఇబ్బందులు తలెత్తే అవకాశాలు ఉండడంతో ప్రభుత్వం రంగంలోకి దిగింది. ఈ పరిస్థితులను ఎప్పటికపుడు సమీక్షించేందుకు కొందరు ఉన్నతాధికారులకు బాధ్యతలు అప్పగించింది. ఇక్కడకు వచ్చే ప్రతినిధులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించింది. అవసరమైతే ఇతర విమానయాన సంస్థలతో కూడా మాట్లాడి ప్రతినిధులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించింది. ఇదిలా ఉంటే శుక్రవారం కొందరు అధికారులు ఇండిగో రీజినల్ మేనేజర్‌ను కలిసి పరిస్థితిని త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

యాసంగికి ఇప్పటికే
2.29 లక్షల టన్నుల యూరియా

- ఎరువుల పంపిణీ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే..
- పాస్‌పోర్ట్ సేవల్లో హైదరాబాద్ రీజియన్ టాప్
- తెలంగాణకు మూడు ఆయుష్ ఆస్పత్రులు..
- తెలంగాణ ఎంపీల ప్రశ్నలు..కేంద్రం జవాబులు

న్యూఢిల్లీ/హనుమకొండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో యాసంగి సీజన్‌కు యూరియా సిద్ధంగా ఉందని.. డిసెంబరు 1 నాటికి 2.29 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వలున్నాయని కేంద్రం తెలిపింది. శుక్రవారం లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి ప్రశ్నకు కేంద్ర రసాయన, ఎరువుల శాఖ సహాయ మంత్రి అనుప్రియా పటేల్ సమాధానమిచ్చారు. గత ఖరీఫ్ సీజన్‌లో తెలంగాణకు డిమాండ్ కంటే ఎక్కువ మొత్తంలో యూరియా సరఫరా చేశామన్నారు. ఖరీఫ్ సీజన్‌కు 9.80 లక్షల మెట్రిక్ టన్నులు అవసరం ఉండగా, 10.28 లక్షల మెట్రిక్ టన్నులను అందుబాటులో ఉంచామని స్పష్టం చేశారు. ఇందులో 9.79 లక్షల మెట్రిక్ టన్నులే విక్రయించారని, సీజన్ ముగిసే నాటికి (సెప్టెంబరు 30) రాష్ట్రం వద్ద ఇంకా 49 వేల టన్నుల నిల్వలు మిగిలే ఉన్నాయన్నారు. ఇటు జీరో అవర్‌లోనూ మల్లు రవి మాట్లాడారు. దివ్యాంగుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. యాక్సెసబుల్ ఇండియా క్యాంపెయిన్‌లో భాగంగా ఉద్యోగాల్లో 4 శాతం, సంక్షేమ పథకాల్లో 5 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. పాస్‌పోర్ట్ సేవల్లో హైదరాబాద్ రీజియన్ అత్యుత్తమ ప్రతిభను చూపిందని కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి పబిత్ర మార్గెరిటా తెలిపారు. ఆ ఆఫీస్ పరిధిలో పాస్‌పోర్ట్‌ల కోసం నిరీక్షణ సమయం గణనీయంగా తగ్గిందని ఎంపీ బలరాం నాయక్ ప్రశ్నకు సమాధానమిచ్చారు.



గోదావరి ద్వారా బొగ్గు రవాణాతో అదనపు భారం..

తెలంగాణలోని రామగుండం ఎన్టీపీసీకి గోదావరి నది ద్వారా బొగ్గు రవాణా చేయడం అదనపు భారంతో కూడుకున్న పని అని కేంద్రం తేల్చి చెప్పింది. ఎంపీలు గడ్డం వంశీకృష్ణ, చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రశ్నలకు కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్ శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ సమాధానాలిచ్చారు. తెలంగాణకు మూడు 50 పడకల ఇంటిగ్రేటెడ్ ఆయుష్ ఆస్పత్రుల ఏర్పాటుకు ఆమోదం తెలిపినట్టు కేంద్రం తెలిపింది. కొత్తగా ఆయుష్ మెడికల్ కాలేజీల కోసం తెలంగాణ నుంచి ఎటువంటి ప్రతిపాదన రాలేదని పేర్కొంది. ఎంపీ రఘువీర్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి ప్రతాప్ రావు గణపతిరావు జాదవ్ సమాధానమిచ్చారు.

తెలంగాణకు 14 వేల కోట్ల పీఎం కిసాన్ నిధులు

పీఎం కిసాన్ పథకం కింద ఇప్పటివరకు తెలంగాణ రైతులకు రూ.14,234 కోట్లు, ఆంధ్రప్రదేశ్ రైతులకు రూ.19,121 కోట్లు చెల్లించామని కేంద్ర వ్యవసాయ, రైతుల సంక్షేమ సహాయ మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్ రాజ్యసభలో తెలిపారు. తెలంగాణలో 30 లక్షల మంది రైతులు, ఏపీలో 39 లక్షలకు పైగా రైతులు పీఎం కిసాన్ ద్వారా లబ్ధి పొందుతున్నారని ఓ ప్రశ్నకు సమాధానమిచ్చారు. దేశవ్యాప్తంగా రైలు ప్రమాదాల నివారణకు ప్రవేశపెట్టిన 'కవచ్' వ్యవస్థను మరింత విస్తృతం చేస్తున్నట్లు కేంద్రం తెలిపింది. ఇప్పటివరకు ఈ ప్రాజెక్టు కోసం రూ.2,354.36 కోట్లు ఖర్చు చేసినట్లు ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ ప్రశ్నకు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ సమాధానమిచ్చారు. మరోవైపు.. హైదరాబాద్ మెట్రో, ఎంఎంటీఎస్ రెండో దశకు అనుమతులు ఇవ్వాలని బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కేంద్రాన్ని కోరారు. రాజ్యసభలో జీరో అవర్‌లో ఆయన మాట్లాడారు. అనంతరం ఈ విషయమై రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.

మహిళలకు సౌకర్యాలు, సామాజిక భద్రతపై ఎంపీ కావ్య 2 ప్రైవేటు బిల్లులు..



మహిళలకు రక్షణ, సౌకర్యాలు, సామాజిక భద్రతను బలోపేతం చేసే దిశగా ఎంపీ కడియం కావ్య లోక్‌సభలో రెండు కీలక ప్రైవేట్ బిల్లులను ప్రవేశపెట్టారు. మూడు దశాబ్దాల తర్వాత తెలంగాణ నుంచి ఒక మహిళా ఎంపీ ఇలాంటి ప్రత్యేక బిల్లులను ప్రవేశపెట్టడం ఇదే తొలిసారి. ఉద్యోగ రంగంలోని మహిళలకు నెలసరి సమయంలో అవసరమైన సౌకర్యాలు, అందుబాటులో గదులు, తగిన ఆరోగ్య వసతులు కల్పించేందుకు చట్టపరమైన నిబంధనలు తప్పనిసరి చేయాలని మొదటి బిల్లులో కావ్య ప్రతిపాదించారు. రెండో బిల్లులో.. ఒంటరి మహిళలు, వితంతువులు, ఆపన్నస్థితిలో ఉన్న స్త్రీలకు ప్రభుత్వం ద్వారా అత్యవసర సాయం, గృహ భద్రత, సామాజిక సంక్షేమ చర్యలు తక్షణం అందేలా ప్రత్యేక విధానాన్ని ప్రవేశపెట్టాలని కోరారు. ఈ రెండు బిల్లులను లోక్‌సభ మూజువాణి ఓటుతో ఆమోదించింది.

సీట్ల కింద.. స్టెప్నీ టైరులో..
రూ. 4.50 కోట్లు!

కారులో భారీగా హవాలా సొమ్ము

మోసం కేసులో నిందితులను వెంబడిస్తే..

హవాలా డబ్బు దొరికిన వైనం

125 కి.మీ. చేజింగ్.. ఇద్దరు అరెస్టు

అడ్డగుట్ట/బోయిన్‌పల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మోసం కేసులో ఇద్దరు నిందితులు పారిపోతుండగా.. బోయిన్‌పల్లి పోలీసులు వారి కారును వెంబడించారు. 125 కిలోమీటర్లు చేజ్ చేసి వారిని పట్టుకున్నారు. వారి కారును తనిఖీ చేసి విస్తుపోయారు. కారులో ఎక్కడ వెతికినా డబ్బులే!! సీట్ల కింద.. డోర్ల అరల్లో.. స్టెప్నీ టైర్‌లో.. ఇలా గుట్టుగా నోట్ల కట్టలు పెట్టేశారు. ఏకంగా రూ.4.50 కోట్ల హవాలా సొమ్మును తరలిస్తున్నారు. ఇలా ఒక కేసులో నిందితులను వెంబడిస్తే మరో కేసు బయటపడింది. నిందితులను అరెస్టు చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు వివరాలను నార్త్‌జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్ శుక్రవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. 2024 డిసెంబరు 7న నాగోల్‌కు చెందిన విశ్వనాథచారికి పరిచయస్తులైన గుజరాత్‌కు చెందిన ప్రకాశ్ మోతిబాయి ప్రజాపత్(30), ప్రగ్నేశ్ కీర్తిబాయి ప్రజాపత్(28)లు వ్యాపారంలో పెట్టుబడి పెడితే అదనంగా సొమ్ములు ఇస్తామని వల వేశారు. రూ.50 లక్షలు పెట్టుబడి పెడితే అదనంగా 10 లక్షలు ఇస్తామని నమ్మించారు. విశ్వనాథ్ వారికి రూ.50 లక్షలు ఇచ్చారు. లాభంగా ఇస్తామన్న 10 లక్షలు కలిపి మొత్తం రూ.60 లక్షలు బ్యాంకు ఖాతాకు ఆర్టీజీఎస్ చేస్తామని చెప్పినవారు తిరిగి రాలేదు. అనుమానం వచ్చిన విశ్వనాథ్ వెంటనే బోయిన్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మోసం కేసు నమోదు చేసిన పోలీసులు.. డబ్బు తీసుకెళ్లిన నిందితులపై నిఘా పెట్టారు. వారు హైదరాబాద్ వస్తున్నారన్న సమాచారంతో పథకం వేయగా.. నిందితులు శామీర్‌పేట్ నుంచి ఓఆర్ఆర్ మీదుగా నగరం దాటేశారు. ఇది గమనించిన పోలీసులు.. వారి కారును వెంబడించారు. ఎట్టకేలకు మహబూబ్‌నగర్ జిల్లాలో నిందితులను పట్టుకున్నారు. కారులో తనిఖీ చేయగా.. రూ.4.50 కోట్ల హవాలా డబ్బు దొరికింది. ఈ డబ్బును నాగ్‌పూర్ నుంచి బెంగుళూరుకు తరలిస్తున్నట్లు తేలింది. ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. స్వాధీనం చేసుకున్న డబ్బును ఆదాయపు పన్ను అధికారులకు అప్పగిస్తున్నట్లు డీసీపీ తెలిపారు. హవాలా డబ్బును, నిందితులను చాకచక్యంగా పట్టుకున్న బోయిన్‌పల్లి పోలీసులను డీసీపీ రష్మి అభినందించారు.

విలీనానికి ముందు..
విచ్చలవిడి అనుమతులు

(మొదటిపేజీ తరువాయి)

కార్పొరేషన్‌లో విలీనం అవుతుండడమే. విలీన ప్రక్రియ పూర్తికాక ముందే సర్టిఫికెట్ ఇచ్చి.. దొరికినంత దండుకోవడమే దీని వెనుక ఉద్దేశం.

ఈ తరహా వ్యవహారాలు ఈ ఒక్క కార్పొరేషన్‌లోనే కాదు.. జీహెచ్ఎంసీలో విలీనమైన ఏడు కార్పొరేషన్లు, 20 మునిసిపాలిటీల్లో చాలా చోట్ల జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మునిసిపాలిటీల విలీనం నేపథ్యంలో కొందరు మునిసిపల్ అధికారులు అక్రమాలకు తెరతీశారు. అసంపూర్తి భవనాలకు ఆక్యుపెన్సీ సర్టిఫిట్లు ఇవ్వడం ఒక్కటే కాకుండా.. కోర్టు వివాదాల్లో ఉన్న భూముల్లో నిర్మాణాలకు పచ్చజెండా ఊపడం, ఆస్తి పన్ను పెండింగ్ కేసుల క్లియరెన్స్ పేరుతో అడ్డగోలు వసూళ్లకు పాల్పడటం , పార్కుల్లో నిర్మాణాలు చేశారనే ఫిర్యాదులున్న భవనాలను క్రమబద్ధీకరణ చేయడం వంటి అనేక అవకతవకలకు పాల్పడ్డారు. విలీనానికి వారం రోజుల వ్యవధిలోనే పెద్ద ఎత్తున అక్రమ అనుమతులు జారీ చేసి.. రూ.కోట్లు దండుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వీటిపై కొందరు ఏసీబీకి, విజిలెన్స్‌కు ఫిర్యాదు చేయడంతో విచారణకు రంగం సిద్ధమైంది.

'బండ్ల'లో అక్రమ సొమ్ము తరలింపు..

గతంలో వికారాబాద్‌లో పనిచేసి ప్రస్తుతం ఓ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న అధికారి.. కోట్ల రూపాయల అక్రమార్జనను 'బండ్ల'లో తరలించినట్లు ఆరోపణలున్నాయి. గ్రేటర్ హైదరాబాద్‌లో ఆ కార్పొరేషన్ విలీనానికి కొద్దిరోజుల ముందు నుంచే పెద్ద ఎత్తున నిర్మాణ అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు జారీ చేసినట్లు, నిమిషాల వ్యవధిలోనే 19 ఓసీలు జారీ చేసి రూ.కోటిన్నర దండుకున్నట్లు తెలిసింది. ఆదివారం సెలవురోజు అయినా..పాత తేదీలతో అనుమతులు జారీ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. చివరి మూడు రోజుల్లో పెద్ద సంఖ్యలో భవన నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేసినట్లు, ఒక్కో అనుమతికి రూ.4.50 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వసూలు చేసినట్లు సమాచారం. మొత్తం మూడు రోజుల వ్యవధిలో రూ.7 కోట్ల వరకు అక్రమ లావాదేవీలు జరిగినట్లు ఆరోపణలున్నాయి. సదరు కార్పొరేషన్.. జీహెచ్ఎంసీలో విలీనం అవుతుందన్న విషయం తెలిసినప్పటి నుంచే నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలకు అనుమతులు, ఓసీలు పెద్ద ఎత్తున జారీ అయ్యాయి. కేవలం పిల్లర్లు వేసిన నివాస సముదాయాలకు సైతం ఓసీలు జారీ చేసి పెద్ద మొత్తంలో వసూలు చేసినట్లు సమాచారం. స్లాబ్ వేయడం వరకే పూర్తయిన నిర్మాణాలు, ఏ మాత్రం నిబంధనలు పాటించకుండా, కనీస సెట్ బ్యాక్‌లు లేకుండా చేపట్టిన నిర్మాణాలకు సైతం పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసి ఓసీలు జారీ చేశారనే ఆరోపణలున్నాయి.

కోర్టు వివాదాలున్నా బేఖాతరు..

జీహెచ్ఎంసీలో విలీనమైన కొన్ని మునిసిపాలిటీల్లో.. కోర్టు వివాదాలున్న భూముల్లోనూ నిర్మాణాలకు అనుమతిస్తూ ఉత్తర్వులు ఇవ్వడం పురపాలక శాఖలో చర్చనీయాంశంగా మారింది. ఓ కార్పొరేషన్ పరిధిలో హైకోర్టులో కేసు నడుస్తున్న స్థలంలో మునిసిపల్ కమిషనర్ స్వయంగా కేసు విచారణకు హాజరైనా.. అక్కడ భవన నిర్మాణానికి అనుమతులు ఇవ్వడం వివాదాస్పదమైంది. మరో కార్పొరేషన్ పరిధిలోని ఓ కాలనీలో ప్రభుత్వ లెక్కల్లో పార్కులుగా చూపించిన స్థలాల్లో అక్రమంగా నిర్మాణాలు చేపట్టినా.. అలాంటి వాటికీ అనుమతులు, ఓసీలు జారీ చేసి పెద్ద మొత్తంలో వసూలు చేశారనే ఆరోపణలున్నాయి. నాలాలు, కుంటలను ఆక్రమించుకుని చేపట్టిన నిర్మాణాలకు సైతం ఓసీలు జారీ చేసినట్లు తెలిసింది. ఓ కార్పొరేషన్ పరిధిలో జరిగిన బడా నిర్మాణాల్లో కొన్ని పత్రాలను ఫోర్జరీ చేసి కాంట్రాక్టర్లకు మేలు చేసి క్విడ్ ప్రోకో పద్ధతిలో పెద్ద మొత్తంలో నగదు లావాదేవీలు జరిపినట్లు సమాచారం.

సెట్‌బ్యాక్‌లు లేకున్నా సెట్ చేసేశారు!

కొన్ని మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో సెట్ బ్యాక్‌లు లేకుండా నిర్మాణాలు చేపట్టినట్లు వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరపకుండానే సెట్ చేసేశారనే ఆరోపణలున్నాయి. ఓ మునిసిపల్ కమిషనర్ తన పరిధిలో నిర్మించిన స్టిల్ట్, ఏడు అంతస్తుల భవనానికి సెట్ బ్యాక్‌లు లేకున్నా, ఓసీ జారీ చేసి 50 లక్షల వరకు వసూలు చేసినట్లు తెలిసింది. సదరు కమిషనర్ ఇటీవల తన సొంత ఊరిలో జరిగిన జాతరకు కార్పొరేషన్ పరిధిలోని కార్పొరేటర్లు, మేయర్లు, ఇతర నాయకులను పిలిచి పార్టీ ఇవ్వడంపై చర్చ జరుగుతోంది. అక్రమ అనుమతులకుగాను బినామీల పేర్లతో ఫ్లాట్ తీసుకున్న విషయం కూడా బహిర్గతమైంది. ఇతర మునిసిపాలిటీల్లో కూడా వసూళ్ల దందా నడిచిందనే ఆరోపణలున్నాయి. విలీనమైన మునిసిపాలిటీల్లో తాజాగా ఇచ్చిన అనుమతులపై ఇప్పటికే ఏసీబీ, విజిలెన్స్ దృష్టి సారించింది. వీటిలో బండ్లగూడ, బోడుప్పల్, ఫీర్జాదిగూడ, జవహర్‌నగర్, నిజాంపేట, బడంగ్‌పేట, మీర్‌పేట కార్పొరేషన్లు, 20 మునిసిపాలిటీల్లో దుండిగల్, కొంపల్లి, శంషాబాద్, బొల్లారం, జల్‌పల్లి, మణికొండ వంటి కీలక ప్రాంతాలు ఉన్నాయి. విలీనానికి ప్రతిపాదించిన పలు మునిసిపాలిటీల్లో ఇచ్చిన అనుమతులు, జారీ చేసిన ఓసీలతోపాటు గతంలో జరిగిన లావాదేవీల్లో అక్రమాలకు సంబంధించి ఆధారాలతో కొందరు ఏసీబీ, విజిలెన్స్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ విషయంపై ఆయా విభాగాలు అంతర్గత విచారణ జరుపుతున్నాయి.

ఆర్థిక లక్ష్యసాధనలో వ్యవసాయమే కీలకం

» గ్లోబల్ సమ్మిట్‌తో మరింత పురోభివృద్ధి: తుమ్మల



హైదరాబాద్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయరంగమే రాష్ట్ర ఆర్థిక లక్ష్య సాధనలో అత్యంత కీలక పాత్ర పోషించబోతోందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గ్రామీణ జనాభాలో 66% మందికి ఉపాధి అందించే వ్యవసాయం రాష్ట్ర జీఎస్‌వీఏలో 17% వరకు వాటా కలిగి ఉందని, దాంతో తెలంగాణ ఆర్థిక వృద్ధిలో వ్యవసాయ అభివృద్ధి కేంద్రబిందువుగా ఉంటుందని పేర్కొన్నారు. గ్లోబల్ సమ్మిట్‌పై సచివాలయంలో శుక్రవారం ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతు ఆదాయం, ఉత్పాదకత పెరుగుదల, విలువ ఆధారిత వ్యవసాయం విస్తరణ, ఎగుమతుల పెంపు.. ఇవన్నీ 3 ట్రిలియన్ ఆర్థిక లక్ష్యాన్ని సాధించడానికి అత్యంత కీలక అంశాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025 ప్రధాన లక్ష్యం రాష్ట్రాన్ని 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమేనన్నారు. గ్లోబల్ సమ్మిట్‌లో ప్రదర్శించాల్సిన అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. తెలంగాణ వ్యవసాయరంగం అభివృద్ధి సామర్థ్యాలు, విదేశీ పెట్టుబడి అవకాశాలు, భవిష్యత్ విజన్ స్పష్టంగా ప్రతిబింబించేలా ఏవీలను రూపొందించాలని ఆయన సూచించారు.

7 ప్లాట్ల వేలం.. 3862.8 కోట్ల ఆదాయం

» నాలుగు విడతల్లో హెచ్‌ఎండీఏ వేలం

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ)కు ప్లాట్ల వేలంతో తాజాగా రూ.3,862 కోట్ల ఆదాయం సమకూరింది. కోకాపేటలోని భూములను నాలుగు విడతల్లో విక్రయించడంతో ఈమేరకు రాబడి వచ్చింది. కోకాపేట నియోపోలీసు లే అవుట్‌లోని 27 ఎకరాల విస్తీర్ణంలోని ఆరు ప్లాట్లను మూడు విడతల్లో విక్రయించారు. నాలుగో విడతలో భాగంగా కోకాపేట గోల్డెన్ మైల్ లే అవుట్‌లోని 1.98 ఎకరాల స్థలాన్ని శుక్రవారం ఈ-వేలం వేశారు. ఈ స్థలానికి ఎకరం కనీస ధరను రూ.75 కోట్లుగా నిర్ణయించగా.. ఎకరాకు రూ.77.75 కోట్ల చొప్పున 1.98 ఎకరాలను రూ.153.94 కోట్లకు సీవోఈఎస్ ఎడ్యుకేషన్ మేనేజ్‌మెంట్ ప్రైవేటు లిమిటెడ్ దక్కించుకుంది. మొత్తంగా నాలుగు విడతల్లో ఏడు ప్లాట్లను విక్రయించడం ద్వారా హెచ్‌ఎండీఏకు రూ.3,862.8 కోట్ల ఆదాయం వచ్చింది. వేలంలో ప్లాట్లను దక్కించుకున్న సంస్థలు వారం రోజుల్లో 25 శాతం చెల్లించాల్సి ఉండగా.. ఈఎండీ (దరావతు)తో కలిపిన 75 శాతాన్ని 60 రోజుల్లో చెల్లించాల్సి ఉంటుంది. హెచ్‌ఎండీఏ అంచనాలకు మించిన ఆదాయం సమకూరడం పట్ల అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా కూకట్‌పల్లి మూసాపేటలో 15 ఎకరాల స్థలాన్ని శుక్రవారం విక్రయించాల్సి ఉండగా.. పార్కులు, ఇతర ఆట స్థలాల కోసమంటూ స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఈ స్థలాన్ని హెచ్‌ఎండీఏ వేలం వేయలేదు. ఈ స్థలాన్ని ప్రజావసరాల కోసం వినియోగించనున్నారు.

ఇంటర్ బోర్డులో నిధుల దుర్వినియోగంపై నేడు విజిలెన్స్ విచారణ

హైదరాబాద్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ బోర్డులో నిధుల దుర్వినియోగం ఆరోపణలపై విచారణ ప్రారంభించిన విజిలెన్స్ అధికారులు శనివారం మరికొంత మంది అధికారులను ప్రశ్నించనున్నారు. బోర్డు ప్రధాన కార్యాలయంలో మరమ్మతులు, కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు కోసం సీసీ కెమెరాల కొనుగోలు, ఇతర బ్యాంకులకు నిధుల మళ్లింపు, ప్రభుత్వ కాలేజీల్లో అగ్నిమాపక యంత్రాల కొనుగోళ్లు, ఇతర ఆర్థిక సంబంధిత అంశాల్లో నిధుల దుర్వినియోగం జరిగిందంటూ ఉద్యోగుల సంఘం నేతలు గతంలో ఇంటర్ విద్య కార్యదర్శి కృష్ణ ఆదిత్యపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. దీనిపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. ఇప్పటికే విచారణ ప్రారంభించిన విజిలెన్స్.. ఆరోపణలపై వివరణ ఇవ్వాలని కృష్ణ ఆదిత్యను కోరింది. సీసీ కెమెరాల కొనుగోళ్లు, ఇంటర్ విద్య ప్రధాన కార్యాలయం మరమ్మతుల ఖర్చులు, ప్రభుత్వ అనుమతుల వివరాలు ఇవ్వాలని పేర్కొంది. అగ్నిమాపక యంత్రాల వివరాలు, సౌర విద్యుత్తు ఏర్పాటు ఖర్చు వివరాలనూ అడిగింది. విజిలెన్స్ కోరిన పూర్తి వివరాలను కృష్ణ ఆదిత్య ఇటీవలే అందించగా.. వీటి ఆధారంగా విజిలెన్స్ అధికారులు ఇంటర్ విద్య అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే పలువురు అధికారులను ప్రశ్నించగా.. శనివారం మరికొంత మంది అధికారులను విచారించనున్నారు.

వివేకా కేసుపై మళ్లీ దర్యాప్తు చేయొచ్చు

» సీబీఐ కోర్టును కోరిన న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా

హైదరాబాద్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసుపై మరింత లోతైన దర్యాప్తు చేయాలని సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా శుక్రవారం సీబీఐ కోర్టును కోరారు. కేసుపై మళ్లీ విచారణ జరపాలంటూ పిటిషన్ దాఖలు చేసిన వివేకానందరెడ్డి కుమార్తె నర్రెడ్డి సునీతారెడ్డి తరఫున ఆయన విదనలు వినిపించారు. గతంలో సరిగ్గా దర్యాప్తు జరగనందునే ఇప్పుడు మరోసారి చేయాలని తన పిటిషనర్ కోరుతున్నారని తెలిపారు. మళ్లీ దర్యాప్తు చేయడానికి తమకు అభ్యంతరమేమి లేదని గతంలో సీబీఐ... కోర్టుకు తెలియజేసిందని గుర్తు చేశారు. మరోసారి దర్యాప్తు చేయడం వల్ల ఈ కేసు ట్రయల్‌కు వచ్చే ఇబ్బందేమి లేదని తెలిపారు. వేగంగా ట్రయల్ నిర్వహించడం కంటే న్యాయమైన విచారణ చేయడం ముఖ్యమని, ఇదే విషయాన్ని వివిధ కేసుల్లో పలుమార్లు సుప్రీంకోర్టు స్పష్టంగా తెలియజేసిందని ఉదహరించారు. నిందితులు సాక్షులను బెదిరించడం, ప్రలోభాలకు గురి చేయడం వంటి ప్రయత్నాలు చేశారని ఆరోపించారు. ప్రస్తుత దశలో మరోసారి దర్యాప్తు చేయడానికి నిందితులు అభ్యంతరం చెప్పలేరని తెలిపారు. దీనిపై ఇప్పటికే ప్రధాన వాదనలు పూర్తయ్యాయి. ఈనెల 10వ తేదీన తీర్పును వెల్లడిస్తామని సీబీఐ కోర్టు పేర్కొంది.

నేడు దేవరకొండకు సీఎం రేవంత్

» పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

» ప్రజాపాలన విజయోత్సవ సభలో ప్రసంగం

» పాల్గొననున్న మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్

నల్లగొండ/హైదరాబాద్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నల్లగొండ జిల్లా దేవరకొండలో శనివారం పర్యటించనున్నారు. ఈ సందర్భంగా సీఎం చేపట్టే అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, బహిరంగ సభ ఏర్పాట్లను నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్రపవార్, స్థానిక ఎమ్మెల్యే బాలునాయక్ శుక్రవారం పరిశీలించారు. సీఎం పర్యటనలో మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీలో భాగంగా రూ.11.33 కోట్ల విలువైన చెక్కులను పంపిణీ చేయనున్నారు. దేవరకొండలోని బీఎన్ఆర్ కాలనీలో రూ.2 కోట్లతో పార్కు నిర్మాణం, ప్రభుత్వ బాలుర కాలేజీలో రూ.2 కోట్లతో స్టేడియం, వాకింగ్ ట్రాక్ నిర్మాణం, రూ.2.50 కోట్లతో భూగర్భ డ్రైనేజీ పనులకు సీఎం శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం సాయంత్రం పట్టణ శివారులోని శేరిపల్లి వద్ద ఏర్పాటు చేసిన ప్రజాపాలన విజయోత్సవ సభలో సీఎం పాల్గొని ప్రసంగిస్తారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తదితరులు ఈ సభకు హాజరుకానున్నట్లు అధికారులు పేర్కొన్నారు.



దేవరకొండ శివారు శేరిపల్లి వద్ద ముఖ్యమంత్రి రేవంత్ బహిరంగ సభకోసం జరుగుతున్న ఏర్పాట్లు

'సాయుధ దళాల నిధి'కి రూ.లక్ష విరాళం..

సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి సీఎం రేవంత్ రూ.లక్ష విరాళంగా అందించారు. సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా సీఎంను సైనిక్ వెల్ఫేర్ ప్రతినిధులు ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా వారికి విరాళాన్ని సీఎం అందించారు. అలాగే బోల్డ్ అండ్ బ్రేవ్ పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు.

నిధులడిగే ఓపిక ఉంది!



నర్సంపేట సభలో సీఎం రేవంత్‌కు నాగలి బహూకరిస్తున్న నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

చూపుతోందని, రాష్ట్రాభివృద్ధికి అవసరమైన నిదుల్ని ఇవ్వడం లేదని ఆరోపించారు. బీఆర్ఎస్‌కు రెండు సార్లు అధికారం ఇస్తే సొంత ఆస్తులు సంపాదించుకున్నరని, ఫామ్‌హౌస్‌లు కట్టుకొని, విమానాలు కొనుక్కున్నరని, టీవీ చానళ్లు, పత్రికలు పెట్టుకున్నరని చెప్పారు. ప్రజల జీవన ప్రమాణాలు మాత్రం మారలేదన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రి హోదాలో వరి వేసుకుంటే ఉరి వేసుకున్నట్లేనని, ఒక్క గింజ కొనేది లేదు దిక్కున్న చోట చెప్పుకొండని అన్నారని రేవంత్ ప్రస్తావించారు. తమ ప్రభుత్వం చివరి గింజ వరకు కొంటోందని చెప్పారు. సన్న వడ్లు పండిస్తే రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి నిలబెట్టుకున్నామని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతుబంధు బంద్ అవుతుందని, రుణమాఫీ అబద్ధమని, కరెంట్ ఉండదని తప్పుడు ప్రచారం చేశారన్నారు. తెలంగాణను దోచుకున్నోళ్లకే కరెంట్ పోయిందని, గడీలోళ్ల కరెంటు పీకేందుకే కాంగ్రెస్ వచ్చిందని వ్యాఖ్యానించారు. దుక్కిదున్నే రైతులకు 24 గంటల కరెంట్ ఇస్తున్నామని తెలిపారు. ఉచిత విద్యుత్ పేటెంట్ కాంగ్రెస్ పార్టీదని, 2004లో దేశంలోనే రైతాంగానికి ఉచిత విద్యుత్‌పై రాజశేఖర్‌రెడ్డి తొలి సంతకం చేశారని ప్రస్తావించారు. దేశంలోనే అత్యధికంగా వరి పండిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. పక్కనున్న ఆంధ్రప్రదేశ్‌కు రెండింతల ధాన్యం పండిస్తున్నట్లు గుర్తు చేశారు. 1.10 కోట్ల రేషన్ కార్డుల మీద 3.10 కోట్ల మందికి సన్నబియ్యం ఇస్తున్నామని ప్రకటించారు. ఏడాదికి రూ.11 వేల కోట్ల భారం అవుతున్నప్పటికీ పేదలకు సన్న బియ్యం ఇవ్వాల్సిందేనని కృతనిశ్చయంతో ఉన్నట్లు తెలిపారు. పదేళ్ల కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో 25 లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించిందని, ధనిక రాష్ట్రం సీఎంగా కేసీఆర్ ఎన్ని ఇళ్లు కట్టించారో చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణలోని 65 లక్షల మంది ఆడపడుచులకు చీరలను కానుకగా ఇస్తున్నామని చెప్పారు. ప్రతీ ఆడపడుచుకు చీరె అందేలా కాంగ్రెస్ కార్యకర్తలు చొరవ తీసుకోవాలని కోరారు. మార్చి నెలలో పట్టణ ప్రాంతాల్లో ఉండే 35 లక్షల మంది మహిళలకు చీరెలను అందిస్తామన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలను రెఫరెండంగా ప్రకటించి, ప్రచారం చేసిన కేటీఆర్‌ను ఓటర్లు బండకేసి కొట్టారని సీఎం అన్నారు. సిగ్గు లేకుండా కనీసం నెల కూడా కాకుండానే మళ్లీ తిరుగుతూ అబద్దాల ప్రచారం చేస్తున్నాడని దుయ్యబట్టారు. నాలుగు సార్లు ఎన్నికల్లో ప్రజలు పండబెట్టి వీపు మీద గుద్ది చెప్పినా బుద్ధి రాలేదని ఎద్దేవా చేశారు. విద్యార్థులు పంచాయతీ ఎన్నికల మీద దృష్టి పెట్టొద్దని ముఖ్యమంత్రి కోరారు. చదువు ఒక్కటే మీ జీవితాన్ని, తలరాతను మార్చుతుందని చెప్పారు. నాణ్యమైన విద్యను అందించి, డాక్టర్లుగా, ఇంజనీర్లుగా, లాయర్లుగా, ఐపీఎస్, ఐఏఎస్‌లుగా తీర్చిదిద్దే బాధ్యత తనదని అన్నారు. గొల్లోళ్లు గొర్రెలు పెంచుకోవాలే, బెస్తోళ్లు చేపలు పట్టుకోవాలే, ఎస్సీలు చెప్పులు కుట్టుకోవాలె అన్నట్లుగా కేసీఆర్ పథకాలు తెచ్చిండని, ఆయన పిల్లలు రాజ్యం ఏలాలంటే మీ పిల్లలు గొర్లు, చేపలు పెంచుకోవాలన్నది ఆయన ఉద్దేశమని చెప్పారు. ప్రభుత్వం భూములు ఇస్తుందనో, ఆస్తులు పంచుతుందనో ఆశలు పెట్టుకోవద్దని, 40 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇస్తామని, వాటికి కష్టపడండని చెప్పారు.





సభకు వచ్చిన మహిళలు; అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రభుత్వంతో మంచిగా ఉండేటోడిని ఎన్నుకోండి



గ్రామాల అభివృద్ధికి యువత రాజకీయాల్లోకి రావాలని అన్నారు. ప్రజల మనసులు గెలిస్తే ఆటోమెటిక్‌గా పదవులు వస్తాయనడానికి తానే ఉదాహరణ అని చెప్పారు. 2006లో జడ్పీటీసీగా ఇండిపెండెంట్‌గా గెలిచానని, ఇప్పుడు ముఖ్యమంత్రి అయ్యానని ప్రస్తావించారు. కొనుక్కుంటే పదవులు రావని, వాటికి ఖర్చు పెట్టవద్దని సూచించారు. గ్రామాల్లో సర్పంచులు మంచోళ్లు ఉంటేనే అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుందని, తీట నోరు పెట్టుకునే మాట్లాడితే ఏం పనీ జరగదని హితవు పలికారు. గ్రామాల్లో రాజకీయ కక్షలకు తావు ఇవ్వొద్దని, తమ ప్రభుత్వంతో కలిసి, మంత్రి దగ్గర కూర్చొని పనులు చేయించుకొనే వాడిని చూసి ఎన్నుకోవాలని సలహా ఇచ్చారు. పంచాయతీ పెట్టుకునే వాడు వస్తే గ్రామానికే నష్టమని హెచ్చరించారు. పథకాలు మంచిగా అందాలంటే మంచోడు సర్పంచి కావాలని, ఆఫ్ ఇద్దునా, ఫుల్ ఇద్దునా అనే వాడిని ఎంచుకోవద్దని సూచించారు.



కాళోజీ హెల్త్ వర్సిటీ

ఇన్‌చార్జి వీసీగా డాక్టర్ రమేశ్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్‌గా డాక్టర్ కె. రమేశ్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు హెల్త్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా జెడ్ చొంగ్తు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ఆయనే ఈ పదవిలో కొనసాగుతారని స్పష్టం చేశారు. ఇంతకుముందు వీసీగా ఉన్న నందకుమార్ రెడ్డి పీజీ పరీక్షల్లో అవకతవకల ఘటనలో రాజీనామా చేయడంతో ఈ నియామకం జరిగింది. ప్రస్తుతం కీలకమైన యూజీ, పీజీ ప్రవేశాల ప్రక్రియ కొనసాగుతున్నందున, ఈ రంగంలో అనుభవం ఉన్న డాక్టర్ రమేశ్ రెడ్డిని ఇన్‌చార్జిగా నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వైద్యవిద్యలో ఆయనకు ఉన్న అనుభవం, గతంలో వైద్యవిద్య సంచాలకులుగా పనిజేసిన అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని ఇన్‌చార్జి వీసీగా బాధ్యతలు అప్పగించింది.

హిల్ట్ జీవోపై స్టేకు హైకోర్టు నో!

జీవో చట్ట విరుద్ధమన్న పిటిషనర్లు.. పాలసీ ప్రకటించింది ఇప్పుడే కదా.. ఏదో అయిందనుకోవడం ఊహే

» కాలుష్యంపై ప్రజల బాధ కనిపించట్లేదా?

» పిటిషనర్లను తప్పుపట్టిన ప్రభుత్వం

» ఏకీభవించిన హైకోర్టు

హైదరాబాద్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ పారిశ్రామిక భూముల మార్పు(హిల్ట్) పాలసీపై ఇప్పటికిప్పుడు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాల్సిన అవసరం లేదని హైకోర్టు అభిప్రాయం వ్యక్తం చేసింది. కేవలం పాలసీ మాత్రమే ప్రకటించామని, దానికి సంబంధించి ఎలాంటి పనులు చేయలేదని అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి పేర్కొన్న నేపథ్యంలో మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికి నిరాకరించింది. హిల్ట్ పాలసీపై కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులుగా ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. విచారణను 29కి వాయిదా వేసింది. మాస్టర్ ప్లాన్, హెచ్‌ఎండీఏ చట్టానికి విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం నవంబర్ 22న జారీచేసిన హిల్ట్ పాలసీ జీవో 27ను కొట్టేయాలని కోరుతూ, ప్రొఫెసర్ కె.పురుషోత్తంరెడ్డి, ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కె.ఎ.పాల్ వేర్వేరుగా హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యాలు వేశారు. పిటిషన్లపై శుక్రవారం జస్టిస్ శ్యాంకోసీ, జస్టిస్ చలపతిరావు ధర్మాసనం విచారణ చేపట్టింది. పురుషోత్తంరెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది కె.వివేక్‌రెడ్డి వాదిస్తూ, జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉన్న పారిశ్రామిక వాడలకు సంబంధించిన భూములను మల్టీజోన్ అంటే బడులు, ఆసుపత్రులు, నివాస సముదాయాల నిర్మాణాలకు ఉపయోగించుకునే విధంగా పాలసీ తీసుకొచ్చారని, ఇది హెచ్‌ఎండీఏ చట్టానికి విరుద్ధమని పేర్కొన్నారు. ఇలా మార్చడానికి అవసరమైన చట్టబద్ధ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం పాటించలేదని అన్నారు. మాస్టర్ ప్లాన్, జోనింగ్ నిబంధనలు మార్చాలని, నోటిఫికేషన్ ఇచ్చి, ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించాలని అన్నారు. పరిశ్రమల భూములను మరే ఇతర అవసరాలకు వినియోగించుకోరాదని 2013లో అప్పటి ప్రభుత్వం జీవో జారీ చేసిందని తెలిపారు. నగర పరిధిలో ఉన్న పరిశ్రమలు మొత్తం పూర్తిగా శివార్లలోకి తరలిపోయి సెటిల్ అయ్యే వరకు సదరు భూములను ముట్టుకోవడానికి వీల్లేదని అన్నారు. జీవోపై స్టే విధించకపోతే ప్రభుత్వం దరఖాస్తు స్వీకరించే ప్రక్రియ చేపట్టే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. సీనియర్ న్యాయవాది వివేక్ రెడ్డి ఎర్రమంజిల్ కేసును ప్రస్తావించారు. జోనింగ్ రెగ్యులేషన్స్‌కు విరుద్ధంగా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం 'ఎర్రమంజిల్' భవనాన్ని కూల్చివేసి అక్కడ అసెంబ్లీ కట్టాలన్న ప్రతిపాదనకు హైకోర్టు అంగీకరించలేదని గుర్తు చేశారు. 9,292 ఎకరాల పారిశ్రామిక భూములను ప్రభుత్వం ఇతర అవసరాలకు వినియోగించాలని చూస్తోందని కేఏపాల్ అన్నారు. పిటిషనర్ల తొందరపాటును అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి తీవ్రంగా తప్పు బట్టారు. కాలుష్య కారక పరిశ్రమలను శివార్లకు తరలించడం ద్వారా హైదరాబాద్‌ను గ్రీన్ సిటీగా అభివృద్ధి చేయాలన్న గొప్ప సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ పాలసీని ప్రకటించిందని చెప్పారు. బాలానగర్, కూకట్‌పల్లి, కాటేదాన్ కాలుష్యం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులపాలు అవుతున్నారని, దుర్వాసన, తాగునీటి కాలుష్యంపై భారీగా ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. ప్రజల కన్నీళ్లు కనిపించడం లేదా అని పిటిషనర్లను ప్రశ్నించారు. గ్రీన్ జోన్‌లో ఉండే హైదరాబాద్ ఆరెంజ్ జోన్‌లోకి వచ్చిందని, రోజురోజుకూ గాలి నాణ్యత తగ్గిపోతోందని తెలిపారు. ప్రభుత్వానికి వివరణ ఇచ్చే అవకాశం ఇవ్వకుండా మధ్యంతర ఉత్తర్వుల కోసం పట్టుబట్టడాన్ని తీవ్రంగా ఆక్షేపించారు. పాలసీ ప్రకటించిందే ఇప్పుడని, ఇంకా ఏ పని చేయలేదని, ఏదో అయిందని ఊహించుకుంటే ఎలా? అని ప్రశ్నించారు. హిల్ట్ పాలసీ మాత్రమే ప్రకటించామని, హెచ్‌ఎండీఏ చట్టం ప్రకారం ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తామని, మాస్టర్ ప్లాన్‌ను సవరిస్తామని, దానికి ఇంకా సమయం ఉందని చెప్పారు. నగరం మధ్యలో పరిశ్రమలు పెడతామంటే అభ్యంతరం ఉండాలి కానీ తరలిస్తామంటే అభ్యంతర వ్యక్తం చేయడం ఎక్కడి విచిత్రమని ప్రశ్నించారు. ఎర్రమంజిల్ వారసత్వ, చారిత్రక కట్టడమని, దానితో పరిశ్రమలను పోల్చడం అర్థరహితమని వ్యాఖ్యానించారు.



మే నెలాఖరుకు 3 లక్షల గృహ ప్రవేశాలు!


జీహెచ్‌ఎంసీలో 13-14 ప్రాంతాల్లో పేదలకు ఇళ్లు.. గ్రామీణ ప్రాంతాల్లో స్థలం లేని పేదలకూ ఇందిరమ్మ ఇళ్లు

» విధివిధానాలు ఖరారయ్యాక వెల్లడిస్తాం

» ఓఆర్ఆర్ చుట్టూ మధ్యతరగతి ప్రజలకు అందుబాటు ధరల్లో గృహ సముదాయాలు

» పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్లకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం: పొంగులేటి

హైదరాబాద్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి స్థలం లేని పేదలకు కూడా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. తొలి విడతలో ఇంటి స్థలం ఉన్న పేదలకు ఇళ్లు మంజూరు చేశామని, ఇకపై స్థలం లేని నిరుపేదలను గుర్తించి వారికి ఇంటి స్థలంతోపాటు ఇల్లు మంజూరు చేస్తామని ప్రకటించారు. విధివిధానాలు ఖరారు చేసిన తర్వాత పూర్తి వివరాలు చెబుతామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం సచివాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గృహ నిర్మాణ శాఖ రెండేళ్ల పురోగతిని వివరించారు. గతంలో హౌసింగ్ బోర్డు కాలనీలు నిర్మించినట్లుగా ఔటర్ రింగురోడ్డుకు చుట్టుపక్కల, హైదరాబాద్‌కు నాలుగు దిశల్లో మధ్యతరగతి వర్గాల ప్రజలకు గృహ సముదాయాలు నిర్మిస్తామని పొంగులేటి చెప్పారు. ఒక్కో చోట 8-10 వేల వరకు ఇళ్లు నిర్మిస్తామని, ఎలాంటి లాభనష్టాలు చూసుకోకుండా మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండే ధరలతో నిర్మించి, ఇస్తామని తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో కూడా అధ్యయనం చేశామని, 2-3 నెలల్లో ఇందుకు సంబంధించిన విధివిధానాలను ప్రభుత్వం ప్రకటిస్తుందని చెప్పారు. తొలివిడతలో 3,80,200 ఇళ్లు మంజూరు చేశామని, వీటిలో 3 లక్షలకు పైగా నిర్మాణాలు పురోగతిలో ఉన్నాయని.. వచ్చే మార్చి నాటికి లక్ష ఇళ్లకు పైగా గృహప్రవేశాలు జరుగుతాయని వివరించారు. మే నెలాఖరు వరకు మొత్తం 3 లక్షల గృహ ప్రవేశాలు జరుగుతాయని ఆశిస్తున్నట్లు తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్‌తోపాటు కోర్ అర్బన్ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం చేపట్టిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ప్రాజెక్టు విఫలమైన నేపథ్యంలో ముంబై, బెంగళూరు, ఢిల్లీ నగరాల్లో అధ్యయనం చేశామని.. శాస్త్రీయంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపడతామని వెల్లడించారు. జీ+3 లేదా జీ+4 ఇళ్లు నిర్మించి నగరంలో ఉండే పేదలకు పంపిణీ చేస్తామని పొంగులేటి తెలిపారు. గ్రేటర్‌లో 13-14 ప్రాంతాలను గుర్తించామని, పేదలకు అక్కడ ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పారు. 30-40 గజాల సొంత స్థలం ఉన్న పేదలకు జీ+1 ఇల్లు నిర్మించుకునే వెసులుబాటు కూడా కల్పిస్తామన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పథకంలో రూ.700 కోట్లు వృథా చేసిందని, నగరంలో ఉండేవారికి శివారు ప్రాంతాల్లో కేటాయింపులు చేస్తే ఎవరూ వెళ్లలేదని, కొన్ని కేటాయింపులు చేయలేదని, మరికొంత మందికి ఇచ్చినా తీసుకోలేదని తెలిపారు. ఇప్పటికే పూర్తయిన డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్లను ఆ పరిసర ప్రాంతాల్లో ఉండే వారికి కేటాయిస్తామని పొంగులేటి స్పష్టంచేశారు. హౌసింగ్ బోర్డు ఆస్తులు కబ్జాలకు గురైతే రక్షిస్తున్నామని, నిబంధనలకు విరుద్ధంగా ఉంటే తిరిగి తీసుకుంటున్నామని తెలిపారు.



ఇప్పటివరకు 1,000 ఎకరాలకు పైగా ప్రహరీ గోడలు నిర్మించామని, వేలంపాటల్లో రూ.750-800 కోట్లు సేకరించామని వెల్లడించారు. వైఎస్, కేసీఆర్ ప్రభుత్వాల హయాంలో ఫౌండేషన్ వేసిన ఇళ్లు 15 వేల వరకు ఉన్నాయని, వాటిపై రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పునాది నిర్మించుకొని, లబ్ధిదారుల జాబితాలో చోటు దక్కని వారి నుంచి కూడా దరఖాస్తులు వచ్చాయని, ఇలాంటి వారికి రెండో విడతలో మంజూరు చేస్తామని చెప్పారు.

భూముల మార్పిడిలో కేటీఆర్ సంతకాలు చేశారు

కేంద్రం నుంచి ఇందిరమ్మ ఇళ్ల పథకానికి, గృహ నిర్మాణ శాఖకు ఇంతవరకు నయా పైసా రాలేదని మంత్రి పొంగులేటి విమర్శించారు. గోపన్‌పల్లిలో భూములను 22(ఏ) జాబితాలో పెట్టింది గత ప్రభుత్వమేనని చెప్పారు. జీవో 59లో అన్యాక్రాంతమైన భూములు మాత్రమే నిషేధిత జాబితాలో ఉన్నట్లు తెలిపారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో వేలం వేసిన భూములను వెనక్కి తీసుకుంటామని, పారిశ్రామిక భూములను వెనక్కి తీసుకుంటామని తామెన్నడూ చెప్పలేదని పొంగులేటి అన్నారు. వేల ఎకరాల భూములను విక్రయించడంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా కేటీఆర్ పాత్ర ఉందని ఆరోపించారు. భూముల మార్పిడి ఫైళ్లపై కేటీఆర్ సంతకాలు చేసిన పత్రాలు కూడా ప్రభుత్వం వద్ద ఉన్నాయని చెప్పారు. దిల్‌సుఖ్‌నగర్‌లో సిరీస్ రాజు ఫ్యాక్టరీ కాలుష్యంతో భూగర్భ జలాలు కూడా విషపూరితంగా మారితే.. యాజమాన్యంతో కుమ్మక్కై నివాస జోన్‌కు మార్చడంలో కేటీఆర్ క్రియాశీల పాత్ర పోషించారని ఆరోపించారు. రూ.5 లక్షల కోట్ల అవినీతి అంటూ కేటీఆర్ విషం చిమ్ముతున్నారన్నారు. భూముల మార్పిడికి సంబంధించి మంత్రివర్గ సమావేశంలో చర్చించిన తర్వాతే నిర్ణయం తీసుకున్నామని, ఇది ఏ ఒక్కరో తీసుకున్న నిర్ణయం కాదని చెప్పారు.

అక్రమార్కులకు గుణపాఠం చెప్పాలి

- 20 ఏళ్లుగా బ్యాంకును సర్వ నాశనం చేశారు
- బ్యాంకుకు పూర్వవైభవం తెస్తాం
- ఫౌండర్ ప్యానెల్ చైర్మన్ అభ్యర్థి భంగాడియా కైలాశ్ నారాయణ్
- రేపు జరగనున్న మహేశ్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ పాలకవర్గ ఎన్నికలు


సమావేశంలో మాట్లాడుతున్న ఫౌండర్ ప్యానెల్ అభ్యర్థులు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కొంత మంది వ్యక్తుల స్వార్థ ప్రయోజనాలు, నిబంధనల ఉల్లంఘనలే ఏపీ మహేశ్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్‌ను ఆర్థిక సంక్షోభంలోకి, ఈడీ కేసుల్లోకి నెట్టాయని బ్యాంక్ ఫౌండర్ ప్యానెల్ చైర్మన్ అభ్యర్థి భంగాడియా కైలాశ్ నారాయణ్ ఆరోపించారు. అందినకాడికి దోచుకుని పెద్దఎత్తున 20ఏళ్లుగా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆయన మండిపడ్డారు. మహేశ్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్‌కు ఈనెల 7న జరగబోయే పాలకవర్గ ఎన్నికల నేపథ్యంలో.. ఫౌండర్ ప్యానెల్ తరపు నుంచి పోటీచేస్తున్న డైరెక్టర్లు శుక్రవారం బేగంబజార్ మహేశ్వరి గార్డెన్‌లో 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. చైర్మన్ అభ్యర్థి కైలాశ్ నారాయణ్ మాట్లాడుతూ.. సంస్థకు పూర్వవైభవాన్ని నెలకొల్పి, ఆర్థిక స్థిరత్వాన్ని పునరుద్ధరించడానికి తమ ప్యానెల్ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. తాము అధికారంలోకి వస్తే పారదర్శకంగా పనిచేసి ఖాతాదారులకు, వాటాదారులకు రక్షణ కల్పిస్తామని చెప్పారు.

20 ఏళ్లలో అంతులేని అక్రమాలు..

2005 నుంచి ఇప్పటివరకు అధికారంలో ఉన్న వారు పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడ్డారని భంగాడియా కైలాశ్ నారాయణ్ ఆరోపించారు. "పాత చైర్మన్ రమేశ్ కుమార్ బంగ్ సారథ్యంలో ఉన్న బోర్డులో ఆర్బీఐ తీవ్రమైన పరిపాలన లోపాలు గుర్తించింది. కేవైసీ నిబంధనలు పాటించనందుకు 2022లో ఆర్‌బీఐ రూ. 1.12 కోట్ల జరిమానా విధించింది. 1994 నుంచి డైరెక్టర్‌గా పనిచేస్తూ.. సంస్థాపక్ ప్యానెల్ తరపున పాలక వర్గంలో చైర్మన్‌గా వ్యవహరించిన వ్యక్తి , సీనియర్ వైస్ చైర్మన్‌గా 1997 నుంచి బోర్డులో ఉన్న మరో వ్యక్తి.. వీరిద్దరూ కీలక పదవుల్లో ఉంటూ దశాబ్దాలుగా బ్యాంకుపై నియంత్రణ సాధించి దోచుకుంటున్నారు" అని కైలాశ్ నారాయణ్ మండిపడ్డారు. వారి హయాంలో ప్రధాన కార్యాలయ నిర్మాణం వ్యయం 2019లో రూ.32.28 కోట్లుగా ఉండగా.. 2020నాటికి రూ.44.75 కోట్లతో పూర్తి చేశారని వివరించారు. కాగా, 2023 జూలైలో ఆబిడ్స్ శాఖలో జరిగిన సైబర్ మోసంలో రూ.కోటి నిధులు మాయమయ్యాయని, ఫిక్స్‌డ్ డిపాజిట్ మోసాలతో మరో రూ.11.80 కోట్లు నష్టం జరిగిందని ఆయన వివరించారు. నిబంధనలు పాటించని కారణంగా 2023లో ఆర్‌బీఐ.. సీనియర్ వైస్ చైర్మన్ పురుషోత్తం మాండవీయను తొలగించి ప్రత్యేక అధికారిని నియమించిందని, తద్వారా బ్యాంక్ నెట్‌ఫండ్స్ రూ.336 కోట్ల నుంచి రూ.475 కోట్లకు పెరిగిందని కైలాశ్ నారాయణ్ చెప్పారు. కాగా, అవినీతి ఆరోపణలతో పాత చైర్మన్, సీనియర్ వైస్ చైర్మన్, ఎండీలపై ఇప్పటికీ ఈడీ విచారణ జరుగుతోందని తెలిపారు. ఆర్‌బీఐ నిబంధనల మేరకు బోర్డు సమావేశాలు జరగడం లేదని.. బోర్డు అభ్యంతరాలను పక్కనబెట్టి పాత చైర్మన్ తన కూతురును ప్రొఫెషనల్ డైరెక్టర్‌గా నియమించారని ఆరోపించారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా బ్యాంకు వాటాదారుల నమ్మకాన్ని పూర్తిగా కోల్పోయిందని తెలిపారు. ఈ ఎన్నికల్లో తమ ప్యానెల్‌ను భారీ మెజార్టీతో గెలిపించి వారికి తగిన గుణపాఠం చెప్పాలని కైలాశ్ నారాయణ్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

300 క్వింటాళ్ల రేషన్ బియ్యం
దారి మళ్లింపు

(మొదటిపేజీ తరువాయి)

మాత్రం లారీకి బదులు బైక్‌కు జీపీఎస్‌ను అమర్చి.. అధికారులను ఏమార్చి రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారు. విషయం తెలిసిన సివిల్ సప్లయీస్ రాష్ట్ర విజిలెన్స్ అండ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు పాల్వంచలోని ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద నిఘా పెట్టి.. అక్రమ దందాను బట్టబయలు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ వెల్లడించారు. జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ రవాణాపై అందిన సమాచారం మేరకు ఈ నెల 2వ తేదీన సాయంత్రం 4.15 గంటల సమయంలో విజిలెన్స్ అధికారులు పాల్వంచలోని ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద నిఘా పెట్టారు. ఆ సమయంలో ఏపీ20ఏపీ1899 నెంబరుగల ద్విచక్రవాహనంపై వచ్చిన ఓ యువకుడు స్టాక్ పాయింట్‌లోకి వెళ్లి ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జ్ సత్యవతి, డేటా ఎంట్రీ ఆపరేటర్ బానోతు కృష్ణకుమార్‌కు కొన్ని పత్రాలు అందజేయగా.. వారు కొంత సమాచారం నమోదు చేసి తిరిగి ఆయనకు ఆ పత్రాలు అందించారు. దానిపై అనుమానం వచ్చిన విజిలెన్స్ అధికారులు ఎంఎల్ఎస్ పాయింట్ ప్రధాన గేటు వద్ద సదరు యువకుడిని ఆపి విచారించగా.. తనపేరు ప్రశాంత్ అని, తాను స్టేజ్-1 కాంట్రాక్టర్ ఎన్.శ్రీనివాస్‌కు అసిస్టెంట్‌గా పనిచేస్తున్నట్టు వివరించాడు. ఎంఎల్ఎస్ పాయింట్ సిబ్బందితో కలిసి మల్లారం వ్యవసాయ మార్కెట్ గోదాం నుంచి ఎంఎల్ఎస్ పాయింట్‌కు రావాల్సిన సన్నబియ్యాన్ని దారి మళ్లించినట్లు తెలిపాడు. బియ్యాన్ని సరఫరా చేసే లారీకి ఉండాల్సిన జీపీఎస్ ట్రాకింగ్‌ను ద్విచక్ర వాహనానికి అమర్చి అక్రమ దందాకు పాల్పడినట్లు పేర్కొన్నాడు. లారీనెం. టీఎస్29టీ5139కు సంబంధించిన ట్రక్ చిట్‌నంబరు 4346 ద్వారా 300 క్వింటాళ్ల బియ్యాన్ని నల్లబజారుకు మళ్లించినట్టు వివరించాడు. ఈ వ్యవహారంలో ఎంఎల్ఎస్ పాయింట్ సిబ్బంది, రేషన్ డీలర్లు కలిసి తప్పుడు పత్రాలతో ప్రభుత్వానికి భారీగా ఆర్థిక నష్టం కలిగించినట్టు అదనపు కలెక్టర్ తెలిపారు. పంచనామా అనంతరం ప్రశాంత్‌ను అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు. డీలర్లు రేషన్ బియ్యం అందుకున్నట్టుగా బయోమెట్రిక్ సంతకాలు చేశారు కానీ అసలు బియ్యం మాత్రం పొందలేదని, లారీకి నకిలీ రశీదుల కోసం ఎంఎల్ఎస్ సిబ్బంది లంచాలు తీసుకున్నట్టు ఆయన తెలిపారు. రేషన్ బియ్యం మళ్లింపులో ఓ మాఫియా రింగ్ పనిచేస్తున్నట్టు గుర్తించిన అధికారులు 15 మందిపై కేసు నమోదు చేసి, 13 మందిని అరెస్ట్ చేశారు.

స్టేజ్-1 కాంట్రాక్టర్ అక్రమాలు

స్టేజ్-1 కాంట్రాక్టర్ ఎన్.శ్రీనివాస్‌ను అధికారులు అదుపులోకి తీసుకుని విచారించగా.. తన భార్య సరోజ పేరుతో కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నానని తెలిపాడు. మణుగూరుకు చెందిన రమ్యా రైస్ ట్రేడర్స్‌కు అక్రమంగా 300 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని తరలించినట్లు పేర్కొన్నాడు. లారీ ట్రిప్పుకు రూ.50 వేల చొప్పున ఐదుసార్లు రైస్ మిల్లర్ యజమాని పంపించినట్లు ఒప్పుకున్నాడు.

చింతూరులో ఉద్రిక్తత

- హిడ్మా ఎన్‌కౌంటర్‌పై నిజ నిర్ధారణకు తెలంగాణ విద్యార్థులు.. మారేడుమిల్లికి వెళ్లే ప్రయత్నం
- చింతూరు వద్ద వారిని అడ్డుకున్న గ్రామస్థులు
- నక్సల్స్ చేసే హత్యలపై మాట్లాడరేం అంటూ నిలదీత

చింతూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు నేత హిడ్మా ఎన్‌కౌంటర్ జరిగిన అల్లూరి జిల్లా మారేడుమిల్లి ప్రాంతానికి వెళ్లడానికి ప్రయత్నించిన తెలంగాణ విద్యార్థులను చింతూరు వద్ద గ్రామస్థులు అడ్డుకోవడంతో కొద్దిగంటలపాటు ఉద్రిక్తత నెలకొంది. హిడ్మా ఎన్‌కౌంటరుపై నిజానిజాలు తెలుసుకునేందుకు ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీలకు చెందిన 12మంది విద్యార్థులు నిజ నిర్ధారణ కమిటీగా ఏర్పడి శుక్రవారం ఏపీకి వచ్చారు. ఘటన జరిగిన మారేడుమిల్లి ప్రాంతానికి చింతూరు మీదుగా వెళ్లేందుకు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు చింతూరులో వారి వాహనాన్ని అడ్డుకున్నారు. విద్యార్థుల వాహనం కదలకుండా అడ్డుగా నిలబడి, వారితో వాగ్వాదానికి దిగారు. "మావోయిస్టులు చనిపోతే నిర్ధారణ కమిటీ అంటూ వచ్చారు. మరి.. అదే మావోయిస్టులు ఇన్‌ఫార్మర్ల పేరిట హత్యలుచేస్తే ఎందుకు స్పందించడం లేద'ంటూ విద్యార్థులను నిలదీశారు. ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధికి మావోయిస్టులు అడ్డంకిగా మారారంటూ రోడ్డు మీదే ధర్నాకు దిగారు. విషయం తెలుసుకున్న చింతూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, విద్యార్థులను, వారి వాహనాన్ని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం వరకు విద్యార్థులను తమ అదుపులో ఉంచుకుని, ఆ తర్వాత తెలంగాణలోని భద్రాచలంలో వదిలిపెట్టారు. పోలీసులు తమ పట్ల నిరంకుశంగా వ్యవహరించారని తెలంగాణ విద్యార్థులు ఆరోపించారు. మారేడుమిల్లి ఎన్‌కౌంటర్ తీరును అధ్యయనం చేసేందుకు వెళ్తున్న తమను అడ్డగించి, పోలీస్‌స్టేషన్‌లో కూర్చోబెట్టడం ఎంతవరకు సబబని విద్యార్థులు బట్టు వెంకటేశ్వర్లు, లెనిన్, విజయ్ తదితరులు ప్రశ్నించారు. తమను నిర్బంధించిన పోలీస్ స్టేషన్ ప్రాంగణంలోనే వారంతా నినాదాలు చేశారు. చింతూరు మీదుగా మారేడుమిల్లి చేరుకొనేందుకు ప్రయత్నించిన తమను అడ్డుకున్నది గ్రామస్థులు కాదు, వారు పోలీసులేనని విమర్శించారు.

బీసీ రిజర్వేషన్ల కోసం ఆత్మాహుతి !

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు చెందిన క్యూన్యూస్ కార్యాలయం వద్ద యువకుడి ఆత్మహత్యాయత్నం

- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి
- రేవంత్ రాక్షస రాజకీయ క్రీడలో ఈశ్వర్ బలి : హరీశ్ రావు
- ఆత్మబలిదానం బాధాకరం: కవిత
- బాధిత కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలి: బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్


గాంధీ ఆస్పత్రి వద్ద నిరసనలో బీసీ నేతలు

అడ్డగుట్ట, హైదరాబాద్, న్యూఢిల్లీ, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుపై ఆత్మహత్యాయత్నం చేసిన సాయి ఈశ్వర్ చారి(38) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మరణించారు. హైదరాబాద్‌లోని బోడుప్పల్ ప్రాంతంలో ఎమ్మెల్సీ చింతపండు నవీన్(తీన్మార్ మల్లన్న)కు చెందిన క్యూన్యూస్ కార్యాలయం వద్ద సాయి ఈశ్వర్ చారి గురువారం ఆత్మహత్యాయత్నం చేశారు. శరీరంపై కిరోసిన్ పోసుకొని నిప్పు పెట్టుకున్నారు. దాదాపు 90 శాతం కాలిన గాయాలతో ఉన్న ఈశ్వర్‌ను గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం కన్నుమూశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. సంగారెడ్డి ప్రాంతంలోని పోచారం గ్రామానికి చెందిన సాయి ఈశ్వర్ చారి.. హైదరాబాద్ జగద్గిరిగుట్టలోని బీరప్పనగర్‌లో నివాసముంటూ క్యాబ్ డ్రైవర్‌గా పని చేసేవారు. ఆయనకు భార్య కవిత, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

భగ్గుమన్న బీసీ నేతలు.. నేడు, రేపు నిరసనలు

సాయి ఈశ్వర్ చారి మరణించిన విషయం తెలియడంతో బీసీ నేతలు భగ్గుమన్నారు. గాంధీ ఆస్పత్రికి పెద్ద సంఖ్యలో చేరుకొని ధర్నా చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఇక, ఈశ్వర్ చారి ఆత్మహత్యకు సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో కృష్ణయ్య విలేకరులతో మాట్లాడారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన రోజు నుంచి బీసీ సమస్యల పరిష్కారం పట్ల ఒక్క శాతం కూడా చిత్తశుద్ధి చూపలేదని ఆరోపించారు. బీసీ యువత బలిదానాలు ఆమోదయోగ్యం కాదని, రిజర్వేషన్ల కోసం రాజీ లేని పోరాటం సాగించాలని ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. సాయి ఈశ్వర్ మృతి నేపథ్యంలో శని, ఆదివారాల్లో రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. రిజర్వేషన్ల విషయంలో బీసీలకు అన్యాయం జరిగిందనే ఆవేదనతో ఈశ్వర్ ఆత్మహత్యకు పాల్పడ్డారని, బాధిత కుటుంబానికి రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేయాలని తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ అన్నారు. బీసీ రిజర్వేషన్ల పేరిట రేవంత్‌రెడ్డి చేసిన మోసానికి నిండుప్రాణం బలైందని, సాయి ఈశ్వర్ చారి మరణం ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. సాయి ఈశ్వర్ మరణానికి రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి బాధ్యత వహించాలని, ఈశ్వర్ కుటుంబానికి ప్రభుత్వం రూ.50లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల పేరిట సీఎం రేవంత్‌రెడ్డి ఆడిన రాక్షస రాజకీయ క్రీడలో సాయి ఈశ్వర్ బలైపోయాడని మాజీ మంత్రి హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీసీ సమాజం క్షమించదన్నారు. సాయి ఈశ్వర్ చారి ఆత్మబలిదానం బాధాకరమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఈశ్వర్ చారి భౌతికకాయానికి నివాళులర్పించిన కవిత బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. బీసీ రిజర్వేషన్ల సాధనకు బలిదానాలు పరిష్కారం కాదని పేర్కొన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.